మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2021-23
Date of Posting: On 29th & 30th
Date of Publication: 25.5.2023



ప్రకృతి మాత

# మిసిమి

చింతనాత్మక సారస్వతం



భూమాత

మాసపత్రిక, జూన్, 2023 ₹ 50/-

ISSN 2454–4329




భూ జాత




రామ

# మిసిమి

మాసపత్రిక


సంపుటి 34 సంచిక 6

జూన్ - 2023


సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : వల్లభనేని అశ్వినీకుమార్

సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం


KALA JYOTHI
Since 1946

Printed & Published by

**BAPANNA ALAPATI**

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,

**Hyderabad - 500 020.**

Ph: 040 - 27612436, 27645538.

Editor: **Ph: 994 951 6567**

(10.00 am to 5.00 pm)


**చందా వివరాలు:**

₹ 600/- (సంవత్సర చందా),

₹ 1200/- (రెండు సంవత్సరాలకు),

₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : వి. ఆశారాణి

**040-27645536**

Scan QR to Pay

**Misimi Publication**


LIBRARY OF CONGRESS

LCCN 91-903060

UGC Care

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE

ISSN 2454-4329



**misimi90monthly@gmail.com**

www.misimimonthly.com

e-magazine : www.kinige.com/misimi

facebook.com/misimimaasapathrika


YouTube : **Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## జూన్ నెల సూచికలు...


మాలకరి సద్భక్తి : అక్కిరాజు రమాపతిరావు... 3
విశ్వామిత్రుడు : మనోహర్ పంత్... 4
నేషనల్ డిజిటల్ యూనివర్సిటీ : డా. కందగట్ల శ్రవణ్ కుమార్... 5
దుబాయ్ కళా మేళా : టి.వి. ప్రసాద్... 7
ఏథెన్సు : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు... 11
అమెరికా ఇల్లాలు : డా. ఎ. రవీంద్రబాబు... 18
మహిళా వికాసం : మన్నేపల్లి లలితమ్మ... 21
తథాగతుని ఛాయాదేహ దర్శనం : వేలూరి కృష్ణమూర్తి... 25
ఎవరీ శాంతం? : జయశ్రీ అట్లూరి... 31
తాళ్లపాక కవులు : రసవాదము : గూడూరు యానాదిరాజు... 37
మనోధర్మ సంగీత సాధనలో మెళకువలు : మల్లాది సూరిబాబు... 40
తెలుగు సాహిత్యం – మరో విశ్లేషణ : ఎమ్. కురుమయ్య యాదవ్... 43
చిత్రగీతాలు – హరికథ : డా. ఎమ్. పురుషోత్తమాచార్య... 45
జ్ఞానం మతరహితం : డా. దేవరాజు మహారాజు... 49
నీతిచంద్రిక : రెంటాల సాంబశివరావు... 51
కన్యాశుల్కము – ఒక పరిశీలన : పల్లి హనుమయ్య... 55
పాలీ భాష పుట్టుపూర్వోత్తరాలు : చౌదూరి ఉపేంద్రరావు... 63
కొత్త రంగుల తపన : డా. నందిని సిధారెడ్డి... 69
కబీర్ దాస్ – 13 : ఆచార్య ఎన్. లక్ష్మీ అయ్యర్... 71
కామోత్సవ్ : వి. రాజారామమోహనరావు... 75
చదవండి... : మిసిమి ... 78



డా. నిమ్మగడ్డ శేషగిరి రావు


శేషేంద్ర శర్మ

### అట్టమీది బొమ్మలు


భూమాత



భూ జాత



రామ


ప్రకృతి మాత

# మాలకరి సద్భక్తి

రాజగృహంలో పుష్పమాలలు కట్టి విక్రయించే సుమన అనే పూల వ్యాపారి బింబిసార రాజప్రసాదానికి ప్రతిరోజూ నియతంగా ఉదయమే పూలు తీసుకొని వెళ్లి ఇవ్వాల్సి ఉండేది. అది అతడి ఉద్యోగ బాధ్యత. మల్లెపూలో, జాజిపూలో అవి లభించే ఋతువు పొడుగునా వాటినాతడు బింబిసార మహారాజుకు సమర్పించాలి. అది కట్టడి.

ఒకరోజు ఉదయం అతడు పూలు తీసుకొని రాజప్రాసాదానికి పోతుండగా బుద్ధభగవానుడు నగరంలో భిక్షాస్వీకారం కోసం వెళుతూ అతడికి కనిపించాడు. ఆయనతో చాలామంది భిక్షువులు కూడా ఉన్నారు. అప్పుడు సుమనుడికి బుద్ధభగవానుణ్ణి చూడగానే ఆయనకు తాను తీసుకొని వెళుతున్న పూలు సమర్పించాలని తీవ్రమైన ఇచ్ఛ కలిగింది. రాజుగారు తనను దేశబహిష్కృతుణ్ణి చేసినా సరే, ఎటువంటి శిక్ష విధించినా సరే, చివరికి మరణశిక్ష విధించినా సరే తనతో ఉన్న పూలు భగవానుడికి సమర్పించాల్సిందే అని తీవ్రమైన ఉద్వేగం అతడికి కలిగింది. హృదయపూర్వకమైన భక్తిశ్రద్ధలతో ఆత్మసమర్పణ భావంతో తన దగ్గర ఉన్న పూలు ఒక్కటీ మిగల్చకుండా సుమనుడు భగవానుడికి సమర్పించాడు. బుద్ధభగవానుడు తనను అనుసరించి వస్తున్న భిక్షుసంఘంతో, సుమనుడిచ్చిన పుష్పమాలలతో రాజగృహవీథులలో వెళుతుండగా వేల సంఖ్యలో ప్రజలు ఆయనకు దోసిలొగ్గి ప్రణమిల్లడం చూసి సుమనుడికి పరమప్రీతి, పట్టరాని సంతోషం కలిగాయి. ఆనంద తరంగాలలో అతడు తేలియాడాడు.



అప్పుడిక సుమనుడి భార్య రాజాంతఃపురంలో ప్రతి రోజులాగా పూలు ఇవ్వకపోవడంలో తన తప్పేమీ లేదని, సుమనుడు అవాళ అంతఃపురానికి వచ్చి ఆ పూలు అందించలేదనీ విన్నవించుకొంది. నిజానికి రాజుగారు సుమనుడు రాజవీధిలో పూలు బుద్ధభగవానుడికి సమర్పించిన విషయం తెలిసి సంతోషించాడు. అంతేకాక భిక్షుసంఘాన్నీ, బుద్ధభగవానుణ్ణీ రాజభవనానికి ఆహ్వానించి భిక్ష సమర్పణ చేసే అవకాశాన్ని కూడా వెంటనే వినియోగించుకున్నాడు.

భిక్ష స్వీకరణానంతరం, అందరి భోజనాలు ముగిసిన తర్వాత బుద్ధభగవానుడు జేతవనానికి తిరిగి చేరుకున్నాడు. బింబిసార మహారాజు అప్పుడు సుమనుణ్ణి పిలిపించుకున్నాడు. బుద్ధుడి పట్ల ఆ పుష్పవిక్రేతకున్న అచంచల భక్తిని ప్రస్తావించి అతణ్ణి ఎంతగానో మెచ్చుకున్నాడు. అతడి స్థిరనిశ్చయాన్ని, ధైర్యాన్ని ప్రశంసించాడు. అతడి పట్ల తన సంప్రీతిని తెలియజేయడానికి పెద్ద బహుమానం కూడా అందజేశాడు. జేతవన విహారంలో పూజ్య ఆనందుడు బుద్ధభగవానుణ్ణి ఇవాళ సుమనుడు కనపరచిన భక్తిశ్రద్ధలకు పూజ్యభావానికి అతడికి ఎటువంటి పుణ్యలబ్ధి కలుగుతుందని అడిగాడు. అప్పుడు భగవానుడు సుమనుడు తనకు కఠిన శిక్షను కూడా లక్ష్య పెట్టని నిర్ణయానికి నాలుగు విధాలైన అపాయాలు కలగని లోకంలో జన్మిస్తాడనీ ఆ తర్వాత జన్మపరంపర నుంచి విముక్తుడవుతాడనీ ఆనందుడికి చెప్పాడు.

**ధమ్మపదం గాథలు** – అక్కిరాజు రమాపతిరావు

# విశ్వామిత్రుడు

**- మనోహర్ పంత్**

మనకు భారత, రామాయణ, పురాణాలలో, అనేకమంది ఋషుల ప్రస్తావన ఉంటుంది.

వీరిలో ముఖ్యంగా నారదుడు, విశ్వామిత్రుడు, వశిష్ఠుడు, గౌతముడు, భరద్వాజుడు మరికొందరు కనిపిస్తారు. వీరందరూ, ఒకే పేరుతో, వేరు వేరు కాలాల్లో ఉన్నా వేరు-వేరు వ్యక్తులని, కాదు ఒక్కరేనని వాదనలు ఉన్నాయి. ప్రస్తుతం ఆ విషయం వదిలేద్దాం.

విశ్వామిత్రుడు తప్ప, మిగతా ఋషుల గురించి, ఒకటీ రెండు సందర్భాలలో మాత్రమే ఉంటుంది. కానీ విశ్వామిత్రుడి గురించి అనేక కథలు ఉన్నాయి. అలాగే విశ్వామిత్రుడు భిన్న కోణాల్లో, వ్యక్తితాల్లో కనిపిస్తాడు.

**వాటి గురించి చిన్న పరిశీలన:-**

వేదంలో ఏడు ఛందస్సులను ప్రముఖంగా చెప్పారు, అవి:- గాయత్రి, ఉష్ణిక్, అనుష్టుప్, బృహతి, పంక్తి, త్రిష్టుప్, జగతి. గాయత్రి ఛందస్సు 24 అక్షరాలతో, షడ్జమంలో ఉంటుంది. వరసగా, తరువాత ఛందస్సులు 4 అక్షరాల చొప్పున పెరుగుతూ, రిషభం, గాంధారం, మధ్యమం, పంచమం, దైవతం, చివరిదైన జగతి 48 అక్షరాలతో నిషాదంలో ఉంటుంది. విశ్వామితుడని, ఈ గోల ఏమిటని అనుకోవద్దు. మొట్టమొదటి గాయత్రి ఛందస్సుకు, రిషి విశ్వామిత్రుడే. ఇదిగో, విశ్వామితుడి పరిచయం, ఇలా వేదంతో మొదలవుతుంది. తరువాత హరిశ్చంద్రుడి కథలో దర్శనం ఇస్తాడు. ఇక్కడ విశ్వామిత్రుడు, పెద్ద విలనుగా కనిపిస్తాడు. హరిశ్చంద్రుడి నుంచి తన అప్పు వసూలు చేసుకునేటప్పుడు "షైలాక్"లాగా అతనిచేత అసత్యం చెప్పించాలనే ప్రయత్నంలో "శాడిస్టుగా" కనిపిస్తాడు. రామాయణంలో మరో కోణంలో కనిపిస్తాడు. దుష్ట సంహారం కోసం, రాముడికి గురు స్థానంలో అస్త్రవిద్యలు నేర్పుతూ, శ్రేయోభిలాషిగా, మార్గదర్శిగా రాజధర్మాలను, రాజనీతిని బోధిస్తాడు. లోకకళ్యాణం కోసం దుష్ట సంహారం చేయించి, పుత్రవాత్సల్యంతో రామ కళ్యాణం జరిపిస్తాడు. మరో కథలో, వశిష్ఠుడి దగ్గరవున్న కామధేనువును బలవంతంగా తీసుకొనిపోయే సందర్భంలో రాజసంతో కూడిన అహంకారం ఉంటుంది. మరోచోట, శరణు అని ఆశ్రయించిన, 'పునః శేషుని' రక్షించటం కోసం, తన మాట కాదన్న సొంత పుత్రులను ఘోరంగా శపించి, ఆశ్రిత రక్షకుడుగా కనిపిస్తాడు.

మరో కథలో "త్రిశంకుడికి" ఇచ్చినమాట నిలబెట్టుకోవటం కోసం, తన తపఃశక్తిని ధారవోసి త్రిశంకు స్వర్గం నిర్మిస్తాడు.

భారతంలో, మేనకతో కాపురం చేసి, ఆమె గురించి ఆలోచించకుండా, ఆవిడ మానాన, ఆవిడను వదిలేసి, తనదారి తాను చూసుకున్న స్వార్థపరుడిగా కొంతకాలం కాలక్షేపం చేసిన జులాయిగా కనిపిస్తాడు. రాజ రిషి నుంచి, బ్రహ్మ రిషి కావాలనుకొని అనేకసార్లు తన తపఃఫలాన్ని, వదులుకొని, చివరకు పట్టుదలగా బ్రహ్మ రిషి అనిపించుకొంటాడు. తన తపస్సుకు మెచ్చి, నువ్వు బ్రహ్మ రిషివి, అని సాక్షాత్తు, తనకు వరం యిచ్చిన బ్రహ్మ చెప్పినా సమాధానపడక, వశిష్ఠుడు తనను బ్రహ్మ రిషి అని గౌరవిస్తేనే సంతోషిస్తానని, తన మాట నెగ్గించుకున్న పట్టుదలగలవానిగా, నిరూపించుకొంటాడు. ఇన్ని విశిష్టాలు ఉన్నా, చివరకు, ఆకలి బాధకు, తట్టుకోలేక, కుక్క మాంసం తినటానికి పతనమైనవాడిగా, మరో కథలో, కనిపిస్తాడు.

ఇన్ని విభిన్న కథలు, గుణాలు, వ్యక్తిత్వాలు, మరో రిషిలో కనిపించవు. అది విశ్వామిత్రుడు.

ఇంకా వివరంగా ఎవరైనా తెలియచేస్తే సంతోషం.

మనోహర్ పంత్
హన్మకొండ. ఫోన్: 949 039 2300.

# నూతన విద్యా విధానం : నేషనల్ డిజిటల్ యూనివర్సిటీ

*– కందగట్ల శ్రవణ్ కుమార్*

డిజిటల్ యూనివర్సిటీ అనేది ఒక ఆన్‌లైన్ విశ్వవిద్యాలయం, ఇది ఆన్‌లైన్ అభ్యాసాన్ని ప్రోత్సహించడం, యువతకు విద్యను మరింత సులభంగా అందుబాటులో ఉంచడం లక్ష్యంగా పని చేసే ఒక ఆధునిక విశ్వవిద్యాలయం. డిజిటల్ యూనివర్సిటీ ఉన్నత విద్యలో అధిక సంఖ్యలో విద్యార్థులను నమోదు చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. దేశంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు నమోదు చేసుకోవడంవల్ల బాగా చదువుకున్న, నైపుణ్యం కలిగిన యువతను బలమైన శ్రామిక శక్తిగా మార్చడానికి డిజిటల్ యూనివర్సిటీ దోహదపడుతుంది. "ప్రపంచ స్థాయి నాణ్యమైన విద్య" అందించడానికి, వివిధ భారతీయ భాషలలో ఆన్‌లైన్ అభ్యాసాన్ని ప్రోత్సహించడానికి తొలిసారిగా జాతీయ స్థాయిలో నేషనల్ డిజిటల్ యూనివర్సిటీ (ఎన్డీయూ) సేవలు 2023-24 విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించేలా కేంద్ర ప్రభుత్వం మరియు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (UGC) సన్నాహాలు చేస్తోంది. డిజిటల్ యూనివర్సిటీ సేవలు అందుబాటులో వస్తే దేశంలోని విద్యార్థులు, వారు కోరుకున్న కోర్సులను ఆన్లైన్ ద్వారా ఎంచుకొని పూర్తి చేసే సౌలభ్యం ఏర్పడుతుంది. విద్యార్థులు వీడియోలో ముందుగా రికార్డ్ చేసిన పాఠాలతో, స్టడీ మెటీరియల్‌ని ఆన్‌లైన్‌లో పొందుతూ, వారు ఒక విద్యాసంస్థలో భౌతికంగా హాజరు కాకుండా ఆన్‌లైన్ తరగతులకు హాజరయ్యే అవకాశం ఉంది.

ప్రస్తుత అభ్యాసన విధానం నమూనా దృఢంగా ఉందని, సాంప్రదాయ విశ్వవిద్యాలయాలు విద్యను విద్యార్థుల అవసరాలు, ఆసక్తులు, ఆర్థిక సామర్థ్యాలు, విభిన్న జ్ఞానసామర్థ్యాలను చూసుకునేలా విద్యను అనుకూలీకరించడంలో విఫలమయ్యాయనే భావన పెరిగింది. అందువల్ల, అధ్యాపకులు, విధాన నిర్ణేతలు (Policy Makers) అనుకూలీకరించిన అధిక-నాణ్యతగల "ఎప్పుడైనా/ఎక్కడైనా" విద్యను అందించడానికి అనువైన విద్యావ్యవస్థలను సృష్టించాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు. నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం ప్రపంచస్థాయి ఉన్నత విద్యను అందరికీ అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆదేశాలతో యూజీసీ ఈ యూనివర్సిటీకి శ్రీకారం చుడుతోంది. విద్యార్థుల వ్యక్తిగత ఆసక్తులను అనుసరించి, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను అందించే పలు (సర్టిఫికేట్, డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా) కోర్సులు వారి ఇంటివద్దే నచ్చిన కోర్సులను డిజిటల్ విశ్వవిద్యాలయం అందించనుంది. ఉన్నత విద్యాశాఖ, అఖిల భారత సాంకేతిక విద్యామండలి (AICTE) సహా దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ యూనివర్సిటీలు, ఇతర ఉన్నత విద్యాసంస్థలను ఇందులో భాగస్వామ్యం చేసి ఆన్లైన్ ద్వారా విద్యార్థులకు వివిధ కోర్సులను అందుబాటులోకి వచ్చేలా చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో విద్యను అందించడం, పరీక్షలు నిర్వహించడం, సర్టిఫికెట్ల ప్రదానం చేయడంవంటి అన్ని కేంద్రీకృత వ్యవస్థగా డిజిటల్ వర్సిటీ వ్యవహరిస్తుంది. ప్రస్తుతం వివిధ విద్యాసంస్థల ద్వారా అమలవుతున్న విధానాలకు భిన్నమైన రీతిలో డిజిటల్ యూనివర్సిటీ సేవలందించనుంది. ప్రస్తుతం జాతీయ స్థాయిలో, వివిధ రాష్ట్రాల్లో న్యాక్ "ఏ" ప్లస్ ఉన్న కొన్ని విశ్వవిద్యాలయాలు ఆన్లైన్ విధానంలో పలు కోర్సులను అందిస్తున్నాయి, కానీ డిజిటల్ యూనివర్సిటీ అందుబాటులో వస్తే జాతీయ స్థాయిలో ఒక కేంద్రీకృత విధానం అందుబాటులో ఉండి, యూనివర్సిటీ పరిధి అనే భావన లేకుండా అన్ని వర్గాల విద్యార్థులకు, అభ్యర్థులకు వైవిధ్యమైన కోర్సులు ఉచితంగా లేదా నామ మాత్రపు ఫీజులతోనే చదివే గొప్ప అవకాశం లభిస్తుంది, ఎందుకంటే ప్రస్తుతం పలు యూనివర్సిటీలు అందిస్తున్న ఆన్‌లైన్ కోర్సుల ఫీజులు అధికంగా ఉన్నాయి, బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు అధిక ఫీజులు భారంగా ఉండటంవల్ల వారు ఆస్తకి చూపటంలేదు, డిజిటల్ యూనివర్సిటీ అందుబాటులో వస్తే వారికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ఒకవిధంగా చెప్పాలంటే, నేషనల్ డిజిటల్ యూనివర్సిటీ స్పోక్ అండ్ హబ్‌గా, అంటే ఒక కేంద్రీకృత పంపిణీ వ్యవస్థలా డిజిటల్ వర్సిటీ పనిచేస్తుంది. సైకిల్ చక్రానికి హబ్ మాదిరిగా ఈ యూనివర్సిటీ ఉంటుంది. ఊచలు (స్పోక్) కేంద్ర ప్రదేశంలో కలుస్తూ తిరిగి అన్నివైపులకు తమ సేవలను పంపిణీ చేసేలా వివిధ విద్యా సంస్థల భాగస్వామ్యంతో పని చేస్తుంది. దేశంలోని జాతీయ ఉన్నత విద్యాసంస్థల సమన్వయంలో జాతీయ స్థాయిలో అన్ని ప్రాంతాలకు విస్తరించేలా ఉన్నత

విద్యాసేవలను అందిస్తుంది. ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఐటీలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలతో పాటు ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నడిచే విద్యా సంస్థలన్నీ ఈ డిజిటల్ వర్సిటీ పరిధిలో తమ కోర్సులను విద్యార్థులకు అందుబాటులోకి తేనున్నాయి. విద్యార్థులు తమ సంస్థలలో చదువుతూనే డిజిటల్ వర్సిటీ ద్వారా ఇతర సంస్థల కోర్సులను అభ్యసించడానికి వీలు కల్పిస్తుంది. వారు ఆ సంస్థల ద్వారా క్రెడిట్లను అందుకోగలుగుతారు. సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీలను ఈ క్రెడిట్ల ఆధారంగా వారు అందుకోగలుగుతారు. ఈ విధానంలో 50 శాతం క్రెడిట్లు సాధిస్తేనే అర్హతగా పరిగణించి, విద్యార్థులు ఏ కోర్సులో అయినా 50 శాతం క్రెడిట్లు సాధిస్తేనే డిగ్రీలకు అర్హులవుతారు. ఈ క్రెడిట్లను ఒకేసారి కాకున్నా తమకు నచ్చిన సమయాల్లో సాధించినా డిగ్రీని ప్రదానం చేస్తారు. అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏ.బి.సి) ద్వారా విద్యార్థులు తమ క్రెడిట్లను బదలాయించుకోవడానికి కూడా అవకాశం ఉంటుంది. ప్రయోగ శాలల (ల్యాబ్లు), ప్రాక్టికల్ వర్కులతో సంబంధం లేని థియరీ కోర్సులు మాత్రమే ప్రస్తుతం డిజిటల్ వర్సిటీ ద్వారా అందిస్తారు. ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఢిల్లీ, బనారస్ హిందూ విశ్వవిద్యాలయం ఇప్పటికే డిజిటల్ యూనివర్సిటీ ద్వారా కోర్సులు అందించేందుకు రంగం సిద్ధం చేశాయి. ప్రపంచంలో అతి పెద్ద సార్వత్రిక విశ్వవిద్యాలయమైన "ఇగ్నో" యూనివర్సిటీ కుడా పలు కోర్సులు అందించటానికి సిద్ధంగా ఉంది.

డిజిటల్ యూనివర్సిటీలో సీట్లు లేవనే సమస్య ఉండదు, కాబట్టి విద్యార్థి తాను కోరుకొనే వర్సిటీలో అభ్యసించాలనుకునే కోర్సులో చేరే వెసులుబాటును డిజిటల్ వర్సిటీ కల్పించనుంది. సీట్లు లేకపోవడం లేదా ప్రవేశ పరీక్షలో అర్హత సాధించకపోవడంవంటి వాటితో సంబంధం లేకుండా విద్యార్థులు ఆసక్తి ఉన్న కోర్సును అభ్యసించడానికి వీలవుతుంది. ప్రస్తుతానికి సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీలతో ప్రారభమయ్యే ఈ వర్సిటీ సేవలు రానున్న కాలంలో పీజీ డిగ్రీలు, డాక్టరేట్లను కూడా అందించేలా యూజీసీ సన్నాహాలు చేస్తోంది. ఈ డిజిటల్ వర్సిటీ ద్వారా ప్రస్తుత వర్సిటీల్లో అదనపు సీట్ల ఏర్పాటు, అందుకు తగ్గ సిబ్బంది నియామకం, మౌలిక వసతుల కల్పనవంటి భారాలు తగ్గుతాయని భావిస్తున్నారు. డిజిటల్ విశ్వవిద్యాలయం స్వయం, స్వయం-ప్రభ, e-PG-పాఠశాల, e-GyanKosh, నేషనల్ డిజిటల్ లైబ్రరీ, వర్చువల్ ల్యాబ్లవంటి ప్రస్తుత సామర్థ్యాలను అన్నింటిని సమన్వయం చేసుకుంటూ కావాల్సిన కంటెంట్ని తయారు చేస్తుంది. నేషనల్ డిజిటల్ యూనివర్సిటీ భవిష్యత్లో స్థూల నమోదు నిష్పత్తి పెరుగుదలలో, ఉపాధి అవకాశాల లభ్యతకు దోహదం చేస్తుంది, భవిష్యత్‌లో మారుమూల గ్రామాల్లో ఉన్న విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో వివిధ కోర్సుల్లో నమోదు చేసుకునే అవకాశం ఉంది, పలు కోర్సులలో ప్రవేశం తీసుకున్నాక, ప్రపంచ స్థాయి ఉన్నత విద్యా సంస్థలైన ఐ.ఐ.టి.లు, కేంద్ర విశ్వవిద్యాలయాల ఆచార్యులచే భోధన, నైపుణ్యాల అభివృద్ధివంటివి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. విద్యార్థులలో ప్రేరణ లేకపోవడం, మౌలిక సదుపాయాల సమస్యలు, డిజిటల్ అక్షరాస్యత – సాంకేతిక సమస్యలు, వ్యక్తిగతంగా పరస్పర చర్య లేకపోవడం, కోర్సు నిర్మాణం, నాణ్యతలాంటి పలు సమస్యలు డిజిటల్ యూనివర్సిటీలో విద్యార్థుల నమోదుని ప్రభావితం చేసే అంశాలు, కాబట్టి నేషనల్ డిజిటల్ యూనివర్సిటీ సేవలు పూర్తి స్థాయిలో విస్తరించాలంటే గ్రామీణ ప్రాంతాలలో ఉన్న విద్యార్థులకు ఇంటర్నెట్ సౌకర్యం ఒక ప్రధాన సమస్య, కానీ ప్రభుత్వం ఇంటర్నెట్ సేవలు, కంప్యూటర్‌లాంటి మౌలిక, అంతర్జాల సదుపాయాలు కల్పించాలి. ప్రస్తుతం కేంద్ర మంత్రిత్వశాఖ నిర్వహిస్తున్న స్వయం పోర్టల్ అందిస్తున్న ఆన్లైన్ కోర్సులపట్ల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అవగాహన తక్కువ ఉంది, కాబట్టి నేషనల్ డిజిటల్ యూనివర్సిటీ అందించే ఆన్లైన్ కోర్సులు, వాటి ప్రాధాన్యతను అందరికి విస్తరించేలా ప్రాంతీయ విశ్వవిద్యాలయాలను కూడా నేషనల్ డిజిటల్ యూనివర్సిటీలో సమన్వయం చేయాలి. నేషనల్ డిజిటల్ యూనివర్సిటీ ద్వారా లభించే కోర్సుల ప్రభావంవల్ల ప్రాంతీయంగా ఉండే వివిధ రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాల దూర విద్యా కేంద్రాలలో విద్యార్థుల నమోదు తగ్గే ప్రమాదం ఉంది, కాబట్టి కొన్ని ఎంపిక చేసిన కోర్సులనే ప్రవేశపెట్టి, స్పెషలైజేషన్ ఉన్న కోర్సులని అందిస్తే ఇతర ఇతర విశ్వవిద్యాలయాల దూర కేంద్రాలకు ప్రవేశాల నమోదు సమస్య ఉండదు. ఆన్లైన్‌లో ఉపాధి, నైపునాలను పెంచే కోర్సులు నేషనల్ డిజిటల్ యూనివర్సిటీ ద్వారా అందించటమే కాకుండా పూర్తి చేసిన వారికి పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకున్నపుడే సాంప్రదాయ అభ్యాసన విధానంతో పాటు సమానంగా ఆన్లైన్ విద్యా విధానం కూడా సత్ఫలితాలు ఇస్తుంది.

డా. కందగట్ల శ్రవణ్ కుమార్ - ఫోన్: 990 884 3592.



ఆర్ట్ దుబాయ్ గ్యాలరీ

# దుబాయ్ కళా మేళా

## (Dubai Art Fair) 2023

– టి.వి. ప్రసాద్

ప్రతి సంవత్సరం మార్చి నెలలో జరిగే దుబాయి ఆర్ట్ ఫెయిర్‌ది అంతర్జాతీయ కళా ప్రదర్శనల్లో అగ్రస్థానం. ఇది మధ్య ప్రాచ్యానికి ప్రాముఖ్యతనిస్తూ 2007లో ప్రారంభమైంది. ఉత్తర ఆఫ్రికా, దక్షిణ ఆసియా దేశాలు పాల్గొనే గొప్ప కళాప్రదర్శన. నలభై దేశాలకు చెందిన తొంభై ఆర్టు గాలరీలు అనంత వైవిధ్యంతో పాల్గొనే ఈ మేళా ప్రపంచంలోని మేటి కళా వేదికగా రూపొందింది.

అంతర్జాతీయ కళా కార్యకలాపాల్లో దుబాయ్ కళాసంతది చురుకైన పాత్ర. ప్రతి సంవత్సరం వేలాది సందర్శకుల్ని, కళాప్రియుల్ని ఆకర్షిస్తోంది. అరబ్ ఎమిరేట్స్ (UAE)కు చెందిన స్థానిక, అంతర్జాతీయ కళాప్రియులు, కళా సేకర్తలు, కళావ్యాపారులు, పరిరక్షకులు (క్యూరేటర్లు), కళాపోషకులు వంద వరకు సంచార మ్యూజియాలు, అనేక ఇతర కళాసంస్థలు పాల్గొనే అతి పెద్ద వేదిక. 2019లోనే ముప్పది వేల సందర్శకులను ఆకర్షించిన గొప్ప కళా వేడుక.

ఈ మేళాలోని గాలరీ హాళ్ళకు సమాంతరంగా విస్తృత కార్యక్రమాల్లో కళాసృష్టికి పురమాయించబడ్డ ఆర్టిస్టులు, క్యూరేటర్లు, ప్రాజెక్టులు, స్థానిక సంస్థల చొరవ, ప్రోత్సాహంవల్ల గ్లోబల్ ఆర్ట్ ఫోరం పాత్రవల్ల 'ఆర్ట్ ఫెయిర్' విజయ పథంలో ప్రయాణిస్తోంది. దుబాయ్ రాజు, UAE ప్రధాని, ఉపాధ్యక్షుడు కూడా అయిన షేక్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ దీనికి రాజ పోషకుడు. కరోనా విలయం, ప్రపంచ వ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు వేగంగా పడిపోవడం, రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగించడం కారణంగా ఎమిరేట్సు ఆర్థిక పరిస్థితి కుప్పకూలిపోయింది. అటువంటి పరిస్థితిని అధిగమించి అంతర్జాతీయ కళాప్రదర్శనను నిర్వహించడం, అందులో కళాకారులు, కళాప్రియులు ఎందరెందరో మదీనత్ జుమెయిరాలో సమావేశం అవడం ఊహకందని విషయం.

2020లో జరగవలసిన ఈ కళామేళా కోవిడ్ కారణంగా ఆగిపోలేదు కానీ డిజిటల్ రూపంలో అభిమానులకు చేరువయింది. 2022 మార్చి పదిహేనవ విడత ప్రదర్శన కాగా, 2023 మార్చి 1-5 తేదీలలో జరిగిన కళామేళా పదహారవది. ఇటీవలే ప్రారంభించబడిన "మ్యూజియం ఆఫ్ ఫ్యూచర్", మ్యూజియం ఆఫ్ ఇల్యూషన్స్, మేడం టుస్సాడ్స్, దుబాయ్ గార్డెన్ గ్లో, డిజిటల్ ఆర్ట్ థియేటర్‌ల పాత్ర కూడా ఈ మేళా విజయంలో కాదనలేనిది.

దుబాయ్ ఆర్ట్ గాలరీలు వర్తమానకళ, ఆధునిక కళ, బవాబా, డిజిటల్ ఆర్ట్ నాలుగు విభాగాలుగా విభజింపబడ్డాయి. **వర్తమాన కళా విభాగం** గత రెండు సంవత్సరాలుగా ప్రైమరీ మార్కెట్‌కు ప్రాధాన్యతనిస్తూ కళాసంపదను ప్రదర్శిస్తోంది. 60కి పైగా ఆర్ట్ గాలరీల నుండి ఎంపిక చేసిన యువ కళాకారుల వర్తమానకళను పరిచయం చేయడం దీని ఆశయం. వివిధ కళాకారుల పనితనాన్ని, లబ్ధ ప్రతిష్టులైన ఆర్టిస్టులు మొదలుకొని, కవర్ పెయింటింగు, డ్రాయింగు, శిల్పం, కళాకృతుల స్థాపన, వీడియో, ఫొటోగ్రఫీ మొదలైన రకరకాల కార్యకలాపాలకు విస్తృత పరిధిలో ప్రాతినిధ్యం కల్పించింది. 2019 మేళాలో పలు దేశాల 90 ఆర్ట్ గాలరీలతో కొత్తగా కళాజగతిలో అడుగుపెట్టిన కేమరూన్, కొలంబియాలకు చెందిన యువ కళాకారులకు ప్రవేశం కల్పించింది.



దుబాయ్ ఆర్ట్ గ్యాలరీ

**ఆధునిక కళా విభాగంలో** వర్తమాన కళాకారులను ప్రియాంక రాజా కలకత్తా, ఇసబెల్లా వాన్‌డెన్ – దుబాయ్, ఉర్సులా క్రిన్ జింగర్ – వియత్నాంల త్రిసభ్య కమిటీ ఎంపిక చేసింది. 2023 ప్రదర్శన ఆధునిక విభాగం కళారంగంలో మౌలిక కృషి చేసిన పదిమంది కళాకారుల వైవిధ్యభరిత కళాకృతుల్ని ప్రదర్శించింది. 1929లో జన్మించిన ఘనా దేశీయుడు జేమ్స్‌బార్‌నర్ (james Barner) ఫొటోగ్రాఫర్‌కు తన కాలంనాటి సాంఘిక రాజకీయ పరిణామాలను నిశితంగా పరిశీలించి బంధించిన ఫొటోగ్రాఫుల్ని ప్రదర్శించే అవకాశం కల్పించింది. 1960–1990ల నాటి కళాప్రదర్శనకు జతగా గత ఇరవై సంవత్సరాల్లో చోటు చేసుకున్న ముఖ్యమైన మార్పుల్ని, వివిధ కళాధోరణులను ప్రదర్శించింది. జోర్డాన్ శిల్పకారుడు మోనా సాదీకి నివాళిగా అతని శిల్పాలను ప్రదర్శించడం, లెబనాన్ కళా కుటుంబం ఒక గాలరీని పంచుకునే అవకాశం ఇవ్వడం, లెబనాన్‌కేకాక తూర్పు అరబ్ ప్రాంతానికి ఇదే తొలి గాలరీ కావడం, పాలస్తీనా, డెమాన్కస్ పెయింటర్లకు ఇందులో పాల్గొనే అవకాశం ఇవ్వడం విశేషం. మరో విలక్షణ విభాగం **బవాబా** (Bawwaba) 2019లోని గాలరీల్లో మధ్య ప్రాచ్య, ఆఫ్రికా, దక్షిణాఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల ఆర్టిస్టులు చేపట్టిన ప్రాజెక్టులపై దృష్టి సారించింది. ఫ్రెంచి, కామెరూన్ క్యూరేటర్ ఎలీస్ అటాంగనా (Elise Atangana) పర్యవేక్షణలో అత్యంత ఊహాత్మక కళారూపాలకు, కుడ్య చిత్రాలపై నిర్మించిన వీడియోలకు ప్రాధాన్యతనిచ్చింది. భౌగోళిక దక్షిణ దేశాలకు, ఆయా దేశాల్లో జరుగుతున్న వర్తమాన కళాకార్యకలాపాలకు ముఖ ద్వారం తెరిచింది.



ఆర్ట్ దుబాయ్ 2023 - బవాబా చిత్రం

**డిజిటల్ ఆర్టు :**

ఈ విభాగ క్యూరేటర్, సింగపూర్‌కు చెందిన క్లారా ఛెవిపే సాంకేతిక విజ్ఞానం, ప్రతిభతో కళారంగం ఎంత మార్పు చెందిందీ, డిజిటల్ ఆర్టు ఎంత శక్తివంతమయిందీ, గత సంవత్సరంకన్నా ఈ సంవత్సరపు కృత్రిమ మేధ (Artificial Intelligence - AI) సృజించిన అనేక కళాకృతులను గురించి వివరించింది. పూర్వ ప్రదర్శన (Pre-view) రోజున ఆరు చిత్రాల పరంపర 'జెనెసిస్' ప్రదర్శించబడి మరు క్షణంలోనే అమ్ముడుపోవడం, ఇంకో గాలరీలో లండన్ మోడరన్ ఆర్ట్ గాలరీకి చెందిన టెయిలర్ హాబ్స్ NFT పెయింటింగు నాలుగు లక్షల డాలర్లకు అమ్ముడు పోవడం విశేషం. కళావ్యాపార సంస్థ క్రిష్టీ కూడా వెబ్ 3, AI, బ్లాక్ చైన్ రోబోటిక్స్ ఆర్టు – టెక్నాలజీల ప్రదర్శనను నిర్వహించింది. ఇది ఆర్టు – టెక్నాలజీ క్రమ పరిణామాన్ని, NFT ప్రాధాన్యత కోల్పోవడాన్ని సూచిస్తుంది.

**ప్రపంచ కళావేదిక (Global Art Forum):**

ఆర్ట్ దుబాయ్‌లో జరిగే వార్షిక సమావేశాల్లో గ్లోబల్ ఆర్ట్ ఫోరంది అతి పెద్ద పాత్ర. ప్రాంతీయ, అంతర్జాతీయ మేధావుల, ఆర్టిస్టుల, రచయితల, నాయకుల ఉపన్యాసాలు, చర్చలు, ప్రదర్శనలు దీనిలోని ముఖ్య ఆకర్షణలు. నేను యంత్రాన్ని కాదు (I Am not A Robot) కార్యక్రమంలో యాంత్రీకరణ సంభావ్యత, మతి స్థిమితం (Paranoia) మీద దృష్టి పెట్టే 'పాఠశాల ఓ కర్మాగారమా?' అనే అంశం మీద చర్చ చేపట్టింది.

**విద్యా కార్యక్రమాలు:**

లాభాపేక్ష లేకుండా చిన్న తరగతుల విద్యార్థుల నుండి విశ్వవిద్యాలయ విద్యార్థులవరకు ఉపయుక్తమైన కార్యక్రమాలు చేపట్టడం, అరబ్ దేశాల ఆర్టిస్టులు, క్యూరేటర్లు, రచయితలు, డిజైనర్లు, ఫోరంకు చెందిన ఔత్సాహికులనందర్నీ ఒకే వేదిక మీదికి సమీకరించడం, వారికందరికీ అవసరమైన శిక్షణకు (Internship)

అవకాశం కల్పించడం ఈ కార్యక్రమం విశేషం. 2017 వసంతంలో దుబాయ్ ఆర్ట్ గాలరీల్లో పాల్గొన్న ఆర్టిస్టుల పని విధానం, వ్యక్తిత్వాన్ని తెలిపే మూడు నిముషాల నిడివిలో వీడియో చిత్రాలను రూపొందించడం ప్రారంభించింది.

**ఆర్థిక ప్రభావం :** దుబాయ్ ఆర్ట్ ఫెయిర్ నిర్వహణకు దాదాపు 35 మిలియన్ డాలర్లు ఖర్చు పెట్టాల్సి వస్తుందని అంచనా వేయబడింది. సందర్శకుల నుండి వసూలు చేసిన ప్రవేశ రుసుములో వచ్చిన 25 శాతం ఆదాయాన్ని ఉక్రెయిన్ యుద్ధ శరణార్థుల సాయం కోసం కేటాయించాలని నిర్ణయం తీసుకుంది. ఉత్తమ కళాకృతికి / ఆర్టిస్టుకు రెండున్నర లక్షల డాలర్లు, అనేక నగదు అవార్డులు, ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం ద్వారా కళాకారుల్లో ఉత్సాహాన్ని నింపింది.

'వర్తమానంలో భవిష్యత్తు' ఇతివృత్తంగా 2023 మార్చి 1-5 తేదీల్లో జరిగిన ఆర్ట్ ఫెయిర్ కళారంగంలోని ఉద్దండులు పాల్గొన్న ప్రతిష్ఠాత్మక, అంతర్జాతీయ కార్యక్రమం. శాన్‌ఫ్రాన్సిస్కో క్యూరేటర్ జేమ్స్ బాచి, భారతదేశ ప్రతినిధి శుక్లా, మీనా కమాల్, కెయిరో నుండి డా. నజాత్ మాలిక్, ఫైసర్ అబ్దుల్ ఖాదర్ (దుబాయ్ మెట్రో రైలు బోగీలను అందంగా తీర్చిదిద్దిన కళాకారుడు), కళా సలహాదారు, క్యూరేటర్, సహకారి అబ్దుల్ వాహద్‌లు ప్రముఖులు.

దుబాయ్ ఆర్ట్‌కు ఆరాధనా మందిరంగా గుర్తింపు పొందిన మదీనా జుమెయిరా నాలుగు విభాగాల ద్వారా ఉత్తేకకరమైన ఆధునిక కళా ధోరణులను, దృక్కోణాలను ప్రదర్శించగా, దీనికి సమాంతరంగా కళాప్రదర్శనలు, విద్యాకార్యక్రమాలు, భాషణలు, కళా పురమాయింపులు వార్షిక సమావేశాలు చోటు చేసుకున్నాయి. మొదటి రెండు రోజుల కార్యక్రమాలకు టికెట్ ధర కొంచెం ఎక్కువగా ఉండి, మిగతా రోజుల ప్రదర్శనకు తక్కువ కావడం, 18 సంవత్సరాలలోపువారికి ఉచిత ప్రవేశం కల్పించడంతో సందర్శకుల సంఖ్య బాగా పెరిగిపోయింది. 'దుబాయ్ ఆర్ట్ ఫెయిర్' జరిగే మదీనా జుమెయిరా సమావేశ స్థలం కింగ్ సులేమాన్ బిన్ అబ్దుల్ అజీజ్ అల్ సౌద్ స్ట్రీట్‌లో ఉంటుంది. మధ్య ప్రాచ్యంలో పెరిగిపోతున్న కళాభిమానానికి తగినట్లుగా ప్రపంచ దేశాల వర్తమాన కళను అందుబాటులోకి తెచ్చి ప్రదర్శిస్తోంది. ఈ యేటి ప్రదర్శనలో పశ్చిమ ఆసియాకు అత్యంత ప్రాధాన్యత దక్కింది. ఈ భారీ ప్రదర్శన దక్షిణ భౌగోళిక దేశాల కళకు తలుపులు తెరిచింది. ఇటువంటి వేదికే లేకపోతే ఆసియా, ఆఫ్రికా, బ్రెజిల్, అర్జంటీనా, పెరూ, వెనుజులా మొదలైన లాటిన్ అమెరికా దేశాలకు, పసిఫిక్ మహాసముద్రంలోని ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పపువా, సమోవా, టాంగో మొదలైన ఓషియానా దేశాలకు తమకళను ప్రదర్శించే అవకాశం సాధ్యమయ్యేది కాదు. పశ్చిమ దేశాల కళాప్రపంచంలో ఏమి జరుగుతుందో తెలుసుకోవడానికి కూడా ఈ గాలరీలు మిక్కిలిగా ఉపయోగపడ్డాయి.



Artist Rafik Andol 'Glacier Dreams', Which Debuts In The Julius Bar Lounge at Art Dubai 2023



వరల్డ్ ఆర్ట్ దుబాయ్‌లో మార్కో ఒలివర్ రూపొందించిన శిల్పం

**కళకు రాచబాట:**

దుబాయ్ ఆర్ట్ ఇంకో విషయంలో కూడా ప్రత్యేకమైనదే. ఆసియా హాంకాంగ్‌లో జరిగే ఆర్ట్‌బాసిల్, ఇటీవలే ప్రారంభమైన సింగపూర్ ఆర్ట్ (Art SG)లకు ఇది పూర్తిగా భిన్నమైనది. ఈ శతాబ్ది తొలి దశకంలో చాలా పాశ్చాత్య దేశాల ఆర్ట్ గాలరీలు బంగారు గుడ్లు పెట్టే బాతులుగా మారిపోతే దుబాయ్ ఆర్ట్



వరల్డ్ ఆర్ట్ దుబాయ్ 2023 లో ప్రదర్శించబడిన డిజిటల్ చిత్రం

ఫెయిర్ కళా వాతావరణాన్ని నెమ్మదిగా అభివృద్ధి పరచడంలో, కేవలం ప్రాక్పశ్చిమ కళాసంగమంగానే మిగిలిపోకుండా దుబాయ్‌లో కళాభిరుచిని పెంచడంలో నిమగ్నమైంది. హాంగ్‌కాంగ్‌లో 35 గాలరీలు ఒకేసారి ఉప్పెనగా వచ్చి పెట్టుబడి పెట్టినట్లు కాకుండా, కళాకారులకు, కళాప్రియులకు ప్రోత్సాహాన్ని ఇవ్వడంతో దుబాయ్ కళాకేంద్రంగా అభివృద్ధి పథకంలో పయనిస్తోంది. జమీల్ కళా కేంద్రం, అబుధాబి లూవర్, తష్కీల్ వర్తమాన కళాకేంద్రం మొదలైన సంస్థలు, జీవావరణ పర్యావరణ పరిరక్షణా బాధ్యతతో దుబాయ్ కళామేళాను అంతర్జాతీయ స్థాయికి ఎదగడానికి పాటుపడ్తున్నాయి. అనేక కళాసంస్థలు, ఆర్ట్ గాలరీలు, ఫౌండేషన్లు, గ్రాంట్లు నిధుల రూపంలో విదేశీ కళను దిగుమతి చేసుకోవడానికి సాయపడ్తున్నాయి.

చాలా కాలంగా దుబాయ్ కళాసేకరణకర్త ముఖ్యంగా సిరియా, లెబనాన్, పాలస్తీనా కళాభిమాని అమర్ మక్కి ఈ కళామేళావల్ల తానెంతగా అభివృద్ధి చెందిందీ వివరిస్తూ "ఇతర దేశాల కళకూ, దుబాయ్ కళకూ తేడా ఏమీ కన్పించడం లేదు, దుబాయ్ ఆర్టుకు ఊతం ఇచ్చి, పోషించుకోవలసిన బాధ్యత కళాప్రియులదే" అంటాడు. బంగ్లాదేశ్ కళాసేకర్త నాడియా సమ్‌దానీ ఈ మేళాను



వరల్డ్ ఆర్ట్ - దుబాయ్‌లో సందర్శకులు

మెచ్చుకుంటూ "ప్రపంచ దేశాల కళాభిమానుల్ని ఆకర్షించే స్థానంలో ఉండటంవల్ల దుబాయ్ లాభ పడ్తోంది" అని వ్యాఖ్యానించింది.

'దుబాయ్ ఆర్ట్ ఫెయిర్' నాలుగు విభాగాల ద్వారా (వర్తమాన, ఆధునిక, బవాబా, డిజిటల్ కళను ప్రదర్శించడం) యువ కళాకారులకు అవకాశం ఇచ్చి ప్రోత్సహించడంలో విదేశీ ఆర్టు గాలరీలు, ఫెయిర్లతో పోటీ పడుతోంది. ఫిలిప్పీన్స్ ఆర్టిస్టు సిల్వర్ హవేలీ, నేపాలీ ఆర్టిస్ట యుధిష్టర్ మహారాజన్‌లు ఈ మేళాలో అవకాశం పొందగలిగారు.

**భారతదేశ పాత్ర, ప్రాతినిధ్యం:**

మన దేశం తొమ్మిది పెద్ద గాలరీలతో పాల్గొనడం, మన ఆర్టుకు బాగా ఆదరణ లభించడం, ఎక్కువగా అమ్ముడుపోవడం, మన కళాకారులు దుబాయ్‌లో నివసిస్తున్న భారతీయ (Diaspora) కళాకారులకు మరింత చేరువై విదేశీ కళతో పోటీపడడం గర్వకారణం. 'చౌపాల్ – దక్షిణ ఆసియాలో ప్రయాణం' చిత్ర శ్రేణిలో పదిమంది భారతీయ కళాకారులు ఆహారం, ఆచారం, వర్గ సమీకరణం, జీవిత చిత్రణ అంశాల మీద రూపొందించిన డిజైన్లు ప్రదర్శించబడ్డాయి. ఈ ఆర్టు ఫెయిర్ భారతీయ కళను ప్రపంచ దేశాలకు పరిచయం చేయడానికి రాచబాట వేయగా, విదేశీ కళాకారులకు మన కళను పరిచయం చేయడానికి వీలు కలిగించింది. కళామేళాలోని ఈ సందడిని చూస్తే దుబాయ్ మధ్య ప్రాచ్యంలో ఉన్న విషయం మర్చిపోయి, దక్షిణాసియా దేశాల్లో ఉన్నట్లనిపిస్తుంది" అని ఆర్టు డైరెక్టర్ డెల్‌వాల్ వ్యాఖ్యానించాడు.

దుబాయ్ కళామేళా ఆ నగరానికి, ఆ దేశానికి ప్రతీకగా, గర్వకారణంగా నిలుస్తుంది. అనంత వైవిధ్యం కలిగిన చిన్న-చిన్న సమాజాల కలయికవల్ల ఏర్పడిన దుబాయ్ అభిరుచులు, ఇష్టాయిష్టాల్లో కూడా మరెక్కడా కన్పించని వైవిధ్యాన్ని, సృజనాత్మకతను కళావైభవాన్ని ఇక్కడ చూడవచ్చు. ఆ కారణంగానే దుబాయ్ కళాపరంగా, భౌగోళిక రాజకీయపరంగా ప్రాధాన్యతను సాధించింది అని ఒక ముంబయి జర్నలిస్టు అభిప్రాయపడడం సమంజసమనిపిస్తుంది.

టి.వి. ప్రసాద్
హైదరాబాద్. ఫోన్: 798 139 8250.

# ఏథెన్స్
## పాశ్చాత్య నాగరికత పుట్టింట్లో ...

– నిమ్మగడ్డ శేషగిరిరావు

చిన్నతనం నుండీ నాకు గ్రీసు దేశం అంటే ఎంతో ఇష్టం. ఏథెన్స్ నగరం అంటే అభిమానం. ఐరోపా దేశాల్లో ఎన్నో ప్రయాణాలు చేసినా ఏథెన్స్ నన్ను తప్పించుకు తిరుగుతూనే ఉంది. ఒకసారి అనుకోకుండా ఆ అదృష్టం వచ్చింది. ఎలాగంటే నా ఇద్దరు కుమార్తెలు (కవలలు), వారితో పాటు అదే రోజు పుట్టిన వారి స్నేహితురాలితో కలసి పుట్టినరోజు సందర్భంగా ఏథెన్స్ వెళదామన్నారు. అక్కడికి వెళ్ళటానికి 49 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న నేను వెంటనే బయలుదేరాను.

**నాగరికత పుట్టిల్లు:**

పాశ్చాత్య తత్త్వశాస్త్రం, ఎన్నో ప్రయోగిక శాస్త్రాలు, భౌగోళిక, ఖగోళ, వైద్య, వాస్తు శాస్త్రాలు, సాహిత్య, నాటక కళలతో కూడుకున్న ఒక ప్రత్యేకమైన ప్రాచీన నాగరికతకు, ప్రజాస్వామ్యంలాంటి సమకాలీన దృక్పథాలకు జన్మస్థలం గ్రీస్. ఈ కాలంలో ఇంగ్లీషు భాషలా, ఆ కాలంలో దాదాపు 1500 సంవత్సరాల పాటు, గ్రీకు భాష అంతర్జాతీయ భాషగా కొనసాగింది. చిన్నప్పటి నుండి నాకు సోక్రటీసు, ప్లాటో, అరిస్టాటిల్, హోమర్, హెరిడోటస్, అలెగ్జాండర్, హిప్పోక్రేట్స్, పైథాగరస్, యూక్లిడ్, ఆర్కిమెడిస్, క్లిస్తెనీస్, పెరిక్లెస్‌లాంటి ఎంతోమంది గ్రీకు మేధావుల జ్ఞాన సంపత్తి మీద ఆసక్తి ఉంది. వీళ్ళందరూ దాదాపు 2000 సం.ల నాటివారు.

ఈ రోజు మనం చూస్తున్న పాశ్చాత్య నాగరికతకు ఆనాటి గ్రీకు దేశస్థులు పటిష్ఠమైన పునాదులు వేశారు. క్రీ.పూ. 4, 5వ శతాబ్దాల్లో గ్రీసులో జరిగిన సాంస్కృతిక అభివృద్ధి, మానవ చరిత్ర మీద ఎంతో ప్రభావాన్ని చూపింది. ఈ దశలో వెల్లివిరిసిన అసామాన్యమైన సృజనాత్మక ఆలోచనలు, రాజకీయంగా, వైజ్ఞానికంగా, తత్త్వశాస్త్రపరంగా, ఎన్నో విషయాల్లో వినూత్నమైన పోకడలకు దారిచూపాయి. సుస్థిరమైన సైనిక, నౌకా బలగాలతో అగ్రరాజ్యమైన పర్షియా దేశాన్ని ఎదిరించి, ఓడించిన గ్రీసు దేశం పాశ్చాత్య దేశాలలో ఆధునిక ప్రజాస్వామ్య విధానాలకు నాంది పలికింది.


The Erechtheion

క్రీ.పూ. 320 సంవత్సరంలో అలెగ్జాండర్ వచ్చేటప్పటికే ఆ చిన్న గ్రీసు దేశం ప్రపంచాన్ని శాసించేటంత శక్తివంతంగా ఉంది. పరిస్థితిని అందిపుచ్చుకున్న అలెగ్జాండర్ పర్షియా చక్రవర్తి మూడవ డేరియస్ సైన్యాన్ని మొదటగా క్రీ.పూ. 331వ సంవత్సరంలో ఇస్సస్ యుద్ధంలోనూ, రెండవసారి 330వ సంవత్సరంలో జరిగిన గౌగమేలా యుద్ధంలోనూ ఓడించాడు. పర్షియన్ల మీద సాధించిన ఈ విజయాలవలన తూర్పు ఐరోపా నుండి ఇండియావరకూ ఉన్న ప్రదేశమంతా గ్రీకువారి అధీనంలోకి వచ్చింది. తర్వాత వచ్చిన రోమన్లు రాజకీయంగానూ, సైనిక బలంతోనూ గ్రీకువారిని త్రోసిరాజన్నా, గ్రీకు సంస్కృతి ప్రభావం రోమన్ల మీద, పశ్చిమ దేశాల మీద ఈనాటికీ బలంగా ఉంది.

ఏథెన్స్ గ్రీసు దేశానికి రాజధానే కాకుండా, సాంస్కృతిక కేంద్రం కూడా. ఇటువంటి కాలాతీతమైన నగరాలు ఎప్పటికీ పాతబడవు. కాలచక్రం క్రింద నలిగిపోకుండా, కాలానుగుణంగా మారుతూ, నిత్య కల్యాణం పచ్చతోరణంగా వెలిగే ఈ నగరాలు రెండువేల సంవత్సరాలనాడు ఎంత వైభవంతో ఉన్నాయో, ఇప్పటికీ అలానే ఉన్నాయి. నేను చూసిన వారణాసి, మధురై, జెరూసలం, డెమాస్కస్, షిరాజ్, యూరోప్‌లో రోమ్, లండన్, ఇస్తాంబుల్ నగరాలు కూడా ఇలాంటివే.

**పిల్లలతో ప్రయాణం:**

లండన్‌లోని గాట్విక్ విమానాశ్రయం నుండి

బయలుదేరిన మూడున్నర గంటల తరువాత ఏథెన్సు అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిపోయాము. మాతో నలుగురు స్కూలు పిల్లలు ఉండటంతో వారి అల్లరితో ప్రయాణం సందడిగా సాగిపోయింది. మాతో పాటుగా ప్రయాణించిన లండన్ కెమిస్ట్రీ టీచర్, ఆమె స్నేహితురాలు, మా అమ్మాయిలకు మంచి కాలక్షేపంగా, నవ్విస్తూ, కవ్విస్తూ, దోవ పొడుగునా కేరింతలు కొట్టించారు. తోటి ప్రయాణీకులకి ఇది కొంచెం ఇబ్బంది కలిగించే ఉంటుంది.

**గ్రీస్ గురించి గ్రీసువారి మాటల్లో:**

మా బృందంలో మొత్తం 13 మందిమి ఉన్నాం. వారిలో 3 సం. వయసు నుండి మొదలైన ఐదుగురు చిన్న పిల్లలు. అందరం కలిసి ఒక వ్యాన్ మాట్లాడుకొన్నాం.

డ్రైవరు కాన్‌స్టాంటినో, అరవైకి దాటిన వయసుతో, గ్రీకు దేశస్థుడిననే స్వాభిమానంతో కనిపించాడు. మంచి ఇంగ్లీషు మాట్లాడుతూ, "సుమారు లక్షాయాభైవేల గ్రీకు పదాలు మీ ఇంగ్లీషు భాషలోకి ప్రవేశించాయి" అని మాతో చెప్పాడు. అతని ప్రకారం ఐరోపా మీద అధిపత్యం కోసం బిటన్, జర్మనీ రెండు దేశాల మధ్య ఉన్న పోటీయే, రెండు ప్రపంచ యుద్ధాలకి కారణం. ఇప్పుడు యురోపియన్ యూనియన్‌లో జర్మనీదే పై చేయిగా ఉండటంవలన, జర్మనీవారిచే శాసించబడటం బ్రిటన్ వారికి ఇష్టం లేక, బ్రిటన్ విడిపోయింది, అని తన అభిప్రాయం చెప్పాడు. ఇటీవలి కాలంలో ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దటానికంటూ జర్మనీవారు తీసుకుంటున్న ఏక పక్ష చర్యలు గ్రీసువారికి అంతగా నచ్చటం లేదని నాకు తెలుసు. ఈ విషయంలో బ్రిటన్, జర్మనీల గురించి నీ అభిప్రాయం ఏమిటని అడిగినప్పుడు కాన్‌స్టాంటినో జర్మనీ వారిపట్ల మొగ్గుచూపుతూనే. నేర్పుగా 'బిటీషు రాయల్ ఫ్యామిలీ గ్రీకువారే కదా' అన్నాడు. ఎలిజబెత్ రాణిగారి భర్త ప్రిన్స్ ఫిలిప్ గ్రీకు రాకుమారుడు కాన్‌స్టాంటినోకి ఇంకా చాలా తెలుసు. జె.ఎఫ్. కెన్నడీ మరణం తర్వాత అతడి భార్యని, గ్రీసుకి చెందిన సంపన్న నౌకా వ్యాపారస్తుడు, ఓనాసిస్ పెళ్ళి చేసుకోవటం అమెరికావారికి నచ్చకపోవటంవలన, గత కొన్ని దశాబ్దాలుగా గ్రీసు దేశానికి వారు ఎలాంటి సహాయం చేయటంలేదన్నాడు. వ్యాన్‌లో ప్రయాణించిన 45 నిముషాల్లో అతడు అనేక విషయాలు చెబుతూ వచ్చాడు. గ్రీసు ప్రజలు కొత్త వారితో ఎంతో స్నేహపూర్వకంగా ఉంటారని కానిస్టాంటినో ముందస్తుగా తెలియచెప్పాడు.



A Centaur wrestles with a bearded man - (150-200 A.D.) in National Museum, Greece

**క్రొత్త చోటులో:**

మేము దిగిన '360 డిగ్రీస్ హోటల్' పేరుకు తగినట్లుగానే, ఊరు మధ్యలో, ఎక్రోపోలిస్‌కి దగ్గరగా ఉన్న మోనాస్టిరాకి స్క్వేర్‌లో ఉంది. ఎక్రోపోలిస్ ఏథిన్స్ నగరంలోని చిన్న కొండ. దాని మీద అనేక గొప్ప కట్టడాలు ఉన్నాయి. హోటల్ పైన ఉన్న రూఫ్‌గార్డెన్ రెస్టారెంట్ నుండి చూస్తే నగరమంతా చక్కగా కనిపించింది. నా గది కిటికీ నుండి ఆ స్క్వేర్, దాని ప్రక్కనే ఉన్న ఒక పాత చర్చి, పైన అందమైన గంటతో కనిపించాయి. రెండు మూడు భవనాలు దాటాక చాలా డోమ్‌లతో టర్కీవారి పద్ధతిలో కట్టిన మసీదు కనిపించింది. దాన్ని ఇప్పుడు షాపులుగా మార్చివేశారు. అక్కడ ఒక మెట్రోస్టేషన్ భవనం, మరో పక్కన ఒక మార్కెట్టు ఉన్నాయి. ఐరోపా దేశాలు తిరిగి చూడాలనుకున్నవారికి సిటీ సెంటర్‌లో ఉండే హోటళ్ళలోనే బస చెయ్యమని నేను అందరికీ సలహా ఇస్తాను. ఇందువలన ఆ నగర స్వరూప, స్వభావాలు త్వరగా, సరిగ్గా అర్థమౌతాయి. పగటికంటె విభిన్నంగా, రాత్రివేళ విశేషంగా జరిగే కార్యక్రమాలని చూడటం వదులుకోకూడని అనుభవం కూడా దక్కుతుంది. దానిలో ఉండే ఇబ్బందల్లా గదులు ఇరుకుగా, ఖరీదుగా ఉంటాయి. కాని రకరకాల రెస్టారెంటులు దగ్గర్లో ఉంటాయి. ముఖ్యమైన ప్రదేశాలన్నీ అందుబాటులో ఉంటాయి. నడచుకొంటూ హాయిగా తిరగవచ్చు. టాక్సీలు, టూరిస్టు బస్‌ల అవసరం ఉండదు. పైగా సెంటర్‌లో రక్షణ ఎక్కువ. ఆ ప్రాంతమంతా పోలీసుల కాపలాతో, కెమేరాలతో గమనించబడుతూ ఉంటుంది.

**ఎక్రోపోలిస్:**

మరుసటిరోజు మధ్యాహ్నం అందరం ఏటవాలుగా, ఒక కొండచరియ మీదున్న ఎక్రోపోలిస్ చూడటానికి

వెళ్ళాము. మా గైడు నటలీకి ఈ వృత్తిలో మంచి అనుభవం ఉంది. మొదట్లో ఒలంపస్ కొండ మీద, పన్నెండుమంది ముఖ్యమైన దేవుళ్ళు ఉండేవారట. వారందరికీ 'జ్యూస్' అధిపతి. ఆనాటి ఒలింపియన్ దేముళ్ళలో అపోలో సంగీత సాహిత్యాలకు, అతని కవల సహోదరి ఆర్టిమిస్ వేటకు, ఆఫ్రోడైట్ ప్రేమకు పోసీడన్ సముద్రాలకు కొలవబడేవారనేటటువంటి విశేషాలు కూడా నటలీ చెప్పింది. గ్రీకు దేవుళ్ళు రోమన్ దేముళ్ళుగా ఎలా మార్చివేయబడ్డారో ఆమె మాకు చెప్పింది. ఆ క్రమంలో 'జ్యూస్' జూపిటర్‌గా, ఆఫ్రోడైట్ వీనస్‌గా, పోసీడన్ నెప్ట్యూన్‌గా, ఎథెనా మినర్వాగా నామాంతరం చెందారట. అపోలో పేరు మాత్రం అలానే ఉంది. ఒలింపియన్ దేముళ్ళలో ఒకరైన ఎథీనా, జ్యూస్ కుమార్తె. ఆమె అతని తల నుండి జన్మించింది. అందువలన ఆమె విజ్ఞాన దేవత అయింది. ఎథీనాకి సముద్ర దేవుడైన పోసీడన్‌కి, ఏథెన్సు నగరాధిపత్యం విషయంలో ఎప్పుడూ పోటీ ఉండేదట. ఏథెన్స్ నగర ప్రజలకు ఎథీనా ఒక ఆలివ్ చెట్టుని, పోసీడన్ ఉప్పునీటిని కానుకగా ఇచ్చారట. ప్రజలు ఎథీనాను నగరాధిపతిగా ఎంచుకుని, తమ నగరాన్ని ఆమె పేరు మీద 'ఏథెన్స్' అని పిలుచుకొన్నారు. ఎక్రోపోలిస్ మీద ముఖ్యమైన ఆలయమైన పార్థెనాన్ ఎథెనా దేవతకు అంకితం చేయబడింది.


The Parthenon in Athens, Greece

**పార్థెనాన్:**

మానవ నిర్మితమైన గొప్ప వాస్తుకళారూపాలలో పార్థెనాన్ ఆలయం సాంప్రదాయకంగా గ్రీసు దేశపు చిహ్నంగా నిలిచింది. 2,500 సంవత్సరాలనాటి నిర్మాణం, కాలగతికి లోనై, శిథిలమైనట్టు కనపడుతున్నా, ఈ రోజుకీ అది ఎంతో ఉన్నతంగా, గర్వంగా తలెత్తుకుని నిలబడి, దాని గతవైభవాన్ని చూపరులు ఊహించుకోగలిగే విధంగా ఉంటుంది. ఈ ఎథీనా ఆలయం కాలక్రమేణా కొంతకాలం చర్చిగా, కొంత కాలం మసీదుగా, తర్వాత అంతఃపురంగా, ఉండి, చివరికి ఒక ఆయుధశాలగా మారింది. క్రీ.శ. 1687వ సంవత్సరంలో టర్కీతో చేసిన యుద్ధంలో, వెనీసు వారి బాంబుపడి పై కప్పు శిథిలమయ్యే వరకు. పార్థెనాన్ చెక్కుచెదరలేదు. తరువాత రోజుల్లో వాస్తు శిల్ప నిపుణులచేత పునర్నిర్మించబడిన పార్థెనాన్, ప్రతి సంవత్సరం కొన్ని లక్షలమంది యాత్రికులను ఆకర్షిస్తూ ఉంది. ఆ తర్వాత 19వ శతాబ్దం మొదట్లో బ్రిటీషు వారి దౌత్యవేత్త లార్డ్ ఎల్జిన్, పార్థెనాన్‌లో పదిలపరచబడిన కొన్ని శిల్పాలను, కళాఖండాల్ని ఒక పథకం ప్రకారం ఇంగ్లండుకి తరలించి, వాటిని బ్రిటిష్ మ్యూజియంకు అమ్మాడు. అవే 'ఎల్జిన్ మార్బుల్స్'గా పిలవబడుతున్నాయి. గ్రీసు వాటిని తిరిగి ఇవ్వమని అడిగినప్పుడు, ఒక దేశానికి ఇస్తే వారు తమ హయాంలో ఎన్నో దేశాల నుండి సేకరించిన పురావస్తు సంపదనంతా ఆయా దేశాలకు తిరిగి ఇచ్చేసే పద్ధతికి శ్రీకారం చుట్టినట్లవుతుందని భయపడి బ్రిటన్ ఒప్పుకోలేదు. పైగా, వీటిని ఆనాడు గ్రీసుని పరిపాలిస్తున్న టర్కీ గవర్నరు వద్ద నుండి లార్డ్ ఎల్జిన్ కొని, చట్టబద్ధంగానే బ్రిటన్‌కు పంపాడనీ, వాటి మీద గ్రీస్‌కు ఎలాంటి హక్కు లేదని ఖరారు చేశారు. ప్రపంచంలో ఎన్నో దేశాల నుండి సేకరించిన ఎన్నో కళాఖండాలతో పాటు, 'ఎల్జిన్ మార్బుల్స్' కూడా లండన్‌లోని బ్రిటీషు మ్యూజియంలో ఈనాటికీ ప్రదర్శింపబడుతున్నాయి.

ఈ పార్థెనాన్ ఆలయపు వాస్తు నిర్మాణరీతిలో కట్టిన ఎన్నో ఇళ్ళని, భవనాల్ని నా ఐరోపా యాత్రల్లో చాలాసార్లు చూశాను. అంతగా ప్రభావితం చేసిన నిర్మాణం ఇది. గ్రీకుల తరువాత 400 సంవత్సరాలకి, చక్రవర్తులుగా వెలుగొందిన రోమన్లు మొదటగా దీనిని అనుకరిస్తూ 'పాంథియాన్' అనే చారిత్రాత్మక భవనాన్ని నిర్మించారు. బ్రిటిష్ మ్యూజియమ్ ముఖభాగం, జర్మనీలోని 'వాత్‌హల్లా పోర్టికో' కూడా పార్థెనాన్‌ను పోలి ఉంటాయి. నిజానికి, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అమెరికా నిర్మించుకొన్న చాలా భవనాలు ప్రాచీన గ్రీకు, రోమ్ వాస్తు నిర్మాణాన్ని అనుకరిస్తూ నిర్మించినవే. అందువల్లనే వాషింగ్టన్ డి.సి. నగరం, సుప్రీంకోర్టు, నేషనల్ పోర్ట్రైట్ గ్యాలరీ, లింకన్ మెమోరియల్‌లాంటి భవనాలతో మిగతా అమెరికా నగరాలకంటే భిన్నంగా, ప్రాచీన ఐరోపా నగరాలను పోలి, ప్రత్యేకంగా కనిపిస్తుంది. న్యూయార్కులో

ఉన్న 'నేషనల్ మెమోరియల్ ఫెడరల్ హాలు', ఫిలడెల్ఫియాలో 'సెకండ్ బ్యాంకు ఆఫ్ యునైటెడ్ స్టేట్స్' భవనాలు కూడా పార్థెనాన్ ఆలయ వాస్తు రీతిని అనుకరించి నిర్మించినవే. టెన్నెస్సీలోని నాష్‌విలీ, ఇంకొక్క అడుగు ముందుకి వెళ్ళి పూర్తిగా పార్థెనాన్ నమూనాని యధాతథంగా నిర్మించారు. 2500 సం.ల క్రితం పార్థెనాన్ ఎలా ఉండేదో చూడాలనుకొంటే నాష్‌విలీ వెళ్ళవలసిందే.

**ఎక్రోపోలిస్ – ఇంకొన్ని విశేషాలు:**

ఎక్రోపోలిస్ చూడటం ముగిసేసరికి సాయంత్రం అయింది. మేము దిగుతుంటే, క్రింద నుండి కొంతమంది కొండపైకి ఎక్కుతున్నారు. వారంతా కొండ పై నుండి సూర్యాస్తమయ దృశ్యాన్ని చూడటానికి వెళుతున్నారని తెలిసి, వారితో పాటుగా మేమూ ప్రక్కనే ఉన్న ఇంకొక కొండ ఎక్కాము. సూర్యుడు క్రమేణా పడమరకు ఒదిగిపోయేకొద్దీ, పార్థెనాన్‌తో పాటు, ఎక్రోపోలిస్ చుట్టూ ఉన్న పాలరాతి కట్టడాలు, క్రొత్తక్రొత్త రంగులు సంతరించుకుంటున్నాయి. సంధ్యవేళలో ధగధగలాడే నారింజ రంగుతో పాటు, ఈ సహజమైన వర్ణప్రదర్శనలో, దృశ్యానికి ఒక అతీతభావం అద్భుతమూ, మమ్మల్ని ముఖ్యంగా ఆకట్టుకున్నది ఒకరకమైన ముదురు ఊదారంగు.

ఎక్రోపోలిస్ మీద ఉన్న ఒక చిన్న ఆలయం పేరు ఎరెక్థియాన్. ఈ ఆలయం తూర్పు మండపాన్ని తలల మీద మోస్తున్నట్లుగా కనిపించే, చేతులు లేని ఆరుగురు స్త్రీల శిల్పాలకు ప్రసిద్ధి. జీవంతో తొణికిసలాడుతూ, 'కార్యాటిడ్స్' అనబడే ఈ శిల్పాలు, పాలరాతికి ప్రాణం పోసే గ్రీకు శిల్పకళావైభవానికి నిలువెత్తు సాక్షాలుగా ఇక్కడ నిలిచి ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఇక్కడ ఉన్న శిల్పాలు అన్నీ ప్రతిరూపాలే అయినా అవి అసలు వాటికి ఏ మాత్రం తీసిపోనంత అందంగా ఉన్నాయి. మొదటగా ఇక్కడున్న ఆరు శిల్పాలలో ఒకటి మాత్రం బ్రిటిషు మ్యూజియంలో ఉంది. మిగిలిన అయిదు, మరొక నకలుతో కలసి ఎక్రోపోలిస్ మ్యూజియంలోఉన్నాయి.

ఈ ఎక్రోపోలిస్ కొండ వాలులో క్రీ.పూ. 6వ శతాబ్దిలో నిర్మించబడిన డయోనీసియస్ థియేటర్ ఉంది. కొన్ని శతాబ్దాల పాటు సాగిన తన ఉచ్ఛ దశలో దాదాపు 30000 మంది, కూర్చుని, గ్రీకు విషాదాంత నాటికలు చూడటానికి వీలైన ఈ థియేటర్ ప్రస్తుతం శిధిలావస్థలో ఉంది. దీనికి దగ్గరలోనే ఉన్న ఇరోడిస్ అనే మరో చిన్న వర్తులపు నాటకశాలను మాత్రం ఎప్పటికప్పుడు బాగుచేసుకుంటూ ఇప్పటికీ ఉపయోగిస్తూనే ఉన్నారు. చూసీ చూడగానే పార్థెనాన్ కలిగించే సంభ్రమాశ్చర్యాలు సందర్శకుల హృదయాల్లో నిలచిపోతాయి. ఎక్రోపోలిస్ పైన, ఎత్తులో ఉండి, ఆకాశాన్నంటే ఏథెన్సు నగర భవన శ్రేణులనే శాసిస్తున్నట్లుండే పార్థెనాన్, రాత్రుళ్ళు మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాల వెలుగులో దివికీ, భువికీ మధ్యలో సృష్టించబడిన చలువరాతి సౌధంలా మెరిసిపోతూ ఉంటుంది. ఇక్కడ ఉన్న ఎక్రోపోలిస్ మ్యూజియం ఇటీవలి కాలంనాటిదే. పరిసరాల్లోని శిల్పాలని, వస్తు సంపదని ప్రదర్శించటానికి మాత్రమే దీనిని ఏర్పాటు చేశారు.


Athens

అయినా, దీనిని చూడకుండా ఎక్రోపోలిస్ దర్శనం పూర్తి కాదు. ఏథెన్స్ వైభవం కొన్ని శతాబ్దాల పాటు నింగికెగసి, చివరకు క్రీ.పూ. 480 సం.లో పర్షియావారితో జరిగిన సలామిస్ యుద్ధంలో నేలకూలింది. కాని తూర్పు ఐరోపా అంచుల నుండి, భారతదేశపు వాయవ్య సరిహద్దువరకూ రాజ్యాన్ని విస్తరింప చేసిన పర్షియన్లకు అది ఏనాడూ దాసోహం అనలేదు. క్రీ.పూ. 5, 4వ శతాబ్దాలు అంటే, అలెగ్జాండర్ కాలానికి ముందున్న రెండు వందల సంవత్సరాల కాలం గ్రీకు చరిత్రలో 'స్వర్ణయుగం' అని పిలువబడింది. ఆ కాలంలోనే ఏథెన్స్‌కి చెందిన రాజకీయవేత్త పెరిక్లిస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉత్తమోత్తమమైన భవన నిర్మాణాలకు నాంది పలకబడింది. బంగారురేకుల తాపడంతో మెరిసిపోయే ఏథీనా దేవత కొలువున్న ఈ పార్థెనాన్‌తో పాటు ఎక్రోపోలిస్ భవనాలు చాలావరకు స్వయంగా పెరిక్లిస్ ఆధ్వర్యంలో నిర్మించబడినవే.

**ఇంకొన్ని మ్యూజియములు:**

'నేషనల్ మ్యూజియం ఆఫ్ ఆర్కియాలజీ' అమూల్యమైన ప్రాచీన గ్రీకు కళాఖండాలు భద్రపరచబడిన మరో మ్యూజియం. గ్రీసు దేశం నుండి చాలా సంపద,

చాలా సమయాల్లో పారిస్‌లోని లూర్వ్ మ్యూజియానికీ, లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియమ్‌కు, న్యూయార్క్‌లోని మెట్రోపోలిటన్ మ్యూజియమ్‌కు చేరవేయబడ్డాయి. ఇక్కడ మా గైడు ఆంద్రియా ఎంతో హుషారుగా, దాదాపు ఒక గంటసేపు మ్యూజియమ్ విశేషాలన్నీ చూపించింది. అమ్మాయిలు వాళ్ళు స్కూల్లో నేర్చుకున్న గ్రీకు పురాణ గాథలని, చరిత్రని గుర్తుకు తెచ్చుకొన్నారు. మా అమ్మాయిలందరూ ఇప్పటికీ ఆంద్రియా నవ్వులనే కాకుండా, ఆమె తనకు తెలిసిన విషయాన్ని ఇతరులకు సులువుగా అర్థమయ్యేలా చెప్పే చాతుర్యాన్ని కూడా తలచుకుంటూ ఉంటారు. ఈ మ్యూజియంలోని ఆరడుగుల కంచు, పాలరాతి శిల్పాలు, కొన్నిటికి చేతులు, ముక్కులు విరిగిపోయినప్పటికీ జీవం ఉట్టిపడుతున్నట్లుగా కనిపించాయి. ఇక్కడ ఎథెనా, అపోలో, పోసిడాన్, విగ్రహాలు, మైసీనియన్ వారి బంగారు నగలు, అగమెమ్నన్ రాజుగారి బంగారు మాస్క్ చెప్పుకోదగ్గవి.


డాక్టరుగారి కుటుంబం

**గ్రీక్ రుచులు:**

గైరోన్ అనేది గ్రీసులో చాలామంది ఇష్టపడే ఆహారం. ఇది రెండు పొరలుగా ఉండే రొట్టె లోపల కూరగాయలు లేదా మాంసంతో చేసిన కూరతో నింపి, చివరగా దీన్ని ముంచుకోవటానికి పెరుగుతో చేసిన 'ట్జాట్జికి' (సాసికి అని పలకాలి) అనే పెరుగు చట్నీలాంటి పదార్థం కూడా ఇస్తారు. మధ్యాహ్నం పూట ఆకలి తీర్చుకోవటానికి ఇది సరిపోతుంది. 'క్విక్ లంచ్' అంటే కూడా, మధ్యధరా ప్రాంతంలో భోజన సమయంలో హడావుడిని సహించరు. మధ్యాహ్న భోజనం 'క్విక్' అంటే రాత్రి భోజనంకంటే కొంచెం త్వరగా. ఏ భోజనమైనా వైన్, ఛీజ్, ఆలివ్ నూనెలతో రుచులన్నీ కలుపుకుంటూ నిదానంగా తినవలసిందే. గ్రీకు రుచులు చాలావరకు టర్కీవారివే అనిపిస్తుంది నాకు. ఈ గ్రీసు నగరం టర్కీ వారి క్రింద నాలుగు వందల సంవత్సరాల పాటు ఉండటంతో, ఇరుప్రాంతాల ఆహార విహారాలు కలగలుపై ఉండి ఉంటాయి. గ్రీకుని తుర్కుల నుంచి విడుదల చేయటానికి లార్డ్ బైరన్ తన ధన మాన ప్రాణాలు పణంగా పెట్టాడు. గ్రీకులంటే బైరన్‌కు అంత ప్రేమ!

సాయంత్రానికి మేము అద్దెకు తీసుకున్న ఒక సర్వీసు అపార్టుమెంట్ చేరుకున్నాము. ఒక ప్రఖ్యాత టూర్ గైడు దానికి యజమాని. దీన్ని అతని తదనంతరం అతని మేనల్లుడికి ఇస్తూ, కేవలం యాత్రికులకి మాత్రమే అద్దెకివ్వాలనే షరతు పెట్టాడు. ఇక్కడ ఉన్న పెద్ద లైబ్రరీలో అతను సేకరించిన కొన్ని అరుదైన పుస్తకాలు కూడా ఉన్నాయి. ఆ సాయంకాలం, మాలో కొంతమందిమి స్థానిక పానీయం 'ఔజో'ని రుచి చూశాం. ఒక చిన్న సీసా ఔజోని అతిథ్యంలో భాగంగా ఉచితంగా ఇచ్చారు. దాని వాసన కాస్త ఘాటుగా, అనాసపువ్వులా ఉంది. ఈ పానీయాన్ని మధ్యయుగాల్లో గ్రీకు క్రైస్తవ మతగురువులు మొదటగా తయారు చేశారని తెలిసింది.

**ఇద్దరు ఆడపిల్లల తండ్రిగా:**

ఆ రోజు ఫిబ్రవరి 11, 2019. మా కవల పిల్లలు, వారి స్నేహితురాలికి కూడా పుట్టినరోజు. అప్పటివరకు, నేను లిమోజిన్ కార్లలో తిరగగలిగేది గొప్పగొప్పవారే అనుకునేవాడిని. అయితే ప్రత్యేక సందర్భాల కోసం ఇలా ఒక లిమోజిన్ కార్లో ప్రయాణం ఏర్పాటు చేసుకోవచ్చు అని ఇక్కడ తెలుసుకొన్నాను. పుట్టినరోజు సంబరంలో భాగంగా, ప్రత్యేకంగా అమ్మాయిలు వారి తల్లులు మాత్రమే నగరం అంతా తిరగటానికి ఒక లిమోజిన్ బుక్ చేశాము. ఇది గ్రీసు కాబట్టి నాలాంటి సామాన్యుడు కూడా ఇటువంటి ఆలోచన చేయగలిగాడు. ఇలాంటి పార్టీ లండన్‌లో జరిగితే అయ్యే ఖర్చు గుర్తొచ్చి, అది తప్పినందుకు చాలా సంతోషించాను.

ఆ లిమోలో డ్రైవరు ప్రక్కన ఒక సీటు ఖాళీగా ఉంది. మాలో అందరికంటే పెద్దవాడిని నేనే కాబట్టి ఆ సీటులో నన్ను కూర్చోబెట్టారు. ఇద్దరు ఆడపిల్లల తండ్రిగా నాకు ఎప్పుడూ, ఎదురు చూడని ఇటువంటి

అనుభవాలు దొరుకుతూనే ఉంటాయి. ఆ గంటసేపు లిమో టూరు నిముషాల్లో పూర్తయినట్టనిపించింది. ఆ లిమో ఏథెన్స్ ప్రధాన వీధుల్లో మెత్తగా సాగిపోతుంటే ఆ దారిలో ఉన్న కొన్ని పర్యాటక విశేషాలను డ్రైవరు మాకు చూపిస్తూపోయాడు. వాటిల్లో ఒకటి ఒలింపిక్ జ్యూస్ ఆలయం. దీన్ని క్రీ.శ. రెండవ శతాబ్దంలో రోమన్ చక్రవర్తి హేడ్రియన్ నిర్మించాడు. దిట్టమైన ఆ పెద్ద పెద్ద స్తంభాలు ఇప్పటికీ అలాగే నిలిచి నగరంలో ఎన్నో చోట్ల నుండి కనపడతాయి కూడా. ఆ దోవలో ఇండియా, అమెరికా దౌత్య కార్యాలయాలతో పాటు, నగర రాజకీయ కేంద్రమైన సిన్‌టాగ్మా కూడలిని కూడా చూశాము. చివరగా 1896వ సంవత్సరంలో ఉపయోగించబడిన 'పనాథినైకోన్' అని పిలవబడే పాత ఒలంపిక్ స్టేడియం చూశాము. బారన్ పియరీ డి కౌబర్టిన్ అనే ఫ్రెంచ్ ఉన్నత వర్గీయుడు ఒలింపిక్ ఆటలను పునరుద్ధరించినప్పటి నుండి ప్రతి నాలుగు సంవత్సరాలకీ జరిగే ఒలింపిక్ ఆటల జ్యోతి ఇక్కడ మొదలై, ప్రపంచం అంతా తిరిగి వస్తుంది ('ప్రోమిథిస్ అన్‌బౌండ్' షెల్లీ రచనలో మనిషి 'జూస్' నుంచి నిప్పుని నేలకు తీసుకు వస్తాడు).

ఒలింపిక్ క్రీడలకి పుట్టిల్లు ఏథెన్స్. ప్రతి నాలుగు సంవత్సరాలకీ ఒలింపిక్ ఆటలు గ్రీస్‌లోని 'ఒలింపియా' అనే ప్రదేశంలో మొదలుపెట్టే సాంప్రదాయం క్రీ.పూ. 888వ సం.లో మొదలై, రోమను రాజులు క్రైస్తవ మతస్థులై, వీటిని ఆపివేసినంతవరకూ జరిగాయి. ఒలింపిక్ క్రీడాసమయంలో చాలా ముఖ్యమైన దౌత్య వ్యవహారాలు ఒప్పందాలు కూడా జరిగేవట. ఆ కాలంలో క్రీడాకారులందరూ పురుషులే. అందరూ నగ్నంగానే పాల్గొనేవారు. ఆ ప్రాంగణంలోకి స్త్రీలకు ప్రవేశం లేదు. ఈ ఆటల్లో గెలుపొందినవారికి ఆలివ్ ఆకులతో చేసిన కిరీటాన్ని బహూకరించేవారు. పిల్లలతో ప్రయాణం చేయటంలో ఉన్న ఒక మాధుర్యం, మనం మన బాల్యానికి వెళ్ళిపోగలగటం. మనలో దాగి ఉన్న పసి మనస్తత్వాన్ని బయటికి తీసుకురావటంలో పిల్లలను మించినవాళ్ళుండరు. గత రెండు రోజులలో సంస్కృతి, చరిత్ర, మ్యూజియమ్‌ల మోతాదు ఎక్కువైంది. ఈ పిల్లలు ఏదైనా సాహస వినోదం కోసం అడుగుతున్నారు. వారికి ఎక్కి నిలుచుని సాగిపోయే 'సెగ్‌వే' అనే ఎలక్ట్రిక్ వాహనం మీద సిటీ టూర్ వాగ్దానం చేశాను. ఆ మరుసటిరోజు ఉదయాన అరగంటసేపు నడచిన తర్వాత సెగ్‌వే టూర్ కంపెనీ చేరుకొన్నాం. అప్పటికి కూడా అవకాశముంటే తప్పించుకుందామనే ఉంది. ఎందుకంటే రెండు చక్రాల మధ్య ఉండే చిన్నబల్ల మీద సమంగా నిలబడి వేగాన్ని అదుపు చేసుకుంటూ సాగిపోవటం చాలా కష్టం. కాని ఈ పిల్లలందరినీ చూసుకొంటున్న ఇద్దరిలో నేనూ ఒకణ్ణి కాబట్టి దీన్ని తప్పించుకునే విషయంలో నాకు కావాలనుకున్నంత స్వతంత్రం దొరకలేదు. ముందెప్పుడూ చూడకపోయినా, మా పిల్లలు మాత్రం ఐదు నిముషాల్లోనే సెగ్ వే మీద తిరగటం నేర్చేసుకున్నారు. మా శిక్షకురాలు, వేరా ఎంత అనుభవజ్ఞురాలైనా, నేర్చుకొని, విశ్వాసంతో రోడ్డెక్కటానికి నాకు పది నిముషాలు పట్టింది. సైకిల్ వేగంతో సులువుగా సాగిపోతుంటే, ఇదేమీ కష్టమనిపించలేదు. నిజానికి చాలా సరదాగా ఉంది.

ఎక్రోపోలిస్ చుట్టూ ఉన్న బాట మీద సగం దూరం ఈ సెగ్‌వే మీద 90 నిముషాల పాటు తిరిగాం. చాలా రెస్టారెంట్లు, కేఫ్‌లతో కిక్కిరిసి ఉన్న ప్రాంతాన్ని దాటి పార్థెనాన్ చక్కగా కనపడే ఒక మంచి ప్రదేశం చేరుకున్నాము. మలుపులు తిరిగిన రోడ్డు మీద జాగ్రత్తగా 'డెమోక్రసీ హిల్'వైపు సాగిపోయాము. మా సెగ్‌వేలని అక్కడే ఉంచేసి, ఆ ప్రాంతం అంతా కాలినడకన తిరిగి చూడటానికి వేరా సహాయం చేశాడు. గ్రీకు భాషలో డెమోస్ అంటే ప్రజలు. ప్రాచీన కాలంలో ఏ విషయం మీదైనా వాదోపవాదాలున్నప్పుడు ఏథెన్స్ ప్రజలు ఆ కొండమీద చేరి, ఎక్కువమంది మద్దతు ఎటువైపుందో దానినే నిర్ణయంగా స్వీకరించేవారని, ఆ విధంగా ఇక్కడ ప్రజాస్వామ్యం (డెమోక్రసీ) పుట్టిందనీ గైడు వివరించాడు.

ప్రపంచంలో అతి ప్రాచీనమైన న్యాయస్థానం కూడా ఈ కొండ మీదనే ఉండేదనటానికి సాక్ష్యంగా ఇక్కడ కొన్ని శిథిలాలు ఉన్నాయి. చరిత్ర సంగతి కాస్త ప్రక్కకు పెడితే, ఇక్కడి నుండి ఏథెన్స్, అందులోని ఎక్రోపొలిస్ దృశ్యాలు అద్భుతంగా కనిపిస్తాయి. మోనాస్టరాకీ కూడలి ఎప్పుడూ అక్కడ డజన్లకొద్దీ ఉన్న రెస్టారెంట్లలో తినటానికో, వాడిన వస్తువులను అమ్మే వీధి మార్కెట్‌లలో కొనటానికో వచ్చే స్థానికులతో, యాత్రికులతో రద్దీగా ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడి రెస్టారెంట్లు మరీ కిక్కిరిసిపోతాయి.

మెట్రో స్టేషన్ వెనుక, విద్యుద్దీపాల కాంతిలో మెరిసే హేడ్రియన్ లైబ్రరీ పాలరాతి స్తంభాలు దాటాక వచ్చే ఒక ఇరుకు వీధి పేరు, ఆడ్రియానో స్ట్రీట్. మా హోటల్ వద్ద ఉన్న ఒక రిసెప్షనిస్ట్ మమ్మల్ని ఈ ఆడ్రియానో స్ట్రీట్‌లో ఉన్న రెస్టారెంట్లలో తప్పకుండా భోజనం చెయ్యమని చెప్పింది.

**గ్రీకు ఆతిథ్యం:**

నిజమైన గ్రీకు దేశపు ఆహారాన్ని రుచి చూడటానికి మొదటిరోజు 'ఆడ్రియానో' వీధిలో 'ఎఫ్కారిస్' అనే రెస్టారెంట్‌ని ఎన్నుకున్నాము. మా పదమూడుమంది కోసం రోడ్డు మీదకు వేసిన షామియానా క్రింద ప్రత్యేకంగా ఒక టేబుల్ వేశారు. చుట్టూ వాతావరణమే కాకుండా, అక్కడి రుచులు, వారి ఆతిథ్యం మమ్మల్ని ముగ్ధుల్ని చేశాయి. మా ముందుంచిన పదార్థాల్లో పెరుగులో సన్నగా తరిగిన దోసకాయ, ఉల్లిపాయ ముక్కలు వేసి చేసే 'ట్జాట్జికి' (సాసికి), నిప్పుల మీద కాల్చిన మాంసం, అన్నము, రొట్టెలతో పాటు అందించే సోవ్‌లాకి, పెద్దవంకాయ, బంగాళదుంపలను కైమాతో కలిపి చేసే ముసాకా ముఖ్యమైనవి. మేము జఠరాగ్నిని ప్రేరేపించే 'స్టార్టర్స్' తింటూండగానే, తాజాగా అప్పుడే తయారుచేసిన వెచ్చటి బ్రెడ్ చిన్నబుట్టలలో ఇచ్చారు. వాటిమీద వేసుకోవటానికి ఆలివ్ నూనె, ఊరబెట్టిన ఆలివ్స్ కూడా ఇచ్చారు. మధ్యధరా ప్రాంతంవారికి భోజనంలో వైన్ ఒక భాగం. మాకు ఇచ్చిన వైన్ వారి స్వంత తయారీ. ఒక ఇత్తడి గ్లాసులో ఇచ్చిన ఈ వైన్ సుతారంగా గొంతులోకి జారిపోయింది.

ఆ రోజు మాభోజనానికి పెద్ద మొత్తం చెల్లించాలేమో అనుకుంటుండగా, 145 యూరోలకు మాత్రమే బిల్లు వచ్చింది. ఐరోపా ప్రమాణాలను బట్టి చూస్తే ఇది చాలా తక్కువ. ఇదే లండన్ అయితే బిల్లు దీనికి కనీసం రెండు రెట్లు ఉండేది. అందువలన ఈ రెస్టారెంట్‌కి, వెళ్ళేలోపు మళ్ళీ ఇంకోసారి రావాలనుకున్నాము. ఏథెన్స్‌లో ఒక రాత్రిభోజనంలో 'రెట్సినా' అనే స్థానిక వైన్‌ని తీసుకొన్నాం. గ్రీసు అంతర్భాగంలోని, అట్టికా ప్రాంతపు పత్యేకత ఇది. వైన్ నిలువబెట్టే పీపాల మూతలను పైన్ చెట్లనుండి స్రవించే జిగురుతో ముయ్యటంవలన ఈ వైన్‌కు ఒక ప్రత్యేకమైన పైన్ రుచి వస్తుందట. గ్రీకువారికి ప్రతి వస్తువుకీ ఒక దేవుడు ఉంటాడు. డయోనీసస్ ఈ ద్రాక్షసవానికి దేవుడు. అందుకే పురాతన గ్రీకులు ద్రాక్షతోటలతో పాటు పెరిగే పైన్ చెట్లను డయోనీసస్‌కి ప్రత్యేకించేవారు.

**అగోరా:**

చివరి రోజు పిల్లలు వాళ్ళ తల్లులతో కలసి షాపింగ్‌కి వెళ్ళారు. ఆ సమయంలో మేము 'అగోరా' అంటే మార్కెట్ ప్రదేశానికి వెళ్ళాం. ఇది ఎక్రోపోలిస్ కొండవాలులో, 'మోనాస్టరాకీ'కి దగ్గర్లోనే ఉంది. ప్రాచీన కాలపు ఏథెన్స్‌లో అగోరాలు ప్రజాజీవితానికి కేంద్రస్థానాలు. ప్రతి గ్రీకు నగరంలోను 'అగోరా' సామాజిక జీవనానికి, రాజకీయ వాదాలకు, మత కార్యకలాపాలకు జీవనాడిలాంటిది. ఏథెన్స్ అగోరా గ్రీసులో చూడవలసిన ప్రదేశం. ఎన్నో సామాజిక భవనాలతో కూడిన ఈ అగోరా ప్రజాస్వామ్య విధానానికి పీఠంలాంటిది. సొక్రటీసు, ప్లాటో, అరిస్టాటిల్‌వంటి గొప్ప మేధావుల ఆలోచనా విధానాలను కూడా తన చరిత్రలో పొదవుకుంది ఈ అగోరా. 120 మీటర్ల ఎత్తు స్తంభాలతో కట్టిన పెద్ద హాలులా ఉన్న 'అత్తలోన్ స్టోవా' అగోరా ప్రాంతంలో దొరికిన పురావస్తువులను భద్రపరచే మ్యూజియం. పరిసరాల్లో ప్రాచీన నిర్మాణాల శిధిలాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. వాటిల్లో ఒకటైన 'హెఫీస్టస్ ఆలయం' అంతగా శిధిలం కాలేదు. హెఫీస్టస్ హస్తకళాకారుల దేవుడు. ఈ ఆలయాన్ని క్రీ.పూ. 5వ శతాబ్దంలో ఒక చిన్న కొండ మీద నిర్మించారు.

**తిరుగు ప్రయాణం:**

ఆ రోజు మా తిరుగు ప్రయాణం. నాలుగు రోజుల క్రితం మాకు గ్రీసుని పరిచయం చేసిన కాన్‌స్టాంటినో మా తిరుగు ప్రయాణంలో కూడా ఇంకొన్ని కొత్త ప్రదేశాలు చూపించాడు. వాటిలో ఒకటి 'పెంటిలికస్' కొండ. పార్థెనాన్‌తో పాటు ఏథెన్స్ స్మారక భవనాల నిర్మాణానికి వాడిన చలువరాయి ఇక్కడి నుండి వచ్చినదేనట. ఎయిర్‌పోర్టుకి చేరుకోగానే అమూల్యమైన అనుభవాలను మూటకట్టుకుని, కాన్‌స్టాంటినోకి, ఏథెన్స్ నగరానికీ గుడ్ బైచెప్పి లండన్‌కి బయలుదేరాము.

ఇంగ్లీషు మూలం: డా. నిమ్మగడ్డ శేషగిరి రావు (ఇంగ్లాండ్)
e-mail: srnimmagadda@googlemail.com
అనువాదం: ప్రొ. ఆదినారాయణ (భ్రమణ కాంక్ష)
జయశ్రీ అట్లూరి (ఇంగ్లాండ్)

# అమెరికా ఇల్లాలు

**– ఎ. రవీంద్రబాబు**

ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచం కుగ్రామంగా మారుతోంది. సమాజంలోని అనేక అంశాలు దాని ప్రభావానికి గురవుతున్నాయి. అయితే ప్రపంచీకరణ మూలాలను మన దేశంలో కేవలం 1991 నుంచి అంటే నూతన ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టినప్పటి నుంచే చూస్తున్నాం. కానీ అంతకు పూర్వమే దాని ప్రభావం మనదేశంపై ఉందని నా నమ్మకం. ఆర్థికరంగంవల్ల ప్రభావితమయ్యే ఉపరితలాంశాలలో సాహిత్యం ఒకటి. సాహిత్యాన్ని కేవలం సాహిత్యంగా మాత్రమే చూస్తే దానికి పరిపూర్ణత లభించదు. సమాజాన్ని, సంస్కృతిని సాహిత్యంతో ముడిపెట్టి చూడాలి. ఈ క్రమంలోనే చారిత్రక విమర్శకులు ఆధునిక సాహిత్యం అర్థం కావాలంటే ఆధునిక సమాజాన్ని అర్థం చేసుకోవాలన్నారు.

భారతదేశానికి 1947లో వలసపాలన నుంచి విముక్తి లభించింది. కానీ నేడు నయా వలసవాద కాలంలో మా దేశానికి రమ్మని విదేశీ శక్తులకు తలుపులు తెరిచి ఆహ్వానం పలుకుతున్నాం. మనమూ విదేశాలకు వలసలు వెళ్తున్నాం. ఇందుకు అనేక కారణాలు ఉన్నా, ప్రధాన కారణం ఆర్థికమే. అయితే గతానికి, వర్తమానానికి లింకు ఉన్నట్లే, మనిషి గత అనుభవాలను, వాటి అనుభూతులను నెమరువేసుకుంటూ ఉంటాడు. వదిలేసిన లేదా వదిలి వచ్చిన లేదా వదిలించుకున్న జీవన బంధాల తాలూకూ జ్ఞాపకాలు మనిషి మదిలో సంచరిస్తూ ఉంటాయి. వాటి తాలూకూ అలలు ఉవ్వెత్తునో, ప్రవాహ గమనంగానో, సెలయేరులాగానో మనిషిని తడుపుతూనే ఉంటాయి. ఆ తడి మనసు చెప్పే భావోద్వేగాలే నోస్టాల్జియా.

సూక్ష్మంగా చెప్పాలంటే- భావోద్వేగాలు, చిత్రాలు, ఆలోచనలు, అనుబంధాలతో వ్యక్తిగతాన్ని గుర్తు చేసుకోవడమే నోస్టాల్జియా. ఇది జ్ఞాపకాలతో ముడిపడి ఉంటుంది. గతం కోసం వర్తమానంలో నిలబడి ఆరాటపడడంవల్ల ఉబికి వస్తుంది. అయితే నోస్టాల్జియాలో వ్యక్తిగతంతో తెగదెంపులు చేసుకోడు. గతం గురించి అమితంగా బాధపడడు, ఒకవేళ బాధపడినా గతాన్ని సానుకూల దృష్టితో చూస్తాడు. దానిలో ఆనందాన్ని పొందుతాడు. నోస్టాల్జియా గురించి మనస్తత్వ శాస్త్రవేత్తలు ఇరవయ్యో శతాబ్దం మధ్యనుంచే ఆలోచించడం మొదలుపెట్టారు. ఎందుకంటే మేధోవలసలు మరీ ఎక్కువైన కాలమది. మనిషి మానసిక, భౌతిక స్థిరత్వాన్ని కోల్పోయిన సందర్భం కూడా అదే. సొంతదైన నిర్దిష్ట జీవన విధానం లేకుండా పోయింది. మొదట వలసవాదుల్లోనే ఇలాంటి ఆలోచనా ధోరణి ఎక్కువగా కనిపించేది. మాతృనేల గురించి, అక్కడి వారితో ఉన్న బంధాల గురించి ఆలోచించేవాళ్లు. వాటితో విడిపోయినట్లు భావించేవారు. అయితే వాటిని ఆదరర్శంగా చూసేవాళ్లు. ఏ వ్యక్తి అయినా ఆహ్లాదకరమైన జ్ఞాపకాలను, పాత వ్యామోహాలను వదులుకోడు. మనసులో భద్రపరుచుకొని, ఆ అనుభూతులను అప్పుడప్పుడు లేదా పరిస్థితులనుబట్టి స్వీకరిస్తూనే ఉంటాడు. అవసరంకొద్దీ లేదా ఆశకొద్దీ లేదా కావాలనే కొన్ని పరిస్థితుల నుంచి దూరమైనప్పుడు, తనను ప్రభావితం చేసిన అంశాల గురించి, మనసుపై ముద్రపడిన విషయాల గురించి, స్థిరీకరణ ఏర్పరచుకున్న వాటి గురించి మనిషి ప్రతికూలంగా చూడడు. కాలం గడిచేకొద్దీ వాటిని ఆదర్శాలుగా భావిస్తూ, అతిశయోక్తులుగా ఊహిస్తూ ఉంటాడు. ఒక్కమాటలో చెప్పాలంటే ఒక వ్యక్తి తన ఆలోచనల్లోంచి గతానికి వెళ్లినప్పుడు, దాన్ని కేవలం గతంలా మాత్రమే చూడడు, అంతకంటే మెరుగ్గా చూస్తాడు. వర్తమానంతో పోల్చి చూసుకొని గతమెంతో ఘనకీర్తికలవాడినని సంతోషిస్తాడు.

దీన్ని కొన్ని సూక్ష్మ నిర్వచనాల ద్వారా చూడొచ్చు. అందుకుగల కారణాలను అన్వేషిస్తే పలుకోణాలు, కారణాలు కనిపిస్తాయి.

1. గతంపట్ల తీవ్రమైన కాంక్ష, కోరిక, అభిమానం ఉండటం. 2. గత జ్ఞాపకాలవల్ల కలిగే బాధ తాలూకు అనుభూతి. 3. పూర్వయుగ భావోద్వేగం. 4. నిరాశ్రయత. 5. గతాన్ని నిల్వ చేసుకోకపోవటం. 6. వర్తమానంలో నచ్చిన జీవితాన్ని అనుభవించలేకపోవటం. 7. అనిశ్చితి. 8. గతానికి, వర్తమానానికి సరైన భౌతిక, మానసిక లంకె కుదరక పోవటం. 9. ప్రస్తుతంతో పూర్తిగా రాజీపడలేక పోవటం. 10. ఆశల సౌధాల్లో జీవించలేక పోవటం లేదా అవి కూలిపోవటం. వీటన్నింటిని గమనిస్తే నోస్టాల్జియాలో మనిషికి గతంపై వాంఛ కనిపిస్తుంది. ఇది ఒక కాంతి పుంజంలా జ్ఞాపకాలపై ప్రసరించి వెలుగులు పంచుతుంది. అందుకే గతం తాలూకు

అనుభూతులతో ప్రత్యక్ష జీవనం చేయడానికి ప్రయత్నం చేస్తాడు నోస్టాల్జియాలో మనిషి.

నోస్టాల్జియా పదం గ్రీకు భాష నుంచి వచ్చిందే. దీని అర్థం ''నొప్పిని తిరిగి పొందడం''. అంటే జీవించిన సమయంపై బలమైన కాంక్షను కలిగి ఉండటం. అయితే ఆ కాంక్షను నోస్టాల్జియా నిరాశగా మాత్రం చూడదు. గర్వించదగిందిగా భావిస్తుంది. ఎందుకంటే ఆ భావన వర్తమానంలోని చింతను కాదని సంతోషంగా ఉంచుతుంది. అంతేకాదు ఒక్కోసారి వర్తమానంపై తిరుగుబాటు కూడా చేయిస్తుంది. నోస్టాల్జియా గురించి విస్తృతంగా అర్థం చేసుకుంటే– ఇది కేవలం మనోవిశ్లేషణ శాస్త్రానికి సంబంధించిందే కాదు. ఒక తాత్విక భావన కూడా. వర్తమాన సమాజ స్థితికి అవసరమైన, ప్రామాణికమైన అంశం కూడా. గత, వర్తమానాల మధ్య మనిషిని అంచనా వేసే కొలబద్ద. మనిషి తననుతాను అర్థం చేసుకోవడానికి ఉపకరించే తూనికరాయి.

నోస్టాల్జియాలో– ఉపచేతనలో నిల్వ ఉన్న అనుభవాలు, గతాన్ని గుర్తించమంటాయి. వర్తమానంతో తెగదెంపులు చేసుకోమంటాయి – లేదా రాజీపడొద్దంటాయి. మనసు చెప్పినట్లు వినమంటాయి. సైనికులు మాతృభూమి మీద తీవ్రకోరికతో మరణించడం కూడా ఇలాంటిదేనా అనే అనుమానం కలుగవచ్చు. నోస్టాల్జియా సంగీతం, సినిమా, శిల్పం, పెయింటింగ్స్.. దాదాపు అన్ని కళల్లోకి విస్తరించింది. ఇక మన వ్యక్తిగత జీవితానికి వస్తే అప్పుడప్పుడు డైరీలు తిరగవేస్తాం. ఫోటో ఆల్బమ్ దగ్గర కూర్చొని వాటిని చూస్తూ జ్ఞాపకాల్లో మునిగిపోతాం. స్నేహితులు, బంధువులు వచ్చినప్పుడు వాటిని చూపిస్తూ అనుభవాలను పంచుకుంటాం. ఇవన్నీ నోస్టాల్జియాలో భాగమే. సినిమాల విషయానికి వస్తే "మహానటి", ఇటీవల వచ్చిన "జై భీమ్"లాంటి సినిమాలను నోస్టాల్జియాలో భాగంగా చూడొచ్చు. వృద్ధులకు ఇది ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తుందేమో అన్నవాళ్లూ లేకపోలేదు. గతాన్ని గుర్తు చేసుకునే క్రమంలో ఒక్కోసారి గతానికి వర్తమానానికి మధ్య ఉన్న వారధిని బలోపేతం చేసుకోవచ్చు లేదా తెంచుకోవచ్చు. ఇది ఆయా వ్యక్తుల వైయక్తిక, మానసిక, భౌతిక పరిస్థితులనుబట్టి ఉంటుంది. చాలామంది చెప్తుంటారు "మిస్ అవ్వండి. అలా అయితే దాని గొప్పతనం తెలుస్తుంది" అని. ప్రవాసంలో ఉంటూ గతం తాలూకూ మాతృభూమి, జ్ఞాపకాలు, అనుభవాల గురించి రాసినవే నోస్టాల్జియా సాహిత్యం కిందకు వస్తాయి. దీనిని ప్రవాస తెలుగు సాహిత్యంలో భాగంగా చూడాలి. గుర్తించాలి. దీని ద్వారా గత అనుబంధాలు వర్తమానంలోని ఒంటరితనాన్ని దూరం చేస్తాయి. సంతోషాన్ని పోగుచేస్తాయి. చిమట కమల రాసిన కథ "అమెరికా ఇల్లాలు". ఇందులో ప్రధానపాత్ర అమెరికాలో జీవిస్తూ ఉంటుంది. కంప్యూటర్ ముందు కూర్చొని మరుసటిరోజు చేయాల్సిన వినాయక చవితి పండుగ గురించి ఆలోచిస్తుంది. ఆ ఆలోచనల్లో చిన్నప్పటి అనుభవాలు, ఆ అనుభవాల తాలూకూ అనుభూతులను కథ ద్వారా మనతో పంచుకుంటుంది. వేకువ జామున లేవడం తనకు అలవాటు లేదని, అందుకు వాళ్ల బామ్మ, అమ్మ ఎలా తిట్టేవాళ్లో గుర్తుచేసుకోవడంతో ఈ కథ మొదలవుతుంది.

''పొద్దున్నే లేచి స్నానం చేయడం తులసి పూజ చేసుకోవడం ఏం లేదు. పక్కింటి రమ చక్కగా ఎనిమిది గంటలకు అన్నీ ముగించుకుంటుంది. ఏ కుదురూ ఏం భక్తి – ఆడపిల్లలంటే అలా ఉండాలి. ఊళ్లు ఏలాలా ఉద్యోగాలు చేయాలా? ఎందుకు వచ్చిన చదువులు. కడుపు నిండేనా కాలు నిండేనా? ప్రొద్దున ఏ రుక్మిణీ కళ్యాణం చదివితే కదా రామచంద్రుడిలాటి మొగుడు వచ్చేది. అయినా రుక్మిణి కళ్యాణం చదివితే శ్రీరాముడులాంటి మొగుడు రావడం ఏంటి? కృష్ణుడులాంటివాడు వస్తాడు అని ఎన్నిసార్లు బామ్మతో ఆర్యూ చేసినా ఏం లాభం లేదు. తను నెగ్గాల్సిందే. అమ్మ తిట్లూ, బామ్మ మందలింపులు ఏమీ పనిచేయలేదు. ప్రొద్దున నిద్రలేవటం మాత్రం అలవాటు కాలేదు నాకు.'' అని తెల్లవారుజామునే లేవటం అలవాటు చేసుకోలేకపోయినందుకు కొంత బాధపడుతూ, అలా నిద్రలేవడం మంచి అలవాటని భారతీయ సంస్కృతిలోంచి మాట్లాడుతుంది. వాళ్ల భర్తవాళ్ల ఇంట్లో ఈ పండుగ ఎలా చేస్తారో చెప్పడాన్ని వివరిస్తూ– "మావారు చిన్నప్పుడు వాళ్లింట్లో వాళ్లందరూ చేసిన పూజా విశేషాలు, తిన్న పిండివంటలు, అందరి ఇళ్ల మీద వేసిన జిల్లేడు కాయల గురించి అనర్గళంగా ఉపన్యసించి చివరకు "కథ టైముకు పిలవ్వోయ్! అక్షింతలు నెత్తిన వేసుకుంటాను" అని "స్టాకు మార్కెటు చూడడానికి కంప్యూటరు రూములోకి వెళ్తారు" అని భర్తలో గతానికి వర్తమానికి వచ్చిన మార్పును వివరిస్తుంది. ఈ చెప్పడంలో కూడా గతంలో భర్తవాళ్ల ఇంట్లోని వినాయక చవితి పూజలను, ఆయనా గొప్పగా భావించినట్లే

వర్ణిస్తుంది. ఇండియా ఇల్లాలిలా అమెరికాలో అడుగుపెట్టిన ఆమెలో వచ్చిన మార్పును గురించి మరోచోట తలపోస్తూ– "ముగ్ధగా అమాయకంగా, పట్టుచీర కట్టుకుని, ముద్దబంతి తురుముకొని చెవులకు జూకాలు తళుక్కుమంటుంటే కృష్ణశాస్త్రి కవితలా, పల్లెటూరి వనితలా, పక్కా ఇండియా ఇల్లాలిలా అడుగు పెట్టిన నాలో కాలంతోపాటు ఎన్ని మార్పులు!" అని భారతీయ ఇల్లాలి కట్టు బొట్టు, అమాయకత్వం, కృష్ణశాస్త్రి కవిత... అన్నింటిని గుర్తుచేసుకుంటుంది. అలా ఉండటంపై తనకున్న సదాభిప్రాయాన్ని మనతో పంచుకుంటుంది. ఇలా గతంపై, భారతీయ హిందూ సంస్కృతిలోని పండుగలు, స్త్రీ వస్త్రధారణ, బామ్మ, అమ్మవంటివారితోగల అనుబంధాలను జ్ఞాపకం చేసుకుంటుంది. ఆ జ్ఞాపకాల్లో ఆమెకు వాటిపై ఉన్న అభిమానం, వర్తమానంలో వాటి నుంచి దూరం జరిగానన్న బాధ కనిపిస్తాయి. ఇంకా ఈ కథను నోస్టాల్జియా దృష్ట్యా పరిశీలిస్తే ఆ పాత్ర తన జుట్టు గురించి, తలంటు పోసుకోవడం గురించి చెప్తూ "మా చిన్నప్పుడు ఇంట్లో తలంటు అంటే అదో పెద్ద హడావుడి. కుంకుడుకాయలు కొట్టడం, తలలు అంటడంవంటికి నలుగు మహాసందడి. నలుగురు పిల్లలకు తలకు పోయాలంటే నాలుగు గంటలే పట్టేది. ప్రస్తుతం మనకు ఆ బాధ లేదు. ఈ పిల్లలు తలకు నూనె పట్టించుకోరు. ఇక తలంటటం ఏమిటి?" అని వ్యంగ్యంతో జ్ఞాపకాన్ని వర్తమానంతో ముడిపెట్టి చెప్తుంది. ఇక హిందూ స్త్రీకి బొట్టు, తాలిబొట్టు అనేవి పాతివ్రత్యానికి ప్రతీకలు. వాటి గురించి తలపోస్తూ– "ఇకపోతే బొట్టు విషయానికి వస్తే దోసగింజబొట్టు చిక్కి, గింజ అయి, డాట్ అయి, చివరకు డిసప్పియరయింది!" అంటుంది. "మొగుడి మీద ఎంత గౌరవమో, భయమో, భక్తో– తెలియదు కాని, మంగళసూత్రం మాత్రం చాలామంది మెడలో ఉండే ఆభరణం" అని అంటుంది. అంటే భారతదేశంలోని హిందూ సంప్రదాయంలో భార్యకు భర్తమీద ఉన్న అభిప్రాయలను, వాటి వెనకున్న భక్తి, భయం, గౌరవాల మూలాల స్వభావాన్ని చెప్పే ప్రయత్నం చేసింది ఇక్కడ రచయిత్రి. ఇక వర్తమాన జీవితంలోని అసంతృప్తికి, గతంపై అభిమానానికి కారణాలు అన్వేషిస్తుందీ పాత్ర. "హై టెక్నాలజీ, అతి సంపన్నమైన దేశంలో ఉండి కూడా తెలియని అసంతృప్తి. ఏడువారాల నగలు, లేటెస్టు ఫ్యాషన్ చీరలు, వారం వారం విందుభోజనాలు – వేటికీ కొదవలేదు. పక్కన నిలబడి ప్రతి పనికి సాయం చేసే ఫ్రెండ్స్, ఇంటా బయటా కావాల్సినంత ఫ్రీడం. ప్రాబ్లమ్ ఏమిటి అనేది తెలియని సమస్య." అంటూ నోస్టాల్జియాకు కారణాలను వెతికే ప్రయత్నం చేస్తుందీ అమెరికా ఇల్లాలు. "ఇంట్లో పండగ సందడి పదిమందితో – కనీసం పిల్లలు, మొగుడితోనైనా పంచుకోలేక పోతున్నామే అన్న బాధ. పులిహోర చేశానా, పాయసం వండానా అన్నది కాదు. చేసిన వంట తినేందుకు టైమ్ లేని రోజులు ఎన్నో. ఈ దేశం వచ్చి, మంచి చేశానో రాంగ్ చేశానో నాకైతే తెలియదు." అని అమెరికాలో కరువైన మానవ సంబంధాల్లోని ఆత్మీయతే నోస్టాల్జియా రైటింగ్స్‌కు కారణమని వివరణ ఇచ్చే ప్రయత్నం కూడా చేస్తుందీ రచయిత్రి కమల.

"అటు భారత గృహిణిలా పూర్తిగా బిహేవ్ చేయలేక, ఇటు అమెరికన్ హౌస్ వైఫ్‌గా మారలేక త్రిశంకు స్వర్గంలో ఉన్న అమెరికా ఇల్లాలిని నేను. రేపు సాయంత్రం బాస్‌తో మీటింగ్ ఉంది. అదీ డిన్నర్ మీటింగు. డిన్నర్ అంటే వైన్ కూడా సర్వ్ చేస్తారు కదా! మరి దేవుడి పూజ చేసిన రోజు వైన్ తాగొచ్చో లేదో? ఎవరినడగాలబ్బా! మా అమ్మనడిగితే వీపు వాయించేస్తుంది. ప్రపంచంలో ప్రతి ప్రశ్నకు సమాధానం ఫింగర్ టిప్పులో ఉన్న ప్రత్యక్ష దైవం! ప్రాణ నేస్తం! నా కంప్యూటర్ని అడిగితే సరి!" అని కథను ముగిస్తారు రచయిత. అంటే, ఇక్కడ రెండు సంస్కృతుల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని, వాటివల్ల ఆమె ఎదుర్కున్న ఇబ్బందిని వివరిస్తూ... హిందూ కల్చర్‌ను అమెరికాలో పాటించడంలో ఉన్న సమస్యను ప్రశ్నగా సంధించి వదిలేస్తుంది రచయిత్రి.

ఇక్కడ కమల సృష్టించిన "అమెరికా ఇల్లాలు" పాత్రలో భారతీయ హిందూ సంస్కృతికి సంబంధించిన అనేక విషయాలు, వాటిపై ఆమెకున్న అభిమానం వ్యక్తమవుతున్నాయి. అలాగే వాటి తాలూకూ గతాన్ని ఆమె నెమరు వేసుకుంటుంది. వాటిని ప్రస్తుతం పాటించలేనందుకు కొంత ఇబ్బందిగా కూడా ఫీలవుతుంది. అంటే కోల్పోయిన దానిలో ఉన్న అనుభూతిని బాధతోనే కాదు, గుర్తు చేసుకోవడంలో ఉన్న ఆనందాన్నీ వ్యక్తపరుస్తుంది. వినాయక చవితి పండుగను అమెరికాలో భారతదేశంలోలాగా చేసుకోలేక, రాజీపడలేని వర్తమానం నుంచి జ్ఞాపకాలకు లంకె వేస్తుంది. అందుకే తెలుగునేలకు దూరంగా ఉన్నవారి సాహిత్యంలో ఓ ప్రధాన స్రవంతే నోస్టాల్జియా.

డా. ఎ. రవీంద్రబాబు - ఫోన్: 800 863 6981.

# మహిళా వికాసం

– మన్నేపల్లి లలితమ్మ

సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీలు చైతన్యవంతులు కానిదే ఏ సమాజమైనా సంపూర్ణ ప్రగతి సాధించలేదు. శక్తి సామర్థ్యాలలో, అవకాశాలలో, అభివృద్ధిలో, నిర్ణయాలలో, నిర్మాణంలో స్త్రీ పురుషులు సమానంగా ఉండే ప్రపంచం నిస్సందేహంగా శక్తివంతమైన ప్రపంచం. ఏ సమాజం అయితే స్త్రీలకు సమాన అవకాశాలను, హక్కులను కల్పిస్తుందో ఆ సమాజం నుండి ఎక్కువ మంది మేధావులు, శాస్త్రజ్ఞులు, పాలనాదక్షులు, సంఘసంస్కర్తలు, సేవాతత్పరులు, చింతనాపరులు, తత్వవేత్తలు, సాహితీవేత్తలు ఉద్భవిస్తారు. కాని వాస్తవం దీనికి భిన్నంగా ఉంది. ఆచరణలో, ఆలోచనలో, వాస్తవంలో ఒక స్త్రీ గర్భంలో పడినప్పటి నుండీ అన్నీ అవరోధాలే. పిండదశనుండి, ఉగ్గుపాలనుండి, చదువునుండి, ఉద్యోగంనుండి, పెళ్ళినుండి, మరణందాకా అనేక రకరకాల ఆంక్షలతో ఈ సమాజం స్త్రీ మనసును, శరీరాన్ని ఆధీనం చేసుకుంది. కుటుంబంలో స్త్రీలు చేసే పనులకు విలువ తగ్గి ఆ పనులు ఆదర్శవంతం చేయబడ్డాయి. వివాహజీవితం స్త్రీల వృత్తిగా మారింది. వారిని తల్లిప్రేమ, రక్షణ, మృదుత్వం, లాలన, దయ, వితరణ, స్వార్థత్యాగం అనే భావజాలంలోకి కుటుంబం నెట్టివేసింది. దానితో స్త్రీ ఒక భార్యగా, తల్లిగా ఉండడం తప్ప పుట్టుకతో వచ్చిన తన సృజనాత్మక శక్తిని, సామర్థ్యాలను, కోరికలను వ్యక్తీకరించే అవకాశం లేకుండా పోయింది. ఆమె స్వతంత్రించి ఏమైనా చెయ్యబోతే, ఇలా చెయ్యడం మా ఇంటా వంటా లేదని కళ్ళెర్రజేస్తుంది పురుషప్రపంచం. అనేక సాంఘిక దురాచారాలు స్త్రీలని సాంఘిక వికలాంగులుగా చేశాయి. స్త్రీ బాల్యవివాహానికి, సతీసహగమనానికి, కన్యాశుల్కానికి దారుణంగా బలి అయింది. క్వీన్ విక్టోరియా అంతటి గొప్ప మహిళ స్త్రీల గురించి తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ 'దేవుడు కోరుకున్నట్లు స్త్రీని ఉండనీయండి – పురుషుడికి తోడుగా నీడగా, అతని భిన్నమైన బాధ్యతలు, వృత్తులు నిర్వహిస్తూ....' అని పేర్కొన్నారు. అలా క్రమక్రమంగా పురుషునికి భార్యగా జీవించడం ఒక్కటే స్త్రీకి ఒక గౌరవంగా మారిపోయింది. ఆమె ఒక భోగ వస్తువుగా, పిల్లల్ని కని, పెంచే యంత్రంగా కొందరి పురుషుల మనస్తత్వంలో చెరపలేనంతగా నాటుకొనిపోయింది. పురుషాధిక్య సమాజం స్త్రీల మాటలపైన, వస్త్రధారణపైన, అలంకరణలపైన, ఇంకా నవ్వులపైన, నడకపైన ఎన్నో ఆంక్షలు విధించింది. స్త్రీల శరీరం చుట్టూ నిర్మితమైన భావజాలం అణచివేత సాధనాలుగా వారి లింగవివక్షను పెంచిపోషించింది. ఈ వ్యవస్థ తరతరాలుగా మహిళాభ్యుదయానికి అవరోధమయింది. అందుకే **ఒక సమాజ ప్రజాస్వామికతత్వానికి మహిళా విమోచనస్థాయి కొలమానమని** ఎంగెల్స్ మహాశయుడు తెలిపారు. స్త్రీలకు ప్రాధాన్యత లభించిన చోట్ల నాగరికత వృద్ధిచెందిందో, నాగరికత అభివృద్ధి చెందినచోట్ల స్త్రీలకు ప్రాధాన్యత లభించిందో ఆగి ఆలోచించాల్సిన విషయమది.

సమాజం స్త్రీని నాలుగు గోడల మధ్య కట్టుబాట్లతో బంధించి, ఆమెను జ్ఞానానికి దూరం చేసి, ఆమెకు సామాజిక సంబంధాల పట్ల సంకుచిత ధోరణులున్నాయని, అది ఆమె నైజమని ముద్రవేసి, ఆమెను మానసికంగా అజ్ఞానిని చేసి ఒక గృహ బానిసగానే చూడసాగింది. అందుకే చలం 'స్త్రీ జీతంలేని సంఘ బానిస' అంటాడు. 19వ శతాబ్దంలో కూడా స్త్రీ దుస్థితి ఇదే విధంగా ఉంది, వారి బ్రతుకు పరాధీనంగానే ఉంది. పారిశ్రామిక విప్లవం తరువాత జరిగిన ఆర్థిక, రాజకీయ మార్పులు, అవసరాలు స్త్రీల స్థితిగతులను కొద్దిగా మెరుగుపరిచాయి. స్త్రీ శ్రమ ఆవశ్యకత వ్యవసాయం, పారిశ్రామిక రంగాలలో ఏర్పడింది. మరలా అక్కడ స్త్రీ చేసే పనులకు, శ్రమకు తక్కువ గుర్తింపు ఇవ్వడం, తక్కువ వేతనాలు ఇవ్వడం, పురుషుల పనులకు ఎక్కువ వేతనాలు ఇవ్వడం వలన స్త్రీ పై పురుషాధిక్యం మరలా ఒకసారి ఆర్థికంగా ఋజువయింది. సమానపనికి సమానవేతనం ఇవ్వనంతకాలం సమానత్వం రానట్లుగానే పరిగణించాలి. తొలినాళ్ళలో స్త్రీ పురుషుల మధ్య ఏర్పడిన శ్రమవిభజన, పురుషునికి ఉత్పత్తి సాధనాల మీద తిరుగులేని అధికారాన్ని కట్టబెడితే, కాలక్రమంలో స్త్రీయే ఒక ఉత్పత్తి సాధనంగా మారిపోయింది.

అయితే కాలక్రమేణా అగమ్యగోచరమైన పరిస్థితులలో వున్న స్త్రీ ప్రపంచం గురించి కొందరు సంఘసంస్కర్తలు, దార్శనికులు, తత్వవేత్తలు, విద్యావేత్తలు ఆలోచించసాగారు. "స్త్రీకి శరీరం ఉంది – దానికి వ్యాయామం కావాలి; ఆమెకి

మెదడు ఉంది– దానికి జ్ఞానం ఇవ్వాలి; ఆమెకి హృదయం ఉంది– దానికి అనుభవం ఇవ్వాలి" అని చలం తన మాటల్లో తెలిపారు. ఇలాంటి ఎంతోమంది సంస్కర్తల వల్లే మహిళాచైతన్యానికి ఒక నాంది ఏర్పడింది. స్వాతికిరణం చలనచిత్రం ముగింపులో గొప్ప సంగీత విద్వాంసుడయిన కథానాయకుడు ఈర్ష్యాద్వేషాలను అధిగమించలేక జరిగిన పరిణామాలతో, పశ్చాత్తాపంతో, మారుమనసుతో మరలా సరిగమలను చిన్నచిన్న పిల్లలతో కలిసి మొదటి నుండి నేర్చుకున్నట్లు, స్త్రీ పురుషులు సమానంగా ఆలోచించే విధంగా మానవ వ్యక్తిగత జీవితరంగాన్ని పునర్నిర్వచించవలసిన అవసరం ఎంతో ఉంది. న్యూటన్ మూడవ సూత్రం ప్రకారం ఎక్కడైతే అణచివేత ఉంటుందో అక్కడ విముక్తి మార్గాలు కనపడతాయి. అసమానత నుంచి హింస, సమానత నుంచి అహింస పుడతాయని గాంధీ ఉద్ఘాటించేవారు. స్త్రీకి అవయవాల పొందికే ఆస్తి కాదు, స్త్రీ సంతానాన్ని వృద్ధి చేసే పరికరం కాదు. మగవాని కోరికలు తీర్చడానికి స్త్రీని అతని సొంత ఆస్తిగా పురుష ప్రపంచం భావిస్తూవచ్చింది. **సిగ్గుపడుతున్న ఆడదాని వెనుక దాగివుంది అందం కాదు, వెనుకబాటుతనం.** "ఎక్కడైతే స్త్రీలు తమ యవ్వనం, అందం, దేహం మూలంగానే కేవలం శక్తిమంతులుగా చూడబడతారో, పురుషులు తమ పని, కీర్తి లేదా సంపద ద్వారా తమ లైంగిక విలువల్ని పెంచుకుంటారో, అక్కడ ఏ మార్పూ ఉండదు" అని సాహిత్యరంగంలో నోబెల్ బహుమతి సాధించిన ప్రముఖ రచయిత్రి **ఇల్ఫ్రీడే ఇయెలినెక్** కరాఖండిగా తెలియజేశారు. దేవుడు ప్రతి ఇంటిలో ఉండడానికి వీలులేక తల్లిని సృష్టించాడని, ప్రతి మగాడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందని పురుష ప్రపంచం చెప్తుంది. వాస్తవంగా పైకి ఏమిచెప్పినా నిజ జీవితంలో దానికి భిన్నంగా జరుగుతుంది. ప్రముఖ తత్త్వవేత్త, నోబెల్‌బహుమతి గ్రహీత బెట్రాండ్ రస్సెల్ చెప్పినట్లు "మనుష్యులలో ఒక విచిత్రమైన సత్యం ఉంది. అదేమిటంటే తాము బలంగా అణగద్రొక్కిన వ్యక్తుల్లో వున్న మంచితనాన్ని మెచ్చుకోవడం. కాని వాస్తవంలో బానిస దేశాలలోని బానిసల కన్నా స్త్రీలను బాగా అణచిపెట్టారు, స్త్రీని సౌందర్య దేవత అని అంటారు, ఆధ్యాత్మిక దృక్పథంలో ఆమెదే మొదటి స్థానం అంటారు. కాని ఇంతచేసి మీకు పురుషుల కన్నా తక్కువ వేతనం ఇస్తాం, ఓటు హక్కు కూడా ఇవ్వం అని అంటారు. ఇది ఎలాంటిదంటే రెడ్–ఇండియన్ల దగ్గర నుంచి అమెరికా భూమినంతటినీ లాక్కొని ఆటవికుల మనస్తత్వం ఎంతో గొప్పది అని పొగడడం లాంటిది" అని వివరణ ఇచ్చారు. మొట్టమొదట స్త్రీలకు ఓటు హక్కు ఇచ్చిన దేశం 1893లో న్యూజిల్యాండ్. ఓటు హక్కు కల్పించినప్పటికీ స్త్రీలు పురుషులతో సమానంగా నిలబడగలిగే స్థాయికి ఎదగలేకపోయారు. వాస్తవానికి స్త్రీలకు ఓటు హక్కు ఇవ్వడమంటే పురుషునికి రెండో ఓటు ఇవ్వడమే అయింది. అలా కాకుండా స్త్రీ తను ఆలోచించుకొని, అంతరాత్మ ప్రబోధం మేరకు ఓటు ఎవరికి వేయదలచుకుంటే వారికి నిర్భయంగా వేసే స్వేచ్ఛను తీసుకోగలిగిననాడే ఓటుహక్కుకు సార్థకత. అప్పుడే ప్రజాస్వామ్యమం పరిఢవిల్లుతుంది.

పురుషులలోలాగే స్త్రీలలోనూ ఎన్నో నిగూఢ శక్తులున్నాయి. అభిరుచిరీత్యా, మేధస్సురీత్యా గొప్పగొప్ప ప్రతిభాపాటవాలు జన్యుపరంగా సంక్రమించివున్నప్పటికీ విద్యాగంధం, అవకాశాలు లేని కారణంగా వారి శక్తియుక్తులను సమాజం పొందలేకపోయింది. స్త్రీని కూడా పురుషునితోపాటు సమాజ అభివృద్ధికి వినియోగించుకోలేని వ్యవస్థలో మనం ఉన్నాం. చలం బాధపడినట్లుగా ఎందరో నర్తకుల్ని, చిత్రకారుల్ని, కవుల్ని, శిల్పుల్ని, యంత్రకారుల్ని స్త్రీలలో తరతరాలుగా దేశం పోగొట్టుకుంటూనే ఉంది. మచ్చుకి రేడియంని కనిపెట్టిన మేడం క్యూరీ లాంటివాళ్ళు, మదర్ థెరిస్సా లాంటివాళ్ళు ఎంతోమంది మన సమాజంలో ఉన్నా కూడా గుర్తింపు లేక, రాణింపు లేక స్త్రీలు అలా ఉండిపోయారు. స్త్రీ శ్రమంతా ఎందుకూ పనికిరాని, విలువలేని, దినవారి యాంత్రిక పనులతో ధ్వంసమైపోతోంది. ఆ శ్రమ సామాజిక ఉత్పత్తి కార్యక్రమాలలో వినియోగపడితే సమాజం అత్యధిక బలంతో స్థిరపడుతుంది. స్త్రీ పురుషులిద్దరూ సామాజిక మార్పులలో సమానంగా భాగస్వాములవ్వాలి. స్త్రీ ప్రగతికి, పురోగతికి విద్య ఆయువుపట్టు. విద్య వలన స్త్రీ బలహీనురాలు అనే భావన తొలగిపోయి పురుషులతో సమాన ఆలోచనలు చేయడానికి అవకాశం ఏర్పడింది. ఇంకా ఆత్మస్థైర్యం, హేతుబద్ధత, మానసిక ఔన్నత్యం, సామాజిక అవగాహన, బిడ్డలశిక్షణ మొదలగువాటికి స్త్రీ విద్య ఎంతగానో తోడ్పడింది. స్త్రీ విద్యకై రాజారామ్మోహన్‌రాయ్, క్రైస్తవ మిషనరీలు, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, డి.కె.కార్వే, గాంధీ, అంబేద్కర్, యం.యన్. రాయ్, జ్యోతిరావుఫూలే, సావిత్రిబాయిఫూలే మొదలైన ఎంతోమంది దేశవ్యాప్తంగా కృషి చేశారు.

కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు లాంటివారు ఎంతోమంది మన రాష్ట్రంలో స్త్రీ విద్యకై పాటుపడ్డారు. ఉన్నవ లక్ష్మీబాయమ్మ గుంటూరులో స్త్రీల కొరకు శారదా నికేతనము, దుర్గాబాయమ్మ కాకినాడలో హిందీ పాఠశాల, చొరగుడి శాంతమ్మ బాపట్లలో మహిళా పాఠశాల, పెద్దాడ కామేశ్వరి రాజమండ్రిలో శిశువిహార్, దువ్వూరి సుబ్బమ్మ రాజమండ్రిలోనే సనాతన విద్యాలయం, కలగవడి పిచ్చమ్మ ఏలూరులో అన్నపూర్ణ జాతీయ పాఠశాల, పొణకా కనకమ్మ నెల్లూరులో కస్తూర్బా స్కూలు ప్రారంభించారు. క్రమక్రమంగా స్త్రీ విద్య తప్పనిసరి అనే భావన అందరిలో మొదలైంది. వ్యక్తులు, సంస్థలు, ప్రభుత్వాలు విద్యను స్త్రీకి దగ్గర చేశాయి. స్త్రీ విద్య వలన ఎన్నో సమస్యలకు కొంత పరిష్కారం దొరికింది. స్త్రీకి విద్య అందుబాటులోకి వచ్చిన తరువాత స్త్రీ తన స్థాయిని, తన గురించి తను తెలుసుకోసాగింది.

ఆడపిల్లలు, మగపిల్లలు సమానం అనే భావన ఆచరణలో వుంటే తల్లిదండ్రులకు తారతమ్యాలు అనే అజ్ఞానభావాలు ఉండవు. పిల్లల్ని ఆర్థిక సంబంధాలతో ముడిపెట్టి చూడడం వలన మానవత కొరవడి 'గిట్టుబాట్ల' ప్రాధాన్యత సంతరించుకుంటుంది. మగపిల్లలు పుడితే మనకు కట్నం రూపేణ ఆస్తి కలిసివస్తుందని, వంశం నిలబడుతుందని ఆశ. ఆడపిల్లలు అయితే వారిని ఇంకొక అయ్య చేతిలో పెట్టాల్సిందే గాని మన వంశానికి ఊరా, పేరా అనే భావన సర్వత్రా నెలకొనివుంది. పితృస్వామ్యం వివాహం ద్వారా పురుషుడికి భార్య పేరుతో ఒక నమ్మకమైన బానిసను సంపాదించిపెట్టింది. వివాహాలు ఆస్తుల కొరకు, ప్రతిష్ఠ కొరకు, అంతస్తు కొరకు, పరువుకొరకు, కట్నకానుకల కొరకు కాకుండా మానవసంబంధాల కోసం, అన్యోన్యత కోసం జరగాలి. వివాహం వివేచనాత్మకంగా ఉండాలి. జీవితంలో అతి ప్రధానమైన వివాహ విషయంలో తల్లిదండ్రులు తమకు నచ్చిన వారికి అమ్మాయిని యిచ్చివేయడం తగదు, పరస్పర అవగాహనతో ఇరువురు పరిణయమాడే వాతావరణాన్ని సృష్టించాలి. స్త్రీ పురుషులిద్దరూ సమానమని ఋజువు చేయడానికి వివాహం చక్కని సాధనం. అందుకే కొడవటిగంటి కుటుంబరావు 'వివాహ వ్యవస్థ గొప్ప మార్పులకు గురైతేగాని స్త్రీ పురుషులలో సమానత్వం సాధ్యం కాదు' అని అభిప్రాయపడ్డారు.

ఆడపిల్లలకు పెళ్ళయిన వెంటనే పుట్టిల్లు పరాయిది అవుతుంది. కొడుకులకు మాత్రమే తల్లిదండ్రుల ఇంట్లో సమస్త హక్కులుంటాయి. కానీ వాస్తవంలో ఆడపిల్లకు మాత్రం పెళ్ళి కాకముందు, పెళ్ళయ్యాక కూడా పుట్టిల్లంటే అభిమానం మెండు. 21వ శతాబ్దంలో కూడా సమాజంలో పుత్రవ్యామోహం పోలేదు. బాల్యంలో తండ్రి ప్రాపకం కింద, యుక్త వయస్సులో భర్త అదుపాజ్ఞలలో, వృద్ధాప్యంలో కొడుకుల పోషణలో ఆడపిల్ల ఉండిపోవాలి అని పాత సమాజం నిర్దేశించింది. పుత్రసంతానం పట్ల పెరిగిన ఆపేక్ష, స్త్రీ సంతతిని నిర్లక్ష్యం చేసే దశకు చేరుకుంది. స్త్రీ సంతతి కలగకుండా వ్రతాలు మొదలయ్యాయి, పురుష సంతతి కలిగితే పార్టీలు, కేరింతలు ఎక్కువయ్యాయి. ప్రసవం తరువాత శిశువును 'ప్లస్సా, మైనస్సా' అని అడిగే ధోరణి ఏర్పడింది. దీనికి అబ్బాయైతే లాభమని, అమ్మాయైతే నష్టమని భావం. ఒక మనవరాలు తన ప్రాణాధికమైన తాత అన్నం తింటుంటే తను కూడా అదే కంచంలో కలిసి ఆప్యాయంగా తింటూ, అమాయకంగా ఒక ప్రశ్న అడిగింది. 'తాతా! తాతా!! ఆడపిల్ల పుడితే ఎందుకు సంతోషపడరు, పశువుల్లో పద్దదూడ పుడితే ఎందుకు సంతోషపడతారు' అని పదేళ్ళ మనవరాలు అడిగితే దీనికి తాత దగ్గర సరైన సమాధానం లేక 'ముందు తిను' అని దాటేశాడు. అపరిమిత కుటుంబం వల్ల ఆర్థికంగా మాత్రమే బాధపడతాడు పురుషుడు. స్త్రీ అలా కాదు, శారీరకంగా, మానసికంగా కూడా అనేక ఒడుదుడుకులు ఎదుర్కొంటుంది. ఆమె కాన్పు, కాన్పుకు కృంగి కృశించి జీవచ్ఛవంలా తయారవుతుంది. ప్రతి కాన్పు ఆమెకు పునర్జన్మ. పిలల్ని కనలేక ఎంతోమంది తల్లులు మరణించిన సందర్భాలు గుర్తుకొస్తాయి. అంటే శిశువుకు జన్మనిచ్చే పరంపరలో తల్లి తనువు చాలించాల్సిన పరిస్థితులు ఎన్నో సజీవ ఉదాహరణలు కళ్ళముందు మనకు సాక్ష్యాలై నిలుస్తాయి.

సృష్టిలో ప్రతిజీవి తమ సంతానాన్ని పెంపొందిచాలనే ఒకపేగు బంధం మీద ప్రకృతి పునరుత్పత్తి సూత్రం ఆధారపడి ఉంది. అలాగే మానవుల్లో కూడ జన్యుపరంగా తల్లికి శిశువుకి దగ్గర సంబంధం స్వాభావికంగా ఏర్పడింది. 'స్త్రీ మానసిక ఏర్పాటు (Psychological Make-up) ప్రకృతికి దగ్గరగా ఉంది' అని ఓర్టనర్ తెలియజేశాడు. శిశువులకు అవసరమైన ఆప్యాయతలు, వాత్సల్యాన్ని, భద్రతను మరియు ఇంకా అవసరమైన భావోద్రేక అనుభవాలను తల్లి అందిస్తుంది.

శిశువు చక్కగా సామాజికీకరణ చెందాలంటే ఇవన్నీ తల్లి ద్వారానే తప్పనిసరిగా జరగాలి. అమ్మ ఒడి తొలి జ్ఞానాలయం. బాలనేరస్థులకు సంబంధించి అనేక అధ్యయనాలు జరిపి మానసికంగా దెబ్బతిన్నవారు పసితనం నుండే తల్లి నుంచి వేరుపడిపోయారని కనుగొన్నారు. పిల్లల సామాజికీకరణలో స్త్రీ పాత్ర గణనీయమైనది. అందుకేనేమో మన మొదటి ప్రధాని చాచా నెహ్రూ 'ప్రజా బాహుళ్యాన్ని నిద్ర నుంచి మేల్కొల్పవలెనంటే మొదట స్త్రీని మేల్కొల్పాలి. స్త్రీలో కదలిక వస్తే కుటుంబం, గ్రామం, జాతి వాటంతట అవే అభ్యుదయం వైపు పురోగమిస్తాయి' అని తెలిపారు.

స్త్రీ విద్యావ్యాప్తి పూర్తిస్థాయిలో జరిగి స్త్రీలు ఉపాధి, ఉద్యోగాలు నిర్వహిస్తూ కొంత తమ కాళ్ళపై తాను నిలబడగలిగే పరిస్థితులు ఏర్పడినా ఆమెకు కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యాయి. కార్యాలయాల్లో వెక్కిరింపులు, వేధింపులు, ద్వంద్వార్థాలు, పైకి ఒకటి లోన ఇంకొకటి పెట్టుకొని మాట్లాడటం, నోరు మాట్లాడుతూ నొసలు వెక్కిరించడం మొదలైనవన్నీ వారు నిత్యజీవితంలో ఎదుర్కోవలసి వస్తున్నది. స్త్రీలకి విద్య మాత్రమేకాక, కొంత ఆర్థిక స్వావలంబన కూడా అవసరం. మన తాత ముత్తాతలు స్త్రీని కొంత అసమానంగా చూసినా, వాళ్ళెవరూ తమ భార్యల్ని కిరోసిన్ పోసి తగులబెట్టలేదు. ర్యాకెట్ యుగంలోని ఇప్పటి మన సమాజం ఆ తాతముత్తాల ముందు సిగ్గుతో తలవంచుకోవాలి. ఒక్కోసారి అనిపిస్తుంది, వాటితో పోల్చిచూస్తే ఇప్పటి ఉద్యోగం చేసే మహిళల కన్నా ఆ కాలపు మహిళలే ఎంతో కొంత సుఖపడ్డారేమో! నేటి సమాజంలో ఇంకా పాఠశాలల్లో, బంధువుల సమూహంలో, ఇరుగుపొరుగు వారిలో, అయినవాళ్ళలో, కానివాళ్ళలో, రకరకాలుగా స్త్రీకి ప్రతిచోటా ప్రచ్ఛన్న శత్రువులున్నారు. తెల్లారేసరికి ప్రింట్ మీడియాలో, ఎలక్ట్రానిక్ మీడియాలో, సోషల్ మీడియాలో ఏ అభాగ్యురాలు ఏ కిరాతకుడి వాతపడిందోననే వార్త వినాల్సివస్తుందేమోనని స్త్రీ జాతి తల్లడిల్లిపోతుంది. ఇట్టి కిరాతకులకు ఒక స్త్రీ నిండుజీవితానికి బలవంతపు వీడ్కోలు, అర్ధాంతర ముగింపు ఇచ్చేశామన్న విచారమూ, పశ్చాత్తాపమూ ఏ కోశానా లేదు. చిన్నాపెద్దా, గర్భిణి అనే తారతమ్యం కూడా లేకుండా రైళ్ళల్లో, బస్టాప్‌లలో, హాస్పిటళ్ళలో, పొలాల్లో, పోలీస్ స్టేషన్‌లలో, కళాశాలల్లో అత్యాచారాలు చెయ్యడం సర్వసాధారణమయింది. ప్రేమించలేదని ముఖంపై ఆసిడ్ పోయడాలు, సామూహిక అత్యాచారాలు, బ్లాక్ మెయిలింగ్‌లు, బెదిరింపులు ఇవన్నీ దినవారీ వార్తలయ్యాయి. ఈ దుస్సంఘటనల గురించి చెప్పుకోలేక, తలెత్తుకుతిరగలేక, సమాజంలో గౌరవంగా బ్రతకలేక ఆత్మాహుతికి పాల్పడుతున్న అభాగినులు ఎంతో మంది. ఒక స్త్రీకి పుట్టిన పురుషుడు ఇంకొక స్త్రీని చంపడానికి ప్రయత్నించడం యుగయుగాల్నుంచి కొనసాగుతున్న వైచిత్రి.

భారతదేశంలో స్త్రీ పురుష సమానత్వాన్ని సాధించటానికి ఎన్ని చట్టాలు చేసినప్పటికీ అవి కాగితాలకే పరిమితమయ్యాయి. స్త్రీ పురుషులు సమానమని చట్టం ఘోషించినప్పటికీ వాస్తవ జీవితంలో సమాజం దానిని పాటించడం లేదు. అసలు మనుష్యులు అంటే పురుషులు మాత్రమే కాకుండా, స్త్రీ పురుషులిద్దరూ అన్న స్థాయికి ముందు మన సంఘం ఎదగాలి. మహిళల్లో సరైన ఆత్మభావన (Self-Image), ఆత్మవిశ్వాసం పెరగాలి. విమర్శనాత్మకంగా ఆలోచించే సామర్థ్యం పెంపొందాలి. స్వయం నిర్ణయాత్మక శక్తి ఏర్పడాలి. సామాజిక మార్పులలో సమాన భాగస్వామ్యం తీసుకోవాలి. ఆర్థికంగా స్వాతంత్ర్యాన్ని పొందేందుకు అవసరమైన సాధనాసంపత్తిని అందిపుచ్చుకోవాలి. మహిళా వికాసానికి మనుష్యులలో పరిపూర్ణ మానసిక విప్లవం రావాలి, తద్వారా సంఘస్వరూపం మారాలి. ఒక వాహనానికి రెండు చక్రాలు ఎంత ముఖ్యమో ఒక కుటుంబానికి, సమాజానికి, దేశానికి స్త్రీ పురుషులిద్దరూ అంతే ముఖ్యం. సంసారమనే రెండెడ్లబండికి భార్యాభర్తలు రెండు చక్రాలవంటివారు. ఆ చక్రాల మధ్య నమ్మకమనే ఇరుసు ఏర్పడాలి. ఆ ఎడ్లమధ్య సమభావన లేనిదే బండి నడవదు, బతుకుబండి సజావుగా సాగదు అనే గ్రహింపు కలగాలి. సమాజం అంటే స్త్రీ, పురుషులు ఇద్దరూ అనే సమగ్ర భావం మన చింతనలో భాగం కావాలి. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, ప్రముఖ తెలుగు చలనచిత్ర దర్శకులు స్వర్గీయ శ్రీ కె.విశ్వనాథ్ గారు "నా జీవితంలోని చాలా అంశాలకు మా అమ్మకు నేనెంతో రుణపడ్డాను. ప్రతి మనిషి జీవితంలోనూ తల్లి, అక్క, చెల్లి, వదిన, భార్య, కుమార్తె – ఇలా ఎందరో స్త్రీ మూర్తుల ఫలితంగానే మనిషికి కొంత వ్యక్తిత్వం తయారవుతుంది" అని వక్కాణించారు. ఈ భావన అందరికీ ఆదర్శం కావాలి. అప్పుడే సామాజిక ప్రగతి పరిపూర్ణం అవుతుంది.

**మన్నేపల్లి లలితమ్మ - కావలి. ఫోన్: 798 949 0551.**



# తథాగతుని చాయాదేహ దర్శనం

**- వేలూరి కృష్ణమూర్తి**

**ప్రవేశిక:** బౌద్ధ సాహిత్యానికి పుట్టినిల్లు భారతదేశం. ఈ సాహిత్యం చైనా యాత్రికుల ద్వారా విదేశాలకు పయనించింది. క్రీ.శ. మొదటి శతాబ్దంలో చైనా యాత్రికులు భారతదేశాన్ని దర్శించి బౌద్ధ సాహిత్యాన్ని లోతుగా అధ్యయనంచేసి వాటికి నకళ్ళు చేసి తీసుకొని పోవడమేకాక, కొన్నిటిని మూల ప్రతితోసహా తీసుకొనిపోవడం కూడా జరిగింది. చైనా యాత్రికులు బౌద్ధ సాహిత్యాన్ని ప్రచారం చేయడంలో అవిస్మరణీయమైన పాత్ర వహించిన గొప్ప ఘటన ఇది. వారు ఇలా తమతో తీసుకొని వెళ్ళిన గ్రంథాలలో బౌద్ధ ఆచరణలు, సంస్కృతి, సంప్రదాయాల వివరాలుండినవి. ఈ యాత్రికులు కేవలం గ్రంథాల అధ్యయనంతో మాత్రమే తృప్తిచెందక ఆనాటి భారతీయుల బ్రతుకు కపటతనం, ఆచరణలు, పరిపాలన, రాజులు మొదలైనవాటి గురించి కూడా గమనం పెట్టి వాటిని దాఖలు పరిచినది ఒక అమూల్యమైన విషయం. అప్పటివరకూ భారతదేశం అనాగరిక దేశమని అపోహ ఉండేది. చైనా యాత్రుకులు మన దేశానికి వచ్చి ఇక్కడి పవిత్రమైన ఆచరణలు, రహస్యాత్మక ధార్మిక క్రియలు, అనాగరికమైనవి కావు. అవి అద్భుతాలన్నది బయటి ప్రపంచానికి శృతపరిచారు. ఇంతమాత్రమేకాక చైనా యాత్రికుల రచనలు తమ స్వంత అనుభవాలైనందున చరిత్ర అధ్యయనం చేసేవారికి అవి ఇప్పటికీ అమూల్యమైన దాఖలాలయ్యాయి. యాత్రా సౌకర్యాలు లేని కాలంలో పర్యటన చేయడం ఒక గొప్ప సాహస కార్యం. అలాంటి సాహసాన్ని ఎన్నో శతాబ్దాల క్రితం చైనా యాత్రికులు చేసి చూపారు. అశోక చక్రవర్తి వల్ల బౌద్ధ ధర్మం చైనా దేశానికి కూడా ప్రసరించింది. ఈ కారణంతో ఐదవ శతాబ్దం నుండి ఏడవ శతాబ్దంవరకు చైనా యాత్రికులు ఎక్కువ సంఖ్యలో మన దేశాన్ని దర్శించి ఎంతో కాలం గడిపిన సంగతి గురించి ఎన్నో దాఖలాలు ఉన్నాయి. అందులో ప్రధానంగా పాహియాన్, హ్యూ యాన్ త్సాంగ్ మాత్రమే కాక ఇత్సింగ్ వాంగ్, త యు అన్, మాహు అన్, చంగ్ హూ మొదలైన ఎందరో మన దేశం దర్శించి వారి పర్యటన అనుభవాలను లిఖితపరిచారు. ఇత్సింగ్ 670లో భారతదేశానికి వచ్చాడు. అప్పటి ఇతడి వయసు 35 ఏళ్ళు. ఇతడు 25 ఏళ్ళ కాలం (670-695) మన దేశాన్ని సందర్శించాడు. ఈ చైనా యాత్రికులందరూ ముఖ్యంగా బౌద్ధ ధర్మం గురించి ప్రత్యక్షంగా తెలుసుకోవాలని వచ్చినప్పటికీ, బౌద్ధ ధర్మం పుట్టినిల్లైన భారతదేశాన్ని చూడాలన్న కోరిక, బౌద్ధ ధర్మం గురించి తెలుసుకోవడం, దానితో పాటు బౌద్ధ ధర్మం గురించిన గ్రంథాలు, బుద్ధుడి మూర్తులను తమవెంట తీసుకుపోవడం, దీనికి తోడుగా అప్పటి భారతీయ శిక్షణా పద్ధతిని అర్థం చేసుకోవడం. తమ భారతదేశ పర్యటన అనుభవాలను వారి యాత్రా కథనాలలో ఆనాటి భారతీయ జనుల జీవితాలను గురించి తమ రచనలలో నిక్షిప్తం చేశారు. పాహియాన్ మౌర్య చక్రవర్తి చంద్రగుప్త పరిపాలన కాలంలో మన దేశాన్ని దర్శించాడు. అంతకు మునుపు ఒకమారు 399లో కొందరి భిక్షులతో భారత యాత్ర ప్రారంభించినా యాత్ర మధ్యలో తన ఇద్దరు సహ ప్రయాణీకులు సుడిగాలికి లోనై దారిలోనే మరణిస్తారు. మరి ఇద్దరు భయపడి వెనుదిరుగుతారు. అయినా తన ఆశయాన్ని విడువక కొంత కాలం తరువాత మన దేశానికి ప్రయాణించి చరిత్ర సృష్టించాడు. పాహి యాన్ అంటేనే 'ధర్మ జ్యోతి'. బౌద్ధ ధర్మం తత్వాలను మూల గ్రంథాల నుండి చదివి తెలుసుకోవాలన్న కోరికతో మన దేశాన్ని దర్శించిన మొదటి యాత్రికుడు. దాదాపు తొమ్మిదేళ్ళ కాలం (402-411) ఉత్తర భారతమంతా సంచరించి తక్షశిల, మథుర, కనౌజ్, సారనాథ్, కపిలవస్తు, వైశాలి, పాటలీపుత్ర, గయా, వారణాసి మొదలైన ముఖ్య స్థలాలను దర్శించి తన అనుభవాలను నిక్షిప్తం చేశాడు. ఇతడు 414లో తన స్వదేశానికి వెనుదిరిగి తన వెంట తీసుకొని వెళ్ళిన గ్రంథాలను చీనీ భాషలోనికి అనువదించాడు. క్రీ.శ. 290లో చు సి హింగ్ అన్న బౌద్ధ యాత్రికుడొకడు ఖోతాన్ అన్న ఒక ప్రదేశాన్నిదర్శించాడన్న విషయం ఉన్నది. అతడి తరువాత

ఫాలింగ్ అన్న మరొక యాత్రికుడు ఉత్తర భారత దేశాన్ని దర్శించాడని తెలుస్తున్నది. ఇంకా అనేకమంది చైనా యాత్రికులు మన దేశాన్ని దర్శించి ఉండే అవకాశాలు ఉన్నా వాటి దాఖలాలు లభించడం లేదు. బుద్ధ గయలో లభించిన ఒక శిలా శాసనంలో చీ ఐ ఇంకా హోయిున్ అన్న యిద్దరు చైనీయులు అనేకమంది యాత్రికులతో పవిత్ర స్థలల దర్శనానికి వచ్చి ఉన్నారన్న సమాచారం తెలుస్తుంది. ఇలా, మొదటి శతాబ్దం తరువాత భారత దేశాన్ని ప్రవేశించిన చైనా యాత్రికులంటే పాహియాన్, హుయాంత్సాంగ్ (జువాన్ జాంగ్), యిజింగ్.

**ఫాహియాన్ (Faxian) భారత దర్శనం:**

బహుశా శిహ్ ఫాహియాన్ లేక శాక్య పుత్రుడు భారత దేశాన్ని దర్శించిన వారిలో ప్రఖ్యాతిగాంచిన మొదటి చైనా బౌద్ధ సన్యాసి. ఇతడి మూలనామం కుంగ్. ఇతడు బౌద్ధ సన్యాసత్వం పొందిన మీదట శాక్యపుత్ర ఫాహియాన్ అని మరునామాంతరం చెందినాడనిపిస్తుంది. తన మూడవ ఏటనే ఇల్లు వదలి శ్రమణేరుడయ్యాడు. క్రీ.శ. 337లో చైనాలో జన్మించిన ఇతడు క్రీ.శ. 399లో, అంటే తన 60వ ఏట భారత దేశానికి వచ్చాడనిపిస్తుంది. ఫాహియాన్ భారతదేశం వైపు బయలుదేరినపుడు అతడి వద్ద అక్షాంశ – రేఖాంశాల సమాచారముండినది. ఇతడితో వచ్చిన గుంపు ఖార్తార్ అన్న ప్రదేశం ద్వారా తారిం, ఖోటాన్ వైపు ప్రయాణం చేయడానికి బయలుదేరింది. ఇరవైఐదు రోజుల ప్రయాణానంతరం వీరు యంగి హిస్సార్ ప్రాంతపు త్స్యుయెన్ హో అన్న స్థలం చేరారు. మరి నాలుగు రోజులు ప్రయాణం చేసి యు హువుయ్ చేరి తమ ధార్మిక క్రియలను ముగించి మరలా 25 రోజులు ప్రయాణం చేసి కీశా నాడుకు వచ్చారు. ఈ ప్రదేశం బహుశా లడాక్ ప్రాంతమై ఉండవచ్చునని అంటాడు లైడ్లే అన్న విద్వాంసుడు. కొండలు–గుట్టలు, ఉప్పొంగి ప్రవహించే నదులను దాటి ఖోటాన్‌కు వచ్చి చేరడానికి ఐదునెలల సమయం కావాల్సి పడినది. ఈ ప్రదేశాన్ని టిబెట్ దాఖలాలు లి నాడు లేక వైశాలి లిచ్ఛవీయుల నాడు అని చెబుతాయి. ఈ ప్రదేశానికి దొర మహాసింహ (మహా లి) అనునతను. ఆ ఊరికి రెండు మైళ్ళ దూరంలో బాల్క్ కు నైరుతి వైపున నవ సంఘారామమన్న బృహత్ దేవాలయం ఒకటి ఉండేది. ఈ దేవాలయం గురించి హుయాన్ త్సాంగ్ కూడా తన కృతిలో దృఢపరిచాడు. ఫాహియాన్ ఇక్కడికి వచ్చి చేరిన సమయంలో ఈ ఖోటాన్ దేవాలయంలో రథోత్సవం జరుగుతుండినది. దానిని వీక్షించిన అనంతరం ఫాహియాన్ వెంట వచ్చిన యాత్రికుల గుంపు తమ ప్రయాణాన్ని కొనసాగించారు. అనంతరం ఫాహియాన్ తక్లామాకన్ (Taklamakan) అనే చోట ఖోటాన్ అన్న నగరాన్ని దర్శించాడు. తన రచనలలో ఫాహియాన్ ఇలా చెబుతాడు: 'ఈ దేశంలో ప్రతి గృహమూ ఒక ప్రత్యేకమైన స్థలాన్ని పొంది ఉంటుంది. అన్ని ఇళ్ళ ముందరి భాగంలో 30 అడుగుల ఎత్తైన గోపురం నిర్మించబడి ఉంటుంది. లోపలి వసారాలో వచ్చి పోయే యాత్రికులు, అలాగే సన్యాసుల సౌకర్యార్థం ఆశ్రయమిచ్చే స్థలాలున్నవని' అంటాడు. అనేక బౌద్ధ విహారాలలోనూ వ్యాపారస్తులకు ఆశ్రయం లభించేది. దీనికి ప్రతిగా వారు విహారాలకు పూజా సామగ్రిలను ఉచితంగా ఇచ్చేవారు. ఫాహియాన్ తన ప్రయాణాన్ని భారతదేశం పూర్వ దిక్కువైపు కొనసాగించి మధ్య భారతదేశంలోని అనేకమైన జన సమూహాల పరిచయం చేసుకొంటాడు. అతను తన రచనలలో బుద్ధుడి జీవితానికి సంబంధించిన స్థలాల, ఘటనలకు మాత్రం ప్రాముఖ్యమిచ్చాడు. అతడు గమనించినట్లు తక్సిల (తక్షశిల ఇప్పటి పాకిస్తాన్ వాయువ్య దిక్కులో ఉన్నది) అన్నచోట బుద్ధుడు తన వెనుకటి ఒక జన్మలో ఆకలిగొన్న ఒక సింహానికి తన దేహాన్నే సమర్పించిన ఘటనను ఉల్లేఖించాడు. బుద్ధుడి జన్మ స్థలం లుంబిని, కపిలవస్తు, అతడు నిర్వాణం చెందిన కుశీనగరాన్ని కూడా దర్శిస్తాడు. ఇప్పటి పెషావర్లో ఫాహియాన్ బుద్ధుడి భిక్షాపాత్రను, తరువాత శ్రీలంకాలో బుద్ధుడి పంటిని సంరక్షించిన స్థలాన్ని, దానికి అక్కడ జరుగుతున్న పూజను తిలకించాడు. ఇది బుద్ధుడి అనంతరం శాక్యమునికి సంభందించిన దేహపు అంగాంగాలను సంరక్షించి ఉంచుకొనే సాంప్రదాయానికి నాంది పలికింది. చైనా నుండే బయలుదేరిన దావోజంగ్ అన్న ఒక బౌద్ధ సన్యాసి ఫాహియాన్‌కు తోడు ఉండేవాడు. బుద్ధుడికి సంబంధించిన స్థలాలను ఒక్కొక్కటి చూస్తుండగా అతడికి అదేం బోధ అయినదో తెలియదు 'నేను చైనాకు వెనుదిరగను, బుద్ధత్వం పొందేవరకూ నేనిక్కడే ఉండి చివరి శ్వాస విడుస్తా. సాధ్యమైతే మరోమారు ఈ దేశంలో జన్మిస్తా'నని ఘోషించాడు. ఈ ఘటనలన్నీ ఇతర దేశాలలో భారతదేశం గురించి ఉన్న మనోభావాన్ని మార్చివేశాయి. క్రీ.శ. 3వ శతాబ్దంలో భారత దేశాన్ని దర్శించిన లి దావో యువాన్ తన గ్రంథం శ్యుజింగ్ (ఉత్కృష్ట జలం) అన్న గ్రంథంలో భారతదేశ వర్ణన చేస్తాడు. అతడి ప్రకారం, 'మధురా నుండి దక్షిణం వరకు మధ్యదేశమున్నది. ఇక్కడి జనులు శ్రీమంతులు, అలాగే చైనా ప్రజలులాగే అత్యుత్తమమైన వస్త్రాలను ధరించి, మృష్టాన్నాన్ని భుజిస్తారు' అని ఉల్లేఖించాడు. భారతదేశం జనుల జీవితం క్రీ.శ. 10వ శతాబ్దం

వరకు అదేవిధంగా ఉండేది. అనంతర కాలంలో విదేశీయుల ఆగమనంతో భారతదేశాన్ని దోచుకోవడం ప్రారంభమైనదని చెప్పబడుతున్న విషయం తెలుపుతాడు. అనంతరం ఫాహియాన్ బహుశా క్రీ.శ. 408 లేక క్రీ.శ. 409లో తూరుపు భారతదేశంలోని తామ్ర లిపి అన్న స్థలం నుండి వ్యాపారస్తుల పడవలో శ్రీలంకా వైపు ప్రయాణం సాగించి రెండేళ్ళ కాలం అక్కడే ఉండి అక్కడి వారి రీతి–నీతులూ, అలాగే బౌద్ధుల అలవాట్లు–సాంప్రదాయాలను అధ్యయనం చేశాడు. కొండలు–గుట్టల ప్రదేశంలో సంచరిస్తూ, వ్యాపారస్తుల వెంటే ప్రయాణం చేస్తూ అత్యంత కష్టంతో భారతదేశానికి వెనుదిరిగి పదునాలుగు సంవత్సరాలకాలం ఇక్కడి బౌద్ధ సాహిత్యం గురించి అధ్యయనం చేసిన మీదట శ్రీలంకా మార్గంగా చైనా దేశానికి వెనుదిరుగుతాడు. అతడు తన అవలోకనలను 'బౌద్ధ సామ్రాజ్యాల దాఖలాలు' (ఫ్హో–క్వో–కి: A Record of Buddhist Kingdoms) అన్న గ్రంథంలో దాఖలు పరిచాడు. ఇతడు బౌద్ధ విన్యాసం గురించి అధ్యయనం చేసే ఉద్దేశంతో భారతదేశానికి వచ్చాడు. ఇతడి అధ్యయనాల ఆధారంతో తరువాత 'కమలసూత్రం' చీనీ భాషకు అనువాదమైంది. ఫాహియాన్ తన భారతదేశ యాత్రానుభవాలను దాఖలించినపుడు అతడి వయసు 77 సంవత్సరాలు. బుద్ధుడు జన్మించిన పవిత్ర నాడుకు వెళ్ళివచ్చినవాడన్న ఖ్యాతితో అతడి గ్రంథాలు చాలా జనప్రియమయ్యాయి. ఫాహియాన్ మన దేశానికి వచ్చి వెనుదిరిగిన 200 ఏళ్ళ తరువాత మరొక గొప్ప యాత్రికుడు భారతదేశానికి ప్రయాణం చేయడానికి సిద్ధమై వేచి ఉన్నాడు. అతడే హ్యూ యెన్ త్సాంగ్ (Xuanzang) అన్న గొప్ప యాత్రికుడు.

హ్యూ యాన్ సాంగ్ మన దేశాన్ని దర్శించినది 628లో. ఆ సందర్భంలో దక్షిణ భారత దేశంలో చాళుక్య సామ్రాట్టు రెండవ పులకేశి పరిపాలిస్తున్నాడు. ఉత్తర భారతంలో హర్ష వర్ధనుడు పరిపాలిస్తున్నాడు. హర్ష వర్ధనుడు హ్యూ యాన్ సాంగ్ ను తన ఆస్థానానికి ఆహ్వానించి రాజ మర్యాదలతో రాజ సభలో 'జ్ఞాన సూర్య' అని అతనిని సత్కరించాడు. హుయాంత్సాంగ్ మూల నామం చెన్ యీ. చైనీయులు మాట్లాడే భాషలో క్సువాన్ జాంగ్‌గా పరివర్తన చెంది 'మోక్షదేవ' అన్న సంస్కృత అర్థమున్న నామాన్ని పొందిన ఇతనికి భవ్య పరంపర ఉన్నది. హుయాంత్సాంగ్ లేక క్సువాన్ జాంగ్ (క్రీ.శ. 602–664) ఒక చైనా బౌద్ధ సన్యాసి. ఇతడు బుద్ధదేవుడి పరమ ఆరాధకుడు. ధర్మం కోసమే తన వ్యక్తిగత జీవితంలో చాలా ఎక్కువ భాగం భారతదేశానికి ప్రయాణం చేసి, బౌద్ధమతం గురించి అధ్యయనం చేయడానికే వినియోగించాడు. అతను తన భారతదేశ మహాయాత్రలో 15,000 కి.మీ దూరం ప్రయాణం చేశాడని అందాజు చేయడమైంది. హుయాంత్సాంగ్ పూర్వీకుడు చెన్ శిహ్యాన్ అక్కడి రాజుగారివద్ద మంత్రిగా ఉండేవాడు. అతడి ముత్తాత చెన్ క్విన్ శాంగ్ డాంగ్, వారు నివసిస్తున్న నగరానికి ముఖ్యాధికారిగా ఉండేవాడు. తాత చెన్ కాంగ్ ఒక గొప్ప విద్వాసుడు. హుయాంత్సాంగ్ తండ్రి చెన్ హుయ్ న్యాయమూర్తిగా ఉండేవాడు. ఇలాంటి సుసంస్కృత కుటుంబంలో జన్మదాల్చిన హుయాంత్సాంగ్ బాల్యంలోనే అద్భుతమైన బుద్ధిమంతతనాన్ని పొంది ఉండేవాడని, తన ఎనిమిదవ ఏటకే కన్ఫ్యూషియన్ తత్త్వాల గురించి తండ్రితో చర్చ చేస్తూండేవాడట. తన కుటుంబం కన్ఫ్యూషియన్ తత్త్వాల అనుయాయులైవున్నప్పటికీ తాను మాత్రం బౌద్ధ సన్యాసి కావాలన్న కోరిక కలిగి ఉండెనట. ఇతడు తన ధార్మిక కార్యకలాపాలకు తోడుగా అనేకమైన భాషలలో పాండిత్యాన్ని పొంది ఉండేవాడు. ఇతడి ఆసక్తులు, యాత్రలు చేయడం, గ్రంథాల అనువాదం చేయడం. కొంతకాలం ఇతడు మహాయాన బౌద్ధ పంథం గురించి అధ్యయనం చేయసాగాడు. బుద్ధుడు జన్మించిన దేశం, అతడు నడిచిన నేలను స్పర్శించాలన్న గొప్ప కోరిక తన మనసులో కలుగసాగింది. అక్కడి రాజుగారికి హుయాంత్సాంగ్ నడవడిక ఇష్టం కాలేదు. రాజుగారి అనుమతి లేకుండా దేశం విడిచి పోవడానికి లేదన్న నియమం కూడా ఉండేది. అది క్రీ.శ. 618 సమయం. చైనా దేశాన్ని పరిపాలిస్తుండిన 'సుయి' వంశం (Suy Dynasty)వంతు ముగిసిపోయి 'తంగ్' వంశం రాజ్య సింహాసనాన్ని అధిరోహించింది. హుయాంత్సాంగ్‌కు ఈ మార్పు అనుకూల మనిపించి తన సహోదరుడితో కలిసి చాంగ్యాన్ అన్న ప్రదేశానికి రాత్రికి రాత్రే పరారయ్యాడు. ఇక్కడ అన్నదమ్ములిద్దరూ సుమారుగా మూడు సంవత్సరాల కాలం కోంగ్ హుయ్‌లో ఎన్న బౌద్ధ ఆశ్రమంలో 'వసుబంధు' అనునతను సంస్కృతంలో రచించిన' 'అభిధర్మకోశ శాస్త్రం' అధ్యయనం చేశాడు.. దీనితో హుయాంత్సాంగుకు బౌద్ధ ధర్మం గురించి అభిమానం పెరుగుతూ పోయి క్రీ.శ. 622లో తన 20వ ఏట బౌద్ధ సన్యాసి కావాలన్న గట్టి నిర్ణయం చేశాడు. హుయాంత్సాంగ్ అధ్యయనం ప్రకారం చైనాలోని బౌద్ధ గ్రంథాలలో, సంస్కృత గ్రంథాలలో ఎన్నో విరోధా భాసాలు కనపడసాగాయి. అందువల్ల, భారతదేశానికి వెళ్ళి మూల గ్రంథాలను చదివి వివరంగా తెలుసుకోవాలన్న కోరిక మొలకెత్తి, అది తీవ్రం కాసాగింది. తనను మహాయాత్రకు సిద్ధం చేసుకొనే దృష్టిలో సంస్కృత భాషను నేర్చుకోవాలన్న సాహసానికి

పాల్పడ్డాడు. దానికి తోడుగా బౌద్ధతత్వ మీమాంసకు సంబంధించిన 'యోగాచార పంథం' గురించి ఆసక్తి పెరిగింది. కాని, వీటి అధ్యయనంవల్ల అతడి జ్ఞానదాహం తీరలేదు. దానికి బదులుగా అది ఇంకా అధికమయింది. భారత దేశానికి ప్రయాణం చేయడానికి నిర్ణయించినపుడు హుయాంత్సాంగ్ కు 25 ఏళ్ళ నిండు యౌవనం. క్రీ. శ. 627 సమయానికి తంగ్ సామ్రాజ్యంపై టర్క్ జంగమ జనాంగం దాడి చేసింది. అపుడు చక్రవర్తిగా ఉన్న తైజోంగ్ (Taizong 598-649) యుద్ధ సిద్ధతలలో మునిగి ఉన్నాడు. ఇది తనకు సరియైన సమయమని భావించిన హుయాంత్సాంగ్ కొంతమంది బౌద్ధ సన్యాసుల మనసులను అంగీకరింపజేసి తన వెంట భారతదేశానికి ప్రయాణించడానికి ప్రేరేపించాడు. వీరందరూ ఒకనాటి రాత్రి ఎవరికీ తెలియకుండా కోంగ్ హుయ్ నుండి సిల్క్ రోడ్ దారి మూలంగా క్వింగ్ హై ప్రాంతం చేరుకొన్నారు. రాజుగారి సైనికుల చేతికి చిక్కి తామెక్కడ ప్రాణాలను పోగొట్టుకొంటామోనని వారందరికీ భయముండేది. ఈ ఆతంకంలో అయినంత శీఘ్రంగా గోబి ఎడారి మార్గంగా తియాన్ శాన్ అన్న ప్రదేశాన్ని చేరుకొన్నారు. వారి ప్రయాణం ముందుకు కొనసాగింది. క్రీ.శ. 630 వేళకు ఝింఝియాంగ్‌కు తూరుపులో ఉన్న తుర్పాన్ (Turpan) ప్రాంత్యానికి హుయాంత్సాంగ్ గుంపు చేరుకొన్నది. తుర్పాన్ దేశం రాజు కూడా బౌద్ధ ధర్మంవాడైనందున తన రాజ్యానికి దయచేసిన ఈ ప్రయాణీకులను తన ఆస్థానానికి పిలిపించి వారి సుధీర్ఘమైన ప్రయాణ కథను విని మురిసిపోయాడు. వారి తరువాతి ప్రయాణానికి కావాల్సిన ధనం, సరకు-వస్తు-సామగ్రిలను, ఇతర అన్ని సౌకర్యాలను ఒదిగించి ఆ గుంపు వారికి గౌరవంతో వీడ్కోలు పలికాడు. తుర్పాన్ రాజుగారి నుండి వీడ్కోలు పొందిన హుయాంత్సాంగ్ చైనా దేశపు 14 చిన్న-చిన్న ప్రాంత్యాలను దాటి భారతదేశం చేరడానికి చైనా దేశం వ్యాపారస్థులు ఎన్నో శతాబ్దాల నుండి వాడుతున్న వ్యాపార దారి 'సిల్క్ రూట్' చేపడుతాడు. దీనివల్ల అతడు దారి తప్పిపోయే భయం లేక సమయానికి పోవాల్సిన దారి గురించి అడిగి తెలుసుకొని, వ్యాపారుల వెంట ప్రయాణం చేయడంతో వారికి భద్రత కూడా లభించింది. హుయాంత్సాంగ్ తాను దర్శించిన మహాన్ భారతదేశం పూర్తి వివరాలను నేల-నీరు, నాడు-నేడుల విషయ వివరాలను అత్యంత నికరంగా చూచినది చూచినట్టు ఎలాంటి టీక తాత్పర్యాలు ఇవ్వక వివరించే ఫొటోగ్రాఫిక్ రిపోర్టింగ్ ఇతని రచనలో మనం గమనిస్తాము. తన పర్యటనానంతరం చైనా దేశానికి వెనుదిరిగిన మీదట హుయాంత్సాంగ్ చైనా భాషలో రచించిన గ్రంథం సి-యు-కి (Si-Yu-Ki). ఈ గ్రంథంలో హుయాంత్సాంగ్ తన అనుభవాలను సవివరంగా దాఖలు పరిచాడు. చైనా భాషలో సి.యు.కి. అంటే పాశ్చాత్య దేశపు దాఖలా అని అర్థం. చైనీయుల పాలిట భారతదేశమొక పాశ్చాత్య దేశం. అతని మూల గ్రంథాన్ని 1906లో లండన్ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ సామ్యుయల్ బీల్ అనునతను రెండు సంపుటాలలో బుద్ధిస్ట్ రెకార్డ్స్ ఆఫ్ ది వెస్టర్న్ వరల్డ్ (Buddhist R ecords of the Western World) అన్న పేరుతో ఇంగ్లీషుకు అనువాదం చేశాడు.

క్రీ.శ. 629లో చైనా దేశం వదలి, ధర్మ యాత్రా నిమిత్తం కోంగ్ హుయ్ నుండి సిల్క్ రోడ్ దారి పట్టి భారతదేశానికి బయలుదేరిన మా సుదీర్ఘ ప్రయాణంలో హిమపాతాలను, పర్వత దేవతలను, దారి దొంగలను, ఎదు ర్కొని గోబి ఎడారి ప్రాంతం దాటి హిందు కుష్, కోహి బాబా పర్వత ప్రదేశాల మధ్య కనుమ ప్రదేశంలో వున్న బామియాన్ రాజ్యం చేరుకొన్నాము. బామియాన్ రాజు నుండి అతిథ్యం పొంది అక్కడి బౌద్ధ ధర్మం ముఖ్యస్థులతో చరిత్ర ప్రసిద్ధమైన రాతిలో చెక్కబడి బంగారు పూత పూసిన 140-150 అడుగుల ఎత్తున్న భవ్యమైన బుద్ధుడి విగ్రహాలు దర్శించిన మీదట బామియాన్ నుండి వారి ముందరి ప్రయాణానికి బయలుదేరాము. క్లిష్టమైన శైలశ్రేణిని, శిబార్ కనుమలు దాటి ఘోర్బండ్ నదీ తీరంలో అక్కడి వేటగాళ్ళ సహాయంతో అనతి దూరంలో కంటికి కనపడుతున్న కపీస పట్టణానికి బయలుదేరారు. ఇప్పటి కాబూల్ పట్టణం నుండి 40 మైళ్ళ దూరంలో ఉన్న కపీస పట్టణం తలిపాము. కపీసలో ఎక్కువమంది మహాయాన బౌద్ధాన్ని అనుసరిస్తుండేవారు. కాని, హిందూ దేవస్థానాలు కూడా ఉండేవి. ఇక్కడ మాకు ప్రప్రథమంగా హిందూ, జైన, శైవ సంస్కృతి పరిచయమైంది.

చాతుర్మాసాన్ని శాలక విహారంలో గడిపి, ఓ పదిమైళ్ల దూరం ప్రయాణం చేసి సైకత పర్వతం దాటి బుద్ధదేవుడి పవిత్ర అవశేషపు పుర్రె భద్రపరచబడి ఉన్న ఒక నగరాన్ని ప్రవేశించాం. అనేక అంతస్తులున్న ఒక భవ్య భవనంలో బుద్ధదేవుడి ఈ పవిత్ర అవశేషముండినది. ఆ భవనం రెండవ అంతస్తు ఉపరితలంలో (Terrace) చిన్నదొక స్తూపం ప్రకాశిస్తుంతుండినది. ఈ స్తూపాన్ని అలంకరించిన సప్తరత్నాలు వివిధ రంగుల ప్రభావపు వెలుగులను వెదజిమ్ముతుండినవి. ఈ స్తూపంపై, పై మూత ఉన్న రత్నఖచితమైన ఒక పాత్రలో ఆ తల పుర్రె ఉండినది. ఆ పుర్రె చుట్టుకొలత ఒక అడుగు రెండు అంగుళాలు. భవిష్యత్తు గురించి తెలుసుకోవాలనే కోరిక ఉన్నవారికి

ఈ మస్తకం దానిని తెలియజేస్తుంది. అది లభించాలంటే ధూపాన్ని నున్నని పిండిలా చేసి శుభ్రమైన పట్టువస్త్రంలో చుట్టి ఆ దివ్య మస్తకానికి అదిమిపెడితే, ఆ పట్టు వస్త్రంలోని ధూపపు పొడిపై వివిధ రకాల వస్తువుల ముద్రలు బొమ్మల రూపంలో ఒత్తబడి ఉంటాయి. ఈ బొమ్మలాంటి ముద్ర అలా చేసేవారి భవిష్యత్తు గురించి సూచించే సంకేతమవుతుందట!

నాకు నా భవిష్యత్తు గురించి తెలుసుకోవాలన్న కుతూహలం కలిగినది. నేను ఆ పవిత్రమైన మస్తకానికి అదిమిపెట్టిన ధూపపు పుడిపై 'బోధివృక్షం' ముద్ర ఏర్పడింది. నా ప్రయాణపు సేవా శుశ్రూషకై నావెంట వచ్చిన ఒక బ్రహ్మచారికి బుద్ధదేవుడి ప్రతిమ ఉన్న ముద్ర ఉండినది. మరొక బ్రహ్మచారికి పద్మపుష్పం ముద్ర ఉండినది. నాకు బోధివృక్షం ముద్ర లభించడం గమనించిన ఈ పవిత్ర మస్తకం అవశేషం సంరక్షకుడైన విప్రుడికి చాలా సంతోషం కలిగినది. అతడు నాకు పుష్పాలను ఇస్తూ, 'పూజ్యులారా, మీకు లభించిన 'బోధి వృక్షం' ముద్ర చాలా అసాధారణమైనది. అది మీరు బోధిని సాధించగలరనే భవిష్యత్తు సూచించే సంకేతమని తెలిపాడు!

దీపంకర బుద్ధ, శాక్యముని బోధిసత్వునికి భవిష్యత్తును గురించి చెప్పినందున ఈ నగరానికి దీపంకర నగరమని పేరు వచ్చింది. ఈ ప్రదేశంలో మరొక స్థూపమున్నది. ఇక్కడ బుద్ధదేవుడి కాషాయాంబరం భద్రపరచబడి ఉన్నది. ఇక్కడ బుద్ధుడి స్వేతవ్వర్ణపు లోహపు ఉంగరాలున్న ధర్మ దండాన్ని భద్రపరచి ఉంచారు. ఆ ధర్మదండం పిడి శ్రీగంధం చెక్కతో చేయబడినది. నేను ఈ పవిత్ర అవశేషాలకు భక్తితో అర్చన చేసి యాభై బంగారు నాణాలనూ, ఒక వెయ్యి వెండి నాణాలనూ, రెండు థానుల పట్టువస్త్రాన్నీ ఒక జత కాషాయాంబరాన్నీ కానుకగా సమర్పించా.

దీపంకర నగరం నుండి వాయువ్య దిక్కులో ఐదుమైళ్ల దూరంలో ఒక గుహ ఉన్నది. ఈ గుహలో తూరుపువైపున, నాగులకు రాజైన గోపాలుడు నివసించేవాడట. తథాగథుడు తన ధార్మిక తేజంతో ఈ నాగరాజును పరాభవపరచి ఈ గుహలో తన చాయాదేహాన్ని వదలి వెళ్లాడట. తథాగతుని ఈ చాయాశరీరాన్ని కన్నుల నిండా తృప్తిగా చూడాలన్న కోరిక నా హృదయంలో అంకురించినది. కానీ, ఆ గుహవద్దకు పోవడానికి ఉన్న మార్గం దుర్గమమైనదట. ఆ దారిలో దొంగల బెడద ఎక్కువట. ఈమధ్య కాలంలో అక్కడికి వెళ్లిన భక్తులకు చాయా దేహం అగుపించలేదట. అందువల్ల ఆ గుహకు ప్రయాణంచేసే యాత్రికుల సంఖ్య కూడా తగ్గిపోయినది. నేను కపిశ దేశం నుండి బయలుదేరినపుడు మార్గదర్శకులుగా వచ్చినవారికి నా ఈ కోరికను తెలిపా. అపాయకరమైన ఈ సాహసానికి పోవద్దని వారు నాకు సలహా ఇచ్చారు. వారు ఆ ప్రదేశంలో సంచరించడానికి ఇష్టపడక అయినంత శీఘ్రంగా స్వదేశానికి వెనుదిరగడానికి ఉత్సాహితులయ్యారు. 'నేను చాలా దూరం నుండి వచ్చా. తథాగతుని చాయాదేహం చూడకుండా ఎలా వెనుదిరగడం' అని వారితో అన్నా.

'మీరు ముందుకు వెళ్లండి. నేను ఆ గుహను సందర్శించిన మీదట, వచ్చి మీతో చేరుకొంటానని వారితో తెలిపి నేను ఒక్కడే దీపంకర నగరం నుండి ఆ గుహను చూడడానికి బయలుదేరా. నేను ఒక రోజంతా ప్రయాణం చేసి ఆ గుహకు దగ్గరలో ఉన్న ఒక కుగ్రామాన్ని తెలిపా. ఆ గ్రామానికి దగ్గరలోనే ఒక విహారమున్నదని, దానికి సమీపంలోనే ఆ గుహ ఉన్నదని తెలిసి అక్కడవున్నవారితో గుహకు దారి చూపించాలని విన్నవించుకొన్నా. కానీ, అక్కడ నా కోరికను మన్నించేవారెవరూ ఉండలేదు. అంతలో అక్కడ ఉన్న ఒక బాలుడు నా వద్దకు వచ్చి 'ఆ విహారమున్న గ్రామమేమీ చాలా దూరంలో లేదు. నేను మీకు దారి చూపుతానని' తెలిపి నాకు సహాయపడడానికి ముందుకు వచ్చాడు. నేను ఆ బాలుడి వెంట వెళ్లి మరొక గ్రామం తలిపి ఆ రాత్రి అక్కడున్న విహారంలో గడిపా. ఆ విహారంలో ఒక వృద్ధుడు ఉండేవాడు. నేను ఆ వృద్ధుడితో గుహకు దారి చూపమని ప్రార్థించా. అతడు నా ప్రార్థనను మన్నించి నన్ను ఆ గుహ వద్దకు తన వెంట పిలుచుకొని వెళ్ళాడు. దారిలో మాకు మరొక విపత్తు ఎదురైంది. ఐదుమంది దారి దొంగలు మమ్ములను అడ్డగించి వారివద్ద ఉన్న ఒరల నుండి కత్తులు తీసి మాకు అడ్డంగా నిలబడ్డారు. వారిని చూచి నేను నా ధైర్యాన్ని కోల్పోలేదు. నేను నా తలమీద ఉంచుకొన్న టోపీని తీసి, నేను ధరించిన కాషాయ వస్త్రాన్నివారికి చూపించా. 'మీరు, ఎక్కడికి పోతున్నారు?' అని ఆ దారి దొంగలు మమ్ములను ప్రశ్నించారు. 'ఇక్కడ ఉన్న గుహలో బుద్ధదేవుడి చాయా శరీరం కనపడుతుందట. దాని దర్శనం చేసి దానికి అర్చన చేయడానికి మేమక్కడికి వెడుతున్నామని' నేను జవాబు చెప్పా. 'మేము దారి దొంగలం. దారిలో పోయేవారిని దోపిడీ చేయడమే మా వృత్తి. మమ్ములను చూస్తే మీకు భయమవడం లేదా? అని వారి నాయకుడు అడిగాడు. 'దొంగలు కూడా మానవులే. వారికీ మానవ హృదయముంటుంది. దారిలో హింసించే మృగాలు అడ్డుపడతాయని ప్రయాణం చేయకుండా ఉంటామా? అలాంటపుడు మానవులైన దొంగలకు ఎందుకు భయపడాలి?' అని నేను అన్నా. నా మాటలు ఆ చోరులపై కొంత ప్రభావం చూపాయి. అపుడు వారు, 'మాకూ బుద్ధదేవుడి చాయాదేహాన్ని చూడాలని ఉన్నది. మీ వెంట మేమూ

వస్తామని' అన్నారు. మేమందరం ఆ గుహ ఉన్న చోటికి నడిచి వెళ్ళాము. అదొక ఇరుకైన కనుమ. ఆ కనుమ చివరన ఒక దైత్యాకారపు పెద్ద బండ నిలిచి ఉండినది. ఆ బండ మధ్యలో ఆ గుహలోనికి పోవడానికి దారి కనపడినది. ఆ బండ దగ్గరికి వెళ్లి ఆ ద్వారం గుండా లోనికి తొంగిచూడగా లోపల దట్టమైన చీకటి.

'పూజ్యులారా, మీరు గుహలోనికి వెళ్లి యాభై అడుగుల దూరం ముందుకు పోండి. అపుడు మీకు తూరుపు వైపున్న గోడ లభిస్తుంది. అక్కడ నిలబడి తూరుపు వైపు కన్నులు తెరచి చూడండి. అపుడు మీకు తథాగతుని చాయాదేహం దర్శనమవుతుందని' మా వెంట వచ్చిన ఆ వృద్ధుడు అన్నాడు. నేను ఆ గుహలోనికి వెళ్లి ఆ వృద్ధుడు చెప్పిన విధంగా 50 అడుగులు ముందుకు పోగా తూరుపు వైపు గోడ తగిలినది. నేను అక్కడ నిలిచి తదేక చిత్తంతో బుద్ధదేవుడిని ధ్యానించా. తథాగతుని పుణ్య నామాలు స్మరిస్తూ 101 నమస్కారాలు చేశా. కానీ, బుద్ధదేవుడి చాయా దేహం ఆ గోడమీద కనపడనందువల్ల నేను నిరాశ చెందా. నా పూర్వార్జిత హీన కర్మలవల్ల నా కోరిక సిద్ధించడానికి విఘ్నం కలిగిందని తలిచి దుఃఖంతో కన్నీరు కార్చా. అపుడు నేను శ్రీమాలదేవి సింహనాద స్తోత్రం, తథాగతుడి స్తవనాలను అనన్య భక్తితో పఠిస్తూ, మరొక మారు 101 ప్రణామాలు సమర్పించా. అంతలో తూరుపు వైపున్న గోడపై భిక్షా పాత్రంత వెడల్పున్న ఉజ్వలమైన ప్రభా పుంజమొకటి అగుపడినది. కానీ, మరొక క్షణంలో ఆ ప్రభాపుంజం మాయమైంది.

ఈ దీప్తి దర్శనంతో నా శరీరం పులకరించినది. బుద్ధదేవుడి చాయా శరీరపు దర్శన భాగ్యం నాకు లభిస్తుందన్న నమ్మకం దృఢమైంది. నేను వెళ్లి నమస్కారాలు సమర్పించా. మరొక క్షణంలో చక్రాకారంలో ఒక పళ్ళెమంత దీప్తి పుంజం గోడపై కనబడ్డది. కటిక చీకటి నిండిన ఆ గుహలో వెంటనే బంగారు రంగు వెలుగు రేఖలు ప్రసరించాయి. తథాగతుని దివ్య చాయాదేహ దర్శనం లభించేదాక ఇక్కడి నుండి కదలనని ప్రతిజ్ఞచేసి బుద్ధదేవుని స్తోత్రం చెబుతూ ప్రణామం చేయడం కొనసాగించా. చీకటి కప్పబడి ఉన్న ఆ గుహ వెంటనే వెలుగు తటాకంలా మారిపోయింది. గుహను ఆవరించిన చీకటి మంచు తొలగగా సుమేరు పర్వతం కనిపించేలా, గోడపై తథాగతుని దీప్తిమంతమైన చాయ అగుపించినది. నా జీవితం సార్థకమైనది! ఎంతో తృప్తిచెంది ఆనందపరవశుడినయ్యా. అపుడు నేను అనుభవించిన సంతోషాన్ని మాటలలో వివరించి చెప్పడం నా ఉద్దేశం కాదు. బుద్ధదేవుడి దేహం, ధరించిన వస్తువులు కాంతియుక్తమైన కేసరి వర్ణాన్ని దాల్చాయి. మోకాళ్లవరకూ శరీరం స్పష్టంగా అగుపడినది. పద్మాసనం దిగువ భాగం మసక మసకగా ఉండినది. చాయాదేహం ఎడమవైపు బోధిసత్వుడి, అర్హంతుల చాయలు కనపడ్డాయి. తథాగతుని చాయా దేహం దర్శనమైనపుడు బయట నిలబడిన ఆరుమందిని లోనికి పిలిచి చాయాదేహం ఆరాధనకు కావాల్సిన ధూపం, అంటించడానికి అగ్నిని తీసుకు రమ్మని తెలిపా. వారు అగ్ని తీసుకొని లోనికి వచ్చే సమయానికి బుద్ధుడి చాయాదేహం అంతర్ధానమైనది. నేను ధూపాన్ని అంటించి చాయా దేహం అదృశ్యం కాకూడదని మరొకమారు దర్శనం కల్గించే కృప చేయాలని అనన్య భక్తితో తథాగతుడిని ప్రార్థించా. నా ప్రార్థన ఆలకించిన బుద్ధదేవుడు కరుణించాడు. చాయాదేహం మరలా గోడమీద కనపడింది. ఆ ఆరుమందిలో ఐదుమందికి మాత్రం ఈ భవ్యమైన చాయా రూపాన్ని చూడడానికి శక్తి కలిగినది. కాని, ఆ ఆరుమందిలో ఒకడికి మాత్రం ఏమీ కనపడలేదు. నేను ఆ చాయను పూజించిన మీదట ఆ నీడ అంతర్ధానమైంది.

'ఆచార్యులవారి అనన్య భక్తి ప్రభావంవల్ల, మనకందరికీ తథాగతుని చాయాదేహ దర్శనం లభించినది. లేకుంటే మనకు ఆ పుణ్యం లభించేది కాదని' నన్ను గుహ వద్దకు పిలుచుకొని వచ్చిన వృద్ధుడు సంతోషం నిండిన స్వరంలో అన్నాడు. బుద్ధదేవుడి చాయాదేహం దర్శనానికి నా వెంట వచ్చిన ఐదుమంది దొంగలపై మహత్తరమైన ప్రభావం కలిగించినది. వారి అంతరంగంలో నిండిన హింసా ప్రవృత్తి, ఎండకు కరిగిపోయిన మంచువలె మాయమైంది. వారు తమ చేతులలో పట్టివున్న కత్తులను దూరంగా పారవేసి, 'యికమీదట మేము దారిదోపిడి వృత్తి చేయము. సాధు జీవితాలను గడుపుతామ'ని అన్నారు. అది చాలదన్నట్టు వారు వంగి నాకు నమస్కారం చేసి నానుండి పంచ మంత్రోపదేశం పొంది సెలవు తీసుకొని వెళ్ళిపోయారు. అనంతరం, నేను అనేక రోజుల పర్యంతం ప్రయాణం చేసి కాశ్మీర రాజ్యాన్ని ప్రవేశించాను.

* * *

*(చీనీ యాత్రికుడు హుయాన్సాంగ్ భారత దేశ యాత్ర రచనల ఆధారంగా వ్రాసిన 'భారతీసుత' గారి కన్నడ రచన 'జ్ఞాన యాత్రిక' నుండి అనుసృజన చేసిన కొద్ది భాగం.)*

వేలూరి కృష్ణమూర్తి
మైసూరు. ఫోన్: 9448977877.

# ఎవరీ శాంతం?

– అట్లూరి జయశ్రీ

డా. పుప్పల లక్ష్మణరావుగారు భార్యాభర్తల మధ్య వచ్చే తగాదాలను "ఆమె-అతడు" అనే శీర్షికతో ఒక డైరీ రూపంలో ఉన్న కథగా 1922-27 మధ్యలో వ్రాశారు. అదే పంథాలో ఆయన వ్రాసిన నవల "అతడు-ఆమె" 1950లో పూర్తి అయింది. ఆ దరిదాపుల్లో వచ్చిన సాహిత్యం మొత్తంలోనే 'అతడు-ఆమె'లో ప్రముఖంగా కనపడే శాంతం, సుభ, లక్ష్మి పాత్రలు అప్పటికీ ఇప్పటికీ కూడా తలమానికలుగా నిలుస్తాయి.

"శాంతం ఎం.ఏ. పాస్ అయి, చెన్నపట్నంలో క్వీన్స్ కాలేజీలో పనిచేస్తూ ఉండేది. తెలివైంది. చురుకైంది. సరదా మనిషి. నాలుగేళ్ళ క్రితం ఆమెకి చిదంబర శాస్త్రితో పరిచయం అయింది. ఇంగ్లాండ్‌లో బారిష్టరీ పాస్ అయి, చెన్నపట్నంలో ప్రాక్టీసు పెట్టాడు. అతనూ మంచి మనిషి. సరదాలు కావాలి. ఇద్దరూ తెలుగువాళ్ళవడంవల్ల, ఒకేలాంటి ఉద్దేశాలు ఉండటంచేత.. స్నేహం బాగా కుదిరి రెండేళ్ళ క్రితం పెళ్ళి చేసుకున్నారు. ఇద్దరూ చూడచక్కనివారు. కాశ్మీర్‌లో రెండు నెలల హనీమూన్ తరువాత చెన్నై వచ్చి కొత్త సంసారం మొదలుపెట్టి రెండు సంవత్సరాలు అయింది. శాస్త్రి కోర్టులో పని మొదలు పెట్టాడు. శాంతం పని మానేసి ఇల్లు చక్కబెట్టుకోవాలని నిర్ణయించుకుంటుంది. ఇక ఈ సంసారం వల్ల శాంతమ్మకీ, శాస్త్రికీ సుఖమే కలుగుతుందో, కొనకు విడాకుల వస్తాయో?" అంటూ మొదలౌతుంది ఈ నవల. వాళ్ళిద్దరి మధ్య ఏమి జరిగిందో తెలుసుకోవటానికి వాళ్ళు వ్రాసుకునే డైరీ మార్గమవుతుంది.

నాలుగు డైరీ అధ్యాయాలవరకూ ఇద్దరూ చాలా సంతోషంగా ఉంటారు. 5వ అధ్యాయంలో శాస్త్రి ఒక ముఖ్యమైన విషయాన్ని, శాంతానికి కాకుండా ముందు అతని చెల్లెలుకీ, అన్నగారికీ చెపుతాడు. శాంతం అడుగుతుంది. 'అప్పుడే తెలిసింది. అందుకే నీకు చెప్పలేదు. అయినా నువ్వు కూడా అక్కడే ఉన్నావు కదా' అని సర్దుతాడు. తరువాత ఆమెకు ఈ సంగతి అతడు వారం రోజుల క్రితమే ఒక సీనియరు లాయర్ భార్యతో చెప్పినట్లు తెలుస్తుంది. 6వ అధ్యాయం అదే సంఘటన గురించి అతడు వ్రాసుకున్న డైరీ. తను అబద్దం చెప్పటాన్ని సమర్ధించుకుంటాడు. అప్పుడే భార్యాభర్తల మధ్య ఉండవలసిన నమ్మకానికి మొదటి బీట పడుతుంది. దాపరికం ఉండకూడదని శాంతం కాలేజీ సహవిద్యార్థుల గురించి చెప్పమని అడిగి, ఆమె చెప్పిన తరువాత ఎవరో శాంతం కాలు మీద కాలు పెట్టారని కోపం తెచ్చుకుంటాడు శాస్త్రి, అతనితో ఇంగ్లాండ్‌లో కొంతమంది యువతులు అంతకంటే ఎక్కువ చనువుగా, దగ్గరగా ఉన్నప్పటికీ. తన వృత్తి ప్రయోజనాల కోసం వేళాపాళా లేకుండా, ముందు చెప్పకుండా చాలామందిని ఇంటికి చాలాసార్లు తీసుకురావటం, పనివాళ్ళను హీనంగా చూడటం, వాళ్ళను మేనేజ్ చెయ్యటం కూడా రాదు అని శాంతాన్ని ఎద్దేవా చెయ్యటం; ఓ నాటకం చూస్తున్నప్పుడు, భార్య అభిప్రాయాలకు విలువ ఇవ్వకపోవటం; ఆడవాళ్ళ గురించి తేలికగా మాట్లాడటం... వీటి గురించి శాంతం అసంతృప్తిగా డైరీలో వ్రాసుకుంటుంది. ఈ సందర్భాల గురించి శాస్త్రి.. తనను తాను సమర్ధించుకుంటాడు. తన తప్పును శాంతం ఎత్తి చూపించినట్లు అనుకుని, ఇక్కడ, 'ఇద్దరం చదువుకున్నవాళ్ళం అవటంచేత కాబోలు ఈ తంటాలన్నీ' అనుకుంటాడు శాస్త్రి.

నిజమేనేమో. భార్యా భర్తలలో, భర్త బాగా చదువుకుని భార్య ఎక్కువగా చదువు కోకపోవటం; ఇద్దరూ సమానంగా చదువుకోవటం; భార్య బాగా చదువుకుని భర్త అంతగా చదువుకోకపోవటం – అనేవి మూడు రకాలైన పరిస్థితులు. మొదటి పరిస్థితి పాతకాలంలో సర్వ సాధారణం. మూడోది ప్రస్తుతం కూడా అరుదే. రెండోది చాలావరకు ప్రస్తుత పరిస్థితి. భార్య తనతో పాటు సమానంగా చదువుకున్నదైనప్పటికీ, భర్త కుటుంబానికి తనే యజమాని అని అనుకుంటాడు. అన్ని విషయాలలో తనదే పైచేయి కావాలనుకుంటాడు. చదువుకుని మూఢత్వం వదిలించుకున్న భార్య ఈ దాష్టీకాన్ని సహించదు. అప్పుడే ఇద్దరి మధ్య ఎక్కువగా భేదాభిప్రాయాలు వస్తాయి. రచయిత ఆ రోజుల్లో శాస్త్రి ద్వారా పలికించిన మాటలు ఈరోజుకీ నిజమే. అందుకే ఈ రచయిత సార్వకాలీనుడు. అంటే ఈ కాలానికి కూడా సమకాలీనుడే. ఈ పుస్తకంలో ఇలాంటివి ఇంకా చాలానే ఉన్నాయి. శాస్త్రి అతని సంపాదన అంతా అతని అకౌంట్‌లోనే వేసుకుంటాడు. బాగా సంపాదన వచ్చినప్పుడు శాంతంకు చీరెలు వజ్రాలు కొంటాడు. భార్య వీటిని ధరించి కనిపిస్తే సంఘంలో అతని

స్థాయి పెరుగుతుంది మరి. ఒక దశలో శాస్త్రి మోసపోయి బెంబేలు పడుతుంటే, శాంతం తన డబ్బంతా ఇస్తుంది. సమస్య తీరటంకోసం ఇల్లు, నగలు అమ్మించి, చిన్న అద్దె ఇంటిలోకి మారుదామని సూచిస్తుంది. అంటే ఆమె డబ్బు తనదిగా వాడుకుంటాడు కాని, తను సంపాదించే డబ్బు మీద ఆమెకేమీ హక్కు ఇవ్వడు. ఇంటి ఖర్చు కూడా అతను ఇవ్వవలసిందే శాంతానికి. శాంతం ఉద్యోగాని వెళతానంటుంది. 'మిగతావాళ్ళ చూపులు శాంతం మీద పడతాయి' అని ఆర్థికంగా అవసరమైనా వద్దంటాడు శాస్త్రి. ఎంత చదువుకున్నా, భార్య మీద యాజమాన్యపు హక్కు ఉన్నట్టు భావించటం ఆనాటికీ, కొంతవరకు ఈనాటికీ కూడా మగవారి ప్రవృత్తిలో చూస్తాము.

పితృస్వామ్య వ్యవస్థ పోయి చాలాకాలం అయింది. భార్యా భర్తలిద్దరూ బాగా చదువుకుని.. భార్య ఇంటిపనులు చూసుకుంటూ, భర్త బయటికి వెళ్ళి సంపాదించే నేపథ్యంలో... చాలాచోట్ల, అప్పుడు ఇప్పుడు కూడా భార్య చేతిలో చిల్లిగవ్వ ఉండదు. ఒకవేళ ఉన్నా ఖర్చు పెట్టిన ప్రతి పైసాకి లెక్క చెప్పవలసి వస్తుంది. ఏ మాత్రం చదువుకోకపోయినా తెలివిగల ఆడవాళ్ళు భర్తకు తప్పుడు లెక్కలు చెప్పి.. పోపుడబ్బాల్లోనో, బియ్యపు డబ్బాల్లోనూ డబ్బులు దాచుకోవటం, పాలు, పెరుగులాంటివి అమ్మి డబ్బు చేసుకోవటం, చీటీలు కట్టటంవంటివి చేస్తూ ఉంటారని విన్నాము. లేకపోతే భర్త సంతోషంగా ఉన్నప్పుడు కావలసినవి నివేదించుకోవటం ద్వారా కావలసింది సాధించుకోవటం ఇంకో పద్ధతి. శాంతంలాంటి చదువుకున్న ఆడవాళ్ళు ఇవేమీ చేయలేరు. స్వాభిమానం అడ్డొస్తుంది. ప్రేమ వివాహం అయితే ప్రేమ అడ్డొస్తుంది. ఇటువంటి వ్యావహారిక విషయాలు ఆలోచించటమే తప్పనిపిస్తుంది. చలం ఓచోట అంటాడు, "పిల్లల కోసం, ఇంటి కోసం పనిచెయ్యని స్త్రీని పోషించేందుకు భర్త సంపాయిస్తున్నా, అతని దయ మీద ఆధారపడకూడదు. ఆమె తన బతుకు కోసం, అతని జీతంలో కొంత భాగానికి ఆమెకి అధికారం ఉండాలి." "భార్య కావటం ఒక ఉద్యోగం కింద ప్రభుత్వం పరిగణించాలి" అని. ఈ అంశంతో పాటు చలం ప్రస్తావించిన ఇతర అంశాలన్నీ నాకు నచ్చకపోయినా... ఇంట్లో ఆడవాళ్ళు చేసే పని చాలా చవకరకం పని అని, లేకపోతే అసలు పనే కాదన్నట్టు చూడబడటం చాలాసార్లు జరుగుతుంది. I am just a house-wife అని, ఆమె ఇంట్లోనే ఉంటుంది ఏమీ చెయ్యదు అనటం చూస్తాము. పాశ్చాత్య దేశాలలో కూడా house-wife తన పేరుతో అప్పు తీసుకోలేదు. ఏవో కొన్ని కేసులలో అదీ డివోర్స్ కేసులలో భర్త సంపాదించగలగటానికి, తాను ఉద్యోగావకాశాలను వదులుకుని ఇంటి బాధ్యత స్వీకరించటంతో పాటు, ఇంటి నుంచే అతనికి అన్ని విధాల సహకారం అందించటం కూడా కారణమని ధైర్యంగా అడగడం జరిగింది. ఈ కేసులలో లోటుపాట్ల వివరాలు అన్నీ నాకు తెలియవు కాని, సమాజంలో చాలా సందర్భాలలో ఇటువంటి ఆలోచన ఎంతో అవసరం.

శాంతం బయటికి వెళ్ళి పనిచేయటానికి వీలు లేదు. ఇంట్లో చేసే పనికి విలువ లేదు. ఒక సందర్భంలో శాంతం 'చిత్ర ప్రదర్శన'కు వెళుతుంది. శాస్త్రి అనుకోకుండా ముందే ఇంటికి వస్తాడు. ఇంటి తాళాలు ఉండవు. శాంతం బయటకు వెళ్ళినందుకు, తను వేచివుండవలసి వచ్చినందుకు, చిత్రపటాల మీద డబ్బు ఖర్చు పెట్టినందుకు చిరాకు పడతాడు. తరువాత సంతకం చేసి ఉన్న చెక్‌బుక్ తన జేబులోనే ఉందని చూసుకుని, ఆమె తన డబ్బు వాడలేదని తెలిసి మనసులో సంతోషిస్తాడు. తరువాత, తన డబ్బు ఖర్చు అవకుండా, శ్రీమతి శాస్త్రి ఫలానా ప్రదర్శనలో చిత్రపటం కొన్నది అని రేపు వార్తా పత్రికలో వస్తుందని గర్వపడతాడు. అప్పటికి అతడు వృత్తిలో బాగా ఎదుగుతాడు. సంపాదన బాగా ఉంటుంది. మధ్యమధ్యలో శాస్త్రి లేడీ అయ్యంగార్, అలివేలులాంటి వాళ్ళ అందాన్ని పొగుడుతూ రకరకాల ప్రయోజనాల కోసం వాళ్ళతో చనువుగా ఉండటం శాంతానికి కష్టం కలిగిస్తుంది. ఒక ప్రక్కన ఓ బిడ్డకు తల్లి అయి, ఇంట్లో ఉండిపోయిన భార్య అంటే అలసత్వం, ఎంత సంపాదించినా సంపాదన కోసం మానవత్వానికి కూడ ప్రాధాన్యత ఇవ్వని భర్తపట్ల శాంతానికి గౌరవం పోతుంది. అట్లా అని శాస్త్రికి శాంతం అన్నా, కూతురు అన్నా ఇష్టం లేదని కాదు. కాకపోతే, ఖరీదైన ఇల్లు, కార్లతో పాటు, భార్య, పిల్ల కూడా సంఘంలో తన స్థాయి పెంచేటట్టు ఉండాలనుకుంటాడు.

'శాంతానికి నివురు కప్పింది. కొంచెం ఊది నిప్పుని మంట చేయాలి. అంతే అప్పుడు మళ్ళీ నా శాంతం అయిపోతుంది. రెండు డిన్నరు పార్టీలు, గార్డెన్ పార్టీలు ఇచ్చినా, ప్రాక్టీసుకీ మంచిది. శాంతానికీ సరదాగా ఉంటుంది. నా ఇల్లు, నా శాంతం, నా మోటారు... ఎంత హాయి' అనుకుంటాడు. ఇక్కడ శాంతాన్ని కప్పిన నివురు... వ్యక్తిగా గుర్తింపు లేకపోవటం, అస్తిత్వంలేని ఆస్తిగా చూడబడటం, భావ ప్రకటనకు అవకాశం లేకపోవటం, ఇంటి కుందేలుగా చూడబడటం, భర్తలో భరించలేని విరుద్ధమైన ప్రమాణాలు, తను నిర్వహించే బాధ్యతలకు

విలువ లేకపోవటం, తన తెలివితేటలను, చైతన్యాన్ని సార్థకం చేసుకునే అవకాశాలు లేకపోవటం. ఈ అసంతృప్తి ఇద్దరి మధ్య ఎన్నో అభిప్రాయ భేదాలకు, కోపతాపాలకు దారి చేస్తుంది. ఇక్కడ శాస్త్రి అనుకుంటాడు, 'ఈ నాగరికతలూ, చదువులూ, సంస్కరణలూ, చర్చలు లేకుండా.. అక్కరలేని చిత్తక్షోభ పెట్టుకోకుండా.. నేనూ శాంతం హాయిగా ఎందుకు ఉండకూడదు' అని. మళ్ళీ ఇక్కడ మనకు కనపడుతుంది... భార్య చదువుకుని.... ఇంటి బయట వ్యవహారాల మీద నిర్దిష్టమైన అభిప్రాయాలు ఏర్పరచుకుంటే, ఇది ఎంత చదువుకున్న భర్తకైనా నచ్చని విషయం అని. తప్పుడు కేసులు గొప్పవారికి అనుకూలంగా వాదించి, బడుగువాళ్ళ జీవితాలు అథోగతి చేసి, వచ్చిన రూ. 2000లలో రూ. 500తో శాంతానికి వజ్రపుటుంగరం తెస్తాడు శాస్త్రి. 'ఈ వజ్రాలు రైతుల రక్తపు చుక్కలు కావూ? నేనెలా ముట్టుకోగలను' అంటుంది శాంతం. ఆ కేసు గెలిచినందుకు లేడీ అయ్యంగార్ మెచ్చుకుంటుంది. శాంతం ఆమెను చూసి, లౌక్యం, చాకచక్యం, చలాకీతనం నేర్చుకోవాలని అనుకుంటాడు శాస్త్రి. అతని మనసు లేడీ అయ్యంగార్ వైపు పరుగులు తీస్తూంటుంది. మలయాళం వాళ్ళు ఒక అమ్మాయిని అక్రమంగా తీసుకుపోతుంటే ఆ అమ్మాయిని రక్షించుతుంది శాంతం. ఆ అమ్మాయి పేరు సుభ. శాస్త్రి ఇష్టానికి వ్యతిరేకంగా ఆ అమ్మాయిని ఇంట్లో ఉంచుకుంటుంది శాంతం. తరువాత సుభ వాళ్ళ పెద్ద అమ్మాయిగా చూడబడుతుంది. అటు తరువాత శాస్త్రి, శాంతం ఇద్దరూ విభిన్న మనస్తత్వాలతో, వ్యక్తిత్వాలతో చెరోవైపు అడుగులేస్తారు. శాంతం కాంగ్రెస్, గాంధీజీ, ఖద్దరు వైపు. శాస్త్రి డబ్బు, పేరు, హోదావైపు. శాంతం భర్త భావాలతో ఏకీభవించకుండా, తన పంథా తనకు ఏర్పరచుకుంటుంది. "నీ జీవితాన్ని మార్చుకో – నీ స్వభావంలో చురుకుపాలు హెచ్చు – చైతన్యం కోరే వ్యక్తిత్వం నీది'' అని తనతో ఎవరో చెపుతున్నట్టు అనుకుంటుంది. శాస్త్రిలో ఎన్నిలోపాలున్నా అతనంటే ప్రేమేనని డైరీలో వ్రాసుకుంటుంది. అప్పటికి వాళ్ళ పెళ్ళయి 10 సంవత్సరాలు.

శాంతాన్ని స్త్రీల స్థానానికి పోటీ చెయ్యమని అడుగుతారు కాంగ్రెస్ వారు. ఖద్దరు కట్టుకుని కాంగ్రెస్‌లో తిరిగే భార్యవల్ల తన వృత్తి దెబ్బతింటుందని భయపడిన శాస్త్రి, అదే సమయంలో తననే కాంగ్రెస్ అభ్యర్థిగా సిఫార్సు చెయ్యమని శాంతాన్ని అడుగుతాడు. ఈస్టిండియా కంపెనీ తరఫున వాదించి, హరిజన రైతులను వాళ్ళ కుటుంబాలనీ జమీందారుకు నిన్నగాక మొన్న బలిచ్చిన శాస్త్రి, మితిమీరిన స్వార్థంతో ప్రజల పక్షాన నిలబడతాననటం శాంతం భరించలేక అసహ్యించుకుంటుంది. కొన్నాళ్ళ పాటు, అఖండ గౌతమి, వశిష్ఠ గోదావరీ దేని దారిన అది ప్రవహించటం (ఎవరి దోవన వారుండటం) మంచిదని భావించి, సుభనీ, పాపను తీసుకుని, తను ఎందుకు వెళతున్నదీ శాస్త్రికి ఉత్తరం వ్రాసిపెట్టి... వెతకవద్దు, మనసు కుదిరాక మళ్ళీ వస్తాను, ఓపిక పట్టు అంటూ ఇల్లు విడిచి యాత్రలకు వెళ్ళిపోతుంది. ఇక్కడ శాంతం తీసుకున్న నిర్ణయానికి దోహదం చేసింది, ఆమె చదువు, చైతన్యం ఆమెకిచ్చిన ధైర్యమే. ఎక్కడ సర్దుకుపోవాలో, ఎక్కడ సర్దుకుపోకూడదో తెలిపే వితరణ కూడా ఈ చదువువల్లే. తరువాత కొన్ని నెలల ఎడబాటు శాస్త్రికి ఆలోచించుకోవటానికి, జీవితంలో ప్రాధాన్యతలు నిర్ణయించుకోవటానికి అవకాశం ఇస్తుంది. లోపాలున్నవి అని శాస్త్రిని పూర్తిగా వదిలేయలేదు సరికదా, ఏ నుయ్యో గొయ్యో చూసుకోలేదు శాంతం. ఉత్తర భారతదేశంలో తిరిగి కాశ్మీరు వెళ్ళాక, 'శాస్త్రితో హనీమూన్' జ్ఞాపకాలతో మనసు కరిగిన శాంతం అతనికి లెటర్ ద్వారా క్షేమం తెలుపుతుంది. హనీమూన్‌కి వెళ్ళినప్పుడు వాళ్ళు ఉన్న హోటల్ చిరునామాకు శాస్త్రి లెటరు వ్రాస్తాడు, ఇంగ్లాండ్ ప్రయాణానికి ఏర్పాటు చేసినట్టు, ఓ నిర్ణీత సమయానికి బొంబాయి రావలసిందని. శాంతం వెళుతుంది. స్నేహం, ప్రేమల ఆధారంగా ఏర్పడిన బంధాన్ని తెంచుకోకుండా, పెడదారిలో వెళుతున్న భర్తను గుడ్డిగా సమర్థించకుండా, తన వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా సమయానుకూలంగా సరైన నిర్ణయాలు తీసుకున్న శాంతం, చదువుకున్నా మనసులో సున్నితత్వాన్ని కోల్పోకుండా, ఆశయాలను వదులుకోకుండా, నెగ్గుకు వచ్చిన శాంతం అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ మహిళా లోకానికి తలమానికమే. ఏ కాలంలో అయినా శాంతంలాంటి వారు... వ్యక్తిత్వం కోల్పోకుండా.. నొప్పింపక.. తానొవ్వక అనేవిధంగా వైవాహిక జీవితాలను, కుటుంబ జీవనాన్ని సుఖప్రదంగా చేసుకోవటానికి స్త్రీలకు కరదీపికలౌతారు.

**సుభ – లక్ష్మి:**

సీతారామాభ్యాన్నమః అంటూ యాయవారం చేసుకుని బ్రతుకు ఈడ్చుకొచ్చే కుటుంబంలో పుట్టింది సుభ. ఎనిమిది తొమ్మిదేళ్ళప్పుడు కరువురోజులొచ్చి, సుభ, ఆమె చెల్లెలు.. గొప్పవాళ్ళిళ్ళ ముందు పడేసి ఉన్న చింత పిక్కలు ఏరుకెళ్ళి, చితక్కొట్టి ఇస్తే వాటితో వాళ్ళ అమ్మ కాసిన అంబలి మాత్రమే తాగి బ్రతికిన రోజులున్నాయి. కోమటికొట్ల ముందు పడి ఉన్న ఒకటో రెండో




ఎండుమిరప కాయలు ఏరుకోవలసినంత బీదరికం. వీధిలో పడివున్న చీకిపడేసిన మామిడి టెంకలు ఆడపిల్లలు తెచ్చి ఇస్తే, కడిగి, బద్దలుకొట్టి, లోపల జీడితో పులుసు కాసుకునేది ఆ కుటుంబం. ఆమె చూసిందంతా... నాన్న అమ్మని చావబాదటం, ఇంకో ఇద్దరు చెల్లెళ్ళు పుట్టుకురావటం. 14-15 సం.ల వయసులో డబ్బు కోసం ఆ అమ్మాయిని మలయాళం వాళ్ళకి అమ్మేస్తే, ఆ వ్యవహారం శాంతం దృష్టికి వచ్చి సుభని రక్షించి, శాస్త్రి ఇష్టానికి వ్యతిరేకంగా తన దగ్గరే ఉంచుకుని పెద్దకూతురుగా పెంచుకుంటుంది. సుభ శాంతంకంటె సుమారు 12-15 సం.లు చిన్నది. లక్ష్మి.. శాంతం, శాస్త్రిల కూతురు. సుభకంటె 10 ఏళ్ళు చిన్నది. ముగ్గురూ మూడుతరాల ప్రతినిధులు. మూడురకాల వ్యక్తిత్వాలు కలిగి ఉంటారు. 25 సం.ల వయసుకు సుభ చదువుకున్నదిగా, అందమైనదిగా, మాటకారిగా, పనుల్లో నేర్పరిగా, ధైర్యవంతురాలిగా, రాజకీయ అవగాహన కలిగినదానిగా కథలో మనకు తారస పడుతుంది. తల్లిదండ్రులతో పాటు (శాస్త్రి, శాంతం) కొన్నాళ్ళు ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశాలలో గడిపింది. కథలో ప్రధానాంశం సుభ జీవిత భాగస్వామిని ఎంచుకున్న విధానం. ఈ విధానంలో ఆమె నిర్ణయాన్ని ఎన్నో శక్తులు, ఎందరో వ్యక్తులు, రాజకీయ, ఆర్థిక, మానసిక పరిస్థితులు ఎన్నో కోణాల నుండీ తలోవైపుకు లాగుతూ ఉంటాయి. తనకేది కావాలి తేల్చుకోలేని పరిస్థితి ఎదురౌతుంది సుభకి. 'ప్రకృతి ఎంత రమణీయంగా ఉందో మానవుడంత అసహ్యంగా ఉన్నాడనిపించింది. మానవులందరిలోనూ మదనగోపాలం మరీ అధముడనిపించింది!' అని సుభ అనుకోవటంతో ఈ కథ (అతడు - ఆమె 2వ భాగం) మొదలౌతుంది). మదనగోపాలం సుభ స్నేహితురాలి తమ్ముడు. సబ్ కలెక్టర్. డబ్బు, హోదా, ఆస్తి అన్నీ ఉంటాయి. మితిమీరిన స్వార్థం, పిరికితనం, స్వోత్కర్షలాంటి లక్షణాలను ప్రదర్శిస్తూ ఉంటాడు. తెల్ల పంట్లాం మురికి అవకూడదు. ఆడది కారు నడుపుతుంటే మగవాడిగా ప్రక్కన కూర్చోవటానికి చిన్నతనంగా ఉంటుందతనికి. సుభ అంటే ఇష్టం. మితిమీరిన చనువు చూపించి చెంపదెబ్బ తిన్నా పెద్దగా పట్టించుకోడు. సుభ మదనగోపాలాన్ని చేసుకుంటే సంఘంలో గౌరవంగా ఉంటుందని శాస్త్రి అభిప్రాయం. ఆ దిశగా ఆమెను ప్రోత్సహిస్తూ ఉంటాడు. స్నేహితురాలిని చూడటానికి, సాయంగా వెళుతున్న సుభ గురించి, 'ఐ.సి.యస్. వాడిని ఇట్టే బుట్టలో వేసేస్తుంది...... ఆ బండ ఖద్దరు మాన్పించి – చక్కని వాయిల్స్, జార్జెట్, షిఫాన్ కొని ఇవ్వు.... భడవని హుషారెక్కించి పంపించు' అని శాస్త్రి అమ్మతో (శాంతం)తో అనటం విని సుభ నవ్వుకుంటుంది... ఆయన మాటలు, భావాలు అలవాటై. తల్లి, 'ఏ విషయంలోనూ తొందరపడవద్దు. ఎప్పుడూ కూడా నీ మనస్సాక్షి ఎలా చెపుతుందో అలా ప్రవర్తించు' అని మాత్రం చెబుతుంది. మదనం, అతని తల్లిదండ్రులూ కట్నకానుకలూ, పెట్టుపోతలూ అంటూ బేరసారాలు సాగించినా శాస్త్రికి అభ్యంతరం ఉండదు. దాదాపుగా ఈ సంబంధం కుదిరిపోయినట్లే అనుకుంటాడు శాస్త్రి. మూఢం వంక చెప్పి, నాలుగు నెలలు టైమ్ అడుగుతుంది సుభ, మనసు ఎటూ తేల్చుకోలేక, తనకేది ముఖ్యమో ఇదమిత్థంగా నిర్ణయించుకోలేక. రెండో వ్యక్తి సీతారాం. ఇంజనీరు. ఎర్రగా బుర్రగా ఉంటాడు. ఇంగ్లాండ్‌లోనే పరిచయం సుభకి. తండ్రి యుద్ధ సమయంలో సంపాదించిన ఆస్తి కూడా చాలా ఉంది. బ్రతక నేర్చినవాడు. చలాకీగా ఉంటాడు. ఎదుటివాళ్లకు కావలసినది ఇచ్చి తనకు కావలసినది రాబట్టుకోగలిగినవాడు. వాక్చాతుర్యం ప్రదర్శించగలిగినవాడు. సుభ అంటే ఆశ ఉంది. సుభ చెప్పినట్టు వింటాడు. 'డబ్బూ గడుసుదనం ఉన్నవాళ్ళంటే నాకు భయమే సుభా' అనేది శాంతం అభిప్రాయం. సీతారాం బ్రాహ్మడు కాడు. ఏతా వాతా, 'నువ్వు ఎవడిని చేసుకున్నా నాకిష్టమే. డబ్బూ రెండు కార్లూ ఇళ్ళూ వాకిళ్ళూ ఉన్నవాడిని చేసుకుంటే నువ్వు సుఖపడతావు. వాడిని సుఖపెడతావు. బ్రాహ్మడు అవుతే ఉత్తమం. బ్రాహ్మడు కాకపోయినా హిందువు అయితే మధ్యమం. ఇక ఏదీ లేకుండా ఏ దూదేకులాడో, సోషలిస్టో అవుతే నీ ఇష్టం-నీ అమ్మ ఇష్టం'.. అనేది సుభ పెళ్ళి గురించి తండ్రి (శాస్త్రి) అభిప్రాయం. సుభ దృష్టిలో ఉన్న మూడో వ్యక్తి అమృతరావు.. వాళ్ళ డ్రైవరుగా మారువేషంలో ఉన్న కమ్యూనిస్ట్ ప్రొఫెసర్. అందమైనవాడు. అతను రహస్యంగా చదువుతున్న పుస్తకాలను చూసి ఆకర్షణకు లోనవుతుంది. అతని పుస్తకాల ప్రభావం చెల్లెలు లక్ష్మి మీద ఎక్కువగా పడుతుంది. కమ్యూనిస్టు మీద పెట్టిన ఆంక్షలు తీసెయ్యగానే అతను డ్రైవర్ పని వదిలేసి వెళ్ళిపోతాడు. మళ్ళీ కొంతకాలం తరువాత భార్యతో వచ్చి చూసెళతాడు. ఆ జంటను చూసి, తన జీవితభాగస్వామితో ఇంత

స్నేహంగా ఉండగలనా అని ముచ్చట పడుతుంది సుభ. ఇకపోతే నాలుగవవాడు జగన్నాథరావు. రైల్వేలో ఇంజనీరు. యుద్ధకాలంలో మొదట్లో కెప్టెన్ పదవిలో ఉంటాడు. సీతారాంకి తెలుసు. 'ముక్కుసూటిగా పోతాడు. తన సొమ్ము అయినట్లు దమ్మిడీ దగ్గర నుంచి లెక్కపెడతాడు గవర్నమెంటు డబ్బు' అని సీతారాం సుభకు చెపుతాడు, అంతకు ముందే అతను ఆమెకు తెలుసని తెలియక. 'వాళ్ళింట్లోనూ వీళ్ళింట్లోనూ తల్లి నీళ్ళ బిందెలు మొయ్యటం, వంటలక్క పని చెయ్యటం, ఇతను అక్కడ ఇక్కడ వారాలు చేసుకుని చదువుకోవటం' అనే సమాచారం కూడా అతని వల్లే సుభకి తెలుస్తుంది. జగన్నాథరావు పనిలో చాలా నేర్పరి. తన పనేదో తను చేసుకుపోతాడు. కళలలో సునిసితమైన పరిశీలనతో కూడిన ఆసక్తి. వృత్తి అంటే అంకిత భావం. సుభ అంటే ఇష్టమయినా, వాళ్ళ అంతస్తు దృష్ట్యా, సుభ తనపై చూపించే భావాలలో స్పష్టత లేకపోవటంవలన, భావప్రకటనలో తనకు సహజమైన బెరుకువల్ల.. ఆ ఇష్టాన్ని స్నేహం దశలోనే ఉంచుతాడు. ఇక్కడ ఒక పరిశీలన చెయ్యవచ్చు. సుభ, జగన్నాథరావు ఇద్దరూ చిన్నతనంలో కటిక పేదరికాన్ని, జీవితంలో, తల్లితండ్రుల్లో, కుటుంబంలో ప్రేమరాహిత్యాన్ని.. కరుకుదనాన్ని చవిచూసినవాళ్ళే. ఏదెటువచ్చినా సరే నా నిర్ణయం ఇదే అని ఘంటాపథంగా చెప్పగలిగే స్థైర్యం ఇద్దరికీ లేదు. సుభకు తనదైన ఒక జీవనశైలిని ఏర్పరచుకోవాలని ఉంటుంది. ముఖ్యంగా రాజకీయంగా తల్లి, చెల్లి, తండ్రి ఎవరి పంథా వాళ్ళకు ఉండటం, తన పంథా ఇది అని తను తేల్చుకోలేకపోతున్నానని అనుకుంటుంది. క్విట్ ఇండియా పోరాటంలో పాల్గొనాలని ఉంటుంది. గాంధీగారి అహింసా సిద్ధాంతానికి కట్టుబడాలనుకుంటుంది. స్వాతంత్ర్య పోరాటంలో తనవంతుగా ఏదో ఒకటి చేసి జైలుకి వెళ్ళాలని బలంగా ఉంటుంది సుభకి. దానికోసం వంతెనలు కూల్చేయటం, రైల్వే లైనుల క్రింద ఫిష్ ప్లేట్లు పీకటంలాంటివి చెయ్యాలనుకుంటుంది. అందులో జనప్రాణ నష్టం ఉంటుందని, ప్రాణ నష్టం లేకుండా పనిజరిపి, తనను జైలుకు పంపే కార్యక్రమానికి సీతారాంని పురమాయిస్తుంది. జనార్ధనరావు ఇటువంటి పనులలో తోడ్పడడని తెలిసిపోతుంది ఆమెకు. మిగతా అన్ని విషయాలలో జనార్ధనరావును ఎంతో ఇష్టపడుతుంది. కానీ అతని రాజకీయ తటస్థత, తనంటే అతనికి ఉన్న ఇష్టాన్ని ప్రకటించటానికి అతని తటపటాయింపు చూసి అసలు వివాహనికి శారీరకమైన ఆకర్షణ ఉండాలా వద్దా అనే మీమాంసలో పడుతుంది. అటువంటిది తమ మధ్య ఉందా అని అనుమాన పడుతుంది. యుద్ధకాలంలో ప్రపంచం అల్లకల్లోలమై, ప్రజలు అష్టకష్టాలు పడుతుంటే తను ప్రేమ, వలపు, మోహం అని ఆలోచించటం ఏమిటని ప్రశ్నించుకుంటుంది. కించపడుతుంది. సుభ అదృష్టం శాంతంలాంటి తల్లి ఉండటం. వాళ్ళున్న కాలం నుంచీ ఎంతో ముందుకు వెళితే కాని తల్లి, అవసరమైనప్పుడు కూతుళ్ళకు శారీరక, మానసిక స్థైర్యాన్నివ్వటం అనేదాన్ని ఊహించుకోలేము. "ఒకరి మనసు ఒకరు కొంతవరకైనా పూర్తిగా అర్ధం చేసుకున్నాం– అనే విశ్వాసం కలిగి పెళ్ళిచేసుకున్న తరువాత లైంగిక సంబంధమైన చిక్కులు సులువుగానే సర్దుకుంటాయి తల్లీ! పెళ్ళి నిశ్చయం చేసుకునే ముందు మాత్రం ఎదుట వ్యక్తి మనసుని క్షుణ్ణంగా తెలుసుకోవటం ముఖ్యం. అది మాత్రం మర్చిపోకు తల్లీ!' అని శాంతం సుభకు చెపుతుంది. తరువాత సుభ జనార్ధనరావును పెళ్ళి చేసుకుంటుంది. సృష్టిలో సాధారణంగా తన బాగోగులకంటే కూడా ముందు పిల్లల బాగోగుల గురించి ఆలోచించేది తల్లి. పాతతరంలో తల్లులకు పిల్లలకు సలహా ఇచ్చేంత అవగాహన సాధారణంగా ఉండేది కాదు. ఇప్పటికాలంలో పిల్లలు, తల్లిదండ్రుల సలహాకంటె, సాటివారిలో వారి స్థానానికి ఎక్కువ విలువ ఇస్తున్నారు. కారణాలు ఏవైనా, శాంతంలాంటి తల్లిని ప్రేమించి, ఆదర్శంగా తీసుకుని.. జీవితాన్ని మలచుకున్న సుభ అదృష్టవంతురాలు.

**లక్ష్మి:**

సుభ చెల్లెలు లక్ష్మి. ఒక స్వేచ్ఛాపూరితమైన వాతావరణంలో పెరిగింది. తల్లితండ్రుల నుంచి స్వతంత్ర ఆలోచనలు, వైదుష్యం పుణికి పుచ్చుకుని.. చదువుతో వాటిని మేళవించుకుని తన స్వంతమైన భావాలను చాలా చిన్న వయసులోనే అలవరచుకుంది. ఏదైనా నిర్ణయించుకునే ముందు తన గతజీవితం తాలూకు బరువు ఆమెపై లేదు. పెళ్ళితో సహా అన్ని విషయాల మీద భీతిలేని ఖచ్చితమైన అభిప్రాయాలు ఆమెకున్నాయి. సుభ జనార్ధనరావును ఇష్టపడి, అతని నుండీ ఏ విధమైన భావ ప్రకటన రాకపోవటంతో తికమక పడుతున్న సమయంలో.. వరూథినిలా నువ్వే ముందు నీ ప్రేమను తెలియచేస్తే ఏమిటి తప్పని అడుగుతుంది. చదువులో, ఉద్యోగంలో, ఆశయాలలో ఎక్కడా రాజీపడని మనస్తత్వం. ధనం, పురుషుల మెచ్చుకోళ్ళు ఇలాంటివాటికి ఆమె కట్టుపడదు. నాకు నచ్చినవాడు దొరికి, పెళ్ళి చేసుకోవాలని అనిపిస్తేనే చేసుకుంటాను. లేకపోతే ఒంటరిగానే ఉంటాను అని

చెపుతుంది. పుస్తకం పూర్తయేసరికి లక్ష్మి ఇంకా అవివాహితే. ఇదికూడా... ఈ కాలంలో చూస్తున్న పరిణామమే. శాంతం పాత్రను ఇంత ఉదాత్తంగా తీర్చిదిద్దిన రచయిత... ఒక సందర్భాన్ని ఇలా చిత్రించారు.

లక్ష్మి, 'అమ్మా, నిన్నో సూటి ప్రశ్న అడుగుతా, నాన్నని ప్రేమించి, కామించి పెళ్ళి చేసుకున్నావు. మరి నాన్న ఇంతలా మారిపోతాడని నీకు ముందే తెలిసుంటే, నాన్నను పెళ్ళి చేసుకునుందువే? అని అడిగింది.

'మరి నేనూ మారిపోయాను కదుటే' అంటుంది శాంతం. 'అది నేను నాన్నని అడగవలసిన విషయం. నువ్వు దాటెయ్యకు' అంటుంది లక్ష్మి. అమ్మ మెల్లగా చెపుతుంది, 'ఆనాడు తెలిసుంటే చేసుకోకపోయుందునే' అని. 'మారిపోయాడుగా అయినా నాన్నంటే నీకింకా ప్రేమేనా' రపీమని అడుగుతుంది లక్ష్మి. అమ్మ అంది..' ఆ. ప్రేమే. కాని ప్రేమ ఎన్నిపాళ్ళో, ప్రణయం ఎన్నిపాళ్ళో – స్పష్టంగా నాకే తెలియటంలేదంటే నమ్మండి!' 'అమ్మ కడుపులోంచి వస్తున్న మాటలలో నిజాయితీ ఖంగుఖంగున మోగుతోంది. కళ్ళల్లో సత్యం జ్యోతై వెలుగుతోంది. అమ్మ ఏదో బాధపడుతున్నట్టనిపించింది.' అనుకుంటుంది సుభ. పిల్లల్ని తీసుకుని కాశ్మీరు పారిపోయిన తరువాత మళ్ళీ కలుసుకున్న శాస్త్రి, శాంతంల మధ్య మళ్ళీ ఎప్పుడూ పెద్దగా అభిప్రాయ భేదాలు వచ్చినట్టు చూపించలేదు. కాని ఎవరిధోరణి వాళ్ళదిగానే ఉన్నారు. శాంతం ఏ కారణాలవల్ల ఇంట్లో నుండి వెళ్ళిపోయిందో ఇవేమీ సరి అవలేదు తరువాత కూడా. శాస్త్రికి సంపాదన ముఖ్యం. భోజనం ముఖ్యం. సంఘంలో గౌరవం ముఖ్యం. ఇవి ఎలా వచ్చాయి? ఎలా రావాలి? అనే దాని మీద ఖచ్చితమైన అభిప్రాయాలు లేవు అతనికి. పెళ్లికి ముందు మూడు సం.లు చూసినా ఇవేమీ శాంతానికి తెలియలేదు. ఆ వయసులో ప్రణయం ముఖ్యం. దాని నుంచి ప్రేమ వస్తుందని అప్పటికీ ఇప్పటికీ చాలామంది నమ్మకం. ఆశయాలు ఆలోచనలూ కలవని బంధంలో ప్రేమ పాలు తగ్గుతుందని తెలుసుకున్న శాంతం సుభకు, 'పెళ్ళి నిశ్చయం చేసుకునే ముందు మాత్రం ఎదుట వ్యక్తి మనసుని క్షుణ్ణంగా తెలుసుకోవటం ముఖ్యం. అది మాత్రం మర్చిపోకు తల్లీ!' అని చెబుతుంది. 1993లో వచ్చిన విక్రమ్ సేథ్ నవల, 'సూటబుల్ బోయ్' ఎన్నో విధాల, 'అతడు–ఆమె'ను పోలి ఉంది. ఇందులో లతా మెహ్రా, సుభలాంటి సందేహాలలో చిక్కుకుంటుంది. కాకపోతే దాదాపు వెయ్యి పేజీల ఈ పుస్తకంలో శాంతంలాంటి పాత్ర లేదు. పెళ్ళి విషయంలో కళవెళపడే ప్రతి అమ్మాయి తెలుసుకోవలసిన పాత్రలు, సుభ, లక్ష్మి, శాంతం, లతా మెహ్రా. 1950 తరువాత స్త్రీ, పురుష సంబంధాలను, మనోభావాలను విశ్లేషిస్తూ, వీటిని ప్రధానాంశాలుగా తీసుకుని రచనలు చేసిన రచయిత, రచయిత్రులను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావితం చేసిన భావితరపు నవల 'అతడు–ఆమె'. రచయిత డా. ఉప్పల లక్ష్మణరావు గారు చిరస్మరణీయులు.

**జయశ్రీ అట్లూరి - యునైటెడ్ కింగ్‌డమ్**

---

కాకినాడలో మెడిసిన్ చదివి ఇంగ్లండ్‌లో ఫోరెన్సిక్ సైకియాట్రిస్ట్‌గా స్థిరపడిన నిమ్మగడ్డ శేషగిరికి యాత్రలన్నా, జీవితమన్నా అంతులేని పిపాస. గత పాతికేళ్లుగా ప్రపంచమంతా విస్తారంగా పర్యటించారాయన.




"...ఒక మలుపు తిరిగీ తిరగగానే పచ్చటి పైకప్పు ఉన్న చిట్టి కట్టడం కనిపించింది. దాని గోడ మీద ఇబ్న్ బటూటా యాత్రామార్గాల చిత్రపటమొకటి అమర్చి ఉంది. ఆ ప్రదేశమంతా నిర్మానుష్యంగా నా కోసమే ఎదురు చూస్తున్నట్లుగా ఉంది. ఒక మహాయాత్రికుడిని కలుసుకోవడానికి అంతకు మించిన తరుణం ఇంకేముంటుంది? యాత్ర అన్నదానిని ఒక జీవన విధానంగా మలుచుకొన్న వ్యక్తి అతను. అక్కడ నిలబడ్డ క్షణాన వర్తమాన యాత్ర చరిత్రకారుడు ఆదినారాయణ గుర్తొచ్చారు. ఇబ్న్ బటూటా సమాధి స్థలం నుంచి ఫోన్ చేసి ఆ అరుదైన ఘడియను ఆయనతో పంచుకోవాలనిపించింది. విషయం తెలుసుకొని ఆయన మహదానందపడిపోయాడు. ఫోను సంభాషణ సమయంలో నేను చూపించిన ఉత్సాహం, పొందిన ఉత్తేజం గమనించి దారినపోయే ఓ పెద్దావిడ విస్తుపోయింది. ఇబ్న్ బటూటా సాక్షిగా ఒక అపురూపమైన సంభాషణ సాగుతోందన్న విషయం ఆమె ఊహకు అందే అవకాశమే లేదు."

ఇది మొరాకోలో ఆయన పర్యటించినప్పటి సన్నివేశం.

**ఊహలకందని మొరాకో** – *ఆంగ్ల మూలం: డా. నిమ్మగడ్డ శేషగిరి, తెలుగు: దాసరి అమరేంద్ర*

*పేజీలు: 224, వెల: ₹ 200/- ప్రతులకు: అనల్ప ప్రచురణలు, హైదరాబాద్. ఫోన్: 981 898 2614.*

## తాళ్లపాక కవులు :

# రసవాదము

*– గూడూరు యానాదిరాజు*

ఉత్తర భారతంలో నాథ సంప్రదాయము వైష్ణవ భక్తిగా, రామోపాసన, సూఫీ ప్రేమ తత్త్వాలకు గుర్తై ఒక గొప్ప భక్తి ఉద్యమగా పరిణమించింది. నాథ సంప్రదాయ ప్రభావం ఆనాటి తత్త్వ కవుల మీద, ఆ తరువాత కబీరువంటి భక్త కవుల మీద పడింది. యోగసాధన ప్రధానంగాగల నాథ సంప్రదాయం పూర్వం తెలుగు ప్రాంతాలలో బాగా వ్యాపించింది. అలాగే తాళ్లపాక కవులపై కూడా నాథ సంప్రదాయ సిద్ధుల ప్రభావం ఉంది. భక్తి, సమాజ దర్శనం, ఆధ్యాత్మ శృంగారంవంటివి ఎన్నో తాళ్లపాక కవుల రచనల్లో స్థానం సంపాదించుకున్నట్లే నాథ సంప్రదాయఛాయలు ఉన్నట్లు కన్పిస్తాయి.

అన్నమయ్య కీర్తన.... 'ఆహా వేంకటాద్రి నాథురే' (తాళ్లపాక కీర్తనలు – వ్రాత ప్రతి పుట. 92 పేజీ 39-40)లో ఉత్తర భారతదేశం నుండి తెలుగు దేశానికి వ్యాపించిన నవనాథ సిద్ధుల సంప్రదాయానికి చెందిన ఇతివృత్తమున్నట్లుంది. ఈ కీర్తనలో అన్నమయ్య వేంకటేశునిలో నవనాథులను దర్శనం చేస్తున్నట్లుంది. గోపబాలుర బాల్య క్రీడల సమయంలో బాలకృష్ణుడు శివుడివలె కనిపించాడని చెబుతూ... భాగవతం దశమ స్కంధములో సీ॥ 'తనువుననంటిన ధరణీపరాగంబు పూసిన నెరిభూతి పూతగాగ' అంటూ బాలకృష్ణుని క్రీడలను, లీలలను వర్ణించాడు పోతన. అలాగే ఈ కీర్తన మొదటి చరణం... 'ధవళ కర్పూర భూతి ధారా ధరురే... । పవనాశనాద్రిపాల – పాలితురే' అని మరోచోట... ఆదినాథ... అని సంభోదించడంలో అన్నమయ్య భక్త్యాతిశయమైన అనుభూతిలో వేంకటేశునిలో నవనాథులను – ఆదినాథుడైన శివుడిని దర్శించినట్లు భావించవచ్చు. ఇదే కీర్తన చివరి చరణం 'సిరినాథు...తో ప్రారంభించి 'అభినవ కాళీ తాండవ కారురే / ఆదినాథ పరమానంద సింధురే / భూధారా ధమరే భుజగశయనురే' అంటూ చివరిపాదం 'ఆహా థిమికిట తంగిణి థిమికిట తాండవకరురే' పద సంచలనంతో కీర్తన ముగించాడు అన్నమయ్య. తాళ్లపాకలో కొలువున్న కేశవుడు గోరక్షనాథుడైన శ్రీకృష్ణుడే. ఈ కృష్ణుడే తాళ్లపాక సుదర్శన చక్రాలయమునందు బాల్యంలో చిన్ని కృష్ణుడిగా దోగాడుతూ ఉన్నాడు. ఆ బాలకృష్ణుడు అనే నర్తకుడు కాళీయుని పడగలు అనే విశాల మంటపం మీదికెక్కి నాట్యం చేశాడు. బాలకృష్ణుడి కాలికున్న పసిడి అందెల శబ్దం వేద ధ్వనిలా ఉందని అంటారు. అలాగే సిద్ధులు ధ్యానించే తాళ్లపాక సిద్ధేశ్వరుడు కూడా ఆదినాథుడైన శివుడే. శివుడు సాయం సమయంలో తన తాండవ నృత్యం ప్రదర్శించేవాడని భరతముని తన నాట్యశాస్త్రంలో పేర్కొన్నాడు. సకలమునులు, సిద్ధులు, సాధ్యులు, దేవతలు, దేవర్షులు, గంధర్వులు, వంశీనాదంతో శ్రీకృష్ణుడు, ఢక్కానాదంతో శివుడు చేస్తున్న మనోహరమైన నాట్యవిలాసాన్ని, ఆనంద తాండవాన్ని తిలకించారట. వీరి అభినయాలే విశ్వకల్యాణ కారకాలని వేదాలు చెబుతున్నాయి.

కొత్తదైన నృత్యరీతులతో కూడుకున్న ఉద్ధతమైన స్థానంకలవాడా! కృష్ణా... తాండవ నృత్యం చేసే ఆదినాథుడా! పరమానంద సముద్రమా! అని అన్నమయ్య అనడంలో ఔచిత్యం ఉంది. సముద్రము సిరి జన్మస్థలము. ఆమె నివాసం సిరినాథుని వక్షస్థలము. అతని పాన్పు శేషుడు. వీరి ఆవాసము సముద్రము. నానా దేశాలలో సంచరించు నాథసిద్ధులకు నదీ జలాలకు సముద్రమువలె గమ్యుడొక్క ఆదినాథుడే. భుజగశయనుడైన సిరినాథునిలో ఆదినాథుని అన్నమయ్య దర్శించిన తీరు ఈ కీర్తనలలో చెబుతున్నట్లుంది. యజుర్వేదంలో 'శివాయ విష్ణు రూపాయ శివరూపాయ విష్ణవే'... అన్న శ్లోకార్థంలోని శివ కేశవ అభేద తత్త్వం చాటే విధంగా సంగీత, నృత్య సంప్రదాయాలకు చెందిన భక్తితత్త్వ సమన్వయమును తన పదాలలో ఉటంకించినట్లున్నాడు అన్నమయ్య. మరోకీర్తన... పల్లవి 'శ్రీ వేంకటాద్రి నాథురే'తో ప్రారంభించి, చివరి చరణం 'మచ్చేంద్ర కూర్మ రజతాచల సింగినాదం / మోదా(?)మల స్ఫటిక బంధ వామభాగం / శ్రీరామ చరణ తారక మంత్ర సిద్ధం / గోరక్కనాథ జనితామల సిద్ధ రాజం' అని చెప్పాడు అన్నమయ్య. (తాళ్లపాక కీర్తనలు – వ్రాతప్రతి పుట 90 పేజి. 309)

రామాయణము నందు రామరావణ సంగ్రామ సమయంలో సూర్యవంశస్థుడైన రాముడు ఆర్థిక సంక్షోభం ఎదుర్కొన్న పరిస్థితులలో అగస్త్యునిచే ఉపదేశించబడినట్లు చెప్పబడుతున్న ఆదిత్య హృదయము నందు రసవాద విద్య భాగమై ఉన్నది. సూర్యభగవానుణ్ణి సువర్ణ సదృశుడిగాను, హిరణ్య రేతసుడిగాను నుతించింది ఆదిత్య హృదయం 'శివకేశవులు వామభాగంలో తమ సతులకు

సమున్నతస్థానమిచ్చారు. ఆదిదంపతుల అన్యోన్య దాంపత్యం శుద్ధ పవిత్ర బంధంగా దేవతలకు లోకులకు ఆదర్శమైంది. పార్వతీదేవి కోరిక ననుసరించి ఈశ్వరుడు విష్ణుసహస్రనామాలలోకెల్ల రామనామం - (తారకమంత్రం) మహిమ ఉపదేశించాడు.

నాథయోగులలో ఆదినాథుడు మత్స్యేంద్రనాథ్ సాగరంలో చేప కడుపులో దాక్కుని ఉండి, కూర్మంలా నిశ్చలంగా ఉన్న వెండి కొండ మీద శివుడు పార్వతికి చెవిలో చెప్పిన జ్ఞానోపదేశాన్ని విన్నాడు. అతడు ఆ జ్ఞానాన్ని గోరఖ్‌నాథకు చెప్పేడు. గోరఖ్‌నాథ ఆ జ్ఞాన సిరిని నలుదిశలా వ్యాపింపజేశాడని అంటారు. నాథ సంప్రదాయ ప్రవర్తకులలో పేరుగాంచిన మత్యేంద్రనాథ్, గోరఖ్‌నాథ్, శివపార్వతి దంపతులు స్మరించుకుంటున్న మర్మమైన రామతారక మంత్రం గ్రహించారు. దాని మహిమతో వారు సిరిని సిద్ధింపజేసుకొన్న విధం అన్నమయ్య తన పద ప్రయోగంలో తేటపఱచుచున్నట్లుంది.

అన్నమయ్య వైష్ణవ సిద్ధులగు నవనాథులను, శైవ సిద్ధులగు నవనాథులను కలగలిపి ధ్యానించాడా! అనిపిస్తుంది. శైవ సిద్ధులగు నవనాథులవలె వైష్ణవ సిద్ధులగు నవనాథులు కూడా ప్రసిద్ధులని కోరాడ రామకృష్ణయ్య తన నవనాథ పీఠికలో చెప్పాడు. అన్నమయ్య సిరినాథునిలో నవనాథులను దర్శిస్తే... వైష్ణవ నవనాథులు సిరినాథుని వక్షస్థలాన నివాసమున్న సిరిని ధ్యానిస్తూ రసవాద విద్యను అభ్యసించి, దానిలో అద్వితీయమైన ప్రతిభ కనపర్చి ఉన్నారు. చిన్నన్న రచించిన అన్నమాచార్య చరిత్ర కూడా ఈ విషయానికి బలం చేకూర్చిందని చెప్పవచ్చు. వీరే చిన్నన్న పేర్కొన్న నవనాథులు.

'సిరిగొల్చు నవనాథ సిద్ధులు మున్ను / పరుసంబు రససిద్ధి బడసినచోటు' అంటూ తాళ్లపాక గ్రామం ఘనతను చాటి చెపుతున్నాడు చిన్నన్న. ఈ ప్రాంతంలో రసవాద విద్య ప్రచారంలో ఉండినట్లు ఇక్కడ నుండే నవనాథులనే సిద్ధులు ఈ విద్యను నేర్చుకొన్నట్లు తెలుస్తోంది. అందుకు తాళ్లపాక సమీపంలో పడమరవైపు సిద్ధులయ్య గుట్ట, దాని క్రింద సిద్ధులపల్లె, ఉత్తరం వైపు చెయ్యారు ఒడ్డున హేమాద్రివారి పల్లె ప్రతీకలుగా నేటికి నిలిచి ఉన్నాయి.

**సిద్ధుల(య్య)గుట్ట - సిద్ధులపల్లె**

సిద్ధి అంటే నెరవేరడం, అభీష్టసిద్ధి, ఇష్టసిద్ధి, మంత్రసిద్ధి అనే అర్థము చెప్పుకోవచ్చు. సిద్ధులు అంటే ఎవరు? వీరు పైకి మిరుమిట్లు గొలిపే శరీర ఆకర్షణతో ఉండక పోవచ్చు. కానీ లోపల పరమానందభరితులై ఉంటారు. సిద్ధులు దేహ ప్రదర్శన పైన మనస్సు పెట్టకున్నా వారిలో ఒకరకమైన తేజస్సు ఉంటుంది. వారి యోగ శక్తివల్ల ఓజస్సు మెదడును చేరి స్థిరంగా ప్రకాశిస్తుంది. ఓజస్సు అంటే జీవశక్తి. సిద్ధులు తమలోని జీవకాంతి దేహానికి సోకేదాకా వదలిపెట్టరు. కాబట్టి సిద్ధుల విషయంలో సిద్ధి అంటే మోక్షము. ఆధ్యాత్మిక పరిపూర్ణత్వం పొందిన సిద్ధులు శివునికి జీవుడికి మధ్య అభేదాన్ని చేసే సామర్థ్యం (జీవశక్తి) పొందుతారు. ఆశక్తితో సిద్ధులకు ముక్తి సిద్ధిస్తుందని ప్రతీతి. అంటే హఠయోగ సాధనలో శివునితో శక్తి సంయోగము అనేది సాధనకు పరాకాష్ఠ. అదే అద్వితీయ బ్రహ్మానంద స్థితి, కైవల్యావస్థ. సిద్ధ సంప్రదాయం ప్రకారం సిద్ధులను వజ్రయానులంటారు. శివాద్వైత సత్తాను అంగీకరిస్తూ శివశక్తిని ఆరాధించిన వజ్రయాన సిద్ధులు 13వ శతాబ్దారంభంలో సిద్ధ సంప్రదాయము నుండి విడివడినాథ సంప్రదాయాన్ని నెలకొల్పారు. ఆదినాథుడైన జలంధరుడు, అతని శిష్యుడైన అలఖ్ నిరంజన్ స్వామి మర్మయోగి మత్స్యేంద్రుడు, అతని శిష్యుడు శివాద్వైత సిద్ధుడు హఠయోగి గోరఖ్‌నాథుడు నాథ సంప్రదాయానికి ప్రవర్తకులు. వీరిది హఠయోగం. నాథ సంప్రదాయం నందు శక్తి శివుని శక్తియే. శక్తి అనగా శివుడే అని సిద్ధ సిద్ధాంతము. నాథ సంప్రదాయమునందు రసవాద సమాదరము, మంత్ర లయ హఠ రాజయోగ భేదనాడి సాధనము, యోగ మార్గ శివ ధ్యానము, శివశక్త్య భేదము, శివజీవాభేదము, శివ రూప బ్రహ్మము, శివ మార్గ మోక్షము, మర్మ కవిత్వము మొదలైన విశేషములు కలవు. కబీరు భక్తిమార్గంలో సిద్ధనాథ సంప్రదాయాలలోని తాత్త్విక ధోరణులు, సాధనా ప్రక్రియలు అన్నీ దాదాపు చోటు చేసుకొన్నాయి. హఠయోగంలోని అనేక విషయాలు కబీరువాణిలో ఉన్నాయి. మొదట హఠయోగ సాధనకు ప్రాముఖ్యమిచ్చినా తదనంతర కాలంలో కేవలం స్మరణ, ధ్యానం, ధారణ, సమాధివంటి సరళమైన సాధనా పద్ధతులకు ప్రాధాన్యతనిచ్చాడు కబీరు. కబీరుకు వైష్ణవాచార్యుడైన రామానందుడు గురువు. స్వయంగా ఆ రామానందుడే అద్వైత వాదం, విశిష్టాద్వైత వాదంతోపాటు యోగవిద్యలో కూడా శిక్షణ పొందినట్లు చరిత్ర చెబుతూంది. అన్నమయ్య కూడా శ్రీరామానుజుల విశిష్టాద్వైత మార్గానుయాయి. 15వ శతాబ్దంలో కబీరుకు సమకాలికుడైన భక్తి కవి అన్నమయ్య కూడా ఆనాటి నాథ సిద్ధుల సంప్రదాయ స్ఫూర్తిని పొంది ఉండవచ్చు. నాథ సంప్రదాయంలో శివుడు ఆదినాథుడైతే నవనాథులు

ప్రవర్తకులు. మహాశివుడి అంశలో జన్మించిన మత్స్యేంద్రనాథుడు ఆ మహాదేవుడి గురుత్వంలో అధ్యాత్మిక విద్యను అభ్యసించాడు. దేశ సంచారం చేస్తూ ఎన్నో తీర్థయాత్రలు తిరిగి ఎనిమిదిమందిని శిష్యులుగా స్వీకరించాడట. ఆ నవనాథులపేర్లు.... మత్స్యేంద్రనాథుడు, గోరక్షనాథుడు, నాగార్జున నాథుడు, చౌరంగి నాథుడు, మేఘనాథుడు, విరూపాక్షనాథుడు, ఖణిక సిద్ధుడు, బుద్ధి సిద్ధుడు, వ్యాళి సిద్ధుడు. (గౌరవ నవనాథచరిత్ర)

ఈ నవనాథసిద్ధులు పూర్వం తాళ్లపాక దగ్గఱ ఒక గుట్ట మీద యోగశక్తి మార్గంలో శివ ధ్యానం చేసుకొనేవారట. ఆ గుట్ట తాళ్లపాకకు పడమరవైపు ఉంది. సిద్ధనాథ సంప్రదాయానికి శివుడు ఆదినాథుడు. ధ్యానములలో శివుని ధ్యానమే పరమావధిగా జీవించేవారట. వారు నివసించిన గుట్టను సిద్ధులయ్య గుట్ట అని ఇప్పటికీ పిలుస్తుంటారు. ఇక్కడ మారేడు, జమ్మి, వేప మొదలైన వృక్షాలు విరివిగా ఉండేవట. ఆ గుట్ట క్రింద ఉన్న పల్లెను సిద్ధుల పల్లె అని పిలుస్తారు. ఆ సిద్ధులే పూర్వం తాళ్లపాకలో శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగాన్ని ధ్యానించినందున ఆస్వామికి సిద్ధేశ్వరస్వామి అని పేరు ఏర్పడినట్లు స్థల పురాణ కథనం.

### హేమాద్రివారి పల్లె

బంగారానికి – స్వర్ణం, హిరణ్యం, హేమం, పుత్తడి, పసిడి వంటి ఎన్నో అర్థాలున్నాయి. పరుసవేది అంటే ఇనుమును బంగారంగా మార్చే ఒకరసశిల. దీనినే స్పర్శమణి, స్పర్శవేది అని కూడా అంటారు. రసశిల అంటే రసవాదం సంబంధమైన రాయి. రసవాదం ప్రసక్తి ప్రాచీన కాలం నుండి ఉంది. రసవాదం అంటే తక్కువ జాతి లోహాలను బంగారంగా మార్చే విద్య. పొత్తపినాడు ప్రాంతంలో కూడా పూర్వకాలం నుండి రససిద్ధి విద్య ప్రచారంలో ఉందని చరిత్ర చెపుతుంది. ఈ ప్రాంతం ప్రాచీనాంధ్ర కవులు నాచనసోమన, అన్నమయ్య సాహిత్యంలో కూడా పరుసవేది ప్రస్తావన ఉంది. రసవాద గురించి వేమన అనేక పద్యాలలో ప్రస్తావించాడు. రసవాదమును హేమకారక విద్య, గుప్తవిద్య అంటారని వేమన అభిప్రాయము. హేమకారక విద్య కృష్ణ యజుర్వేదమునందలి శ్రీసూక్తమునందు విపులీకరించబడి ఉన్నది. బంగారానికి వేదకాలంనాటికే ప్రాచుర్యం ఉండడానికి హిరణ్యవర్ణాం హరణీం సువర్ణరజత స్రజామ్ అంటూ మొదలయ్యే శ్రీసూక్తం గట్టి ఆధారం. రసవాద విద్యపై అనేకమంది చేసిన రచనలు బహు గోప్యమై అనుభవజ్ఞులైన రసవాదులకు మాత్రమే అవగాహన అగునట్లు ఉన్నవి. హేమకారక విద్యలో నవనాథ సిద్ధులు ప్రవీణులు. గోరఖ్‌నాథ్ రసవాదములో అద్వితీయ ప్రతిభ కనపర్చి ఉన్నారు. నాగార్జుననాథ్ కూడా రసవాద ప్రవీణుడై దేశవిదేశాలలో విజ్ఞానం వ్యాప్తి చేశాడట. విద్యారణ్యుడు రసవాదమందు విజ్ఞాన ప్రవీణుడై విజయనగర సామ్రాజ్య స్థాపనకు ఆర్థిక సహకారం అందించాడు అని చరిత్ర చెపుతుంది. పొత్తపినాటి ప్రాంతంలో 'సిరుల పట్టు గొమ్మై తాళ్లపాక చెన్నొందు' అని చిన్నన్న చెప్పడం... ఆనాడు సిరిసంపదలకు నిలయమైన తాళ్లపాక సంపన్నమైన, పవిత్రమైన ప్రదేశంగా ప్రసిద్ధికెక్కినట్లు తెలుస్తోంది. మధ్య యుగం ప్రారంభంలో ఔత్తరాహ సంప్రదాయమైన నాథ పంథా తెలుగుదేశంలో వ్యాపించింది. సిరి కొలిచే అంటే రసవాదం సమాదరించే నాథ సంప్రదాయానికి చెందిన తొమ్మిదిమంది సిద్ధులు ఇనుము మొదలైన లోహాలను బంగారంగా మార్చే రససిద్ధి విద్యను తాళ్లపాక గ్రామంలోనే అభ్యసించారని అంటున్నాడు చిన్నన్న.

తాళకం, మైలతుత్తం, యింగులీకములను క్రమపద్ధతిలో పుతం వేసినచో బీజము వచ్చును. ఈ హేమవర్ణము కలిగిన బీజమును రసవాదమునకు ఉపయోగించేవారట. తులసి రసము, చనుబాలు ఆకు అను ఔషదీ రసం, తాజంపు పాలు, జెముడుపాలు, పాదరసము, రాగి మొదలైన రసవాద ద్రవ్యాల సమ్మేళనంతో రసాయనిక చర్య ద్వారా తక్కువ జాతి లోహాలను బంగారంగా మార్చవచ్చునని అంటారు. ఈ పదార్థాలన్నీ ఇక్కడ పుష్కలంగా లభించేవట. పొత్తపినాటి ప్రాంతంలో హఠయోగంతో కోరికలను సిద్ధింపజేసుకొనే సిద్ధులకు బంగారం మీద అధికమైన కోరిక ఉండేదట. వీళ్లు తాళ్లపాక గ్రామం ఉత్తర దిక్కున చెయ్యేరు ఒడ్డున ఉన్న హేమాద్రివారి పల్లెలో ఈ విద్యను క్రమపద్ధతిలో ప్రయోగించి, ఇనుమును బంగారంగా మార్చేవారట. అందువల్లనే ఈ పల్లెకు హేమాద్రివారి పల్లె అని పేరు స్థిరపడింది. వేమనకు నాథ సిద్ధులతో సంబంధమున్నది. ఈ ప్రాంతములో సంచరించిన యోగి వేమన కూడా ఒక సిద్ధుడి దగ్గరే ఈ రసవాదం – గుప్తవిద్యను అభ్యసించాడని ప్రతీతి. వేమన 'ఇహమున సుఖింప హేమతారకవిద్య/పరమున సుఖింప బ్రహ్మవిద్య'... పద్యం చెప్పాడు. పొత్తపినాటి ప్రాంతాన్ని గురించి 'సిరులింకనేమని చెప్పంగవచ్చు' అని చిన్నన్న చెప్పడంతో... ఆనాటి తాళ్లపాక గ్రామం సంపద వర్ణించడానికి వీలుగానంత గొప్పదని అనుకోవాలి. మి

గూడూరు యానాదిరాజు - ఫోన్: 970 185 7260.

# మనోధర్మ సంగీత సాధనలో మెళకువలు

– మల్లాది సూరిబాబు

సంప్రదాయ సంగీతం అభ్యసించే విద్యార్థులకు ఎదురయ్యే ముఖ్యమైన సమస్య... మనోధర్మం. మనసులో అప్పటికప్పుడు సంగీత కచేరీలో పాడవలసిన రాగం, నెరవు, స్వరకల్పన ఈ మూడూ మనోధర్మంలో ఉండే అంశాలు. గురుముఖంగా తగినన్ని కృతులు పాఠం చేసిన తర్వాత, రాగాలాపన కూడా గురువు సహాయంతో ప్రయత్నం చేయవలసిన సాధన ఇది. వర్ణాలలో రాగం ఉంది. కృతులలోనూ రాగం ఉంది. మధ్యమకాలంలో ఉండే రాగం ఒకలా ఉంటుంది. విలంబకాలంలో నడిచే కృతులలో రాగం మరింత విస్తృతంగా, వివిధ సంచారాలతో నిండి ఉంటుంది. అంతేకాదు. స్వరజాతులలో కూడా రాగం నిండి ఉంటుంది, స్వర సముదాయంతో ఏర్పడినదే రాగం. అభ్యాస సంగీతంలో సుమారు 20 వర్ణాలు, కనీసం 50 కృతులు, సంప్రదాయ పద్ధతిలో సమర్థుడైన గురువు దగ్గర నేర్చుకొని, వినికిడి జ్ఞానం తోడైతే రాగం, నెరవు స్వరకల్పనలాంటివి ప్రయత్నం చేస్తే మనసుకు పట్టే అవకాశముంది. తాళం లేకుండా పాడితే రాగం, తాళంతో పాడితే కీర్తన. రాగం వేరు, కీర్తన వేరు కాదు. కీర్తన చుట్టూ లేదా వర్ణం చుట్టూ పడుగు, పేకలా రాగం ఆవరించుకొని ఉంటుంది.

చేతివ్రాత (హ్యాండ్ రైటింగ్) అంటే చేతి దస్తూరి కుదరటానికి ఒకప్పుడు కాపీలు వ్రాయించేవారు. అలా క్రమంగా వ్రాయగా అచ్చులాంటి వ్రాత అలవడుతుంది. అలాగే నెరవును 5, 6 రకాలు మారుస్తూ పాడుతూ పాడిస్తే అలవాటవుతుంది. అలా విడమరచి పాడే గురువుని ఆశ్రయించాలి.

వర్ణాలలో చరణాలకు 4, 5 రకముల స్వరాలు అమర్చబడి ఉంటాయి కదా – అదే ధోరణిలో స్వరకల్పనను మనోధర్మంతో పాడిస్తే స్వరాల అమరిక ఎలా ఉంటుందో గ్రహించి పాడే మార్గం కనిపిస్తూ ఉంటుంది. వర్ణాలలో సాహిత్యానికి ప్రాధాన్యత ఎక్కువ లేదు. అందుకే అవి 'తాన వర్ణాలు' అంటే రాగం పాడేందుకు వీలుగా తయారైనవే. రకరకాల స్వరవిన్యాసంతో రాగభావాన్ని మనసులో నిలుపుకోవటానికి నిర్దేశించబడిన రచనలు. మొక్కుబడిగా వర్ణాలు పాడిస్తే ప్రయోజనం ఉండదు – అటతాళ వర్ణాలు సరేసరి, రాగమంతా ఏకీకృతమై కళ్లకు కట్టినట్లుగా ఉండే రచనలే, ఈ అపతాళవర్ణాలు. స్వరకల్పన ఎలా పాడాలో నర్మగర్భంగా తెలియజేస్తూ ఉంటాయి.

భైరవి రాగంలో విరిబోణి వర్ణం, కాంభోజిలో సరసిజనాభ... లాంటి అనేక వర్ణాలు దీనికి సాక్ష్యం. వీటి ఆధారంగా పాడుతుంటే స్వయంగా స్వరకల్పన చేసే అవకాశం ఉంటుంది. సంగీతమూర్తి త్రయం వారి కృతులన్నీ మనోధర్మ సంగీతం వృద్ధి చేయుటానికే అవతరించిన అద్భుతమైన రచనలు. శ్యామశాస్త్రులవారి రచనలన్నీ రాగసంచారాలతో నిండి ఉన్నవే! ఏ కీర్తన అయినా చూడండి. విలంబకాల కీర్తనలుగాని, చిన్న కీర్తనలుగానీ పల్లవిలో ఉండే 4, 5 సంగతుల అమరికను గమనిస్తే చాలు. వీటిలో నెరవు కనిపించదా మరి!

కాస్త పరిశీలనాత్మకమైన దృష్టితో గమనించాలి. గురువే చెప్పగలగాలి. నేర్చుకొనే విద్యార్థి గమనించలేడు. అందుకే గురువు చిల్లగింజలాంటివాడు (మురికి నీరులో చిల్లగింజ వేస్తే మురికి వేరువడి నీరు తేటగా తయారవుతుంది). గురువు పరుసవేదిలాంటివాడు. గురువే భ్రమరము అంటారు త్యాగయ్య. "గురు లేక ఎటువంటి గుణికి" అనే కీర్తనలో త్యాగయ్య గురువు ప్రాముఖ్యతను తెలియజేశారు. మనసులో పెల్లుబికే భావం, ఆర్ద్రత, సాహిత్యంతో నిండి ఉన్న అర్థం. ఇవన్నీ రకరకాల సంగతులతో పాడినప్పుడే అర్థం, పరమార్థమునూ. అప్పుడే శ్రోతకు సాహిత్యం తోడుగా సాగే సంగీతం అందుతుంది. రంగు, రుచీ, వాసన, లేని పదార్థాలు ఎలా రుచించవో సంగీతం కూడా అంతే. అమస్వరంతో గమకయుక్తంగా లేని సంగీతం నిరర్థకం. సంగీత, సాహిత్యాలు రెండూ సమపాళ్లలో ఉండి, తాదాత్మ్య స్థితిలో పాడితేనే శ్రోతలు చుట్టూ చేరి వింటారు. సంగీత పరమార్థం ఇదే. పుస్తకాల్లో కనిపించే స్వరం వేరు. వ్రాయబడిన స్వరాన్ని (నోటేషన్) ఎలా అన్వయించుకుంటే రాగం అవుతుందో విడమరిచి చెప్పగలిగే గురువు ద్వారా ఇది తెలుస్తుంది. అసలు రాగం ఎంత పాడాలి? ఎలా పాడాలి? ఎలా విస్తరించాలి? ఎలా

ముగించాలి? షడ్రసోపేతమైన విందు ఎలా కడుపారా తినాలనిపిస్తుందో వీనుల విందుగా రాగానికుండవలసిన అన్ని లక్షణాలున్న రాగం ఎంతసేపైనా వినాలనిపిస్తుంది. 'రాగం, తానం, పల్లవి' అనే అంశం. అందుకే పుట్టింది. ప్రచారమైంది. విస్తృతంగా రాగం పాడి, తానం (తానం కూడా రాగమే) పాడి, ఒక పల్లవిని అందుకొని అందులో చిత్రవిచిత్ర విన్యాసాలతో విశృంఖలంగా పాడేవారు ఒకప్పుడు (నైనాపిళ్లై) మహావైద్యనాథ శివన్‌వంటివారు. ఎంతసేపు పాడేవారో అంతసేపూ శ్రోతలు కూర్చుని వినేవారు. మనం పాడుకొనే కీర్తనలల్లోనే రాగం ఉంది. మనం వల్లించే వర్ణాలలో రాగముంది. అలాగే స్వరజతుల్లో ఉంది. ఈ రచనల్లో రాగం ఎలా విస్తరిల్లి ఉంటుందో తెలియజేప్పే గురువువల్లనే తెలుస్తుంది. ప్రతి కీర్తనకూ, పల్లవిలో వినిపించే సంగతులు, అనుపల్లవిలోనూ, చరణంలోనూ వినిపించే సంగతులన్నీ రాగభావం కోసం తయారయ్యేవే కదా! తీగ పందిరిని ఎలా అల్లుకొని పాకుతుందో అలాగే కీర్తనను ఆశ్రయించుకొన్న రాగం కూడా విస్తరిల్లి ఉంటుంది. పల్లవిలో ఒకలా అనుపల్లవీ చరణాలలో మరో రకంగా వైవిధ్యభరితంగా, వంపుసొంపులు తిరుగుతూ అల్లుకొన్న రాగ ఖండికలను గమనిస్తే రాగం యొక్క సంపూర్ణ స్వరూపం తెలుస్తుంది. ఒకే రాగం, ఒక్కొక్క కీర్తనలో ఒక్కోలా కనిపిస్తుంది. ఈ కారణం చేతనే మహా వాగ్గేయకారులంతా ఒకే రాగంలో అనేక కీర్తనలను మనకు అందించారు.

ఈ సందర్భంలో ప్రముఖ నాదస్వర విద్వాంసుడు టి.యన్. రాజారాత్నం పిళ్లైగారిని గురించి చెప్పుకోవాలి. ఆయన నాదస్వర చక్రవర్తిగా పేరు పొందాడు. రాగాలాపనలో దిట్ట. అపారమైన మనోధర్మానికి మారు పేరు. ఆయన గ్రామ ఫోను రికార్డులో ఏడు నిమిషాలపాటు వాయించిన "తోడి రాగాలాపనను గురించి ఈ రోజుకీ చెప్పుకొంటారు. రాజారత్నం పిళ్లై అపారమైన మేథాశక్తికి ఒక రికార్డు చాలు. అలా పాడాలనీ, వాయించాలనీ అనుసరించాలనీ అనుకొనే మహా విద్వాంసులెందరో ఉన్నారు. ప్రయత్నమైతే చేశారుగాని నిశితమైన పరిశీలనతో, సూక్ష్మ బుద్ధితో అసాధారణ ప్రజ్ఞతో సాధించిన జ్ఞానం రాజారత్నం పిళ్లైది. అందుకే అటువంటి మహావిద్వాంసుల సంగీతమే మనకు ఆదర్శం.

***తినగ తినగ వేము తియ్యగనుండు***

***అనగననగ రాగమతిశయిల్లు*** అనే సామెత మనకు తెలిసినదే. చాలా కష్టమని వదిలేస్తే ఉత్తమ శ్రేణికి చెందే విద్వాంసులు ఎలా తయారయ్యారు? పునాది గట్టిగా ఉంటే భవనం పదికాలాలపాటు దృఢంగా చెక్కు చెదరకుండా ఉంటుంది.

అరియక్కుడి రామానుజ అయ్యంగార్‌ని గురించి తెలియనివారుండరు. ఇప్పటి కచేరీ పద్ధతికి ఆద్యుడు, ఆదర్శనీయమైన సంగీత శిల్పి అరియక్కుడి. ఆయన పాడిన సంగీత కచేరీలలో ఇంచుమించు నాలుగైదు కీర్తనలకు, ఉపోద్ఘాతంగా ఆయన రాగాన్ని క్లుప్తంగా పాడి మొత్తం రాగభావాన్ని చూపించేవారని ప్రతీతి. నిశితమైన దృష్టి, చక్కని అవగాహనతో సిద్ధించే విషయాలివి. భైరవిరాగంలో 'ఉపచారము చేసేవారున్నారని మరువకురా' అనే కీర్తనలో రాగానికీ, అదే భైరవిరాగంలో 'ఉపచారములను చేకొనవయ్య' అనే కీర్తనలో రాగానికి ఎంత తేడా ఉందో గమనించండి. ఒకటి మధ్యమకాలం, మరొకటి విలంబం. ఇలా ఎన్నని చెప్పగలం? రాగసంపదను పెంచడానికి కీర్తనలు పుట్టాయి. రాగానికున్న ఆకర్షణ అటువంటిది. రాగాన్ని ఆవరించిన స్వరాలకున్న సౌందర్యం అటువంటిది. ఆభరణ రూపంలో చెక్కితేనే బంగారానికి అందం. కీర్తనలు రాగభావంలో చెక్కితేనే అందంగా వినిపిస్తాయి. రాగసౌందర్యాన్ని అనుభవించాలంటే పదాలు వినాలి. రాగం ఒక ముద్దగా ఏర్పడి 'పదం' అయిందేమో అనిపించేలా ఉంటాయి పదాలు. ఇప్పుడు పదాలు పాడేవారే తగ్గిపోయారు. వెనుకటి తరంలో బృంద ముక్త అనే గాయనీమణులు ఈ పదాలు పాడటంలో సిద్ధహస్తులు. వీణ ధనమ్మాళ్, 'మాలి' (టి.ఆర్. మహాలింగం) వేణుగానం. జి.ఎన్. బాలసుబ్రహ్మణ్యం, సెమ్మంగుడి శ్రీనివాస్ అయ్యర్‌లాంటి వారందరూ సంగీత సిద్ధి పొందిన మహనీయులు. సంగీత లోకం ఆదర్శంగా భావించవలసిన విద్వాంసులు. అద్భుతమైన 'కీర్తన' పాఠాలను కైవసం చేసుకొని వాటి ఆధారంగా ఒక మానసిక రాగ సౌధాన్ని నిర్మించుకున్నవారు. ఆ రాగ సౌధానికి ఎన్నెన్నో మెట్లు మరెన్నెన్నో గదులు. తన్మయత్వంతో వారు పాడితే రాగసముద్రంలో నిలబడినట్లే మనకునన సంగీత చరిత్ర ఘనతే అది. అందుకే మన ఎదురుగా జరిగే సంగీత

కచేరీలకు వెళ్లాలి. తల్లిదండ్రులు పిల్లల్ని వెళ్లేలా ప్రోత్సహించాలి. సంగీతానికి వినికిడి జ్ఞానం అవసరం. ఈ రోజుల్లో సినిమా పాటల్ని వినీ వినీ జీర్ణం చేసుకొని పాడగలిగే బాల మేధావులెందరో వస్తున్నారు. ఏమిటి ప్రయోజనం? వారికే తెలియాలి. వినేవారున్నారు కాబట్టి పాడుతున్నారు. ఉభయులకు సంతోషం. సరే. అదలా ఉంచండి. పెద్దపెద్ద విద్వాంసులు మనోధర్మ సంగీతం వింటేనే సంగీతజ్ఞానం అలవడుతుంది. విద్వాంసులు మెచ్చేదే అసలుసిసలైన సంగీతం. కాలక్షేపం కోసం పాడే పాటల వల్ల సంగీత జ్ఞానం పెరగదు.

భగవాన్ రమణ మహర్షిని ఒక వీణా వాద్య కళాకారిణి ఓ ప్రశ్న అడిగారు. ''త్యాగరాజాది వాగ్గేయకారుల సంగీత సాధనతో భగవంతుణ్ణి చేరుకున్నారు కదా! అటువంటి సిద్ధి నాకూ ఎలా కలుగుతుందా?

''ఆ వాగ్గేయకారులు సంగీతం పాడుకొని పొందలేదు. పొందిన దానిని పాడుకున్నారు. అందుకే వారి కీర్తనలన్నీ ఈ రోజు కూడా సజీవంగా వినిపిస్తాయి. జీవంతో నిండి ఉంటాయి'' అని మహర్షి సమాధానం ఇచ్చారు. అర్థమయిందో లేదో మౌనంగా వెళ్లిపోయింది. త్యాగరాజాది వాగ్గేయకారులంతా సంగీతాన్ని ఒక తపస్సులా భావించారు. అనుభవించి పాడుకొన్నారు. నాదలోలులై బ్రహ్మానందాన్ని పొందారు. నాదమయ జగత్తులో విహరించి పాడుకొన్న ఆ కీర్తనలే ఈవేళ సంగీత లోకానికి మార్గదర్శకాలై శోభిల్లుతున్నాయి.

"న గురోరధికందైవం" సంగీతమంతా గురుశిష్య పరంపర నుండి వచ్చి ప్రచారమైనదే. మన అలవాట్లు, ఆచారాలు, కట్టుబాట్లు మొదలైనవన్నీ ఒకరి నుండి మరొకరికి ఎలా సంక్రమిస్తాయో సంగీతవ్యాప్తి కూడా అలాగే జరిగింది. సంప్రదాయ సంగీత విలువల్ని పరిరక్షిస్తూ కట్టుదిట్టమైన కీర్తన పాఠాంతరాలు విస్తృతంగా ప్రచారమవటానికి కారణం ఈ శిష్య ప్రశిష్య పరంపరయే.

సంగీత పరమావధి ఒక్కటే, సుస్వరంతో, సొగసుగా చక్కని లయతో, భావశుద్ధిగా, జగన్నాటక సూత్రధారిని తలుచుకొంటూ స్తుతిస్తూ పాడుకోవటమే. మన పాట, మనకు తృప్తినివ్వాలి. మన సంగీతాన్ని మనం విని ఆనందించాలి. ఆ తర్వాత మన పాటకు శ్రోతలు ప్రతిస్పందిస్తారు. డిప్లొమోల కోసమో, డిగ్రీల కోసమో ముక్కునబట్టి నేర్చుకొనే సంగీతం వేరు. ఒక సంగీత విద్వాంసుడిగా గాయకుడిగా ఎదగాలంటే చేసే సాధన వేరు. లోకంలో గురువులనేకం. అటు గురువుకూ లక్ష్యం ఉండాలి. ఇటు శిష్యునికీ లక్ష్యం ఉండాలి. లక్ష్య లక్షణ సంగీత జ్ఞానం కలిగిన గురువులూ శ్రద్ధాభక్తులున్న శిష్యుల వల్ల మాత్రమే సంగీత జ్ఞానం పెరుగుతుంది.

సుప్రసిద్ధ నేపథ్య గాయకుడైన ఘంటసాలను చూడండి. శుద్ధమైన కర్ణాటక సంగీతాన్ని నేర్చుకొన్నాడు. ఆయన లక్ష్యం – సినిమాల్లో నేపథ్యగానం కాదు. మంచి సంప్రదాయ సంగీతాన్ని బాగా ఒంటబట్టించుకొని అద్భుతమైన శృతి మాధుర్యంతో కూడిన కంఠస్వరంతో, రాగ జ్ఞానాన్ని సొంతం చేసుకొని, బ్రతుకు తెరువు కోసం సినిమా రంగాన్ని ఎంచుకోవలసి వచ్చింది. సినిమా పాటలకు, సంగీత గౌరవాన్ని కల్పించినది ఘంటసాల. తాను నమ్ముకొన్న సంప్రదాయం సంగీతాన్ని దృఢనిశ్చయంతో పట్టుకొని, సంప్రదాయవాదుల విమర్శలకు తావీయకుండా అత్యద్భుతమైన గీతాలను పాడి, లక్షలాది శ్రోతల అభిమానాన్ని పొందిన ఏకైక గాయకుడు. భౌతికంగా ఎప్పుడో 1974లో కనుమరుగైన ఆయన పాడిన పాటల ఆకర్షణ ఇంకా ఇంతవరకు తగ్గకపోవడానికి కారణం? సుస్వరనాదానుభవంతో నిండిన ఆయన పాటల్లోని మాధుర్యమే ఆయన పాటలోని మాటలన్నీ రాగభావాన్ని నింపుకొన్నవే మరి. ఈవేళ సినిమాల్లో అటువంటి పాటలు మచ్చుకైనా వినబడుతున్నాయా? భూతద్దంలో వెతికినా కనిపించవు. ఘంటసాల పాడే కాలంలో స్వరసౌందర్యం అనుస్వరం, రాగం, గమకంలాంటి మాటలు వింటే కంగారు పడే దర్శక నిర్మాతలు గానీ, సంగీత దర్శకులుగానీ ఎవరూ లేరు. కాబట్టి ఆయన పాడిందే పాటయింది, ముత్యాల మూటలయ్యాయి. అటు దర్శక, నిర్మాతలకూ, ఇటు శ్రోతలకూ శాస్త్రీయ సంగీత మాధుర్యాన్ని చూపించారు ఘంటసాల.

**వాగ్గేయకారులు - విదుషీమణులు** - *ఎమ్. భారతలక్ష్మి*

# తెలుగు సాహిత్యం మరో విశ్లేషణ

**– ఎమ్. కురుమయ్య యాదవ్**

20వ శతాబ్దపు పూర్వ భాగందాకా సాహిత్యాన్ని కేవలం "శైలి, అలంకారం, రసం" మొదలైన కళాత్మక విలువల దృష్ట్యా మాత్రమే పరిశీలించడం జరుగుతూ వస్తున్నది. దానివల్ల సాహిత్యం ప్రామాణికతకు కొంత దూరమైంది. దీనిని పరిగణలోకి తీసుకొని "సామాజిక, రాజకీయ, చారిత్రక" భూమికతో తెలుగు సాహిత్యాన్ని పరిశీలించాలనే దృక్పథంతో రంగనాథచార్యులు రాసినదే "తెలుగు సాహిత్యం– మరో చూపు" అన్న రచన. ఆనాటి సాహిత్య చరిత్రకు ఆవల ఉన్న వాస్తవిక సాహిత్య చరిత్రను చూపే దర్పణమే ఈ "తెలుగు సాహిత్యం – మరో చూపు" అన్న రచన. వీరు సాహిత్యాన్ని అందరు విమర్శకులలాగా భావజాలం లక్షణ నియమాల ఆధారంగాకాక సాహిత్యంపైగల దేశ–కాల, మత, ఆర్థిక సామాజిక వాస్తవిక అంశాల ప్రభావం దృష్ట్యా పరిశీలించారు.

ఒక భాష యొక్క విశిష్టతను, గొప్పతనాన్ని తెలిపేది ఆ భాషలో వెలిసిన సాహిత్యమే. సాహిత్యం అంటే సంస్కృతిని ప్రతిబింబింపచేసేది అని అర్థం. ఒక జాతి, దేశ, సంఘం యొక్క జీవన విధానాలు, వారి ఆచార వ్యవహారాలు, సామాజిక – ఆర్థిక స్థితిగతులు, కట్టుబాట్లు, కళలు మొదలగు అన్నింటి సమన్వయమే సంస్కృతి. అటువంటి సంస్కృతికి రూపం ఇచ్చి, వాటిని భద్రపరిచి, భవిష్యత్ తరాలకు సజీవంగా అందించేది సాహిత్యం మాత్రమే. ముఖ్యంగా ఆ కాలంనాటి భారతదేశంలోని ప్రాంతీయ భాషాసాహిత్యాలు ఆస్థాన, ఆస్థానేతర సాహిత్యాలుగా అభివృద్ధి చెందాయి. ఆస్థాన సాహిత్యం ఫ్యూడల్ వ్యవస్థకు అనుకూలమై, దానిని బలపరచడానికి ఉపయోగిస్తే, ఆస్థానేతర సాహిత్యం ఫ్యూడల్ వ్యవస్థను, దానికనుకులమైన కుల వ్యవస్థనూ వ్యతిరేకిస్తూనో, భక్తి సాహిత్యంగానో జనంలో వ్యాపించింది. ఆ యా ప్రాంతాలకు సంబంధించిన ప్రత్యేకమైన చారిత్రక కారణాలవల్ల, ఫ్యూడల్ వ్యవస్థ ప్రభావంవల్ల కొన్ని భాషల్లోని లిఖిత సాహిత్య చరిత్రలో ఆస్థాన సాహిత్యానికి ప్రాధాన్యం ఏర్పడగా, కొన్ని భాషల్లో ఆస్థానేతర సాహిత్యానికి సమప్రాధాన్యం, మరికొన్నిచోట్ల అధిక ప్రాధాన్యం కనబడుతుంది. ఆస్థాన సాహిత్యానికైనా, ఆస్థానేతర సాహిత్యానికైనా మతమే ప్రధాన ప్రాతిపాదికగా కనిపిస్తుంది. ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తి సంబంధాల్లో కాలక్రమంలో వచ్చిన పరిణామాన్ని చెప్పటమే దేశ చరిత్ర అయితే, ఆ సంబంధాలు సాహిత్యంలో ఎలా ప్రతిబింబించాయో, దానికనుగుణంగా సాహిత్య రూపాలు ఎలా సంతరించుకున్నాయో చెప్పటమే సాహిత్య చరిత్ర. శిష్ట సాహిత్య రూపాన మనకి అందుబాటులో ఉన్న ఈ సాహిత్యం సాహిత్య చరిత్ర నిర్మాణానికి ఎంతవరకు ఉపకరిస్తుందో చెప్పటం కష్టమే. ఎందుకంటే ఆనాటి సంస్కృతిలో ఆధ్యాత్మిక విలువలు ప్రధానంగా ఉండి మతం, తత్వం, చట్టం, సాహిత్యం, సంగీతం, చిత్రకళ మొదలగు ఉపరితల విషయాలన్నింటిలోనూ ఆధ్యాత్మికతే ప్రతిబింబిస్తుందనే ఒక అభిప్రాయం కలదు. కానీ సంస్కృతి అంటే ఒక సమాజపు సంపూర్ణత్వాన్ని విశదీకరించగలగాలి. ఇది సగటు మానవుని సామాజిక, వాస్తవిక జీవన పరిస్థితులను, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, నమ్మకాలు, భావజాలంవంటి మౌలికాంశాలన్నింటి మధ్యగల సమన్వయ చిత్రీకరించగలగాలి. తొలినాళ్ళలో సాహిత్యం మత ఆధిపత్యంకు లోనైతే, తర్వాతి కాలంలో ఆర్థిక ఆధిపత్యానికి గురవ్వాల్సి వచ్చింది. ఆర్థిక ఆధిపత్యం మతంకంటే బలవత్తరమైనది.

ఒక విషయాన్ని అభివ్యక్తికరించే పద్ధతిలోని కళాత్మక విలువలనుబట్టి ఒక రచనను సృజనాత్మక రచన అని సాహిత్య రచన అని వర్గీకరిస్తారు. సృజనాత్మక రచనలో కేవలం రసానుభూతి, భావనశక్తి మాత్రమే ప్రధానంగా ఉంటాయి. సాహిత్య రచన అనేది సంస్కృతిని, సామాజిక అంశాలను మిళితం చేసిన సృజనాత్మక రచన. ఇందులో రసానుభూతి, భావన శక్తితో పాటు సమకాలీన సామాజిక స్పృహ, వాస్తవికతవంటి అంశాలు అంతర్లీనంగా ఉంటాయి. సాహిత్య చరిత్ర రచనలో సింహ భాగం ఇవ్వాల్సింది సాహిత్య రచనావళికే కానీ సృజనాత్మక రచనలకు కాదు. అయినప్పటికీ ఒక విషయాన్ని అభివ్యక్తికరించే పద్ధతిని, రచన రూపాన్ని నిర్ణయించేది కవి యొక్క సాంఘిక ఆస్తిత్వం, కవి ఆశించే ప్రయోజనం మాత్రమే. నన్నయ మహాభారతంను తెలుగులోకి అనువదించాలనుకున్నప్పటికీ అందులో సంస్కృత

ప్రభావం, బ్రాహ్మణ మత ధర్మాలుగల ఒక లౌకిక కావ్య అంశాలు అధికంగా కనిపించడానికి కారణం ఆనాటి సమాజంలో అధికంగాగల సంస్కృత భాష, వర్ణవ్యవస్థ యొక్క ప్రభావమే. శివకవి యుగంలో వచ్చిన అనుభవ సాహిత్యం, దేశి సాహిత్యం, వీరశైవ మత ప్రభావం ఫలితంగానే పాల్కురికి సోమన్న తన రచనలలో దేశీయతను, అచ్చ తెలుగును పరచగలిగారు. అంతేకాక బసవ్వవంటి సామాన్య వ్యక్తులను కన్నప్పవంటి అటవీకులను, గంగిరెద్దులవారు మొదలగు జానపద కళాకారులను కథా వస్తువులలో భాగంగా ఎంచుకోవటం, సమాజంలోని అస్పృశ్యతను, వర్ణ వ్యవస్థను నిరసించడంవంటివివారు ఆశించిన సంస్కరణ తత్వ ప్రయోజనాన్ని వెల్లడిస్తున్నాయి. ఒక సాహిత్యంలోని మౌళిక సాహిత్య గ్రంథాలను సామాజిక విపరిణామం దృష్ట్యా పూర్తిగా వదిలేయాల్సిన అవసరం లేదు. దానిని చూసే దృష్టిని మార్చుకుంటే సరిపోతుంది. అందులో సమకాలీన సమాజానికి/సాహిత్యానికి అవసరమైన అంశాలను వెతుక్కోగలగాలి. చారిత్రక ఆధారాలు, గ్రంథాలు లభించిన సందర్భాలలో ఈ సాహిత్య గ్రంథాలే చరిత్ర రచనకు/ ఆనాటి ప్రజల జీవన విధానంను తెలుసుకోవడానికి ఉపకరిస్తాయి.

***జొన్నకలి జొన్నయంబలి / జొన్నన్నము జొన్న పిసరు జొన్నలె తప్పన్***
***సన్నన్నము సున్నసుమీ / పన్నుగ బల్నాటి సీమ ప్రజలకు నెల్లను***

పై శ్రీనాధుని పద్యాన్ని చదివితే ఆనాటి ప్రజల ఆహార విధానాలు, వారి జీవనశైలి మనకు ప్రస్ఫుటంగా కనబడుతుంది. సురవరం ప్రతాపరెడ్డి గారు రాసిన ఆంధ్రుల సాంఘిక చరిత్ర అన్న గ్రంథానికి ఉపయుక్త ఆధారం ఆనాటి కొఱవి గోపరాజుగారు రాసిన సింహాసన ద్వాత్రింశిక అన్న గ్రంథమే. కవి తాను నివసిస్తున్న సమాజం, నాటి పరిస్థితులు, తాను ఎంచుకున్న సాహిత్య రచనకు మధ్యగల పరస్పర వైరుధ్యాలు కవిని నిరంతరం వెంటాడుతుంటాయి. తన కాలంనాటి సమాజం ఒకరకంగా ఉంటే తాను కోరుతున్నది, సాధించాలని ఆశిస్తున్న సిద్ధాంతాలు, భావాల మధ్య వైరుద్యాలు అతని లక్ష్యాన్ని కొంత అయోమయానికి గురి చేయవచ్చు. ఈ వైరుధ్యాలను గుర్తించి వేరు చేయగలిగినప్పుడే తన లక్ష్యానికి పరిపూర్ణత చేకూర్చగలరు. పాల్కురికి సోమన్న దేశీ మార్గమని ద్విపదను అనుసరించినా, తొమ్మిది రసములు కొలుకాడుదాని, యిమ్మడి వర్ణన లెసగంగ ద్విగుణమగునలంకారం బులసలారు దాని, దిగునార్ధ భావములు దీటుకొనంగ అని సంస్కృత అలంకార శాస్త్ర మర్యాదల్ని పేర్కొనకుండా ఉండలేకపోయారు. అల్పాక్షరముల ననల్పార్థ రచన, కల్పించుటయేకాదే కవి వివేకంబు అంటూనే అలాంటి రచన చేయలేకపోయాడు. జాను జానుగు ప్రసన్నతకు కారణం అంటూనే సంస్కృత భూయిష్టమైన పండిత భాషనే వాడాడు. సమకాలంలో కవి అస్తిత్వం పైన ఆధారపడిన భావజాలం అందులో కనిపించే వైరుధ్యాలు సాహిత్యంలో ఎలా ప్రతిబింబిస్తాయో, సాహిత్య రూపాన్ని నిర్ణయించడంలో ఎలా ప్రధాన పాత్రను వహిస్తాయో చెప్పడానికి సోమన సాహిత్యం ప్రధాన నిదర్శనం.

తెలుగు లిఖిత సాహిత్యం ప్రధానంగా ఆస్థాన సాహిత్యంగా, పండిత సాహిత్యంగా మొదలైనప్పటికీ ఆధునిక కాలంలో సామాజిక విలువలు, సమసమాజ స్థాపనే ప్రధాన భూమికగా పరిణతి చెందింది. ఒక దశలో చాలా కృత్రిమంగా పరిణమించినా ఆస్థాన సాహిత్యంలోనూ కళావిలువలు ఉన్నతంగా రూపొందిన మాట కాదనటానికి వీల్లేదు. మధ్యలో సామాన్యుల కోసం శివకవులు తీర్చిదిద్దిన దేశీకవిత్వం, అచ్చ దేశీయమైన భాషలో, జానపద బాణిలలో గీతాలు, కీర్తనలు రాసిన అన్నమయ్యవంటివారు, నిజమైన ప్రజాస్వామిక నిర్మాతలైన వేమన, వీరబ్రహ్మం వంటి వారు ప్రాచీన సాహిత్యంలోనూ ఆధునిక సంస్కరణ భావాలనీ తీర్చిదిద్దారు.

సమాజం–సాహిత్యం రెండు పరస్పర ఆధారితాలు. వ్యక్తులనే కాదు సమూహాలను, సమాజాలను సైతం ఆకర్షించగల శక్తి ఒక్క సాహిత్యానికే ఉంది. అందుకే శివ కవులు, అన్నమయ్య, వీరబ్రహ్మం, వేమన వంటివారు తమ భావజాల ప్రసరణకు సాహిత్యాన్నే మాధ్యమంగా ఎన్నుకున్నారు. అంతేకాదు వేమన, తిక్కన, గురజాడ కందుకూరివంటి ఎంతోమంది కవులు సమాజంలోని అసమానతలు, కుల మత భేదాలను, లింగ అసమానతలు నిర్మూలించడానికి, తమ సంస్కరణ వాదానికి సాహిత్యాన్నే ఆయుధంగా మలుచుకున్నారు. ఎందుకంటే సాహిత్యం మనసుకు మత్తుమందు చల్లడమే కాదు, సమాజానికి శస్త్ర చికిత్స చేయగలదు.

**ఎమ్. కురుమయ్య యాదవ్ - ఫోన్: 779 955 3493.**

## చిత్రగీతాలు
# హరికథ

– ఎమ్. పురుషోత్తమాచార్య

**తెలుగులో హరికథ**

మానవుడు పుట్టిననాటి నుంచి ఉన్న ఒక ముఖ్యమైన ప్రక్రియ కథ. పురాణాలలో సూతుడు శౌనకాది మునులకు చెప్పిన కథలే పురాణాలు. క్రమేణా ఎన్నోరకాలుగా కథ చెప్పడం అనేది ఏర్పడింది. కథాకాలక్షేపం అని మహారాష్ట్రలో ఉంది, మనకి కథ – కాలక్షేపం రెండు మాటలు. మహారాష్ట్రుల కథాకాలకషేపం, కీర్తన్ ఇవి మహారాష్ట్రులు తంజావూరు పరిపాలించినప్పుడు (1674–1855) దక్షిణ దేశానికి వచ్చాయి. వారి అధికార భాష తెలుగు. అప్పుడు హరికథను పోలిన కథా కాలక్షేపం పుట్టింది.


ఆదిభట్ల

తెలుగున హరికథా పితామహుడు శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారయదాసుగారు (1864–1945). ఆయన తన జీవిత చరిత్ర 'నా యెరుక'లో ఉటంకించినది ఏమంటే 1884లో కుప్పుస్వామి అనే ఒకాయన దక్షిణాది నుంచి వచ్చి ఒక హరికథ చెప్పాడట. అందులో, సాహిత్యం, భక్తి సంగీతం, నృత్యం అలవోకగా కథ ఆశువుగా చెప్పే విధానం ఉన్నాయట. అది ఆయన్ను ఆకర్షించింది. ఆ రాత్రే నారాయణ దాసుగారు అంబరీష చరిత్ర హరికథ స్వయంగా వ్రాసి మరునాడే ప్రదర్శించారు. అదీ తెలుగునాట హరికథ ఆవిర్భావం. వారు తెలుగులో 17, సంస్కృతంలో 3, అచ్చ తెనుగులో ఒకటి హరికథలు విరచించారు. మొన్న పద్మశ్రీ పొందిన కోట సచ్చిదానందమూర్తి భాగవతార్ వీరి శిష్యపరంపరలోనివారే!

– ఆచార్య పప్పు వేణుగోపాలరావు

**కుచేలోపాఖ్యానం**

చిత్రం : **శ్రీకృష్ణమాయ (1958)**
రచన : **రావూరు వేంకట సత్యనారాయణరావు**
సంగీతం : **టి.వి. రాజు**
గానం : **ఘంటసాల**
వచనం : **అక్కినేని నాగేశ్వరరావు**




శ్రీమద్రమారమణ గోవింద హరి

**మోహన–ఏక**

మి. కలడు కుచేలుండను విప్రోత్తముడొకడు
వారికి కల్గెను చింతగూర్చు సం
తానమనంతముగా మరి
దొరకదు కబళము చిరుపాపలకు / ఎంత ఘోరమకటా॥

వచ. పాపం. కుచేలుడు కడిపెడు పిల్లలను కన్నాడు

**(పద్యం) బిలహరి**

**కడిపెడు బిడ్డలన్ గనియు కర్మవశంబటులుండజేసె ఆ**
**బుడతల పెట్టిపోతలకు పుట్టవు చారెడు నూకలైన......**

వచ. ఇలా సంసార బాధలు పడుతూండగా ఒకనాడు ఇల్లాలు కుచేలుని భార్య తన భర్త దగ్గరకు వచ్చింది.

**కాంభోజి–ఏక**

వినుడీ నా మొఱ దయగనుడీ పసి
పాపల గతి నేనోపగజాలను ॥వి॥
మీ బాల్యమిత్రుడగు గోపాలుని
గోపాలుని దరిజేరి మన గతి నెరిగింపుడు

వచ. అని ప్రార్థించింది. అంతే, కుచేలుడు తన భార్య మాట విన్నవాడై ద్వారకకు వెళ్ళాడు. అప్పుడు శ్రీకృష్ణపరమాత్మ మిత్రుని జూచి ఎదురేగి....

**తోడి-ఏక**

మి. *గట్టిగ మిత్రుని కౌగిట చేర్చెను*
*ఎట్టెటులుంటివి మిత్రమా?*
*నీ సంతతి యంతయు సౌఖ్యమా?*
*నీ యిల్లాలును కుశలమా?॥*

వచ. అంటూ ఆ భక్తమందారుడు ప్రశ్నించాడు తరువాత తన భార్య రుక్మిణీదేవివైపు దిరిగి 'దేవీ'!

**(పద్యం) కేదారగౌళ**

***భూసురవర్యుడీతడు సుబుద్ధి మహాత్ముడనుంగు మిత్రుడే***
***చేసిన పుణ్యమూలమున చేకురె నాకొక బాల్యమిత్రుడై***
***వేసట చెందె నీతడు సుపేశకరంబుల పాదమొత్తగా***
***దాసుడ నుంటి నేనిచట దాసివి నీవును రమ్ము నెచ్చెలీ!॥***

వచ. అని పిలిచాడు. పిలిచి, ఆ కౌస్తుభధారి తానే కాకుండా తన భార్యచేత కూడా మిత్రుని పాదాలు వత్తించుతూ ఇలా అన్నాడు.

**హరికాంభోజి-మిశ్రచాపు**

*మిత్రమా! నాకేమి ఇత్తువు కానుక*
*ఇన్నినాళ్ళకు కళ్ళబడితివి*
*వెన్నెలాయెను నాదు మనసు ॥మి॥*

వచ. అని అడిగాడు. అప్పుడు కుచేలుడు తన కొంగునన్ను గుప్పెడటుకులు తీసి సిగ్గుతో తన మిత్రుని దోసిట్లో పోశాడు. అప్పుడు శ్రీకృష్ణపరమాత్మ పరమానందం పొంది రుక్మిణికి ఒక్క పలుకూ పెట్టకుండా అన్నీ తనే తినేశాడు. అలా తినగానే కుచేలుని జాడ్యమంతా తీరిపోయింది. అప్పుడు కుచేలుడు మహదానందం పొంది ఆ దివ్యమూర్తి పాదాలపై పడ్డాడు. అలా పడి.........

**బేహాగ్-ఏక**

*నీ దయ తెలియగ తరమా*
*నీరజనయనా క్షీరాబ్ధిశయనా ॥నీ॥*

వచ. ఇక అక్కడ కుచేలుని ఇంటినిండా ధనధాన్యాలు రాసులు పోసి ఉన్నాయి. అప్పుడు కుచేలుని భార్యాబిడ్డలు అందరు ఆ భక్తవత్సలుని తలచి ఇలా ప్రార్థించారు.

**సింధుభైరవి-ఏక**

*దీనబాంధవా దేవా ॥దీన॥*
*నీ దయ కలిగెనా మాపైన*
*పేదరికమ్మది తొలగె*
*పెన్నిధులే ఒరిగెనులే ॥దీన॥*

వచ. ఇలా ప్రార్థిస్తూ ఉండగా కుచేలుడు ఇంట్లోకి ప్రవేశించాడు. దారాపుత్రుల మొహాల్లో వికసించిన ఆ వెలుగును చూచి తన్మయుడైపోయాడు. కనుక-

**మధ్యమావతి-ఏక**

మి. *శ్రీహరి నమ్మినవారికి వేరే*
*కరువేమున్నది జగతి*
*గుప్పెడు అటుకుల గొప్పగ జేసి*
*కురిపించెను సిరులను శౌరి॥*

*శ్రీమద్రమారమణ గోవింద హరి*

నారదమహర్షి శ్రీకృష్ణుని మాయకు గురియయి సంసారంలో పడినాడు. ఆ సమస్యలతో సతమతమవుతూ ఆర్థికసహాయం అడిగేందుకు కృష్ణుని దగ్గరికి వచ్చి అన్నదానానికి సహాయం కావాలని కోరితే కృష్ణుడు సరేకాని, ఏదైనా కథాగానం చేయమని అడిగాడు. అప్పుడు నారదుడు ఆలపించిన కథే ఈ కుచేలోపాఖ్యానం హరికథ.

శ్రీకృష్ణునిగా కె. రఘురామయ్య, రుక్మిణిగా సూర్యకళ, నారదునిగా అక్కినేని నాగేశ్వరరావు, మాయగా జమున చక్కగా నటించారు. 'కడిపెడు బిడ్డలన్' పద్యాన్ని ఎందుకో రెండు పాదాలే ఇచ్చారు. 'కడిపెడు' పదప్రయోగం చాలా విశిష్టమైనది. దీనికి అసంఖ్యాకము అనే అర్థాన్ని చెప్పుకోవచ్చు. కాని 'కడప, కడిపి' పదాలకు మానార్థకమైన 'ఎడు' ప్రత్యయాన్ని చేర్చడంవల్ల ఇది ఏర్పడింది. అయితే, 'కడప' శబ్దానికి గుమ్మం దగ్గర ఉండే 'గడప' అనే అర్థం కూడా ఉంది. కడవ+ఎడు=కడవెడు, కడివెడు అనే వ్యవహారంలో కనిపిస్తాయి. ఇదే 'కడిపెడు' అయిందని కొందరు, కాదు, కాదు-కడుపు+ఎడు=కడుపెడు, కడిపెడు (కడుపు నిండా సమృద్ధిగా) అయిందని మరికొందరు భావిస్తున్నారు. 'పెట్టిపోతలు' అనేది 'పెట్టుపోతలకు' రూపాంతరంగా అయింది. అన్నం పెట్టడం, నీళ్ళు పోయడం అనేవి ఇందులో ధ్వనిస్తాయి. కుచేలుడు, అతని భార్య, కృష్ణుడు పాత్రల మధ్యన మంచి నాటకీయతను ఈ రచన సూచిస్తున్నది. హరికథా గానంలో సాధారణంగా అనుసరించే 'మిత్రం' పద్ధతిలోనే రచన ఎక్కువగా సాగింది. యతి, ప్రాసలను అంతగా పట్టించుకోక స్వేచ్ఛగా రచన చేశారు. సుకుమార హస్తాలతో పాదాలను వత్తడానికి నేను దాసుడను, నీవు దాసిగా రా అని కృష్ణుడు రుక్మిణిని పిలిచాడని చెప్పడంలోనే భగవంతుడు తన దాసులకు

దాసుడు అనే పరమార్థాన్ని చెప్పడమేకాక భగవద్భక్తునికి సకలసిరి సంపదలూ దాస్యం చేస్తాయని ప్రకటించడంగా మనం గుర్తించవచ్చు. 'పెన్నిధులే ఒరిగె' అంటూ 'ఒరిగె' శబ్దాన్ని గమ్మత్తుగా ప్రయోగించారు. సాధారణంగా ఈ పదాన్ని 'కూలిపోవడం' అనే అర్థంలో ఉపయోగిస్తాం కదా! కాని రావూరువారు ఈ పదాన్ని 'వాలడం, కురవడం' అనే అభిప్రాయంతో ఉపయోగించడం చెప్పుకోదగ్గ ప్రత్యేకత.

హరికథా గానంలో పాటలు, పద్యాలను ఘంటసాల ఆలపించగా, వచనాన్ని అక్కినేనివారే పలికారు. చేతిలోని చిడతలను లయ తప్పకుండా వాయించారు. గొంతును కొద్దిగా పెంచి పలకడం వల్ల అక్కడక్కడా వాచికం కొంచెం అస్పష్టమైంది. అంతేకాదు, గానానికి, వచనానికి ఏకసూత్రత లేకపోవడంవల్ల సహజత్వం కొంత దెబ్బతిన్నదని చెప్పవచ్చు. వాచికం కూడా మాస్టారే చెబితే బావుండేది అనిపిస్తుంది. అయితే, వచనాన్ని అక్కినేనివారు తనే చెబుతానన్నారో, స్వరకర్త చెప్పమన్నారో, దర్శక నిర్మాతలు ప్రోత్సహించారో తెలియాల్సి ఉంది.

మొదటి పాటను మిశ్రంలో మోహనరాగబద్ధంగా ఏకతాళం వేస్తూ పాడారు. 'కలదు కుచేలుండను' అంటూ తారస్థాయి షడ్జమంలో ప్రారంభించారు. తరువాతి పద్యాన్ని బిలహరి రాగంలో ప్రారంభిస్తూనే రాగంతో రావలసిన అన్యస్వరమైన కైశిక నిషాదాన్ని 'దదనిద' బాణీలో స్పృశించారు. 'నూకలైన' దగ్గర మాస్టారు తన అనితర సాధ్యమైన గానసంగతిని ఆలాపన రూపంలో ఆవిష్కరించారు.

తరువాత 'దసనిదపా' బాణీలో 'వినుడీ నా మొఱ' పాటను కాంభోజిలో అందుకున్నారు. 'మీ బాల్యమిత్రుడగు' అనే చరణంలో 'గోపాలుని' దగ్గర రాగాలావన రాగస్వరూపాన్ని సంపూర్ణంగా సాక్షాత్కరింపజేసింది. 'మనగతి నెరింగింపుడు'ను మాత్రమే 7వ అక్షరం మీది నుండి మిశ్రంలో పాడి పల్లవిని అందుకోవడం ఎంతో చమత్కారంగా ఉంది.

దీని వెంటనే ఉన్న మిశ్రాన్ని తారషడ్జమంలో 'తోడి' రాగం, ఏక తాళంలో వేగంగా పాడారు. 'మిత్రమా' దగ్గర ఒక ఆవర్తం పాటు ఆలాపన, ముక్తాయి వినిపించారు. 'కుశలమా' దగ్గర కూడా చిన్న ఆలాపన చేశారు. తరువాత వచ్చే పద్యాన్ని కేదారగౌళ రాగంలో విజృంభించి పాడారు. 'మిత్రుడు ఏ చేసిన'లాంటి చోట్లలో చక్కని పద విభజన చేస్తూ మనోహరంగా పాడారు. 'చేకురె' దగ్గర చక్రంలాగా గిర్రున తిరిగే సంగతిని పాడారు. 'వేసట చెంది నీతడు'ను భావాధిక్యత కోసం అలసట, బాధ పొందడాన్ని వర్ణిస్తూ రెండు రకాల సంగతులతో పాడారు. 'నెచ్చెలి' దగ్గర విస్తార రీతిగా రాగాలాపన చేశారు.

'మిత్రమా నాకేమి' పాటను పంచమం నుంచి మిశ్రచాపు తాళంతో ప్రారంభించారు. హరికాంభోజి రాగంలో పాడినట్లుగా లీలగా స్ఫురిస్తుంది. సంగతి మాత్రం కాంభోజి రాగమే అయినా మొదటి భాగంలో హరికాంభోజి రాగపు పోకడలు వినిపిస్తాయి.

'నిసనిదప దమగ' అనే బాణీలో 'నీదయ తెలియగ' అని రెండు నిషాదాలను ఉపయోగిస్తూ 'బేహాగ్' రాగంలో, ఏకతాళంలో పాటను మొదలుపెట్టారు. 'శయనా' తరువాత అర ఆవర్తంలో మృదంగం ముక్తాయినిచ్చారు. దీని తరువాత వచ్చే 'దీనబాంధవా' పాటను మధ్యమ శ్రుతిలోకి తీసుకుని మూడు మాత్రల జాగ వదలి గాంధారం నుండి ప్రారంభించారు. తోడిరాగాన్ని మధ్యమం నుండి అందుకుని పంచమం దాటకుండా పాడారు. కనుక దీన్ని 'నాగవరాళి' రాగం అని భావించవచ్చు. పోకడ అంతా 'సింధుభైరవి'లాగా అనిపిస్తుంది. చరణం 'నీ దయ కలిగెనా'ను పంచమం నుండి అందుకుని విచిత్రంగా 'తొలగె' దగ్గరి నుండి పట్టుగా నడిపించి 'నీ దయ కలిగెనులే'ను వడిగా పాడి పల్లవిని అందుకోవడం హాయిగా ఉంది. 'చివరలో 'దీనబాంధవా'ను మూడు మారులు ముక్తాయింపుగా పాడి ముగించారు.

చివరగా 'శ్రీహరి నమ్మిన' పాటను తిరిగి సమశ్రుతికి వచ్చి మధ్యమావతి రాగంలో, ఏకతాళపు నడకలో తారషడ్జమం నుండి ఎత్తుకున్నారు. ఆధారషడ్జమం దగ్గర చేరగా అర ఆవర్తం మృదంగం ముక్తాయింపుతో పాట ముగిసింది.

దృశ్యంలో మృదంగం, కంజీర మాత్రమే కనిపిస్తాయి. వయొలిన్ లేదు కనుక ఆడియోలో ఇంక ఇతర వాద్యాలేవీ లేకుండా, బిట్వర్కు పని లేకుండా నిరాడంబరంగా సాగించారు.

**జావళి**

**వగకాడ బిగువేలరా**

**చిత్రం : తిక్కశంకరయ్య (1968)**
**రచన : సి. నారాయణరెడ్డి**
**సంగీతం : టి.వి. రాజు**
**గానం : పి. సుశీల**
**నృత్యం : జయలలిత**

**షణ్ముఖప్రియ-ఆది**

*వగకాడ బిగువేలరా ఈ*
*సొగసైన చినదాని బిగికౌగిలి చేర* ॥వగ॥

1. *కన్నుసైగలు చేసి నా*
*కడకొంగు నునుకేల దూసి*
*ఎన్నో బాసలు చేసి ఏవో ఆశలు చూపి*
మి॥ *వింతవింత గిలిగింత చేసి మరి*
*అంతలోనె మాయమైతివేరా* ॥వగ॥

2. *అర్ధరాతిరి నిదుర లేపి చెక్కు*
*టద్దమ్ముపై కేలు మోపి*
*నవ్వులు విరబోసి పువ్వుబాణము వేసి*
మి॥ *పొంచి పొంచి కవ్వించి బేలనుడి*
*కించనేల చెంతజేర రారా* ॥వగ॥

పట్నం నుంచి మోహన్ అనే కుర్రాడు పెళ్ళిచూపులకు రాణి ఇంటికి వచ్చాడు. అక్కడే సాధారణంగా ఉన్న సుశీలను చూసి ప్రేమించాడు. కానీ రాణి మోహన్‌ను తన ఆటపాటలతో కవ్వించే ప్రయత్నం చేస్తుంది. ఇది మోహన్‌కు ఇష్టం ఉండదు. మోహన్‌గా ఎన్టీఆర్, సుశీలగా కృష్ణకుమారి, రాణిగా జయలలిత అభినయించారు. ఈ పాటను జయలలిత మీద చిత్రించారు.

ఆయా చోట్లలో యతిప్రాసలను, అనుప్రాసలను అందంగా ప్రయోగించి శబ్దమాధుర్యాన్ని చవిచూపారు. అందగాడైన మోహన్ చిలిపి చేష్టలను ఊహించుకుంటూ రాణి తాను కలలో అనుభవించిన అనుభూతులను నెమరువేసుకుంటూ సరదాగా ఆయన్ని ఉడికిస్తున్నది.

ప్రారంభంలో నాలుగు ఆవర్తాలలో మృదంగం, మోర్సింగ్, ఘటం వాద్యాలతో లయ జతుల విన్యాసాన్ని వినిపించారు. తరువాత రెండు ఆవర్తాలలో వయొలిన్స్,




వీణలతో బిట్టును ఇచ్చి పైషడ్జమంలో వదిలేశారు. తారస్థాయి నుంచే సమంలో 'వగకాడ'ను రిషభం నుంచి అందుకున్నారు. మొదటి పాదాన్ని రెండోసారి పాడుతున్నప్పుడు 'రా' దగ్గర ముచ్చటైన ఆరోహణ గమకాన్ని వినిపించారు. రెండో పాదం పాడాక 'వేలరా' దగ్గర మరో అందమైన సంగతిని 'రా' మీద రూపొందించారు.

పల్లవిని పాడాక అతీత విధానంలో 8వ అక్షరం నుంచి వయొలిన్స్ బిట్టు ప్రారంభమైంది. వయొలిన్స్‌తో పాటు వీణను ఉపయోగిస్తూ 5 ఆవర్తాలలో బిట్టును వినిపించారు. చివరకు పంచమంపైన వదలగా దైవతం నుండి సమంలో 'కన్నుసైగతో' చరణాన్ని ప్రారంభించారు. 'దూసి' దగ్గర చిన్న ఆలాపనను రెండు ఆవర్తాలలో మధురంగా వినిపించి మళ్ళీ చరణాన్ని మొదటి నుండి పాడారు. మూడో పాదాన్ని రెండు సార్లు మార్పు లేకనే పాడి తరువాతి భాగాన్ని మిశ్రంలోకి తీసుకుని వేగంగా ఆలపిస్తూ 'రా'ను 'గమపదనిసా' బాణీలో పాడినారు.

రెండో చరణానికి ముందు బిట్టు స్వరూపాన్ని పూర్తిగా మార్చారు. అతీత విధానంలో వయొలిన్స్‌తో ప్రారంభించి ఒక ఆవర్తంలో బిట్టును వినిపించారు. తరువాత నుంచి నాలుగు ఆవర్తాలలో తబల, మృదంగ విన్యాసాన్ని జతులుగా వినిపించారు. అయిదు, ఆరు ఆవర్తాలలో స్వరవాద్యాలతో బిట్టును వినిపించి నిషాదం దగ్గర వదిలేయగా 'అర్ధరాతిరి' చరణాన్ని ప్రారంభించారు. 'కేలుమోపి' దగ్గర మరో తీరుగా చక్కని రాగాలాపనను రెండు ఆవర్తాలలో పాడి మళ్లీ చరణాన్ని ఎత్తుకున్నారు.

మూడో పాదాన్ని రెండుసార్లు పాడాక చివరి రెండు పాదాలను మిశ్రం ధోరణిలో పాడి చరణాన్ని ముగించారు. అయితే, ఒక అక్షరం జాగా వదిలి 'నవ్వులు విరబోసి' అని పాడవచ్చు. కాని దీన్ని కూడా సమంలో పాడించాలనుకున్న స్వరకర్త 'నవ్వూలు' అని పలికించాల్సి వచ్చింది. పల్లవిని పాడాక మృదంగ నాదంతో జతులు వినిపిస్తూ ఒక ఆవర్తంలో ముగించి పాటను పూర్తి చేశారు.

డా. ఎమ్. పురుషోత్తమాచార్య - నల్లగొండ. ఫోన్: 939 661 1905.

# జ్ఞానం మతరహితం

– దేవరాజు మహారాజు

మతం చుట్టూ తిరిగేదే 'జ్ఞానం' అనే ఆలోచన సమాజంలో బాగా నాటుకుపోయింది. ఏ దేశమైనా, ఏ మతమైనా ఇదే భావనని జనంలో స్థిరపరిచాయి. కానీ కాలం గడుస్తున్నకొద్దీ జ్ఞానానికీ, మతానికీ దూరం పెరుగుతూ వచ్చింది. జ్ఞానం – ఏ మతం చుట్టూ ప్రదక్షిణలు చేయదని సర్వస్వతంత్రంగా ఎదుగుతుందని, తనను నమ్ముకున్న జనం ఎదుగుదలకు తప్పక తోడ్పడుతుందని తేలింది. మనిషి, మనిషిగా మారడానికి – మారి, నిలబడడానికీ – నిలబడి ఎదగడానికీ జ్ఞానం... అంటే విజ్ఞానం – నిరంతరం కృషి చేస్తూనే ఉంటుంది. అతణ్ణి ఈర్ష్యా ద్వేషాల నుంచి, అసూయ ప్రతీకారాల నుంచి, మూఢనమ్మకాల బయటపడేసి, నైతిక జీవిగా కొనసాగడానికి దోహదం చేస్తుంది.

మా'నవ'వాదానికి బీజాలు విజ్ఞాన శాస్త్రంలోనే ఉన్నాయి. ఏ మతంలోనూ లేవు. అందుకే జ్ఞానాన్ని మతరహిత స్థాయికి తెచ్చుకోవాలి! ప్రాపంచిక దృక్పథంతో, విశాల భావాలతో మానవ జాతి అంతా ఒకటేనని జన్యుశాస్త్రం అందించిన 'జ్ఞానాన్ని' స్వీకరిస్తే ప్రతి ఒక్కరూ మానవవాదులే అవుతారు. విజ్ఞాన శాస్త్రాన్ని తన సృజనాత్మకతతో సాంకేతిక శాస్త్రంగా కేవలం మనిషికే ఉంది. ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచిని పెంపొందించడానికి మాత్రమే ఉపయోగించుకోవాలి. మనిషిలోని స్వార్థం వెర్రితలలు వేస్తే సాంకేతిక పరిజ్ఞానం మానవ వినాశనానికి దారి తీస్తుంది. ఆ విషయం కూడా గుర్తుంచుకోవడం మంచిది. 'విజ్ఞానాన్ని మతరహిత స్థాయికి ఎందుకు తీసుకుపోవాలి? మతం ఉంటే నష్టమేమిటి?' అని ఎవరైనా ప్రశ్నిస్తే అందుకు మనం ఈ విధానంగా సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది – అబద్ధాలతో నిజాలు జతకట్టవు. వాస్తవాలు ఊహల్లో తేలిపోవు. ఊహల్లో తేలిపోతే తేలిపోవచ్చు – కానీ, అవి అప్పుడు వాస్తవాలుగా మిగలవు.

మతగ్రంథాలలో ఉన్న స్వర్గనరకాలకు అడ్రస్‌లు లేవు. భూమి అడుగున ఉన్న పాతాళ లోకానికి వెళ్లే సొరంగ మార్గం ఎవరికీ తెలియదు. లోకాలన్నింటినీ మోసే ఆదిశేషు పరిమాణం ఎంతో తెలియదు. దాని మీద పవళించే విష్ణుమూర్తి అతాపతా తెలియదు. శిలువెక్కిన ప్రభువు మొబైల్ నెంబరేమిటో తెలియదు. పరలోకం ఏ గూగుల్ మ్యాప్‌లోనూ దొరకదు. ఆకారమే లేని అల్లా కనీసం తన ఇ–మెయిల్ ఐడీ అయినా, ఎవరికైనా ఇచ్చాడా? ఇవ్వలేదే – శతాబ్దాలుగా భక్తులెవరూ తమ దేవీదేవతల మొబైల్ నెంబర్లు సంపాదించలేకపోయారు. గ్రహాలన్నీ దేవతలకు నివాసాలని అంటారు కదా? మరి, రాకెట్లలో గ్రహాంతరయానం చేసే మన 'మానవమాత్రులకు' వారు ఎక్కడా కనపడరెందుకూ? అయినా, గతంలో విశ్వసించినట్టు గ్రహాలు దేవతల నిలయాలని ఇప్పుడు ఎవరూ విశ్వసించడం లేదు. ఇక్కడ భూమి మీద సాంకేతిక పరిజ్ఞానం పెరగడంవల్లనే కొద్దిమంది పరిపాలకులు కోట్లమంది జనాన్ని అదుపులో పెట్టగలుగుతున్నారు. మరి ఈ సాంకేతిక పరిజ్ఞానం దేవీదేవతల మీద పనిచేయడంలేదు. ఎందుకంటారా? వారు నిజంగా ఉంటే పనిచేసేది లేనివాళ్ల మీద ఎలా పనిచేస్తుంది చెప్పండి? అయితే, అందుకు కారణం కూడా ఉంది. భ్రమ భ్రమలతో కలుస్తుంది. వాస్తవాలు వాస్తవాలతో మాత్రమే అతుకుతాయి. నిన్న రాత్రి నిద్రలో కన్న కలలు ఇవ్వాళ రాత్రి కూడా కను – ప్రమాదం లేదు. కానీ, పొద్దున వాస్తవంలో మోటారు సైకిల్‌పై వెళుతూ రాత్రి కన్న కలలు కంటానంటే యాక్సిడెంట్ అవుతుంది. నువ్వు బతికి ఉంటావో లేదో కూడా తెలియదు. ఒక వాస్తవాన్ని భ్రమమలతో కలుపుతానంటే ఇలాగే ప్రమాదాలు జరుగుతాయి. వాస్తవాల ఆధారంగా బతికేవాడికే, తనకు జ్ఞానం ఉందన్న స్పృహ ఉన్నవాడికే విజ్ఞానం అందుబాటులోకొస్తుంది. మతాల మాయలో పడితే తెలివి తేటలు కాదు కదా మూర్ఖత్వం అబ్బుతుంది! అప్పుడు అందుకు తగిన వేషం ఒకటి వేసుకుని ఎంచక్కా వ్యాపారం చేసుకోవచ్చు. సిగ్గూ ఎగ్గూ, నైతికత అన్నీ వదిలేసినవాడు ఇక ఏం చేస్తాడు? తోటి మనుషుల్ని మోసం చేస్తాడు. అన్ని మతాల గురువులు, ప్రబోధకులు, ముల్లాలు, పాస్టర్‌లు, పురోహితులు, ప్రవచనకారులు చేస్తున్న పని ఇదే. పాకే జంతువు నుంచి పక్షి రావడం, వానరం నుంచి మనిషి రావడం అనేది వీరు తెలుసుకోరు. తెలుసుకున్నా అర్థం చేసుకోరు. ఆత్మజన్మ, పునర్జన్మలగూర్చిన పరిజ్ఞానమే 'జ్ఞానం' అని అనుకుంటూ ఉంటారు. మనిషి గుండెలో అంగుష్ఠ దేహం ఉంటుందనీ, మరణించినప్పుడు అది బ్రహ్మ రంధ్రం గుండా బయటికిపోతుందని నమ్మే వీరు, మనిషి కర్మానుసారం అతని చావు పుటుకలుంటాయని విశ్వసిస్తారు. అంతేకాదు, గతజన్మలో వారు చేసిన మంచీ చెడ్డల పర్యవసానంగానే వారి తలిదండ్రుల నిర్ధారణ జరుగుతుందని విశ్వసిస్తారు. ఆధునిక జన్యుశాస్త్రం చెప్పే వంశపారంపర్య లక్షణాలు వీరికి విచిత్రంగా తోస్తాయి. ఒకరకంగా అలాంటి విషయాలు నమ్మాలంటేనే వీరికి

ఇబ్బందిగా ఉంటుంది. విస్కీ తాగడం అలవాటయినవాడికి కొబ్బరినీళ్లు ఆరోగ్యానికి మంచిదని చెబితే వింటాడా? ఇలాంటి వారి వితండ వాదనలు చిత్రవిచిత్రాలుగా ఉంటాయి.

గతంలో బ్రాహ్మణార్యులు జనాన్ని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అని నాలుగు వర్ణాలుగా విభజించారు. మానవజాతి అంతా ఒక్కటే అయినప్పుడు ఈ విభజనలు ఎందుకు? అని మనమంటాం. అందుకు “మనుషుల్లో రక్తం గ్రూపులు నాలుగు లేవా? అవి ఒకదానితో ఒకటి కలుస్తాయా” అని ఎదురు ప్రశ్న వేస్తారు. నిజమే! ఆ అతి తెలివి ప్రశ్నకు సంతోషించాలో లేక ఏడవాలో అర్థం కాదు. ఇది ఒక తప్పు ప్రశ్న. ఎందుకంటే రక్తం నాలుగు గ్రూపులు మనువాదులు విభజించిన ఆ నాలుగు వర్ణాల వారిలో కూడా ఉన్నాయి. అత్యవసర పరిస్థితిలో శూద్రుడి రక్తం బ్రాహ్మణుడికి ఇవ్వొచ్చు. క్షత్రియుడి రక్తం వైశ్యుడికీ ఇవ్వొచ్చు. ఎవరి రక్తం ఎవరికైనా ఇవ్వొచ్చు. కేవలం ఆ రక్తం గ్రూపు కలవాలి అంతే! అంటే ఏమిటీ? మనుషుల రక్తమంతా ఒక్కటే అని కదా? కులమతాలకు, లింగభేదాలకు అతీతంగా రక్తం ఒకరిది ఒకరికి ఇవ్వడం జరుగుతున్నప్పుడు మనుషుల్లో భేదం ఎక్కడుంది? రక్తమార్పిడి ఖండాంతరంగా జరపొచ్చు. ఖండాంతర వివాహాలు చూస్తేనే ఉన్నాం. ఆ రకంగా జనులందరినీ విశ్వజనులుగానే పరిగణించాలి.

ఇటీవలి వంద, రెండు వందల సంవత్సరాల చరిత్ర చూసుకొని మాది గొప్ప వంశం – మా కులం గొప్పది – మా మతం గొప్పది అని విర్రవీగడం హాస్యాస్పదమైన విషయం. ఇంకా వెనక్కి వెళ్ళి చూసుకుంటే వేల సంవత్సరాల క్రితం మన పూర్వీకులు ఎక్కడ ఉండేవారో, ఎలా ఉండేవారో, ఎటునుంచి ఎటు వలస వెళ్లారో, వారి మతవిశ్వాసాలేవో, ఎవరు ఎవరిని పెండ్లి చేసుకున్నారో ఎవరికి తెలుసు? అందువల్ల ఏదో రెండు, మూడు తరాల వంశ చరిత్ర చూసుకుని విర్రవీగడం మూర్ఖత్వం అవుతుంది. ఇంకా కొంచెం వెనక్కి వెళితే అందరమూ ఆ మహా మిశ్రమ మానవజాతి నుంచి వచ్చినవాళ్లమేనని తెలుసుకుంటాం. మానవవాదులుగా మారడానికి తెలుసుకోవలసిన మొదటి అంశం, జ్ఞానగుళిక ఇదే! ఈ విషయాలన్నీ ఇక్కడ ఎందుకు చెప్పుకుంటున్నామంటే తాము విశ్వజనులమని భావించుకునే కొందరైనా కొంచెం భిన్నంగా ఆలోచిస్తారేమోనని! మనుషులు ఇలా విభజింపబడి ఉండాల్సిందేనని గట్టిగా విశ్వసించేవారిని, అంధవిశ్వాసాల్లోనే వెలుగులున్నాయని భ్రమించేవారిని మనం ఉన్నఫళంగా ఏమీ చేయలేం. ఆలోచించుకోవడానికి వారికి కొంత సమయం ఇవ్వాల్సి ఉంటుంది.

శుభ్రత కావాలనుకునేవారికి శుభ్రతను ఇవ్వగలం. బురదలో దొర్లేవారిని ఏం చేయగలం? ఆ కంపు, ఆ బురద సౌఖ్యంగా ఉందనుకునేవారికి ఏమని చెప్పగలం? మార్పు అంతర్గతంగా వారిలోంచే రావాలి. వారు తమ వివేకాన్ని కొద్దికొద్దిగా ఉపయోగిస్తూ ఉంటే, తప్పకుండా మార్పు వస్తుంది. దేనివల్ల ఈ సమాజం ఈ ఇరవై ఒకటవ శతాబ్దంలోకి వచ్చిందో ముందు గ్రహించుకోవాలి. దేవుడు, దయ్యం, ఆత్మ, పరమాత్మ, ఆధ్యాత్మికత, ధ్యానాలవల్ల రాలేదు. కేవలం వైజ్ఞానిక స్పృహతోనే, వైజ్ఞానిక పరిశోధనలతోనే వచ్చింది. ఇవే మనల్ని ఇంకా ముందుకు తీసుకుపోతాయి. మనిషి తను కష్టపడే తత్త్వాన్ని, నిజాయితీని, నైతికతను వదిలేస్తే ఎదురయ్యే ప్రమాదాలు చాలా ఉన్నాయి. వదిలేయకుండా ఉండగలగడమే జ్ఞానం!

పొరపాటున జనం పెత్తందారీ వ్యవస్థకు లొంగిపోతేగనక తీరని నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇక్కడ మరొక పెద్ద ప్రమాదం పొంచి ఉంది. పెత్తందారీ సంస్కృతి గనక సాంకేతిక శాస్త్రాన్ని తన అధీనంలోకి తీసుకుంటే, అది మానవ స్వేచ్ఛనే హరిస్తుంది. అంతేకాదు, మానవ జాతిని తుదముట్టించే ప్రమాదం కూడా ఉంది. పరిస్థితులు అంతగా విషమిస్తే వాటిని అదుపులోకి తేవడానికి అసలు మనిషే ఉండడు కదా? విజ్ఞాన శాస్త్రం రెండంచుల కత్తిలాంటిది. ఎటు వాడుతున్నాం? ఎంత వాడుతున్నాం? ఎలా వాడుతున్నాం? వంటివి తెలియాలి. విజ్ఞాన శాస్త్రాన్ని ఎలా వాడుకోవాలో తెలుసుకోవడమే జ్ఞానం. దీనిమీద మత ఆధిపత్యం ఉండకూడదు. ఎందుకంటే, గతంలో ముక్కు మూసుకుని చేసిన తపస్సులవల్ల ఎవరూ ఏమీ సాధించలేదు. ఇక ముందు కూడా సాధించలేరు. సాధించారని చెప్పుకునే మహిమలు కేవలం అసత్యాలు మాత్రమే! ఆ పద్ధతులు మానేసి మనిషి తనలోని స్వార్థాన్ని, కుత్సిత బుద్ధిని తగ్గించుకుంటే సత్వరం ఇంకా మంచి ఫలితాలు వస్తాయి. చిత్తశుద్ధిగల యువతీ యువకులు హేతువాదులైతే, నిరీశ్వరవాదులైతే, సైన్సు కార్యకర్తలయితే వారు రాజకీయంగా ఎదిగి అధికారం చేపట్టగలిగితే ఈ ప్రపంచం రూపురేఖలు మారతాయి. అప్పుడే మానవత్వం వెల్లివిరుస్తుంది. మతాల పరిధిలో ‘జ్ఞానాన్ని’ గిరికీలు కొట్టిస్తున్న కుట్రను బద్దలుకొట్టి పైకి ఎదిగితేనే – ఎవరికైనా ‘జ్ఞానం – అంటే ఏమిటి’ అనే జ్ఞానోదయం అవుతుంది.

డా. దేవరాజు మహారాజు
హైదరాబాద్. ఫోన్: 990 863 3949.

# నీతిచంద్రిక

– రెంటాల సాంబశివరావు

1. **గుణాః కుర్వంతి దూతత్వం**
   **దూరేపి వసతాం సతామ్ ।**
   **కేతకీగంధ మాఘ్రాయ**
   **స్వయ మాయాంతి షట్పదాః ॥**

దూరంలో ఉన్నప్పటికీ వారి–వారి గుణములే రాయబారం చేసి సజ్జనులకు సాయపడతాయి. అది ఎలాగంటే, మొగలి పువ్వు యొక్క సుగంధాన్ని ఆస్వాదించి తుమ్మెదలు వాటంతట అవే వచ్చి చేరతాయి గదా ॥

2. **యాంతి న్యాయ ప్రవృత్తస్య**
   **తిర్యంచోపి సహాయతామ్ ।**
   **అపంథానం తు గచ్ఛంతం**
   **సోదరోపి విముంచతి ॥**

న్యాయ మార్గంలో పయనించేవానికి పశుపక్ష్యాదులు కూడా సాయం చేస్తాయి. అదే చెడు మార్గంలో పయనించేవారిని సొంత అన్నదమ్ములు కూడా వదిలిపోతారు.

3. **శశ్వద్యత్నవతామపి**
   **కర్మ ఋతే కాల మేతి న ఫలాప్తిమ్ ।**
   **ఉత్తుంగా అపి తరవో**
   **వినా ఋతుం స్వోచితం న ఫలంతి ॥**

పట్టు వదలకుండా ఎంత ప్రయత్నించినా ఆ పని, కాలం సమీపించకుండా సఫలము కాదు. అది ఎలాగంటే, చెట్లు ఎంత ఎత్తైనవైనా తగిన కాలం వచ్చేవరకు ఫలాలను ఇయ్యవు గదా ॥

4. **ఆపది ముంచేయు స్వప్రాణానపి**
   **నో నమంత్యరీన్ ధీరాః ।**
   **భిద్యేత దుర్వహభరాక్రాంతో**
   **న మహా న్నమేత్ శిలాస్తంభః ॥**

ఎలాంటి కష్టం కలిగినా, ధీరులు తమ ప్రాణాలనైనా వదిలేస్తారుగానీ శత్రువులకు నమస్కరించరు, లొంగరు. అది ఎలాగంటే, మోయలేనంత బరువు మీద పడినా కూడా మిక్కిలి పెద్దదైన రాతి స్తంభము ముక్కలు చెక్కలు అయిపోతుందిగానీ ఎప్పటికీ వంగదు గదా ॥

5. **అంకూరకారణమపి**
   **తుషహీన శ్వేత్ తండులో న రోహతి హి ।**
   **అతిచతురోపి సహాయా–**
   **ద్వినా న కర్మాణి నిర్వహతి లోకే ॥**

మొలకెత్తడానికి కారణమైన ధాన్యపు గింజ, పైన ఉండే పొట్టు లేకపోతే అది మొలకెత్తలేదుగదా. అలాగే, ఎంతటి సమర్థుడైనా, లోకంలో సహాయం లేకపోతే కార్యాలు నిర్వహించలేడు సుమా॥

6. **సరస శ్శోషే జలఖగవ–**
   **ద్ధావంతో న బాంధవాః విపది ।**
   **కిం తూత్పల కుముదాంబుజవత్**
   **సమ్మిళితా స్తదాపి చ స్వజనాః ॥**

సరస్సు ఎండిపోయినప్పుడు నీటిపక్షులవలె, కష్టకాలంలో ఉన్నప్పుడు వదలి పారిపోయేవాళ్ళు బంధువులు అనిపించుకోరు. కానీ ఆ కష్టకాలంలో కూడా కలువలు, తామరలు, పద్మాలవలె కలిసి ఉండేవారే ఆత్మీయులు సుమా ॥

7. **సర్వాశుచినిధానస్య**
   **కృతఘ్నస్య వినాశినః ।**
   **శరీరకస్యాంపి కృతే**
   **మూఢాః పాపాని కుర్వతే ॥**

అన్ని రకాలైన అపరిశుభ్రతకు నిలయమైనదీ, మంచితనమే లేనిదీ, నశించిపోయేదీ అయిన నీచ శరీరం కోసం కూడా మూర్ఖులు పాపాలు చేస్తారు గదా ॥

8. **యథా ప్రహ్లాదనా చ్చంద్రః**
   **ప్రతాపా త్తపనో యథా ।**
   **తథైవ సోంభూ దన్వర్థో**
   **రాజా ప్రకృతిరంజనాత్ ॥**

ఆనందం కలిగించే గుణమును కలిగియుండడం వలన చంద్రునివలెను, మిక్కిలి తాపం కలిగించడంవల్ల తపనుడు అనే పేరు సూర్యునికివలెను, ప్రజలను రంజింపజేయడంవలన రాజు అనే పేరు సార్థకంగా పొందియున్నాడు ॥

9. **చిత్తాహ్లాది వ్యసనవిముఖం శోకతాపాపనోది**
   **యజ్ఞోత్పాది శ్రవణసుఖదం న్యాయమార్గానుయాయి ।**
   **తథ్యం పథ్యం వ్యపగతమదం సార్థకం ముక్తవాదం**
   **యో నిర్దోషం రచయతి వచ స్తం బుధా స్సంత మాహుః ॥**

మనస్సునకు ఆనందాన్నిచ్చేదీ, దుష్టకార్యాలను దూరం చేసేదీ, శోకాన్ని, తాపాన్ని తొలగించేదీ, పుణ్య కార్యాలకు ప్రోత్సహించేదీ, వినసొంపైనదీ, న్యాయ మార్గంలో నడిపించేదీ, నిజమైనదీ,

మేలైనదీ, గర్వాన్ని రూపు మాపేదీ, అర్థవంతమైనదీ, వ్యతిరేకించే అవకాశం ఉండనిదీ, దోషరహితమైనదీ అయిన రచనను చేసేవాడే సజ్జనుడని పండితులు చెప్తారు ॥

**10. శిక్షా క్షయం గచ్ఛతి కాలపర్యయాత్**
**సుబద్ధమూలాః నిపతంతి పాదపాః ।**
**జలం జలస్థానగతం చ శుష్యతి**
**హుతం చ దత్తం చ తథైవ తిష్ఠతి ॥**

నేర్చుకున్న విద్య కాలక్రమంలో నశించిపోతుంది । బలమైన మూలాలుగల చెట్లు కూడా పడిపోతాయి । సరస్సులలోనున్న నీరు కూడా ఎండిపోతుంది । కానీ యజ్ఞయాగాదులు దానధర్మాలు వాటి ఫలితాలతో సహా అలాగే నిలిచి ఉంటాయి ॥

**11. ఇహ యత్ క్రియతే కర్మ / తత్ పరత్రోపభుజ్యతే ।**
**సిక్తమూలస్య వృక్షస్య /ఫలం శాఖాసు దృశ్యతే ॥**

ఈ లోకంలో చేసిన కర్మ యొక్క ఫలము పరలోకంలో అనుభవించాలి । మూలములో పోసిన నీరు కొమ్మలలో ఫలితాన్ని ఇస్తుంది ॥

**12. అత్యల్ప మపి సాధూనాం శిలాలేఖేవ తిష్ఠతి ।**
**జలలేఖేవ నీచానాం యత్ కృతం తద్వినశ్యతి ॥**

ఉత్తములకు చేసిన ఉపకారం కొంచెమైనా శిలాక్షరంవలె శాశ్వతంగా నిలిచి ఉంటుంది. అదే నీచులకు చేసినదైతే నీటిమీద రాతవలె తక్షణమే నశించిపోతుంది ॥

**13. వృద్ధౌ చ మాతాపితరౌ సతీ భార్యా సుతః శిశుః ।**
**అప్యకార్యశతం కృత్వా భర్తవ్యాః మను రబ్రవీత్ ॥**

వృద్ధులైన తలిదండ్రులను, ఉత్తమురాలైన భార్యయును, శిశువైన కొడుకు అనే వీరిని ఎన్ని కాని పనులను చేసైనా పోషించాలి. ఇది మనుశాసనం.

**14. దుర్భిక్షే చాంన్నదాతారం /సుభిక్షే చ హిరణ్యదమ్ ।**
**చతుర్థ్యశ్చ నమస్యామి / రణే ధీర మృణే శుచిమ్ ॥**

కరువుకాలమున అన్నదానము చేయువాడును, సుభిక్షంగా ఉన్నప్పుడు బంగారము దానము చేయువాడును, యుద్ధమందు ధీరుడును, అప్పు పద్ధతిగా తీర్చువాడును అను ఈ నలుగురూ నమస్కరింపదగినవారు ॥

**15. అత్యంత కోపః కటుకా చ వాణీ**
**దరిద్రతా చ స్వజనేషు వైరమ్ ।**
**నీచప్రసంగః గుణహీనసేవా**
**చిహ్నాని దేహే నరక స్థితానామ్ ॥**

మానవులలో నరక లోకంలో ఉన్నవారి లక్షణాలు – మిక్కిలి కోపమును, కఠినంగా మాట్లాడుటయును, మిక్కిలి పేదరికమును, తనవారితో విరోధమును, నీచులతోను, నీచులగూర్చి మాట్లాడటమును, చెడ్డ వారిని సేవించుటయును, అనేవి సుమా॥

**16. ధృతిః క్షమా దమోస్తేయం**
**శౌచ మింద్రియనిగ్రహః ।**
**ధీ ర్విద్యా సత్య మక్రోధో**
**దశకం ధర్మలక్షణమ్ ॥**

ధైర్యమును, ఓర్పును, ఇంద్రియనిగ్రహమును, దొంగతనము చేయకుండుటయును, శుభ్రతయును, బాహ్యేంద్రియ నిగ్రహమును, తెలివితేటలును, జ్ఞానమును, సత్యభాషణమును, కోపము లేకుండుటయును – అనే ఈ పదీన్నీ ధర్మమునకు లక్షణము ॥

**17. నైవాకృతిః ఫలతి నైవ కులం న శీలం**
**విద్యాపి నైవ న చ యత్నకృతాపి సేవా ।**
**భాగ్యాని పూర్వతపసా ఖలు సంచితాని**
**కాలే ఫలంతి పురుషస్య యథైవ వృక్షాః ॥**

మనిషి యొక్క ఆకారము మాత్రమే కార్యాలను సాధించలేదు । అలాగే కులమూ, శీలమూ, విద్యా కూడా సత్ఫలితాలను ఇవ్వలేవు । ఎంతో కష్టపడి చేసిన సేవలకు కూడా మంచి ఫలితాలు రాకపోవచ్చు । మానవుడు గతజన్మలో చేసిన తపస్సుతో కూడబెట్టిన భాగ్యాలే ఫలవృక్షాలవలె తగిన సమయాన అనువైన సత్ఫలితాలను ఇస్తాయి సుమా ॥

**18. తర్కోప్రతిష్ఠః శ్రుతయో విభిన్నాః**
**నైకో ముని ర్యస్య వచః ప్రమాణమ్ ।**
**ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం**
**మహాజనో యేన గత స్స పంథాః ॥**

వ్యాసమహాభారతంలో, ధర్మాన్ని గురించిన చర్చ ఇది । "ఔను కాదు – ఉంది – లేదు" అనే చర్చకి ఆస్కారమే లేనిది? ఎందరెందరో మునులు ఏవేవో చెప్పినా ఏ ఒక్కరి మాటా కూడా సాధికారత లేనిదే? కాబట్టి ఆ ధర్మము యొక్క తత్త్వము ఎవ్వరికీ అందని గుహలలో దాగి ఉంది । అందువలన మహాత్ములు నడచినదే మనకు అసలైన ధర్మమార్గము ॥

**19. శుభ్రం సద్మ సవిభ్రమాః యువతయః శ్వేతాతపత్రోజ్జ్వలా**
**లక్ష్మీ రిత్యనుభూయతే చిర మనుస్యూతే శుభే కర్మణి ।**
**విచ్ఛిన్నే నితరా మనంగకలహక్రీడా త్రుటత్తంతుకం**
**ముక్తాజాలమివ ప్రయాతి ఝుటితి భ్రశ్యద్దిశోదృశ్యతామ్॥**

మంచిపని జరుగుచుండగా విలాసవంతమైన భవనాలును, మనోహరులైన సుందరాంగులును, తెల్లని ఛత్రముతో విరాజిల్లే,

అనంతరాజసంపదయును లభించును । ఆ సత్కర్మయే నశించిపోయినచో మిక్కిలి విజృంభించిన శృంగార కేళి పారవశ్యములో దారము తెగిన ముక్తాహారమునందలి ముత్యాలవలె చెదరిపోయి వేగముగా ఆ భోగాలన్నీ కంటికి కనపడకుండా పోతాయి ॥

**20. స్థాల్యాం వైదూర్యమయ్యాం**
**పచతి తిలఖలం చాందనైరింధనౌఘై-**
**స్సౌవర్ణై ర్లాంగలాగ్రైర్విలిఖతి**
**వసుధా మర్కతూలస్య హేతోః ।**
**ఛిత్త్వా కర్పూరఖండాన్ వృతి**
**మిహ కురుతే కోద్రవాణాం సమంతాత్**
**ప్రాప్యేమాం కర్మభూమిం న భజతి మనుజో యస్తపో**
**మందభాగ్యః ॥**

1) వైదూర్యములు పొదగబడిన పాత్రయందు మంచిగంధపుకట్టెలతో తెలగపిండి వండుచున్నాడు ।
2) జిల్లేడు దూదికోసం బంగారు నాగలి మొనలతో భూమిని దున్నుచున్నాడు ।
3) కర్పూరపుటరటి చెట్లను నరికి బీరపాదులకు కంచె వేయుచున్నాడు ॥ అనగా మానవజన్మకు పరమార్థము జపహోమతపాదులచే మోక్ష సాధనకు కృషి చేయాలి। అదే లేకపోతే ఈ జన్మయే వ్యర్థమని భర్తృహరి చెప్పుచున్నాడు॥

**21. గుణవదగుణవద్వా కుర్వతా కార్య మాదౌ**
**పరిణతి రవధార్యా యత్నతః పండితేన ।**
**అతిరభసకృతానాం కర్మణామావిపత్తే-**
**ర్భవతి హృదయదాహీ శల్యతుల్యో విపాకః ॥**

పండితుడు, తాను చేసే పని మంచిదైనా చెడ్డదైనా ముందుగానే దాని ఫలితాన్ని శ్రద్ధగా తెలుసుకోవాలి । అలాకాక, మిక్కిలి త్వరత్వరగా చేసిన పనులయొక్క ఫలితము ముల్లులాగా హృదయాన్ని దహించివేస్తుంది ॥

**22. దుర్భిక్షే చాంన్నదాతారం**
**సుభిక్షే చ హిరణ్యదమ్ ।**
**చతుర్థ్య శ్చ నమస్యామి**
**రణే ధీర మృణే శుచిమ్ ॥**

కరువుకాలమున అన్నదానము చేయువాడును, సుభిక్షంగా ఉన్నప్పుడు బంగారము దానము చేయువాడును, యుద్ధమందు ధీరుడును, అప్పు పద్ధతిగా తీర్చువాడును అను ఈ నలుగురూ నమస్కరింపదగినవారు ॥

**23. సాధూనాం దర్శనం పుణ్యం**
**తీర్థభూతా హి సాధవః ।**
**కాలేన ఫలతే తీర్థం**
**సద్య స్సాధుసమాగమః ॥**

సజ్జనుల దర్శనమే పుణ్యప్రదము. ఎందుకంటే వారు తీర్థఫలములను అనుగ్రహించువారు తీర్థాలైతే కాలక్రమేణ ఫలితాలనిస్తాయి । అలాకాక సజ్జనసంబంధమే వెంటనే ఫలిస్తుంది ॥

**24. అర్థాగమో నిత్య మరోగితా చ**
**ప్రియా చ భార్యా ప్రియవాదినీ చ ।**
**వశ్య శ్చ పుత్రోర్థకరీ చ విద్యా**
**షడ్జీవలోకస్య సుఖాని లోకే ॥**

ఈ లోకంలో మానవులు సాధారణంగా కోరుకునే సుఖాలు ఆరు – 1) నిత్యమూ ధనాదాయము, 2) పరిపూర్ణమైన ఆరోగ్యము, 3) నచ్చిన, 4) ఇష్టంగా మాట్లాడే భార్య, 5) ఉత్తముడైన కొడుకు, 6) జీవనానికి పనికి వచ్చే విద్య ॥

**25. జీవంతం మృతవన్మన్యే**
**దేహినం ధర్మవర్జితమ్ ।**
**మృతో ధర్మేణ సంయుక్తో**
**దీర్ఘజీవీ న సంశయః ॥**

అధర్మవర్తనుడై బ్రతికేవానిని నేను మృతునిగానే భావిస్తాను । అలాగే ధర్మబద్ధుడైనవాడు మరణించినా కూడా వానిని చిరంజీవియే అని తలుస్తాను । ఇందులో అనుమానమే లేదు ॥

**26. శ్లోకార్ధేన ప్రవక్ష్యామి / యదుక్తం గ్రంథకోటిభిః ।**
**దయాసమం నాస్తి పుణ్యం**
**పాపం హింసాసమం న హి ।**

కోటి గ్రంథాలలో చెప్పిన విషయాన్ని ఒకే ఒక్క శ్లోకపాదంలో చెప్తాను । దయతో సమానమైన పుణ్యము లేదు । హింసతో సమమైన పాపమును లేదు ॥

**27. చంద్రః క్షయీ వక్రతనుః కళంకీ**
**దోషాకరస్స్ఫురతి మిత్రవిపత్తికాలే ।**
**మూర్ధ్నా తథాంపి సతతం ధ్రియతే హరేణ**
**నైవాంశ్రితేషు మహతాం గుణదోషచింతా ॥**

చంద్రుడు శుక్లకృష్ణపక్షాలలో క్షీణిస్తూ వృద్ధి చెందుతూ ఉంటాడు । వంకరగా ఉంటాడు । మచ్చ ఉన్నవాడు । రాత్రికి కారణమైనవాడు । మిత్రుడు (సూర్యుడు) అస్తమించిన సమయంలో ఉదయిస్తాడు । అయినా సరే పరమేశ్వరుడు వానిని తలపైన ధరించాడు । దీనినిబట్టి మహాత్ములు తనవారిలో గుణదోషాలను గణింపరు ॥

**28.** ప్రాప్య చాంప్యుత్తమం జన్మ
లబ్ధ్వా చేంద్రియ సౌష్ఠవమ్ ।
న వేత్త్యాత్మ హితం యస్తు
స భవే దాత్మఘాతకః ॥

లోకోత్తమమైన మానవజన్మనెత్తి కూడా శరీరం సంపూర్ణంగా బలంగా ఆరోగ్యంగా ఉండి కూడా తనకు మేలైనదేదో తెలుసుకోలేకపోతే – అలాంటివాడు తనను తాను నాశనం చేసుకుంటున్నాడు ॥

**29.** ప్రియః ప్రజానాం దాతైవ
న పునర్ద్రవిణేశ్వరః ।
గత్వా తు కాంక్ష్యతే లోకై-
ర్వారిదో న చ వారిధిః ॥

ప్రజలకు మహాదాత అంటేనే ఇష్టము, కానీ ధనవంతుడంటే కాదు. అది ఎలాగంటే లోకులు నీటినిచ్చే మేఘాన్ని కోరతారుగానీ నిండా నీరున్నా సముద్రాన్ని ఎవ్వరూ కోరరుగదా ॥

రెంటాల సాంబశివరావు, కొవ్వూరు. ఫోన్: 789 385 5174.

## కమ్మతెమ్మెరలు

'... **మిసిమి** పత్రిక సంపాదకులకు నమస్కారములు.. అందింది అందంగా **మిసిమి** (మార్చి–2023). లలిత సంగీత మాధుర్యం పట్టుకు వచ్చింది **మిసిమి**. కృష్ణమోహన్ గారి ఇంటర్వ్యూ అద్భుతంగా సాగింది. బ్రహ్మసమాజం రోజుల్లో కృష్ణశాస్త్రిగారి గీతాలు – లలిత సంగీత గీతాలకు నాంది పలికాయి. చలంగారివంటి మహనీయులు కాకినాడ వీధులవెంట సుప్రభాత సేవ ద్వారా పాడుకుంటూ జనంలో బ్రహ్మసమాజంపట్ల ఆసక్తి కలిగించారు. లలిత సంగీతం వింటూ ఉంటే ఏదో అనిర్వచనీయమైన మహదానందం కలిగింది. కృష్ణశాస్త్రి – విశ్వనాథ – మల్లవరపు – ఇంద్రగంటి శివరామారావు – రజనివంటి వారి రచనలు గొప్ప సాహిత్య సంపద. బాలమురళీ – రజనీగారు ఆకాశవాణి ద్వారా భక్తిరంజని ద్వారా భక్తితో కూడిన రసరమ్య గీతాలు – సుందర సుప్రభాతంలో వింటుంటే భక్తితో పరవశింపజేసిన మా హృదయాలు, 'నాటు నాటు' పాటలతో యువజన హృదయాలు చిందులు వేస్తున్న తరుణంలో ఆనాటి సాహిత్యం – ఆ లలిత – భక్తి సంగీతం మాధుర్యం ఈ తరం వారికి ఎలా తెలుస్తుంది – కృష్ణమోహన్‌గారు ఎక్కడా రాజీ పడకుండా సుసంపన్నమైన సంగీత సాహిత్యాలను అందించి ధన్యత పొందారు. వారి కృషి – శ్రమ – భావిసంగీత విద్వాంసులకు మార్గదర్శనం చేస్తుంది. 'మొక్కజొన్న తోటలో' గీతానికి బి.వి. నరసింహారావుగారు ట్యూన్ చేశారు. బాలబంధు బావి నరసింహారావుగారు ఎన్నో బాలసాహిత్యం వ్రాసి కీర్తిని సాధించుకున్నారు. వారే ఈ లలిత గీతాలకు నాట్యం చేసేవారు. కృష్ణశాస్త్రి గారింటి స్నేహం – అనసూయ – బుజ్జాయి గార్లతో పెరిగినవారు. చలం – సంజీవదేవ్ వంటివారికి మంచి మిత్రులు. 'నింగికి నేలకు వంగిన వంతెనగా' రజనిగారి పాట వారు పాడగా విన్నాను. కృష్ణశాస్త్రి – రజనీ గారలు ఎన్నో సంగీత రాగరసాలు రచించి – నిర్వహించి – ప్రసాదం చేసి కృష్ణ–రజనీగా కీర్తిని మూటకట్టుకున్నారు. శత వసంతాలు సంగీతంతో – సాహిత్యంలో – పరిశోధనలో ప్రపంచంలోని వివిధ దేశాల సంగీత రాగాలను తెలుగు పాటకు మహత్తరమైన శోభను కలిగించినవారు రజనీగారు – సాహిత్య సంగీతాలు వారి సొమ్ము. శ్రీ కృష్ణమోహన్ – రజనీ గారల గురించి చదువుతుంటే లలిత సంగీత మాధుర్యంతో ముగ్ధుడినైనాను. ఆనాటి గాయనీమణులు సీత–అనసూయ – శ్రీరంగం గోపాలరత్నం – వింజమూరి లక్ష్మి – ప్రన్నం రాజు సీత – అవసరాల సత్యవతివంటివారెందరో జ్ఞాపకానికి వచ్చారు. రచయితల ఇష్టాగోష్ఠి రమ్యంగా సాగింది. చదువుతుంటే 'అయ్యో! నేను లేకపోయానే' అనిపించింది. అయినా చదువుతూ పాల్గొన్నంత అనుభూతిని పొందాను. అశ్వినీకుమార్! గంధర్వుడువంటివారు. వారు ఏం చేసినా అందంగా – రసానంద పారవశ్యంగా ఉంటుందనడంలో సందేహం లేదు. ఇలాంటి మంచి వ్యాసాలు **మిసిమి** ద్వారా చదువుతూ ఆరోగ్య భాగ్యాన్ని పొందుతున్నాం.... **మిసిమి** ఏప్రిల్ – 2023 సంచికలో ఎబికె ప్రసాద్ గారి గురించి చదివి ఆనందించాను. పత్రికారంగంలో స్వతంత్ర్య భావాలు కలిగిన వ్యక్తిత్వం వారిది. జర్నలిస్టు ఎలా నడవాలో, నడిపించాలో తెలిసినవారు. యమ్.సి. కోటంరాజు పున్నయ్య, రామారావు, ఖాసా సుబ్బారావువంటి ప్రముఖుల సరసన నిలబడే వ్యక్తి. యాజమాన్యానికి తలవగ్గే తత్వం కాదు. ఇంతటి మహనీయుని గురించి ఇంటర్వ్యూ చేసి పాఠకులకందించిన అశ్వినీకుమార్‌గారికి ధన్యవాదాలు. శ్రీదేవి గారి 'కాలాతీత వ్యక్తులు' గొప్ప నవల. అలాగే గోపీచంద్ 'అసమర్థుని జీవనయాత్ర', కొడవటిగంటివారి నవల 'చదువు', లతామోహన్ 'వంశి' ఆ తరంలో గొప్ప నవలలుగా ప్రసిద్ధి చెందాయి. అవన్నీ ఈ వృద్ధాప్యంలో జ్ఞాపకానికి తెస్తున్నారు **మిసిమి** వారు. కృతజ్ఞతలు."

– చెరుకువాడ వెంకట్రామయ్య, విస్సాకోడేరు – ఫోన్: 954 211 8184.

# కన్యాశుల్కము -

## ఒక పరిశీలన

– పల్లి హనుమయ్య

**వస్తువు:** 'కన్యాశుల్కం' అని నామకరణ చేశారేగాని చిత్రితమైన విషయం కేవలం కన్యాశుల్కమే కాదు. ఆ సమస్యను కేంద్రంగా తీసుకొని యావత్సమకాలీన జీవితము ఇమిడిపోయేంత విస్తృతమైన చిత్రాన్ని రచించారు. జీవితానికి సంబంధించిన సర్వాంశాలకు పరస్పర సంబంధం ఉంటుంది కనుక ఏ ఒక్క విషయాన్నైనా కేంద్రంగా తీసుకొని మిగతా విషయాలన్నింటినీ చిత్రించవచ్చు. కానీ అలా చేయడం మహా ప్రతిభా సంపన్నులకే సాధ్యమవుతుంది. చిత్రితాంశాలన్నిటికీ సంపూర్ణమైన ఏకత్వం రావాలి. అంశానికి, అంశానికీ మధ్య ఖాళీలుగానీ, కృత్రిమ సంబంధాలుగానీ ఉండకూడదు. ఒకే దారంతో అల్లిన లేసు అల్లకంలాగా నాటకమంతా తయారుకావాలి. అంటే చిత్రితాంశాలన్నీ ఒక సంపూర్ణ సౌష్టవం కలిగిన స్వరూపంలోకి సహజ భాగాలుగా ఒదిగిపోవాలి. అలా చేయడంలో అప్పారావుగారు కృతార్థులయ్యారా?

**సమాజ స్వభావం:** జీవిత వికాసానికి సమాజం క్షేత్రంలాంటిది. భావాలు, సంస్థలు, ఉపకరణాలు, కాలానుసారంగా జీవిత వికసనా విధానంలో మార్పులు వస్తాయి. మార్పు వచ్చినప్పుడు తత్పూర్వ భావాలు, సంస్థలు ప్రయోజన సాధనాలుగా పనికి రావు. క్రొత్త భావాలు, సంస్థలు పుట్టుకొస్తాయి. అలా జరగడానికి సిద్ధాంతాల వెలుగు కావాలి. కనుక క్రొత్త సిద్ధాంతాలు రూపిస్తాయి. అలా కాకపోతే పాత సిద్ధాంతాలను క్రొత్త వెలుగులో దర్శించి క్రొత్త అర్థం చెప్పడమైనా జరుగుతుంది. భావాలు, సంస్థలు వాటి ప్రయోజనం తీరిన తరువాత ఎంతకాలం నిలిచి ఉంటాయో అంతకాలం దుర్వినియోగ సాధనాలుగా మాత్రమే పనిచేయగలుగుతాయి. యుగసంధిలో నవ్యత కండ్లకు కనిపిస్తుంటుంది. పాత్రను వదలలేక మానవులాయసపడుతుంటారు. అంతవరకు సత్ప్రయోజన సాధనాలుగా ఉన్న సంస్థలు, భావాలు దుర్వినియోగ సాధనాలుగా పనిచేయ మొదలెట్టుతాయి.

యుగసంధిలో ఉన్న సమకాలీన సామాజిక జీవితాన్ని కన్యాశుల్కంలో అప్పారావుగారు చిత్రించారు. ఆధునిక శాస్త్రజ్ఞానం, పరదేశ ప్రభావం నవ సమాజ వ్యవస్థను కండ్లయెదుట చూపిస్తుంటుంది. సాంప్రదాయంగా వచ్చిన సామాజిక వ్యవస్థ విచ్ఛిన్నమైపోతుంటుంది. సాంప్రదాయకమైన విద్యలు, సంస్థలు దుష్ప్రయోజన సాధనాలుగ ఉపకరిస్తుంటాయి. దేవాలయాలు, మఠాలు, సారాయి, భంగు సేవించడానికి, రహస్య వ్యభిచారాలకు కాణాచులవుతాయి. జ్యోతిషం, భూతవైద్యం మొదలైన విద్యలు దొంగ జాతకాలు బనాయించడానికి వంచనచేత ధనమార్జించడానికి ఉపయోగితమవుతాయి. శిష్యులచే విస్తాళ్లకు ఆకులు, పెయ్యలకు గడ్డి తెప్పించుకొని, అరవచాకిరి చేయించుకోవడానికి వేదవిద్య పనికి వస్తుంది. ఇలాంటి సామాజిక సంస్థలు బరువెక్కి నల్లబండల్లాగు సామాజికుల గుండెల మీద నిలుస్తాయి. సామాజికులు ఊపిరాడని స్థితిలో పడి విచక్షణా జ్ఞానాన్ని కోల్పోతారు. అడ్డమైన అవినీతికి గురవుతారు. కొంతసేపు పరవంచనకు పథకాలు పన్నుతారు. కొంతసేపు పరస్పరం ఘర్షించుకొని ఉన్మత్తాగ్రహంతో ఉగ్రరూతలూగుతారు. కొంతసేపు భీతాహంతో తమ నీడలచాటున తామే దాగడానికి విఫల ప్రయత్నం చేస్తారు. కన్పించిన మార్గమెల్లా మాదేనని కాలాడిస్తారు. చివరకు ఉచ్చులో తగుల్కొని గుండెలు ప్రేలిపోయేట్టు భోరున ఏడుస్తూ కరుణామయంగ నిలిచిపోతారు. ఆ సామాజికులే అప్పారావుగారి కలంలోంచి కన్యాశుల్క నాటక పాత్రలుగా కళా ప్రపంచంలోకి దిగి వచ్చారు.

**పాత్రల స్వాభావం :** కన్యాశుల్కంలోని పాత్రలను అనేక విధాలుగా వర్గీకరణ చేయవచ్చు. స్వతంత్ర పాత్రలు, పరాధీన పాత్రలు అనేది ఒక విధమైన వర్గీకరణ. స్వకీయమైన స్థానం, ప్రయోజనంకలది స్వతంత్ర పాత్ర. మరియొక పాత్రయొక్క గుణగణాలను వెలువరించడమే ప్రయోజనంగా కలది పరాధీన పాత్ర. ఒక పరాధీన పాత్రను తొలగిస్తే, ఆ పాత్ర ఏ పాత్ర కోసం పుట్టిందో ఆ పాత్ర మాత్రమే ప్రత్యక్షంగా దెబ్బతింటుంది. ఒక స్వతంత్ర పాత్రను తొలగిస్తే నాటకం మొత్తమే దెబ్బతింటుంది. కన్యాశుల్కంలో ప్రధానమైన పాత్రలేకాక చివరకు అసిరిగాడివంటి కనిష్ట పాత్ర సహితం స్వతంత్ర పాత్రలే. ఏ ఒక పాత్రను తొలగించినా ఆ మేరకు నాటకానికి రక్తిలో కొరత కలుగుతుంది. అంతేకాదు కన్యాశుల్కంలోని పాత్రలను మరో విధంగా కూడా వర్గీకరణ చేయాలి. ఆ వర్గీకరణన విమర్శకునకు స్ఫురించకపోతే, నాటక వివరణకు సంబంధించిన కీలకం అతడికి దొరుకదని నా అభిప్రాయం. ఆ విధమేంటో చూతాం. కొన్ని పాత్రలు మనుష్యుల తరహాలకు ప్రతినిధులుగా నిలుస్తాయి. వాటిని ప్రతినిధి పాత్రలందాము. గుణాలకో, భావాలకో, సంస్థలకో మరికొన్ని పాత్రలు సంకేతాలుగా నిలుస్తాయి. వాటిని సాంకేతిక పాత్రలందాం. సౌజన్యారావు పంతులుగారు, కరటక శాస్త్రి, మధురవాణి సాంకేతిక పాత్రలు. మిగిలినవన్నీ ప్రతినిధి పాత్రలు. సౌజన్యారావు పంతులు సుజనత్వానికి, కరటకశాస్త్రి కవిత్వానికి, మధురవాణి నాట్యానికి సంకేతాలు. రచయిత ఇలా ఉద్దేశించకపోతే కరటకశాస్త్రిని మహాకావ్య పండితుడుగా, మధురవాణిని నాట్యకత్తెగాను, మనిషియొక్క గుణాగుణాలతో పనిలేకుండ ఆపదలోనున్న ప్రతివాడికి సహాయం చేయడానికి సిద్ధంగానున్న శరణ్యంలాగు సౌజన్యారావు పంతుల్ని ప్రదర్శింపవలసిన అవసరం లేదు. ఈ విషయ నిర్ధారణ ఈ వ్యాసమంతటిలో ఆయా స్థలాలలో చూడవచ్చు.

**పాత్ర చిత్రణ :** కథ అనేది ఉంటే ఏ రచనా ప్రక్రియ అయినా సరే పాత్రచిత్రణ ప్రధానస్థానం తీసుకుంటుంది. ప్రాచీన సాహిత్యంలో ఉన్న కథలలో పాత్ర చిత్రణ అంతగా లేదు. కనుక వాటిని ఆధునిక ప్రమాణాల ప్రకారం కథలనము. సంఘటనా క్రమత అని మాత్రమే అంటాము. కథలోనే పాత్రచిత్రణకు అంత ప్రాధాన్యత ఉంటే పాత్రలు సజీవరూపాలతో కండ్లయెదుట భాషించి, అభినయించే దృశ్యకావ్యమైన నాటకంలో ఇక ఎంతగా ఉంటుందో చెప్పనక్కరలేదు. పాత్రచిత్రణ నాటకకర్త ప్రజ్ఞకొక గీటురాయి. పాత్రకు స్వేచ్ఛయిస్తే అది దాని ఇష్టం వచ్చినట్లు పరిభ్రమిస్తూ దాంతోపాటు రచయితనే లాక్కుపోయి నాటకాన్ని శంకరగిరి మాన్యాలు పట్టిస్తుంది. అలా అని పాత్రలను బాగా అదుపులో పెడితే అవి లోలోననే కిక్కురు మిక్కురుమనకుండా చచ్చి శవాకారాలుగా మిగులతాయి. అందువల్ల పాత్రలను ఎలా పరామర్శించాలో ప్రతిభావంతునికే సాధ్యమవుతుంది. పాత్రల మనస్తత్వాన్ని రచయిత కరతలామలకంగ గ్రహించుకోవాలి. ఏ పాత్ర ఏ సందర్భంలో ఎలా ఆలోచించి, ఏ రకమైన భాషలో ఎలా వ్యక్తం చేస్తుంది అనే విషయం సంపూర్ణంగా తెలియాలి. పాత్రోన్మీలనతకు అనుకూలంగా సన్నివేశం, సన్నివేశానికి అనుకూలంగా పాత్ర వ్యాపారం సమైక్యం చెందాలి. శబ్దం, అర్థంలాగు అవి రెండు విడదీయడానికి వీలుకాని సమ్మేళనం. పాత్ర కోసం సన్నివేశాన్నో, సన్నివేశం కోసం పాత్రనో సృష్టిస్తే వాటిరెంటికి అంగాంగి భావం కుదర్చడం అసాధ్యం. అలా చేయడానికి ప్రయత్నిస్తే నాటకం నిర్జీవమైన యాంత్రిక చట్రంలాగు తయారవుతుంది. ప్రతిభావంతుడైన రచయిత యొక్క ఊహలో పాత్ర సన్నివేశం సమ్మిళితంగా నేరుపించుతాయి. అప్పుడే నాటకం సజీవంగ, సహజంగ సృష్టవుతుంది. ఈ విషయంలో అప్పారావు పంతులుగారు పూర్తిగా కృతార్థులైనారు.

**హాస్యము :** కన్యాశుల్కంలో హాస్యం అసాంతం ఉంది. హాస్యం అంత ప్రధానంగా ఉండటంవల్ల రసనిర్ణయంలో విమర్శకులు భ్రాంతికి లోనయ్యే అవకాశం హెచ్చింది. 'కన్యాశుల్కంలో అప్పారావుగారు హాస్యరసాన్ని కావ్యస్థాయికి ఎత్తి, దానిని ప్రధాన రసంగ పోషించారు' అనే వాదం ఒకటి ఉందని విన్నాను. హాస్య రసాన్ని అప్పారావుగారెందుకు వాడుకున్నారో గమనించనందున కలిగిన ప్రమాదాలే ఈ రెండు వాదాలని నామట్టుకు నాకు తోచింది. ఈ విషయాన్ని రసనిర్ణయమనే శీర్షికలో వివరిస్తాను. కన్యాశుల్కంలో హాస్యం ఏ ప్రయోజనాన్ని ఎలా సాధించి, అంగిరస నిర్ణయ విధానానికి

కీలకమయిందో చూడాలంటే అసలు హాస్యం ఎలా పుడుతుంది. సామాజికుల వైఖరిమీద దాని ప్రభావం ఎలా ఉంటుంది అనే విషయాన్ని రేఖామాత్రంగానైనా స్పృశించక తప్పదు. కనుక ఆ విషయాన్ని సూక్ష్మంగా పరిశీలించుదాము. దేశకాల సందర్భానుసారంగ జీవిత ప్రతిచర్య మారుతుంటుంది. అలా మార్పు చెందకపోవడాన్ని యాంత్రిక లక్షణమంటాం. జీవితంలో యాంత్రిక లక్షణం కనిపిస్తే శ్రోతలలో లేక ప్రేక్షకులలో నవ్వు పుడుతుంది. ఆ యాంత్రిక లక్షణం వలన ఎవరికైనా అవమానమో, హానో కలిగితే వారిలో మాత్రం నవ్వు పుట్టదు. ఆగ్రహం, దుఃఖం, జుగుప్స మొదలైన వ్యతిరేక ప్రతిచర్యలు కలుగుతాయి. మిగతావారిలో నవ్వు పుడుతుంది. ఈ యాంత్రిక లక్షణం మాటల్లో వుండవచ్చు. చేష్టల్లో ఉండవచ్చు. నవ్వు పుట్టించువాడు యాంత్రిక లక్షణాన్ని తెలిసి, ఉద్ధేశపూర్వకంగా ప్రవేశపెడితే వ్యక్తహాస్యం. తనకు తెలియకుండా ప్రవేశపెడితే అవ్యక్త హాస్యం. వ్యక్త హాస్యంలో హాస్యానికి గురైన వ్యక్తి కేసి లేక విషయానికేసి, లేక రెంటికేసి ప్రేక్షకులు నవ్వుతారు. కాని నవ్వు పుట్టించిన వాడికేసి మాత్రం ఎప్పుడూ నవ్వరు. అతడి ప్రతిభను మెచ్చుకొని, ఆదృతి చూపుతారు. అవ్యక్త హాస్యంలో ఎల్లప్పుడు నవ్వు పుట్టించే వాడికేసే నవ్వుతారు. కొన్నిసార్లు విషయం కేసిగూడా నవ్వుతిరుగవచ్చు. ఇన్ని రకాల హాస్యం కన్యాశుల్కంలో కన్పిస్తుంది.

**ఉదాహరణలు :** 1. గిరీశం లుబ్ధావధాన్లుకు వ్రాసిన ఉత్తరం రామప్ప పంతులు చదువుతుంటాడు. అందులో 'రామప్ప పంతులు తెలివికొక పెద్ద గాడిద' అని రాసి వుంటుంది. కొంచెం సేపయినతర్వాత వేరే సందర్భంలో 'మధురవాణికి అలా గడ్డిపెట్టండి' అని రామప్ప పంతులు లుబ్ధావదాన్లుతో అనటం జరుగుతుంది. 'గడ్డి గాడిదలు తింటవి' అని మధురవాణి త్రిప్పికొదుతుంది. రామప్ప పంతులుకి కోపం వస్తుంది. కాని ప్రేక్షకులలో నవ్వు పుడుతుంది. 'గడ్డి' అనేమాటకు 'చీవాట్లు' అని ఒకర్థం, 'పశువుల ఆహారం' అని మరో అర్థం వున్నాయి. అర్థాన్ని బట్టి మాటమారిపోకుండా రెండర్థాలలో ఒకే మాట రావడం భాషలోవున్న యాంత్రిక లక్షణం. 'గడ్డి' అనే మాటను రామప్ప పంతులొక అర్థంలో, మధురవాణి మరో అర్థంలో ఉపయోగించేప్పటికీ ఆ యాంత్రిక లక్షణం శ్రోతల గ్రహింపునకు అందుతుంది. అందువల్ల వారిలో నవ్వు పుడుతుంది. ఈ నవ్వు విషయంకేసి సారించబడింది. కనుక ఈ విషయంలో ప్రేక్షకుల నవ్వు విషయం వైపు, హాస్యానికి గురిఐన వ్యక్తి వైపు సారించబడింది. రామప్ప పంతులికి ఈ యాంత్రిక లక్షణం అవమానం కలిగించింది కనుక అతడిలో కోపం అనే వ్యతిరేక ప్రతిచర్య కలిగింది.

2. 'వెధవలు' అను తెలుగు మాటను 'వోధ్వల్' చేసి దానికి కోర్టులు అని అర్థం చెప్పాడు గిరీశం. తెలుగుమాటకు పరభాషోచ్చారణా పద్ధతిని అన్వయించడం ఒక యాంత్రిక లక్షణం. దానికి కోర్టులని అవసరం కొద్దీ అర్థం చెప్పడం భాషను స్వప్రయోజనానికి శబ్దార్ధ నియమరహితంగా ఉపయోగించు కోవడం. అలా ఒక రంగంలోకి తద్భిన్నమైన విషయాన్ని ప్రవేశ పెట్టడం మరియొక యాంత్రిక లక్షణం. కనుక ప్రేక్షకులలో నవ్వు పుడుతుంది. ఇది గిరీశం తెలిసి, ఉద్ధేశపూర్వకంగా చేసినది కనుక వ్యక్తహాస్యం. నవ్వు విషయంకేసి సారించ బడుతుంది. నవ్వించిన వాడి పట్ల మెప్పు కలుగుతుంది.

3. 'ఆడ దయ్యాన్ని మగ దయ్యాన్ని ఒకే సీసాలో పెడితే అవి దయ్యపిల్లల్ని పెట్టవా?' అంటుంది మీనాక్షి. మానవ జాతిలోని స్త్రీ పురుష కూటమికి సంబంధించిన ఫలితాన్ని దయ్యాలకు అన్వయించడం యాంత్రిక లక్షణం. దీనిని మీనాక్షి తెలియక ప్రవేశపెట్టింది కనుక అవ్యక్త హ్యాసం. కనుక నవ్వు మీనాక్షికేసి, విషయానికేసి సారించబడింది.

4. అగ్నిహోత్రావధాని ప్లీడర్ నాయుణ్ణి 'నీ యింట కోడి గాల్వ' అని శపిస్తాడు. పదహారు అణాల శాఖాహారియైన, శ్రోత్రియ బ్రాహ్మణుడికైతే అది నీచమైన శాపమే. నిత్యం మాంసాహారానికై ఉవ్విళ్లూరె శూద్రుడికి అదిశాపం ఎలా అవుతుంది? కేవలం బ్రాహ్మణ సందర్భంలో ఉపయోగించవలసిన దానిని శూద్ర సందర్భంలో ఉపయోగించడం యాంత్రిక లక్షణం. 'అమోఘా శీర్వాదము' అని నాయుడు సమాధానంగా అనిన వెంటనే యీ యాంత్రిక లక్షణం ప్రేక్షకుల దృష్టికి వస్తుంది. నవ్వుతారు. దీనిని అగ్నిహెూత్రావధాని తెలియక ప్రవేశపెట్టాడు గనుక అవ్యక్త హాస్యం. నవ్వు అగ్నిహెూత్రావధానికేసి సారించబడుతుంది. ఇంతకు తేలిందేమిటంటే... జీవితంలో యాంత్రిక లక్షణం కన్పిస్తే

నవ్వు పుడుతుంది. ఆ యాంత్రిక లక్షణం హానికరంగ ఎవరి కుంటుందో వారిలో కోపం, ద్వేషం మొదలయిన వ్యతిరేక ప్రతిచర్యలు కలుగుతాయి. మిగతా వారిలో నవ్వు పుడుతుంది. నవ్వు పుట్టిన వారిలో కోపం, జుగుప్స మొదలైన వ్యతిరేక ప్రతిచర్యలు జనించవు. వ్యక్త హాస్యం సృష్టించిన వాడిపట్ల ప్రేక్షకులకు మెప్పు కలుగుతుంది. అవ్యక్తహాస్యం సృష్టించిన వాడిపట్ల ప్రేక్షకులకు నవ్వు పుడుతుంది. నవ్వు పుడుతుంది కనుక ద్వేషం మొదలైన ప్రతికూల ప్రతిచర్యలు కలుగవు. ఛాందసం అంటే దేశకాల సందర్భానుసారంగా మార్పు చెందని మనస్థితి. కనుక అది యాత్రిక లక్షణమే. ఇది అగ్నిహోత్రా వధాని, లుబ్ధావధాన్లు, రామప్ప పంతులు మొదలైన పాత్రలలో ఉంది. ఒకవేళ హాస్యం పెట్టవలసి వస్తే అలాంటి వారిలో అవ్యక్తహాస్యమే పెట్టాలి. అలా పెట్టకపోతే పాత్ర అనౌచిత్య దోషానికి గురై దెబ్బతింటుంది. ఈ విషయాన్ని బాగా గుర్తెరిగిన అప్పారావు పంతులుగారు ఆ పాత్రలకు అవ్యక్తహాస్యాన్నే పెట్టారు. హాస్యం పెట్టారు గనుక, ఆ పాత్రల పట్ల ప్రేక్షకులకు నవ్వు పుడుతుంది గనుక, అసూయ, క్రోధం, ఆగ్రహం, ద్వేషం మొదలైన వ్యతిరేక ప్రతి చర్యలకు తావులేదు. గిరీశం ఛాందసుడు కాదు. దేశకాల సందర్భానుసారంగా తాను మారడమే కాకుండా సిద్ధాంతాలను, శబ్దాలను, భావాలను, నైతిక సూత్రాలను సహితం తన స్వార్థానికై పేక ముక్కల మేడలుగా నిలువబెట్టాడు. కుయుక్తిపరుడు. కనుక అలాంటి పాత్రకు హాస్యం పెట్టవలసివస్తే వ్యక్తహాస్యం పెట్టాలి. అదే అప్పారావు పంతులుగారు చేశారు. వ్యక్తహాస్యకర్త అయినందున గిరీశం కేసి ప్రేక్షకులు నవ్వరు. అతడి హాస్యంలోని విషయానికేసి మాత్రమే నవ్వుతారు. అయితే అతడి ప్రతిభ పట్ల మెప్పు, అతడి యెడల అద్భుతి ప్రేక్షకులలో కలుగుతుంది.

మధురవాణి, కరటకశాస్త్రి, శిష్యుడు దుష్టపాత్రలు కావు. ఛాందసపాత్రలు కావు. ఛాందసపాత్రలు కానందున వాటికి అవ్యక్తహాస్యం అనౌచిత్యం. అందుకని వాటికి వ్యక్తహాస్యం పెట్టడం జరిగింది. వాటికి హాస్యం పెట్టకపోయినా ప్రేక్షకులకు వాటిమీద ద్వేషం కలుగదు. వాటిని ప్రేక్షకులు ఎప్పుడైనా ఆమోదించి ఆద్భుతి చూపుతారు. అయితే ఆ పాత్రలక్కూడా ఎందుకు హాస్యం పెట్టాడు? అలా పెట్టడం అనవసరం కదా? అనవసరమైనది కళాసృష్టిలోవుంటె ఆ కళాఖండం దెబ్బతిని పోదా? అనే ప్రశ్న పరంపర ఉదయించవచ్చు. ఆ పాత్రలక్కూడా హాస్యం అవసరమే అయింది. హాస్యం పెట్టకపోతే ఆ పాత్రలలో ఒక రకమైన గాంభీర్యత వస్తుంది. నాటి వైఖరిని దుష్టపాత్రల పట్ల ద్వేషపూరితంగా వుంచవలసివస్తుంది. అవి సత్పాత్రలు గనుక వాటిపట్ల ప్రేక్షకుల కెంతో సానుభూతి ఉంటుంది. అవి తతిమ్మా పాత్రలను ద్వేషిస్తూ ఉంటే, వాటిపట్ల గల సానుభూతి కొద్ది ప్రేక్షకులు కూడా ద్వేషిస్తారు. అలా ద్వేషం కలుగనిస్తే అప్పారావుగారి ఆశయమె దెబ్బతింటుంది. (ఈ విషయాన్ని రసనిర్ణయ శీర్షిక క్రింద విచారిస్తాం). కనుక అప్పారావు గారు వాటికికూడా తదుచిత హాస్యాన్ని పెట్టాడు. మరో కారణం కూడా వుంది.. ఆ పాత్రలు సుయుక్తితో కన్యాశుల్క ప్రయత్నాన్ని విచ్ఛిన్నం చేయవలసి ఉంది. గాంభీర్యతగల పాత్రలను యుక్తులకు పాల్పడచేయడం అంతగ ఔచిత్యం కాదు.

**నవ్వు :** నవ్వు ప్రాణికోటిలోకెల్లా ఒక్క మానవుడికి మాత్రమే అనుగ్రహించబడింది. బుద్ధి వికాసం కూడా ఒక్క మానవుడికే ఉంది. కనుక నవ్వుకు బుద్ధివికాసానికి సంబంధం ఉంది. జుగుప్స, ఆగ్రహం, భయం మొదలైన ప్రతికూల ప్రతిచర్యలు పొడమినప్పుడు నవ్వుకు తావుండదు. నవ్వు నాడీమండలానికి శ్రమదీర్చి, మళ్ళీ ఆలోచించడానికి దోహదం చేస్తుంది. బుద్ధి వికాసం లేని మనుషులు మనసారా నిష్కల్మషంగా నవ్వలేరు. ఈ సత్యాన్ని అప్పారావు పంతులుగారు తమ నాటకంలో లెస్సగా ఉపయోగించుకున్నారు. కుళ్ళిపోతున్న నిష్ప్రయోజక సామాజిక సంస్థల భారం క్రిందబడి బుద్ధినికోల్పోయి ఛాందసులుగా తయారైన అగ్రిహోత్రావధాని, గిరీశం, లుబ్ధావదాని, రామప్ప పంతులు మొదలైన పాత్రలు నవ్వలేవు. అందుకని వాటికి అప్పారావు పంతులుగారు నవ్వు పెట్టలేదు. సామాజిక సంస్థల బాగోగులను గ్రహించుకొని, వాటికి దాసులు కాకుండా, వాటి ప్రభావం నుండి బయటపడి, సంఘ సంస్కరణకు నడుంగట్టి నిలచిన కరటక శాస్త్రి, శిష్యుడు, మధురవాణి మనసార నవ్వగలుగుతారు. దయాదాక్షిణ్యాలు, సహృదయం, కుశాగ్రబుద్ధి కలిగిన మధుర వాణి నవ్వు మహా అందంగ

ఉండేట్టు అప్పారావుగారు తన చిత్రణావిధానంలో అవకాశం కల్పించారు. మధురవాణి నవ్వులో ఏ మహత్తరాకర్షణ వుందో, కరటకశాస్త్రి శిష్యుడు ఆ నవ్వుమీద మోజుపడి, అనుకరించే ప్రయత్నంలో, తాను నిర్వహించవలసిన మాయసుబ్బి పాత్రనే విస్మరించాడు. గిరీశం ఛాందసుడు కాదు. హృదయమున్న సంస్కరణావాదీ కాదు. అతడొక స్వార్థపూర్తిమైన వచనకు శాశ్వత చిహ్నం. ఆ దుర్గుణ భారం క్రిందబడి అతడు నలిగి పోయాడు గనుక అతడు నవ్వలేడు. కనుక అప్పారావు గారతనికి నవ్వు పెట్టలేదు. ఇందకు తేలిందేమిటంటే కన్యాశుల్క నాటక పాత్రలలో అన్ని ప్రేక్షకులను నవ్విస్తాయి. కాని కొన్ని మాత్రమే నవ్వగలుగుతాయి. అదే సత్పాత్రలు ఈ సామాన్య సూత్రానికొక మినహాయింపు వుంది. అది సౌజన్యరావు పంతులు గారి పాత్ర. సత్పాత్రే అయినా దానికి నవ్వు పెట్టలేదు. ఆ పాత్ర ఉగ్రనిష్టకు సంకేతం. అందుకని హాస్యం అనౌచిత్యం.

**రసనిర్ణయం :** కన్యాశుల్క నాటకంలో రచయిత చిత్రించింది కుళ్లకొడుతున్న సమాజాన్ని కాదు.. ఆ సమాజపు సాలిగూటిలో తగుల్కొని బాధపడుతున్న వ్యక్తుల్ని, సమాజాన్ని చిత్రించి ఉంటే గిరీశం, రామప్పపంతులు, అగ్నిహొత్రావధాని, లుబ్ధావదాని మొదలగు దుష్టపాత్రలు సాంఘిక సంస్థలకు, భావాలకు సంకేతాలుగా నిలుపబడి వుండేవి. అంటే వాటిని సాంకేతిక పాత్రలుగా చిత్రించివుండేవాడు. ప్రతినిధి పాత్రలుగా ఉంచేవాడు కాదు. అవి సాంకేతిక పాత్రలు కావని ఎలా ఋజువు చేయడం అనేది ప్రశ్న? సంఘం, దాని సంస్థలు కుళ్ళిపోయినవని భావించిన రచయిత వాటిని హతమారుస్తాడుగాని వాటిని క్షమించి సంస్కరించడమంటూ చేయడు. నాటకంలో రామప్ప పంతుల్ని, లుబ్ధావధానుల్ని, అగ్నిహొత్రావధానుల్ని, గిరీశాన్ని ఆపదవస్తే ఆదుకుని, తప్పులను క్షమించి చేర్చుకొని ఆశ్రయమివ్వడానికి సౌజన్యారావు పంతులుగారు నడుంగట్టి నిలిచారు. ఏ పాత్ర గూడా మరణానికో, శిక్షకో గురికాలేదు. నిజంగ ఆ పాత్రలు సంఘసంస్థలకో, భావాలకో, ఆచారాలకో, సంకేతాలుగా రచయిత నిలిపివుంటే వాటిని శిక్షించో చంపోవుండేవాడు. ఏం? సంఘసంస్థలను, ఆచారాలను, భావాలను మాత్రం హతమార్చాలని ఎక్కడుంది? వాటిని మాత్రం సంస్కరింప కూడదా? అనే ప్రశ్నలు పొడమవచ్చు. అయితే నాటకంలో రచయిత అలా చేయలేదే, జ్యోతిషం, భూతవైద్యం, మతాలు, గుళ్ళు మొదలైన వాటిని సంస్కరించాలనే సూచన ఎక్కడా కనుపడదే. కన్యాశుల్కం, బాల్యవివాహాలు, నిర్బంధ వైధవ్యం మొదలైన దురాచారాలను రూపుమాపడమే గదా నాటకంలో జరిగిన వ్యాపారమంతాను. కనుక నాటకంలో చిత్రితమైంది సమాజం కాదు దాని భారం క్రింద బాధపడుతున్న వ్యక్తులు. సంఘమే చిత్రితమైవున్నట్లయితే దానిపట్ల ప్రేక్షకులకు జుగుప్స కలిగేట్టు రచయిత కథను, సన్నివేశాలను పాత్రలను పన్నేవాడు. అప్పుడు నాటకానికి అంగిరసం భీభత్సమయ్యేది. హాస్యం 'జుగుప్స' అనే వ్యతిరేక ప్రతిచర్యను పొడమనివ్వదు. గనుక నాటకంలో హాస్యానికి తావుండేది కాదు. ఆసాంతం హాస్యముండటం వలన భీభత్సరసం కానేరదు. భీభత్సం అంగిరసం గాగల నాటకాలలో హాస్యముండటానికి వీలు లేదా? అనే ప్రశ్న ఉదయించవచ్చు. హాస్యం ఉండవచ్చు, కానీ కన్యాశుల్కంలో వున్నట్లుండడానికి వీలుగాదు. జుగుప్సాభావాన్ని కలిగించే సీనులమధ్య హాస్యం పుట్టించే సీనులుండవచ్చు. అందువల్ల జుగుప్సాభావం హాస్యరసానికి వ్యతిరేకంగా దీపించి మరీ ఎక్కువ బలీయంగా ప్రేక్షకుల మనస్సులలో నాటుకపోతుంది. అంటే.. ఒక నల్లచార ప్రక్కన తెల్లచార గీచినట్లు. కన్యాశుల్కంలో హాస్యం అలాలేదే; ప్రతిసీనులో ఆసాంతం హాస్యం వుంది. అంతేకాదు ఏపాత్రపట్ల జుగుప్సాభావాన్ని కలిగించాలో ఆ పాత్రకు హాస్యం అసలు పెట్టగూడదు. అలా పెడితే ఏమవుతుందో 'హాస్యం' అనే శీర్షిక క్రింద చూచాంగదా. కన్యాశుల్కంలో అన్ని పాత్రలకు హాస్యం పెట్టాడు. అందువల్ల పాత్రలెంత జుగుప్సాకరమైన పనిచేసినా వాటి మీద ద్వేషం కలుగదు. వాటికేసి ప్రేక్షకులు నవ్వి వూరుకుంటారు. కనుక భీభత్సం అంగిరసం కానేరదు. పాత్రలపట్ల ప్రేక్షకులు కేవలం నవ్వి వూరుకుంటారు కదా; మరి హాస్యం అంగిరసం ఎందుకు కాకూడదు? అనే ప్రశ్నకిది సమయం. ఆ పాత్రలు జుగుప్సాకరమైన తమ కార్యాలను నవ్వుతో రంగరించండతోటే వాటిపని తీరిపోలేదు. క్రమంగ కుతంత్రాలలోకి నడచి కష్టాలకు, నష్టాలకు గురై దయనీయమైన స్థితిలోకి పడిపోతాయి. అప్పుడు వాటిపట్ల ప్రేక్షకులకు జాలి కలుగుతుంది. అగ్నిహొత్రావధానికి పిల్లపెండ్లికని తెచ్చిన ఏనుంగుల,

లొట్టిపిట్టల ఖర్చు నెత్తిన పడుతుంది. బుచ్చమ్మ గిరీశంతో లేచిపోయి దుఃఖం కలిగిస్తుంది. రామప్పపంతులు చేసిన ప్రయివేటులో ఇల్లుగుల్లవుతుంది. చివరకు గిరీశం అతణ్ణి విశాఖపట్న వీధిలో పడవేసి పరుగెత్తుతాడు. రామప్పపంతులు గిరీశంతో, సిద్ధాంతితో తన్నులు, అవమానం పొందుతాడు. మధురవాణి, మీనాక్షుల మధ్యపడి నలుగుతాడు. లుబ్ధావధానితో కాలు విరగకొట్టించుకుంటాడు. కొంపలోకి మధురవాణి రానివ్వకపోతే చెరువుగట్టు పట్టుక తిరుగుతాడు. చివరకు చెవులు జాడించుకుని కొంపచేరుకుంటాడు. లుబ్ధావధానికి పెండ్లికాదు, దబ్బుపోతుంది, దయ్యం పడుతుంది. ఖూనీ కేసు వచ్చి నెత్తినపడుతుంది. దుష్టపాత్రమీద జాలికలిగేట్టు చేయాలంటే ఆ పాత్రకు పశ్చాత్తాపం పెట్టవచ్చుగదా? అవును. లుబ్ధావధానికి అలాగే చేశాడు. అయితే రామప్ప పంతులికి, అగ్నిహోత్రావధానికి, గిరీశానికి కూడా పశ్చాత్తాపమెందుకు పెట్టకూడదు? పశ్చాత్తాప పడని దుష్టులు లోకంలో వుంటారు గనుక వారిపట్ల కూడా ద్వేషం వహించకుండా జాలిచూపించడం అప్పారావుగారి ఆశయం. దుష్టపాత్రలు చెడు కార్యాలను చేసేప్పుడు వాటి మీద ద్వేషం కలగకుండా వుండడానికి హాస్యం పెట్టడం జరిగింది. అందువల్ల ఆ పాత్రలు కష్టనష్టాలకు గురైనప్పుడు వారిపట్ల ప్రేక్షకులు జాలివహించడం సుళువుగ జరుగుతుంది. ద్వేషం నుండి జాలిలోకి దిగాలంటే పాత్రలో ఎంతో పశ్చాత్తాపం పెట్టాలి. పశ్చాత్తాపపడని పాత్రవైపు అది కష్టానికి గురి అయినప్పుడు జాలి చూపించాలంటే అంతకుముందు ప్రేక్షకులు నిర్ద్వేష స్థితిలో వుండాలి. కనుక కన్యాశుల్కంలో హాస్యం ప్రేక్షకులకు నిర్ద్వేషస్థితిని కల్పించడానికి మాత్రమే ఉద్దేశించబడింది. పాత్రల పట్ల జాలి కలుగుతుంది గనుక కరుణ అంగిరసం.

**కథాకథనము:** మొదటి అంశంలో గిరీశం, వెంకటేశం, రామప్ప పంతులు, అగ్నిహోత్రావధాని, కరటకశాస్త్రి, శిష్యుడు, బుచ్చమ్మ, వెంకమ్మ ప్రేక్షకులకు పరిచయమవుతారు. కన్యాశుల్క సమస్య రూపొందుతుంది. కరటకశాస్త్రి దానికి ప్రతికూలంగ, అగ్ని హోత్రావధాని అనుకూలంగా నిలుస్తారు. ఇరుపక్షా లేర్పడుతవి. అక్కడే బుచ్చమ్మ తలమీద తాండవిస్తున్న నిర్బంధ వైధవ్యం కూడా ప్రేక్షకులకు ప్రత్యక్షిస్తుంది. దానికి పరిష్కర్తగా గిరీశం పరిచయమవుతారు. కరటకశాస్త్రికి మధురవాణి కుడిభుజంగ నిలుస్తుంది. ఈ యిరుపక్షాల చేతులలో మిగతాపాత్రలన్నీ సందర్భానుసారంగా, స్వార్థంకొద్ది సాధనాలుగా పనిచేస్తాయి. దీనితో నాటకానికి సంశ్లిష్టత ఏర్పడుతుంది. నిజ సుబ్బిపెళ్ళిని చెడగొట్టి, మాయసుబ్బి పెళ్ళిని చేయించడంలో కవి అమోఘమైన ప్రజ్ఞను చూపించాడు. గిరీశం పెళ్ళికి వస్తాడనే భయాన్ని రామప్పపంతుల్లో మధురవాణి ప్రవేశపెడుతుంది. దాంతో రామప్పపంతులు నిజ సుబ్బి పెళ్ళిని చెడగొట్టడానికి అంగీకరిస్తాడు. గుంటూరు శాస్త్రుర్లు వాగ్దానం చేసిన కమీషన్ అతడికి బాగా ఆశ కలిగింది. లుబ్ధావధానికి పెళ్ళి చేయకపోతే మధురవాణి అతడి దగ్గరకు పోయివుంటుందేమోననే భయం అతడికి కలుగుతుంది. దాంతో అతడు మాయసుబ్బి పెళ్ళికి జలగపట్టు పడతాడు. గిరీశం వుత్తరం, రామప్ప పంతులు రాసిన పోర్జరీ వుత్తరం నిజ సుబ్బిని పెళ్ళి చేసుకుంటే దబ్బెక్కువ ఖర్చవుతుందనే, భయం, అగ్నిహోత్రావధాని తనపట్ల అమర్యాదగ ప్రవర్తించాడనే రోషం లుబ్ధావధానిలో కలిగిస్తవి. మాయసుబ్బి తక్కువ ధరకు దొరుకుతుందనే విషయం మాయసుబ్బి అందం అతణ్ణి బాగా ఆకర్షిస్తవి. ఈ రకమైన సంఘటనలను కల్పించి రామప్ప పంతుల్ని, లుబ్ధావధాన్లును మాయసుబ్బి మీదకు రచయిత తోలేస్తాడు. ఈ సంరంభంలో మాయసుబ్బి చెయ్యి మగాడిదో, ఆడదానితో కూడా రామప్పపంతులికి తెలియకుండా పోతుంది. సిద్ధాంతి ఎదురువచ్చి, సంతాన సౌభాగ్య రేఖలు వధువునకు లెస్సగవున్నవని నిర్ధారిస్తాడు. ఆపాళంగ పెండ్లి అయిపోతుంది. గుంటూరు శాస్త్రుర్లు ప్రవేశించింది మొదలు మాయసుబ్బి పెళ్ళి అయిపోయేంతవరకు నాటక మాడో సుడిగాలిలాగో, కారుచిచ్చులాగో, పెద్ద ఉప్పెనలాగో ఏ పాత్రకు ముందు వెనుక పస్తాయించడానికి వీలుగాకుండ ఆగవేగాలతో పరుగులు తీస్తుంది. ఈ ఆవేగమే నాటక గమనంలో రాకపోయినట్లయితే మగవాడిని ఆడదాని క్రింద చలామణి చేయడం కృత్రిమంగ కన్పించి నాటకం బూటకమై కూచునేది. ఒక వైపు రామచంద్రపుర అగ్రహారంలో కాన్యశుల్క విచ్ఛిన్న ప్రయత్నాలు మాయసుబ్బి పెళ్ళి సంరంభ రూపంలో జోరుగ సాగిపోతుంటే మరోవైపు కృష్ణరాయపుర అగ్రహారంలో

బుచ్చమ్మ నిర్బంధ వైధవ్య శృంఖలాలొక్కొక్కటి గిరీశం త్రెంచి వేస్తున్నాడు. ఒకే కాలంలో నాటకం ద్విముఖంగా నడిచింది. ఇలాంటి సందర్భాల్లోనే సంఘట నాక్రమత దెబ్బతింటమో, నానుడుబేరంలో పట్టమో జరుగుతుంది. కాని అలాంటి లోటును రచయిత రానివ్వలేదు. తెలతెలవారే సమయంలో రామచంద్రపుర అంగ్రహారంలో ఒకవైపు నుండి పెళ్ళివారు సన్నాహంతో, మరోవైపు నుండి రామప్పపంతులు మనువు విచ్ఛిన్నమై పోయిందనే వార్తతో, ఇంకో వైపునుండి అశుభసూచకమైన తత్త్వాలు పాడుతూ దాసరి వేషంతో శిష్యుడు ప్రవేశిస్తారు. ఆ సుప్రభాత కాలంలో కాన్యశుల్క విచ్ఛేదం, నిర్భంద వైధవ్య విచ్ఛేదం అంటే సుబ్బి పెళ్ళి పోయిందని, బుచ్చమ్మ గిరీశంతో లేచిపోయిందని పాత్రలకు, ప్రేక్షకులకు తెలుస్తవి. అక్కడే నాటకం పరాకాష్ట చెందింది. చెరువుగట్టుమీద శిఖర మెక్కిన కథ నెమ్మదిగ దిగి విశాఖ పట్టణం వీధుల్లోగుండ సౌజన్యారావు పంతులుగారింటిలో సమాప్తం చెందుతుంది. అసలు పెళ్ళికూతరు నిజ సుబ్బి, దాని మోహం ఎలా ఉంటుందో కూడా రచయిత ప్రేక్షకులను చూడనివ్వలేదు. అంటే ఆ పాత్రను ఒకమాటుకూడా రంగమ్మీదకు తీసుకు రాలేదు. కాని ఆ లోటు మనకు ఎక్కడా కన్పించదు. ఇలా తీసుకురాకపోవడంలో రచయిత కొక గొప్ప వుద్దేశం వుంది. కన్యాశుల్క కాలంలో వధువుకు అసలేరకమైన ప్రాధాన్యత గాని, చివరకు నోరువిప్పే అవకాశం కాని వుండేదికాదని ప్రేక్షకులకు తెలియచేయడాఇకి రచయిత అలా చేశాడు.

**లోట్లు:** నామట్టుకు నాకు కనిపించే పెద్దలోటు గిరీశం పాత్రకు పెట్టిన పెద్ద యీడిక సంభాషణలు. గిరీశం వాచాలుడు. అతడికి తగినట్లుగ, అతడు చేసే సంభాషణ కొంతవరకు దీర్ఘంగ వుండ వలసిందే. కాని మరీ ఎక్కువ ధీర్ఘమై ప్రేక్షకులకు విసుగు పుట్టించేంత వున్నై. అందుకనే కృష్ణరాయపుర అగ్రహారంలో జరిగిన నాటక భాగం కొంత నానుడు బేరంలోనే పడింది. బావులు, జామచెట్లు, దిడ్డి దారులు, చెరువుగట్లు, గుర్రాలెక్కి రావడం రంగస్థలమ్మీద ప్రదర్శనాసాధ్యం కావు. అటువంటి సన్నివేశాలు కన్యాశుల్కంలోని లోట్లుగా పరిగణించవచ్చును. కాని, ఒకటి రెండు మాటలను చేర్చడంతోనో లేక తీసివేయడంతోనో ఆ లోట్లను ప్రదర్శకు లుపహరించుకోవచ్చు. నాటకం చాలా పెద్దది. ఒకరాత్రి ప్రదర్శింపడానికి వీలు గాదు. ప్రదశ్శనాదృష్టితో చూస్తే ఇది ఒక పెద్ద లోటే. కాని నాటక కళాదృష్టితో చూస్తే మాత్రము దీనిని లోటుగా పరిగణింప రాదు. నాటకమంతా రసనిర్భాతితో, అంగాంగి భావంతో, దృష్య ప్రపంచంగ రూపించిందా లేదా అనేదే సమస్య. దాని మరిమాణం ఎంత అనేది సమస్యే కాదు.

**నాయక నిర్ణయం :** నాటకానికి నాయకుడు లేడు. కనుక నాటక లక్షణానికే వ్యతిరేకం. ఇది ఒక పెద్ద లోటు అని అనుకోవచ్చు. కాని, ప్రధాన పాత్రలన్నీ స్వతంత్రపాత్రలుగ చిత్రితమైనప్పుడు నాయక నిర్ణయం సాధ్యం కాదు. ప్రతిపాత్ర స్వకీయమైన ప్రయోజనంతో, స్వకియమైన ఫలితం కోసం పనిచేస్తుంది. అలాంటి సందర్భంలో ఏ పాత్రను నాయకుడని నిర్ణయిస్తాం? షెక్సుఫియర్ వ్రాసిన 'జూలియస్ సీజర్' వంటి నాటకాలలో కూడా నాయకనిర్ణయం దుస్సాధ్యంగానే ఉంది. అందువల్ల దానిని నాటకం కాదనం. నాటకమనడానికి ఏదో ఒకపాత్రను, ఏదో ఒక కారణం చూపించి నాయకుడంటం సాహసమే అవుతుంది. ప్రధానమైన పాత్రలు చాలా వుండి, ప్రతిదీ స్వతంత్రపాత్రగా వున్నప్పుడా నాటకం ఎంతో వైవిధ్యం గల ప్రపంచంలాగే భాసిస్తుంది. ప్రపంచానికి సంఘానికి నాయకు డెవరు? ఫలానా అని నిర్ణయించలేము. కనుక, ప్రజా ప్రభుత్వంలో లాగు, నాటకంలోకూడా స్వేచ్ఛాపాత్రలు విలసిల్లినప్పుడు నాయక నిర్ణయమనే సమస్యే వుండదని నా అభిప్రాయం. చెప్పదలచుకొనిన విషయాన్ని రసవత్తరమైన దృశ్య ప్రపంచంగ చిత్రించడమే నాటకం. ఏం చేసే ఆ ప్రయోజనం సాధించబడుతుంది? అనే ప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానాలు దేశ కాలానుసారంగా మారుతుంటవి. ఆ సామాధానాన్ననుసరించి నాటకలక్షణా లేర్పడుతవి. అంతేగాని పూర్వము నిర్ధేశించిన లక్షణాలకు నేటి నాటకాలు నిలువనక్కరలేదు. నేటి లక్షణాలకు భవిష్యన్నాటకాలు కూడా అంతే. **రచయిత ఇచ్చిన సందేశం :** దుష్టపాత్రలపట్ల, అవి పశ్చత్తాప పడకపోయినా సరే, ప్రేక్షకులు ద్వేషం వహించకుండ, జాలి పడడానికి రచయిత కథను, శిల్పాన్ని ఎలా మలుచుకున్నాడో హాస్యము, రసనిర్ణయం అనే శీర్షికల క్రింద పరిశీలించాం. అదే ఆయన నాటకం ద్వారా ప్రవచించిన మహత్తరాదర్శం.

అదే ఆయన భావించిన సుజనత్వం. శరీరావశ్యకతలను సంతృప్తి పరచుకోవడానికి, బుద్ధిని వికసింప చేసుకోవడానికి, హృదయానుభూతిని పొందడానికి వీలుగాకుండ ఆటంకపడుతూ, విధ్వంసక సాధనాలుగా తయారై విలయతాండవం చేస్తున్న సమకాలీన సంస్థల నుండి సామాజిక వ్యవస్థనుండి మానవుడెలా సుజనత్వంవైపు ప్రయాణించగలుగుతాడు? అతడికి తరుణోపాయమేది? అనే ప్రశ్నలకు సామాధానంగా అప్పారావుగారి కన్యాశుల్క నాటకం రూపించిందని నా అభిప్రాయం. అది ఎలాగో చూతాం.

దుష్టపాత్రలన్నీ స్వార్థం చూపించిన మార్గాలలోనే పరిభ్రమి స్తుంటై. కాని వాటి పరిభ్రమణపథాన్ని వాటికి తెలియకుండానే మధురవాణి, కరటకశాస్త్రి అనే పాత్రలు సౌజన్యా రావు పంతులు వైపుకు త్రిప్పుతై. సౌజన్యరావంటే సుజనత్వమే. అందుకనే సౌజన్యారావు పాత్రను సాంకేతిక పాత్ర అని మనవి చేసింది. మధురవాణి నాట్యగత్తె, కరటకశాస్త్రి మహాకావ్య పండితుడు. కనుక వారిద్దరు లలితకళలకు సంకేతాలు. అంటే లలితకళలు మానవ జీవితాన్ని సుజనత్వం వైపు త్రిప్పుతవని రచయిత ఉద్దేశం. లలితకళలు మానవునిలో సానుభూతిని పెంచి, సహృదయాన్ని సాగుచేస్తవి. గనుక వాటిలో ఆ శక్తి ఉంది. సుజనత్వమంటె కేవలం నీతిబద్ధంగా ప్రవర్తిస్తే చాలు ననుకునే భ్రమవుంది. అటువంటి నీతిపరులకు హృదయం లోపిస్తుంది. వారితరులకు సాయం చేస్తారు. ఎందుకంటే పరులకు సాయం చేయడం నీతిగనుక అలాంటి నీతి కేవలం ఒక ఉగ్రనిష్టగ తయారవుతుంది. అది నిజానికి సుజనత్వం కాదు. అది నీతికోసమే. నీతి అనే సిద్ధాంతంలో పర్యవసిస్తుంది. అటువంటి నీతికి హృదయ మక్కరలేదు. అదోరకమైన కాఠిన్యమే. అది క్రమంగ మానవతనే చంపి, ఒక విధమైన అంధవిశ్వాసంగ పతనమైపోయే అవకాశం ఉందని గ్రహించి అప్పారావు పంతులు గారు నీతి అంటే మానవునకు మేలు చేసేదిగ, మానవ ప్రేమను పెంపొందించేదిగ ఉండాలి. మానవుని కోసమే నీతిగాని, నీతికోసం నీతిగాదు. సుజనత్వం అంటే కేవలం నీతిబద్ధమైన ప్రవర్తనే కాదు. హృదయమున్న నైతిక జీవితం అని చెప్పదలచుకున్నాడు. ఈ విషయాన్ని సౌజన్యారావు పంతులు పాత్రపొందిన పరిణామంలో వ్యక్తపరిచాడు. రామప్పపంతులు పట్ల, పోలిశెట్టి పట్ల సౌజన్యారావు వైఖరి సుజనత్వానికి తగినట్లుగా లేదు. వేశ్యలపట్ల ఆయన వైఖరి ఒక రకంగ కౄరమే. వేశ్యను చూడనని, మాట్లాడననిమహా దీక్ష పూనుతాడు. వాళ్లు కూడా మనుష్యులె, తతిమ్మా దుష్టులకుమల్లె వాళ్లకూడా తయనీయులె అనుకునేంత హృదయవైశాల్యం ఆయనలో లేదు. మధురవాణి వచ్చి ఆయన వైఖరిని మార్చింది. ఆయనలోవున్న హృదయ దోషాన్ని ప్రక్షాళనం చేసింది. అతడామెకు భగవద్గీత నిస్తాడు. భగవద్గీత నిష్కామ కర్మకు సంకేతం. నిష్కామకర్మను గ్రహించిన సౌజన్యారావుకు మధురవాణి హృదయాన్నిస్తే, హృదయమున్న మధురవాణికి సౌజన్యారావుగారు భావించిన సూజనత్వం వారిద్దరిలో వచ్చింది. అంటే మానవప్రేమ నిష్కామకర్మ అనేవి అప్పారావుగారు భావించ మానవ జీవిత లక్ష్యాలు.

**తీర్మానం :** పాత్రచిత్రణ, కథాకథనం సన్నివేశాలు రసౌచిత్యం సందేశం మొదలయిన విషయాలన్ని ఉత్తమస్థాయి నందు కొన్నాయి. ఇంత పరిపుష్టంగా తయారయిన ఈ నాటకం ప్రపంచంలోని గొప్ప నాటకాలలో ఒకటిగా పరిగణించవచ్చు. ఇంత మహోత్కృష్టమయిన సృష్టిచేసిన అప్పారావుగారు మహా ప్రతిభావంతులని వేరే చెప్పనక్కరలేదు.

సేకరణ: వావిలాల సుబ్బారావు - ఫోన్: 986 640 2973.

# పాలీ భాష పుట్టుపూర్వోత్తరాలు

– చౌదూరి ఉపేంద్రరావు

పాలీ భాష ఎంతో ప్రాచీనమైనది. త్రిపిటకాలు, వాటి అట్ఠకథలు అశోకుడి శాసనాలు ఇవన్నీ పాలీ భాషలోనే ఉన్నాయి. ప్రపంచంలోని ప్రాచీనమైన భాషల్లో ఒకటైన పాలీ భాష మన దేశ వారసత్వ సంపద. ఇది మన పూర్వుల నుండి మనకు సంక్రమించిన అమూల్యమైన సాంస్కృతిక నిధి. కానీ ఈ విషయాన్ని భారతీయులు మరచిపోయారు. ఇదెంతో విచారకరం.

మిగతా భారతీయులకు పాలీ భాషతో ఉన్న అనుబంధమెలాగున్నా ముఖ్యంగా మన తెలుగు జాతికి పాలీ భాషకు ఉన్న సంబంధం అతి పురాతనమైనది, నిత్యనూతనమైనది కూడా. ఒకప్పుడు ఆంధ్రదేశంలో బౌద్ధం, తత్సాహిత్యమైన పాలీ త్రిపిటకాలు, వీటి అట్ఠకథలు ఎంతో ఆదరణకు నోచుకున్నాయి. అందుకే సాంస్కృతికంగా, భాషాపరంగా తెలుగు సాహిత్యంపై పాలీ సాహిత్య ప్రభావమెంతగానో ఉన్నది. తెలుగు అన్న పదం కంటే ముందు శాసనాలలోగాని, వాఙ్మయంలోగాని ఆంధ్రపదమే ప్రాచుర్యంలో ఉండేది. నిజానికి ఈ ఆంధ్రపదం కూడా ప్రాచీనతమైనది కాదు. దీనికంటే ముందు శిలాశాసనాలలో కనిపించేది "అంధక" పదం. ఈ విషయం ఇంకా ప్రామాణికంగా తెలియాలంటే పాలీ సాహిత్యంతో పరిచయం అనివార్యం. ఎందుకంటే అంధక పద ప్రయోగం మొదటిసారిగా మనకు వినయపిటక అట్ఠకథైన "సమన్త పాసాదిక"లో కనిపిస్తుంది. ఆచార్య బుద్ధఘోషుడు దీన్ని ప్రయోగించాడు.

బౌద్ధ పాలీ వాఙ్మయంలో ఆంధ్రులు అంధకులుగా పిలువబడ్డారు. పాలీ సాహిత్యాధ్యయనంవల్ల గోదావరీ తీరాన అంధకరట్ఠ (ఆంధ్ర రాష్ట్ర)మొకటుండేదని, అస్సకులు, అఠకులు ఆంధ్రరాజులేనని తెలుస్తున్నది. అంటే బుద్ధుని కాలం నాటికే గోదావరీ తీరాన ఆంధ్ర జనపదాలుండినాయన్నమాట. ఇలా తెలుగు జాతి అస్తిత్వాన్ని మొట్టమొదటిసారిగా తెలిపినది పాలీ వాఙ్మయమే. కానీ దురదృష్టవశాత్తు పాలీ భాషా సాహిత్యాలు నేడు మరుగునపడి ఇతర విషయాలే ఎంతో ఆదరణకు నోచుకుంటున్నాయి. తెలుగు భాషలో ఎన్నో పాలీ పదాలు ప్రవేశించాయి. తెలియనివారు వాటిని తెలుగు పదాలే అనుకుంటున్నారు. కేవలం మన తెలుగు భాషనే కాదు, మన దేశంలోని అన్ని భాషలనూ పాలీభాష ప్రభావితం చేసిందని చెప్పవచ్చు. ప్రాచీన భాషలుగా కీర్తించబడే ప్రాకృత – సంస్కృత – పాలీ భాషల్లో పాలీ భాషే ప్రాచీనతమైనదని విజ్ఞులు భావిస్తారు.

పాలీ భాషలో ఎన్నో ప్రత్యేకతలున్నా దీనికి ఒక గౌరవం, నిండుదనం తెచ్చినవి తథాగతుడి ధర్మోపదేశాలే. సిద్ధార్థుడికి జ్ఞానోదయమై అతడు బుద్ధుడిగా మారిన తరువాత సుమారు 45 సం.లు అతడు వివిధ ప్రాంతాలలో తిరుగుతూ ధర్మోపదేశం గావించాడు. అప్పుడు నానా జాతులవారు, నానా ప్రాంతాలవారు బుద్ధుడి శిష్యులుగా మారి బౌద్ధసంఘంలో చేరారు.

బద్ధుడి ఉపదేశ విధానం సులభంగా ఉండేది. ఇలా చెప్పాలి అని అతడేనాడూ తన మనస్సులో ఊహించుకొనలేదు. సందర్భానుకూలంగా ఆనాడు వాడుకలో ఉన్న అందమైన ఉపమానాలతో తన మనస్సులో మెదలిన భావాలను సరళంగా ప్రజలకందించేవాడు. కానీ వాటి వెనక ఒక గంభీరమైన అర్థం దాగుండేది. బుద్ధుడి ఉపదేశాలింత అందంగా ఉండేవి కాబట్టే అతడి శిష్యులు విన్న వెంటనే వాటిని కంఠస్థం చేయడం ప్రారంభించారు. అతడి ఉపదేశాలన్నీ మౌఖికమైనవే. బుద్ధుడి జీవిత కాలంలో వాటిని లిపిబద్ధం చేసినట్లు ప్రమాణాలు లేవు. తన ఉపదేశాలు కేవలం పండితులవరకే పరిమితం కాకుండా అతడి సామాన్యుడి వరకు కూడా చేరాలన్నది బుద్ధుడి అభిమతం. అందుకే అతడా రోజుల్లో సర్వ సమాదరణీయమైన పాలీ భాషలో తన ఉపదేశాలను కొనసాగించాడు. బుద్ధసంఘంలో ఉత్తర భారతంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భిక్షువులుండేవారు. మగధ, వైశాలీ, మిథిలా, కాశీ, కోసల ప్రాంతాల వారు బౌద్ధ సంఘంలో చేరారు. విభిన్న ప్రాంతాల నుండి వచ్చిన వీరందరికీ వారివారి భాషలుండేవి. కాని అందరూ ఒక్కచోట చేరినప్పుడు మాత్రం మాగధీ భాషను ప్రయోగించేవారు. ఇప్పుడు కూడా ఉత్తర భారతంలోని

వివిధ ప్రాంతాల వారు ఒకచోట చేరితే వారివారి భాషలనొదిలి హిందీ భాషలో ఎలా మాట్లాడుకుంటారో అలాగే ఆ రోజుల్లో కూడా అందరికీ మాగధీభాష ఆమోదయోగ్యంగా ఉండేది. కాని వారివారి భాషల ప్రభావం మాగధీ భాషపై పుష్కళంగా ఉండేది. ఈ మాగధీ భాషనే మనం ప్రస్తుతం పాలీ అంటున్నాం. అందుకే పాలీ భాషలో వివిధ రూపాలు దర్శనమిస్తాయి. 'కార్య' శబ్దానికి 'కయ్య' శబ్దం, 'కరియ' శబ్దం రెండూ ప్రయోగంలో ఉన్నాయి. అలాగే 'ఆర్య' శబ్దానికిగాను 'అయ్య' 'అరియ' శబ్దాలు రెండూ వాడుకలో ఉన్నాయి. 'హ్రస్వ' శబ్దానికి 'రస్స' శబ్దం ప్రయోగంలో ఉన్నది. కాని 'హ్రద' 'రద'గా మారదు, అది 'రహదో'గా మారుతుంది. అదేవిధంగా 'రశ్మి' శబ్దానికి 'రస్మి' శబ్దం ప్రయోగించబడితే 'అస్మి' శబ్దానికి మాత్రం 'అమ్హి' శబ్దం కనబడుతుంది.

బౌద్ధ సంఘంలో వికసించిన పాలీ భాషలోని ఈ వైవిధ్యానికి కారణము భిన్నభిన్న ప్రాంతాల నుంచి వచ్చిన భిక్షువులే. ఈ భాషే ఉత్తర భారతదేశమంతా వ్యాపించి ఒక అంతర్రాంతీయ భాషగా గణతికెక్కింది. ఆనాడు సభ్యసమాజం గౌరవంతో దీన్ని వ్యవహరించేది. అందుకే ఈ భాషే మగధ సామ్రాజ్యంలో అధికార భాషాస్థానాన్ని సముపార్జించింది. అధికార భాషైన కారణంగా దీనిపై ప్రజలకింకా ఆదరణ పెరిగింది. మగధ రాజ్యభాషగా ఇది పేరొందిన కారణంగానే దీన్ని 'మాగధీ' అన్నారు. అంతమాత్రాన ఇది మగధకే పరిమితమై ఉండేదని భావించరాదు. దాని పరిసర ప్రాంతాలలో కూడా దీన్ని వ్యవహరించేవారు. మగధ సామ్రాట్టులు ఈ భాష మాధుర్యాన్ని చూసి దీన్ని వాని అధికార భాషగా మలచుకున్నారు. మగధ సామ్రాజ్య అధికార భాషగా మారిన తరువాత ఆ రాజ్యంలో అంతకు ముందు నుండి వ్యవహరింపబడే స్థానీయ మాగధీ భాషా ప్రభావం దీనిపై మిగతావాటికంటే ఎక్కువగా పడింది. ఇలా పరిణతమైన మాగధీ భాషనే బుద్ధుడు తన ధర్మోపదేశాలకు మాధ్యమంగా వాడుకున్నాడు. ఈ భాషనే తరువాతి కాలంలో 'పాలీ' అన్నారు. పాలీ భాషలోనే బౌద్ధులు వారి త్రిపిటకాలను సంగ్రహించారు. పిటకము అంటే బుద్ధ. బుద్ధుని ధర్మోపదేశాలతో నిండిన బుట్టలవంటివి ఈ త్రిపిటక గ్రంథాలు.

అవి: **వినపిటకం – సుత్తపిటకం – అభిధమ్మ పిటకం**

అశోకుడి పుత్రుడు మహేంద్రుడు భిక్షువుగా మారి సింహళ (శ్రీలంకా) దేశానికి వెళ్ళి అక్కడ ఈ త్రిపిటకాలనే ప్రచారం చేశాడు. లంకాధిపతి అయిన పట్టగామని అనే రాజు ఆధ్వర్యంలో త్రిపిటకాలు గ్రంథస్థం చేయబడ్డాయి. శ్రీలంక, బర్మా, కంబోడియా, థాయ్‌లాండ్ మొదలైన అన్ని బౌద్ధదేశాలలో వారివారి లిపుల్లోకి మార్చుకున్నారు. బర్మా రాజు మాండుముడు మహాభారతానికి మూడింతలుగా పెద్దవైన ఈ త్రిపిటకాలను శిలాఫలకాలపై చెక్కించి సంరక్షించాడు. పాశ్చాత్య దేశాలలో కూడా నేడు ఈ త్రిపిటకాల అధ్యయనం చాలా జోరుగా కొనసాగుతున్నది. 'రైస్ డేవిడ్స్'వంటి పాలీ విద్వాంసుల ప్రేరణతో లండన్‌లో పాలీ 'టెక్స్ట్ సొసైటీ' అన్న సంస్థను స్థాపించి అక్కడివారు దాదాపు అన్ని త్రిపిటక గ్రంథాలను ముద్రించారు. వాటి ఇంగ్లీషు అనువాదం కూడా చాలా సంవత్సరాల క్రితమే అయిపోయింది. మిగతా దేశాలవారు కూడా త్రిపిటకాలను అందంగా ముద్రించారు. ఇక వీటి విషయ వస్తువును సంక్షిప్తంగా తెలుసుకుందాము. 'వినయపిటకం' మాటలను, దేహాన్ని నియంత్రణలో ఉంచేది. అందుకే దీన్ని వినయ పిటకం అన్నారు.

***వినయనచో చేవ కాయవాచానం***

***అయం వినయో వినయో'తి అక్ఖాతో***

దీన్ని బౌద్ధ సంఘపు ఆచార సంహితగా పేర్కొనవచ్చు. ఇందులో బౌద్ధ సంఘ వ్యవస్థ, భిక్షు, భిక్షుణిల నిత్యకృత్యములు, ఉపసంపదా నియమాలు, దేశనా నియమాలు, వర్షావాస నియమాలు, ఇంకా వారి భోజన, వస్త్ర, పథ్య, ఔషధములకు సంబంధించిన విషయాలన్నీ ఇందులో వర్ణించబడ్డాయి. ఇలా ఈ వినయ పిటకం భిక్షు, భిక్షుణిలు ఎలా నడుచుకోవాలో నిర్దేశిస్తుంది. ఇంతేకాదు, బుద్ధుడి జీవిత విశేషాలు, ఆ కాలంనాటి సామాజిక స్థితిగతులవంటి విషయాలు కూడా వినయపిటకంలో వివరింపబడ్డాయి.

'సుత్తపిటకం' త్రిపిటకాలలో ముఖ్యమైనది, ప్రసిద్ధమైనది కూడా. బుద్ధ ధర్మాన్ని యథాతథంగా వివరించేది సుత్తం పిటకం. బుద్ధడి ధర్మోపదేశాలను సుత్తపిటకం, సరళ సుందరంగా వివరిస్తుంది. ప్రసిద్ధమైన ధమ్మపదం, జాతక కథలు, దీఘనికాయం, మహాపరినిర్వాణ

సుత్తం ఇలా ఇవన్నీ సుత్తపిటకంలోనివే. బౌద్ధధర్మం గురించి తెలుసుకోవాలంటే ఈ సుత్తపిటకాన్ని తప్పక పఠించాలి. సుత్తపిటకంలోని బుద్ధుడి స్థూలమైన ధర్మోపదేశాలే 'అభిధమ్మ పిటకం'లో సూక్ష్మాతి సూక్ష్మంగా వివరించబడ్డాయి. ఉదాహరణకు సుత్తపిటకంలో స్కంధ, ఆయతన, ధాతువుల గురించిన ఉపదేశం స్థూలంగా కనబడుతుంది. కానీ వాటినే అభిధమ్మ పిటకంలో విభజించి, విభజించి వివరించడం జరిగింది. ఇలా సుత్తపిటకంలోని విషయమే ఈ పిటకంలో తాత్త్విక పారిభాషిక శబ్దాలతో వివరించబడింది. ఈ పారిభాషిక శబ్దాలు కొన్నిసార్లు విషయాన్ని దురూహంగా కూడా చేస్తాయి. అందుకే త్రిపిటకాలలో అభిధమ్మ పిటకం గంభీరమైనది, కొంత కఠినమైనది కూడా.

ఈ త్రిపిటకాలలో మొదటిదైన వినయ పిటకంలో మొదటి గ్రంథం 'చుల్లవగ్గ' ఈ గ్రంథంలో బుద్ధుడి ఉపదేశాలకు మాధ్యమమైన భాషేదో, దాని స్థితిగతులేవో వివరించబడింది. ఆ రోజుల్లో 'యమేళుడు', 'యమేళకులుడు' అనబడే ఇద్దరు బ్రాహ్మణ సోదరులు బుద్ధుడి బోధనలు విని, ప్రభావితులై బౌద్ధభిక్షువులుగా మారారు. వారెంతో అందంగా మాట్లాడేవారు. వారి మాటలను మిగతా భిక్షువులంతా వినాలని కోరుకొనేవారు. వారొకనాడు బుద్ధభగవానుడి వద్దకు వెళ్లి వినమ్ర భావంతో నమస్కరించి "భంతే, ప్రస్తుతం బౌద్ధ సంఘంలో వివిధ ప్రాంతాలవారు, విభిన్న నామగోత్రాలు కలవారు, ఉన్నత వంశంలో పుట్టినవారు, నిమ్నకులంలో జన్మించినవారు, వీరంతా ఉన్నారు. వారి భాషలు, కులాలు, గోత్రాలు, వేరువేరుగా ఉన్నాయి. వీరంతా మీ ఉపదేశాలను శ్రద్ధతో నేర్చుకుంటున్నారు. కానీ చాలామంది మీ ధర్మోపదేశాలను వారివారి భాషల్లో ఉచ్చరిస్తూ వాటిని కలుషితం చేస్తున్నారు. వారి ఉచ్చారణలో దోషాలు కనిపిస్తున్నాయి. ఇలాగే ఇంకొన్ని తరాలు గడిస్తే మీ ఉపదేశాలు స్పష్టమైన ఉచ్చారణ లేని కారణంగా కలుషితమై మీరేం చెప్పారో అర్థం కాకుండా పోతుంది. కాబట్టి వీటన్నిటినీ మేము వైదిక ఛందస్సులోకి మార్చాలనుకుంటున్నాము. వైదిక ఛందస్సులోకి మార్చితే ఒక క్రమబద్ధమైన ఉచ్చారణ ఉంటుంది, ఇక అవి కలుషితం కావడానికి అవకాశముండదు, దానికి మీ అనుజ్ఞ కావాలి" అన్నారు. కాని బుద్ధుడు వారి అభ్యర్థనను నిరాకరించాడు. ఎందుకంటే వైదిక ఛందస్సులోకి మార్చితే తన ఉపదేశాలను శిక్షితులైన ఏ కొద్దిమందో మాత్రమే చదువుతారు. మిగతావారు వాటిని చదవడానికి వీలుండదు. అవి స్పష్టమైన ఉచ్చారణతో కలుషితం కాకుండా ఉండగలవేమో కాని అందరికీ అందుబాటులో మాత్రం ఉండవు. సామాన్య జనుల వరకు చేరవు. నిజానికి సమాజంలో వాళ్లే అజ్ఞానంతో అలమటిస్తున్నారు. ఇలా ఆలోచించి బుద్ధుడు వారితో అన్నాడు – "భిక్షువులారా! ఇది అయుక్తము, అనుచితము. ఎందుకంటే ఈ చర్యవల్ల శ్రద్ధ లేనివారికి క్రొత్తగా శ్రద్ధ పెరగదు. పైగా శ్రద్ధగల సామాన్యులకి నా ఉపదేశాలు అందుబాటులో లేని కారణంగా శ్రద్ధ తగ్గే అవకాశాలున్నాయి. కాబట్టి బుద్ధవచనాలను వైదిక ఛందస్సులోకి మార్చడం అనుచితం. ఒకవేళ ఎవరైనా ఇలాంటి ప్రయత్నం చేస్తే వారికి దుష్కృతాపరాధం చుట్టుకుంటుంది. అందుకే బుద్ధవచనాలను మీమీ భాషల్లోనే నేర్చుకొండి."

***అనుజానామి భిక్ఖవే, సకాయ నిరుత్తియా / పరియాపుణితుం***

బుద్ధఘోషాచార్యులు 'సకాయనిరుత్తియా' అన్న మాటకు వ్యాఖ్యానం వ్రాస్తూ 'సకాయ నిరుత్తియా' అంటే మాగధీ భాషేనన్నాడు. కానీ ఆ సందర్భాన్ని బాగా అర్థం చేసుకుంటే 'సకాయ నిరుత్తియా' అంటే వారి వారి ప్రాంతీయ భాషలేనని స్పష్టమైతుంది. బుద్ధుడు వాటిలోనే తన ఉపదేశాలను నేర్చుకొమ్మన్నాడు. దానికి కారణం తన ఉపదేశాలను ప్రజలు సులభంగా, ఏ శ్రమా లేకుండాడ నేర్చుకోవాలనే. ఇలా భిక్షువులు బుద్ధోపదేశాలను వారివారి ప్రాంతీయ భాషలైన వివిధ ప్రాకృత మాండలికాలలో సంరక్షిస్తూ వచ్చారు. తరువాత వాటిని ఆనాటి సుప్రసిద్ధ భాషైన మాగధిలో అంటే పాలీలో సంకలనం చేశారు.

అందుకే ప్రసిద్ధ జర్మనీ దేశ విద్వాంసులు 'History of Indian Literature' అన్న గ్రంథ రచయిత 'వింటర్ నిట్జ్' పాలీ ఒక వ్యావహారిక భాష కాదని, ఇది కేవలం ఒక సాహిత్యక భాష మాత్రమేనన్నాడు. ఆనాటి అనేక ప్రాకృత మాండలికాల మిశ్రమంవల్ల ఉదయించిన సాహిత్య భాష 'పాలీ' అంటాడితడు. ఇతడి అభిప్రాయానుసారంగా ఈ అనేక ప్రాకృత భాషల్లో ప్రాచీన 'మాగధీభాష' ముఖ్యమైనది. అందుకే పాలీలో అనేక రూపకత కనిపిస్తుంది.

నిజానికి భాష పేరు మాగధీ అయినా దీనికి పాలీ అన్న పేరెలా వచ్చిందన్నది ఆలోచించాల్సిన విషయమే. పాలీ సాహిత్యంలోని ఏ గ్రంథంలోనూ పాలీ శబ్దం భాషార్థంలో ప్రయోగించబడలేదు. ఈ భాషను పేరుతో నిర్దేశించాల్సొచ్చిన ప్రతీసారి దీన్ని మాగధీ అనడం మనం చూస్తాం. ఉదాహరణకు మొగ్గల్లాన వ్యాకరణ ప్రారంభంలో–

*సధమ్మ సంఘం భాసిస్సం / మాగధం సద్ద లక్ఖణం*

అంటాడు ఆచార్య మొగ్గల్లానుడు. తను చెప్పేది మాగధీ శబ్ద లక్షణమన్నాడే కానీ, పాలీ శబ్ద లక్షణమనలేదు. పాలీ సాహిత్యంలో పాలీ శబ్దం కూడా మనకు కనిపిస్తుంది. కానీ భాషార్థంలో కాదు, మూలత్రిపిటకాలు అన్న అర్థంలో. బుద్ధఘోషాచార్యుడు **'పాలిమత్తం ఇధానీతం నత్థి అట్ఠకథా ఇధ'** అంటాడు. అంటే "ఈ సింహళ దేశానికి కేవలం పాలీయే (అంటే త్రిపిటకాలే) తేబడ్డాయి. దాని అట్ఠకథలిక్కడ లేవు" అని. ఇలా చాలాచోట్ల పాలీ అంటే మూల త్రిపిటకాలనే అర్థం. కానీ కాలక్రమేణ బుద్ధోపదేశాలు సురక్షితం చేసిన ఈ భాషను పాలీ అనడం ప్రారంభించారు. ఈ చారిత్రక నేపథ్యం తెలియని చాలామంది పాలీ శబ్ద ఉత్పత్తి విషయంలో రకరకాల కల్పనలు చేశారు. కొందరు పాలీ అంటే పాటలీపుత్ర భాష అని, మరికొందరు 'పల్లి' శబ్దం నుండి ఇది వచ్చిందని, ఇంకొందరు 'ప్రాకృత' శబ్దమే పాలీగా మారిందని ఏవేవో ఊహించారు.

వాస్తవానికి బుద్ధోపదేశాలను మొదట పాలీ అన్నారు. క్రమేణా అదే భాష నామధేయమైపోయింది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే త్రిపిటకాలలో బుద్ధోపదేశాలను 'పరియాయం' శబ్దంతో పేర్కొన్నారు. ఈ శబ్దం త్రిపిటకాలలో చాలాసార్లు కనిపిస్తుంది. కొన్నిసార్లు ఈ శబ్దం ధమ్మశబ్దంతో కలిసి 'ధమ్మ పరియాయో' అని ప్రయోగించబడింది. మరికొన్నిసార్లు స్వతంత్ర్యంగా కూడా వాడబడింది. మొత్తం మీద త్రిపిటకాలలో ఈ శబ్దం బుద్ధోపదేశమన్న అర్థంలోనే వాడబడింది. 'పరియాయ' శబ్దంలోని 'ర'కారం 'ల'కారంగా మారి 'పలియాయ'గా మారింది. అశోక సామ్రాట్టు వ్రాయించిన 'భాబ్రూ శిలాశాసనం'లో కూడా ఈ 'పలియాయ' శబ్దం లభిస్తుంది. అక్కడ కూడా బుద్ధోపదేశమన్న అర్థంలోనే ఈ శబ్దం వాడబడింది. మగధ దేశంలోని భిక్షువులను కొన్ని ఎన్నుకోబడిన బుద్ధవచనాలను అధ్యయనం చేయమంటూ ప్రియదర్శి అశోకుడిలా అంటాడు–

***ఇమాని భన్తే! ధమ్మ పలియాయాని... ఏతాని భన్తే***
***ఇచ్ఛామి కిం తి బహుకే భిఖుపాయే భిఖునియే చా***
***అభిఖినం ఉపధాలేయేయు చా...***

భన్తే ఇవి ధమ్మ పలియాయాలు (బుద్ధోపదేశాలు). వీటిని ప్రతీభిక్షువు, ప్రతీభిక్షుణి, ప్రతీ ఉపాసకుడు, ప్రతీ ఉపాసికా సతతమూ వింటూ ధారణ చేయాలి.

ఈ 'పలియాయ' శబ్దమే రానురాను 'పాలియాయ'గా మారింది. పాలీ భాషలో 'పరి' 'పటి'వంటి ఉపసర్గలు 'పారి' 'పాటి'గా మారడం సహజమే. పరిలేయ్యకం 'పారిలేయ్యకం'గా మారుతుంది. 'పటికజ్ఘా' 'పాటికజ్ఘా'గా మారుతుంది. అదేవిధంగా 'పరియాయ' శబ్దమే మొదట 'పలియాయ'గా మారి తరువాత 'పారియాయ'గా మారి చివరికి అదే 'పాలి'గా మారింది. అందుకే పాళీ–సంస్కృత–హిందీ మొదలైన భాషలోని పాళీని 'పాలి' అంటారు. కాని 'తెలుగు'లో 'ల'కారం 'ళ'కారంగా మారి 'పాళీ'ని 'పాలీ' అని వ్యవహరించడం పరిపాటి. ఈ మార్పు కేవలం పాలీ శబ్ద విషయంలోనే కాదు, మిగతా పదాలలో కూడా ఇది కనిపిస్తుంది. ఉదాహరణకు సంస్కృత భాషలోని 'కలాశాల' తెలుగులో 'కళాశాల'గా, 'కలత్రం' 'కళత్రం'గా మారడమనేది సర్వవిదితమే. ఈ పరిపాటినసుసరించే 'ఎళి'ని కూడా పాలీ అని అనడం ప్రారంభించి ఉంటారు. అయితే పాలీ భాషలో నిజానికి 'ళ' కారం కూడా ఉన్నది. కానీ దీన్ని 'పాళీ' పదంలో ఉపయోగించారు. 'చూళసీలము', 'యమేళుడు'వంటి పదాలలో దాన్ని దర్శించవచ్చు.

ఇలా త్రిపిటకాలలోని పరియాయ శబ్దమే పాలీ పదానికి స్రోతస్సైనా కొందరు 'పాఠ' శబ్దం నుండే 'పాలీ' శబ్దం వచ్చిందంటారు. ఈ విషయాన్ని సహేతుకంగా ప్రతిపాదించడానికి ప్రయత్నించినవాడు భిక్షుసిద్ధార్థుడు. ఇతడి అభిప్రాయానుసారంగా 'పాలీ' శబ్దానికి మూలం సంస్కృత భాషలోని 'పాఠ' శబ్దము. పాఠ శబ్దమే కాలక్రమేణ 'పాలీ' శబ్దంగా మారిందంటాడు ఇతడు. ప్రాచీన కాలంలో పాఠమంటే వేదపాఠమనే అర్థమే ఉండేది. బుద్ధుడి కాలంలో కూడా ఈ పాఠశబ్దం ప్రాచుర్యంలో ఉంది. ఆనాడు బుద్ధుడి బోధనలవల్ల ప్రభావితు ఐన బ్రాహ్మణులు అధిక సంఖ్యలో 'బౌద్ధం'లోకి

ప్రవేశించారు. బౌద్ధసంఘంలో బుద్ధవచనాలే వేదతుల్యాలు కాబట్టి వారు అలవాటు ప్రకారం వాటిని 'పాఠం' అని అనడం ప్రారంభించారు. కేవలం ఇదే కాదు, అలవాటు ప్రకారం వారు సహిత (సంహితా) తన్తి (తన్త్ర) పావచనా (ప్రవచనం)వంటి శబ్దాలను కూడా వాడారు.

'ఠ'కారం పాలీ భాషలో 'ళ' కారంగా మారడం భాషాశాస్త్రరీత్యా కూడా సంభవమే. సంస్కృత మూర్ధన్యాక్షరాలైన ట, ఠ, డ, ఢ, ణలు పాలీలో ళకారంగా మారతాయి. సంస్కృతంలోని ఆటవిక శబ్దం 'ఆళవిక'గా మారుతుంది. 'ఏడక' శబ్దం 'ఏళక' శబ్దంగా మారుతుంది. 'వేణు' శబ్దంగా మారుతుంది. 'దృఢ' శబ్దం 'దళ్హ' శబ్దంగా మారుతుంది. ఇలాగే పాఠశబ్దం కూడా పాలీగా మారిందంటాడు భిక్షుసిద్ధార్థుడు.

కానీ పాలీ సాహిత్యంలో 'పాలీ' శబ్దంతో పాటుగా కూడా 'పాఠ' శబ్దం కూడా లభిస్తుంది. పాఠశబ్దమే గనక పాలీగా మారి ఉంటే అది మళ్లీ కనిపించకూడదు. కానీ కనిపిస్తున్నది. పైగా ఇతడి సిద్ధాంతానికి ఏ చారిత్రకాధారమూ లేదు. అందుకే ఇతని సిద్ధాంతం ప్రామాణికతను కోల్పోయింది. పండిత విధుశేఖర భట్టాచార్యుల వారి సిద్ధాంతానుసారంగా పాలీ శబ్దానికి అర్థం పంక్తి. 12వ శతాబ్దికి చెందిన 'అభిధానప్పదీపికా' అన్న పాలీ నిఘంటువులో కూడా పాలీ శబ్దానికి అర్థం పంక్తి అనే ఇవ్వబడింది. పాలీ సాహిత్యంలో మనకు అంబపాళి, దంతపాళి, కణ్ణపాళి వంటి శబ్దాలు కనిపిస్తాయి. ఈ శబ్దాలకు 'పంక్తి' అన్న అర్థమే పొసగుతుంది. కానీ విజ్ఞుల అభిప్రాయానుసారంగా ఈ సిద్ధంతంలో కూడా లోపాలున్నాయి. ఎలాగంటే 'పాలీ' శబ్దానికి అర్థం పంక్తి అని చెప్పుకుంటే ఒక 'లిఖిత పంక్తి' ఉండడం అనవసరం. కానీ త్రిపిటకాలు క్రీ.పూ. మొదటి శతాబ్దం కంటే ముందు లిపిబద్ధం చేయబడలేదు. అంతవరకు భిక్షువులు వాటిని శ్రవణ పరంపరతో రక్షిస్తూ వచ్చారు. నికాయాలకు నికాయాలనే కంఠస్థం చేసేవారు. వీరిని గుర్తించడానికి కొన్ని పేర్లు కూడా ప్రచారంలో ఉండేవి. ఉదాహరణకు దీఘనికాయాన్ని కంఠస్థం చేసిన భిక్షువును 'దీఘభాషకుడ'ని మజ్ఝిమనికాయాన్ని కంఠస్థం చేసిన భిక్షువును 'మజ్ఝిమభాణకుడ'ని ఇలాగే 'అంగుత్తర భాణకుడు', 'ఖుద్దక భాణకుడు' అని ఉండేవారు. త్రిపిటకాలను మనం ప్రస్తుతం నికాయాలలో విభజిస్తున్నాం. కానీ ఇలా కాకుండా వీటిని భాణావారాల్లో విభజించే పద్ధతి కూడా ఉన్నది. దీని ఉద్దేశ్యం ఒక్కసారి ఒక్క భాణావారాన్ని కంఠస్థం చేయవచ్చునన్నదే.

ఇలా లిపిబద్ధం కాని సమయంలో పంక్తులెలా ఉంటాయి? కాబట్టి పాలీ శబ్దానికి పంక్తి అనే అర్థం పొసగదు. ఇంకో విషయం, గ్రంథనామముల చివరన పాలీ శబ్దాన్ని జోడించే పరిపాటి కూడా పాలీ సాహిత్యంలో ఉన్నది. ఉదాహరణకి 'దీఘనికాయ పాళి', 'మజ్ఝిమనికాయపాళి', 'సంయుత్తనికాయపాళి'. ఇలాంటప్పుడు పాలీ శబ్దానికి అర్థం పంక్తి అని చెప్పుకుంటే సరైన అర్థం రాదు. దీఘనికాయ పాళి అంటే దీఘనికాయపంక్తి అని చెప్పుకోవడం అనుచితం. ఇక పాలీ శబ్దానికి పంక్తి అని అర్థమైనప్పుడు పంక్తులు అన్న బహువచన రూపం కూడా ఉండాలి కదా – కాని అది లభించలేదు.

విధుశేఖర భట్టాచార్యులపై సిద్ధాంతంలోని మూడు లోపాలలో మొదటిదానికి శ్రీమతి 'రైస్ డేవిడ్స్' తన 'Shakya and Buddist Origins' అన్న గ్రంథంలో సమాధానం చెప్పడానికి ప్రయత్నించింది. 'లిఖిత పంక్తి' లేనప్పుడు పంక్తి అంటే 'పఠిత పంక్తి' అన్న అర్థం తీసుకుంటే సరిపోతుంది. ఇలా అయితే త్రిపిటకాలు లిపిబద్ధం కాని సమయంలో కూడా పాలీ శబ్దానికి పంక్తి అనే అర్థం సరితూగుతుంది. ఇలా మొదటి ప్రశ్నకు సమాధానం చెప్పుకున్నా మిగతా రెండు దోషాలవల్ల పండిత విధుశేఖర భట్టాచార్యాల వారి సిద్ధాంతం ప్రామాణికతను కోల్పోయింది. జర్మనీ దేశస్థుడైన డా. మాక్స్‌వెల్‌సర్ అభిప్రాయానుసారంగా 'పాటలి' లేక 'పాడలి' శబ్దపు సంక్షిప్త రూపమే 'పాలీ'. ఇతను చెప్పే ఈ 'పాటలి' ఆనాటి పాటలీ పుత్ర భాష. పాటలీ పుత్రంలోనే ముఖ్యంగా త్రిపిటకాలు సంగ్రహించబడ్డాయి. కాబట్టి 'పాటలి'యే క్రమంగా పాడలి, పాళి అయ్యిందంటాడు ఇతడు. డా. తిరుమల రామచంద్రగారి అభిప్రాయం కూడా ఇదే. కానీ పాలీ శబ్దానికి క్రీ.శ. 19వ శతాబ్ది వరకు భాషార్థమే లేదు (ఈ విషయంలో స్పష్టమైన వివరణ కొరకు నా 'పాలీ సాహిత్యంలోని దీఘనికాయంలో తాత్త్విక ధోరణులు' అన్న గ్రంథం చూడండి). అప్పుడు పాలీ అంటే త్రిపిటకాలు లేక బుద్ధవచనాలు అన్న అర్థమే ఉండేది. అలాంటప్పుడు పాటలీపుత్ర భాషే పాలీ అనడానికి వీలు లేదు.

డా. మాక్స్‌వెలేసర్ ప్రతిపాదించిన పాటలి, పాడలి, పాలీ సిద్ధాంతాన్ని డా. థామస్ ఖండించాడు. అప్పటి నుండి ఇది ప్రామాణికతకు కోల్పోయింది. మరికొందరు పల్లి (గ్రామము) నుండి పాలీ వచ్చిందంటారు. ప్రాకృత శబ్దమే పాలీ అయిందంటారు ఇంకొందరు. ప్రాలేయక శబ్దమే పాలీగా మారిందంటారు మరికొందరు. కానీ ఈ సిద్ధాంతాలన్నిటికన్నా మొదట పేర్కొన్న భిక్షు జగదీశ కాశ్యపుడి పరియాయ, పలియాయ, పాలియాయ, పాలి అన్న క్రమమే అటు చారిత్రకంగా ఇటు భాషా శాస్త్ర రీత్యా కూడా, ప్రామాణికంగా నిలబడింది. పాలీ అంటే 'ధర్మానుశాసనం' అన్న అర్థమే ఉండేది కాబట్టి అదే శబ్దం తెలుగులోకి 'పాడి' అన్న రూపాంతరంతో ప్రవేశించింది. 'పాడి' అన్నా ధర్మమే కదా! పాలీ భాష చాలా ప్రాచీనమైనది. వింధ్య - హిమాలయ మధ్యగతమైన ఆర్యావర్తంలోనే కాకుండా ఒకప్పుడీ సమస్త భూప్రపంచంలో ప్రాకృత భాషలే వ్యావహారిక భాషలుగా ఉండేవని విజ్ఞుల అభిప్రాయం. సమస్త ప్రపంచం మాటెలా ఉన్నా కనీసం యావద్భారత దేశంలోనైనా ప్రాకృత భాషలు ఒకనాడు వ్యావహారిక భాషలుగా వెలుగొందాయన్నది చారిత్రక సత్యం. మనకు తెలిసి ఆర్యావర్తంలో అతి ప్రాచీనమైనది వైదిక భాషే. అయితే ఈ వైదిక భాష కూడా ఒక విధమైన ప్రాకృతమేనని పరిశోధనలవల్ల తెలుస్తుంది. ఈ భాష వ్యాకరణానికి లోబడినట్లనిపించదు. సంబంతాది ప్రయోగాలు వైదిక భాషలో అస్తవ్యస్తంగా వాడబడ్డాయి. 'దక్షిణాయాః' అనే రూపం 'దక్షిణ్నాస్యాం'గా మారింది. 'శుభితం' 'శుధితం'గా మారింది. మధోః' 'మధునః'గా ప్రయోగించబడింది. 'వియూయా' 'వియూయాత్'గా మారింది. కాలాలలో (Tenses) కూడా ఈ అస్తవ్యస్తత కనిపిస్తుంది. 'ఇచ్ఛతి' అనే పరస్మైపదధాతువు 'ఇచ్ఛతే'గా అంటే ఆత్మనేపద ధాతువుగా ప్రయోగింపబడింది. వైదిక సంస్కృత భాషలోని ఈ వైవిధ్యమే పాలీ భాషోద్భవానికి దారితీసింది. వైదిక భాషే రెండు పాయలుగా చీలి ఒకటి లౌకిక సంస్కృత భాషగా, మరొకటి పాలీ భాషగా పరిణమించింది. అందుకే వైదిక సంస్కృతంతో లౌకిక సంస్కృతానికి సంబంధమున్నట్లే పాలీ భాషకు కూడా ఉంది. నిజానికి లౌకిక సంస్కృతం కంటే పాలీ భాషకే వైదిక సంస్కృతంలో దగ్గరి సంబంధం ఉన్నది. వైదిక సంస్కృతంలో కనిపించే 'దేవేభిః', 'కర్ణేభిః'వంటి ప్రయోగాలు సంస్కృతంలో లేవు. కానీ పాలీలో 'దేవేభి', 'దేవేహి', 'కణ్ణేభి', 'కణ్ణేహి'వంటి ప్రయోగాలు స్పష్టంగా కనపడతాయి.

వైదికభాష యాస్క, పాణినుల కాలం కంటే ముందు నుండే నియమబద్ధమై సంస్కృత భాషగా తయారయ్యే సమయంలోనే అది మరో నూతన రూపాన్ని సంతరించుకుంది. ఆ నూతన రూపమే పాలీ భాషోద్భవానికి దారితీసింది. వైదికభాష అన్ని ప్రాంతాలతోపాటుగానే మగధ, కోసల ప్రాంతాలలో కూడా పరిణతి చెందింది. ఈ రెండు ప్రాంతాలలో వికసితమైన ఆ భాషే, తరువాత పాలీ భాషగా రూపుదాల్చుకున్నది.

పాలీ భాషలో విశాలమైన సాహిత్యం దాగి ఉన్నది. చాలామందికి 'ధమ్మపదం' పేరు తెలుసు. ఇలాంటి గ్రంథాలింకా ఇందులో ఎన్నో ఉన్నాయి. నిజానికి 'బౌద్ధ స్థవిరవాదుల' సాహిత్యమే పాలీలో ముఖ్యమైనది. పాలీ సాహిత్యంలో మన గత చరిత్రే కాదు, ఆనాటి ధార్మిక, తాత్త్విక విషయాలెన్నో దాగియున్నాయి. గ్రామ్య జీవనాన్ని పాలీ సాహిత్యం సరళ సుందరంగా చిత్రీకరిస్తుంది. ఈ సాహిత్యమేగనక లేకపోతే నేడు ఎన్నో విషయాలు మన చేజారిపోయి ఉండేవి.

పాలీ భాషలో కఠిన శబ్దాల ఉండవు. సరళ సుందరమైన భాష ఇది. ఎందరో పాశ్చాత్యులు ఈ భాషనభ్యసించారు, పరిశోధనలు చేశారు. నేడు కూడా చేస్తున్నారు. ఈనాడు ప్రపంచంలో, దాదాపు అన్ని ప్రసిద్ధ విశ్వవిద్యాలయాల్లో పాలీ భాషాభ్యాసం కొనసాగుతున్నది. హార్వర్డ్, కేంబ్రిడ్జి వంటి విశ్వవిద్యాలయాలలో ఈ భాషాసాహిత్యాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. బౌద్ధం వ్యాపించిన అన్ని దేశాలలో పాలీ భాషకెంతో ఆదరణ ఉన్నది. ఇంత విశిష్టమైన ఈ భాష మనదైనందుకు మనమెంతో గర్వించాలి. దీన్ని ఒక సాంస్కృతిక నిధిగా భావించాలి. మన పూర్వీకులు ఎందరో ఈ భాషను అభ్యసించారు. ఈ భాష ఒక వర్గానికిగాని, ఒక కులానికిగాని, ఒక మతానికిగాని సంబంధించినది కాదు. ఇది భారతీయుల వారసత్వ సంపద. దీన్ని అందరూ అభ్యసించాలి, ఆదరించాలి. అప్పుడే మన సమాజము పునీతమౌతుంది.

**పాలీ భాష పుట్టుపూర్వోత్తరాలు** - *రచన: డా. చాడూరి ఉపేంద్రరావు*

# కొత్త రంగుల తపన

**– నందిని సిధారెడ్డి**

ఆధునిక మానవుని రూప కల్పనలో విజ్ఞానశాస్త్ర సాంకేతిక మాధ్యమాల పాత్ర చరిత్రాత్మకమైంది. మరిచిపొయ్యేది కాలం కావచ్చు. కానీ గురుతుకొచ్చేది చరిత్ర. ఎప్పుడూ మానవుడు 'కొత్త'ను ప్రేమిస్తాడు. కొత్తదనాన్ని అనుసంధానం చేసుకుంటూ పురోగమిస్తాడు. జీవితాన్ని ఆధునీకరించటంలో, అభివృద్ధి పరచ్చటంలో కీలకపాత్ర పోషించిన విజ్ఞాన సాధనాల్లో అపూర్వమైంది రేడియో. ఆధునిక కాలానికి అవశ్యమైన సంస్కృతీ నిర్మాణంలో 'ఆకాశవాణి'ది అద్భుత చరిత్ర. నగరాల నుంచి పల్లెలదాక, సంప్రదాయం నుండి శాస్త్ర విజ్ఞానం దాక, దేశ భక్తి నుండి వ్యక్తిత్వనిర్మాణం దాకా, వినోదం నుండి విభిన్న కళారూపాల దాకా అల్లుకు పోయిన విశేషవాణి ఆకాశవాణి. సంగీతం, నాటకం, రూపకం, వార్తలు, ముచ్చట్లు, లలితగేయాలు, జానపదగేయాలు, చిత్రగీతాలు, కవిసమ్మేళనాలు... అదొక వైభవం. ఆకాశవాణి వినిపించని ఊరులేదు. ఆకాశవాణి ప్రభావితం చేయని తరం లేదు. అదొక ప్రాభవం. అది కళల కాలం.

సృజనాత్మకతను ఆకాశవాణి నిరంతరంగా ప్రోత్సహించింది. కొత్తదనానికి వేదికగా నిలిచింది. కొత్త జీవన సంస్కృతిని నిర్మించింది. జాతి పర్వదినాల వేళల్లో, జాతీయ పర్వదినాల వేడుకల్లో కవిసమ్మేళనాలు నిర్వహించేది. రేడియోకు మహాకవులు, మహాకవులకు రేడియో ఒక ఆకర్షణ. ప్రకటన దగ్గర నుంచి ప్రసారం దాకా కవి భావుకులకు ఉత్సాహం. కవిత్వానికి ఉత్సవం. నడుమ నడుమ యువకవులకు, కొత్త గళాలకు వేదిక కల్పించటం ఆకాశవాణి ప్రత్యేకత. కొత్త కవితరాన్ని నిర్మించడం ఆకాశవాణికి కొత్త కాదు. ఎన్ని కవి తరాలు... ఎన్ని కవిత్వ ప్రసారాలు... మళ్లా కొత్త కవితరానికి వేదిక. కొత్త సంవత్సరాదికి కొత్త కవిత్వ వేడుక. ఆకాశవాణి నిర్వాహకుల మరొక ప్రయోగం. యువకవి సమ్మేళనం. యువశోభ. యువ కవిత్వ శోభ. కాలం కొత్త రుతువులు మోసుకొస్తుంది. రుతువు మారినప్పుడల్లా కొత్త శోభలు పరిమళించడం సహజం. కొత్త గొంతులు పులకించటం సహజం. ఆ కొత్త ఆలాపనలు విశేషం. జీవితం మారినా... అనుభావాలు మారినా... సాంకేతికతలు మారినా... వ్యక్తీకరణలు మారినా... కవిత్వమే సాక్ష్యం. వొస్తున్న మార్పుల్ని వొడిసి పట్టుకునేదే కవిత్వం. ఆషామాషీకాదు. కవిత్వం ప్రకంపన. కాల పరిణామాల ప్రతిబింబం. కవిత్వం రుతుపరిమళం. ఆ ప్రకంపనలను ఆ పరిణామాలను, అద్భుత పరిమళాలను ఈ కవులు ఆలాపిస్తున్నారు.

కవికి 'నింగి ఎప్పుడూ ఓ మరకలేని కాగితమే'. నిసర్గ సౌందర్య భరితమైన కాగితమ్మీద పరిమళాల చెదరని బాల్యాన్ని ఉల్లేఖిస్తారు కవులు. బాల్యం గంధపేటిలో భద్రపర్చుకున్న రుతువు. వాడదు. వాసన చెడదు. వెలిసిపోదు. 'ఖాళీ తనాన్ని భర్తీ చేసే నిండైన తత్వం కదా బాల్యం. అమృత బిందువది. రూపం మార్చుకుని అన్నం ముద్దలా ఎదురు పడుతుంది'. అది కవి అనుభవం. అవునా... 'ఇదిగో ఈ రూపాయి బిళ్ళంత మచ్చుంది చూశావూ. అది నీకు పుట్టుకతోనే వొచ్చింది. చందమామ దాని తాలూక గుర్తు ఇది'. అంతేనా... 'నెలవంకపై ఉన్న నూరేళ్ల బామ్మగారి చిన్నారి కుందేలుతో సరదాగా చిందెయ్యాలని' ఊహ. కవి ఊహ. బామ్మ ఒక ఊహ. కుందేలు మరొక ఊహ. సరదాగా చిందెయ్యాలనేది ఇంకొక ఊహ. కవిత్వంలో ఊహకు తిరుగులేదు.

తర్వాత కవుల్ని నిదురపోనివ్వనిది ప్రేమ. ఊహల నిండా హృదయాల నిండా నిండి ఉద్వేగ భరితం చేస్తుంది. 'నువ్వు రాక ముందు నాకు ఒంటరితనమే లేదు. ఎప్పుడూ నాతో నాలోకం తోడు ఉండేది. నువ్వు వచ్చాక నువ్వే లోకం'. రెండు లోకాలు ఒక లోకంగా మారటం కొత్త అనుభవం. పరవశుల్ని చేసే అనుభం. 'సృష్టి అద్దంలోన బింబమవుదాం ప్రియసఖీ స్పృహ లేని అందమవుదాం. వలపన్ని పోతుంది వలపు ఋతువు. వర్ణించుకుంటాయి ధరణి సిరుల. ప్రియసఖీ మార్పులకు సిద్ధమవ్వు'. స్పృహలేని అందమవటానికి సిద్ధపడతాడు కవి. రుతు మార్పులకు సిద్ధపడి గానం చేయటం కవివి తెలుసు. ఔచిత్యం కూడా తెలుసు. పొద్దుపువ్వును కొప్పులో పెట్టుకుని పొద్దులొస్తం సేద్దెం చేసే చెమట గువ్వా, దుక్కిస్తున్న ఊళ్లను చూస్తూ నీ సుక్కల రైకపై కవి తెట్టారాసేదమ్మా'. ప్రేమ

పరవశకు కవికి ఊరంటే మరింత పరవశం. మరింత ఆవేశం. దుఃఖిస్తున్న ఊరును చూసే కవి తన ప్రేమలోనే తరించటం కష్టం.

వర్తమాన కవికి ఊరుతో ఉద్వేగానుబంధం. నగరాలు తిరిగినా నాజూకుగా మారినా ఊరి బంధాల్ని పొరలు పొరలుగా వర్ణిస్తాడు. 'పానం ఆగమాగమై రందిలపడ్డప్పుడు మాట్లాడిన పచ్చి మడికట్ల భాష ఎంతన్న ఉప్పస' మడికట్ల భాషలో మనసు మిళితమై ఉంటుంది. ఎంతటి రంధి అయినా ఆ భాషతో ఊరటపుడుతుంది. ఊరు భాష ఆత్మీయత అదే. కవిత్వమెప్పుడూ ఆత్మభాష. ఆత్మీయుల భాష. 'చుట్టూతా ఉన్న ట్యూబ్ లైట్ల వెలుతురుకు సిగ్గుగానే తలదించుకుంటుంది. ఆ ఇంటి ఎండుటాకుల తోరణం. వాలేపొద్దు చెప్తూనే ఉంది. నీ కొడుకెప్పుడో వాలిపోయాడమ్మా అని వాలిపోయిన కొడుకు కోసం ఎదురుచూస్తున్న వాళ్లది ఒక ఒడవని దుఃఖం. చెప్పరాని నరకం. ఎన్నో అనుబంధాల్ని పంచిన ఊరు. అనుబంధాల కోసం నిరీక్షణగా మిగిలిన దీనస్థితి కవుల్ని కలచివేస్తున్నది.

కవిత్వాన్ని పదునెక్కిస్తున్నది జీవితమే. సారహీనమవుతున్న జీవితపు లోతుల్నించి కవిస్వరం సరాయించుకుంటాడు. 'జీవితం నాలుగిటికెల ఇళ్ళని రాసుకున్నాక వేడుకలాంటి వాన కురుస్తుందని, కూలిపోయే గాలి బొమ్మొస్తుందనీ చెప్పారు... మనససలే అరువు. ఒళ్ళు పూర్తిగా నాది కాదు. ప్రాణం మరి ఆర్తవదు . జీవితం పరాయీకరించబడిన బాధ వర్తమాన కవిది. ఎంతో మౌనంలో నుండి దయగా ఓ పిలుపూ వ్యాపారానికి వెనుకాడని ఈ లోకంలో జీవితాన్ని పుణికి కొసరడగడం తప్పేమీకాదు. దయతో కూడిన పిలుపు కోసం కవిత్వం కలవరిస్తుంది. 'కలలో మెళకువను మెళకువలో కలను మెలివేస్తున్నాను గాఢంగా ఒక శుభోదయానికై నిరీక్షిస్తూ' ఉంటారు కవులు. జీవితాన్ని కొసరు అడుగుతుంది. 'కోల్పోయిన రంగుల కోసం మట్టికాబడుతాను. మర్చిపోయాను బతకలేని గుహలో దాక్కుని నిన్ను. కవి బతకలేనందుకు బాధపడతాడు. మట్టి కావడానికి మథనపడతాడు.

కవులందరిలోనూ ఆర్తి అల్లుకొని ఉన్నది. కోల్పోయిన బ్రతుకులో కోతపెడుతున్న పదన ఉన్నది. 'ఎన్ని ఇరుకుగదుల్ని ఖాళీ చేయాలోకన్నా, ఎదురైన ప్రతి మనిషినీ నీలా గుండెల నిండా ఆహ్వానించాలంటే'. విశాలంగా ఉండ వలసిన మనుషులు ఇరుకిరుకుగా మారుతున్న పరిస్థితి చూసి కవి ఇబ్బంది పడుతున్నాడు.

స్త్రీ పురుష సంబంధాలు ఛిద్రమవుతుంటే హృదయం కనలుతుంది. కములుతుంది. కవిత్వమైతుంది. మీ చేతికంటిన రక్తాన్ని ఆమె కన్నీటితో కడిగేసుకోండి సంబంధాలన్నీ ఆర్థిక బంధాలైపోయినప్పుడు మనుషులు మారిపోగలరు. మానవ సంబంధాలన్నీ కొంచెం రక్తం, కొంచెం కన్నీళ్ళు. అవి మారిపోయి సొంతం రక్తం, సొంతం కన్నీళ్ళు మిగిలాయి. సంప్రదాయం కొంచెం ఓదార్పు. 'ఒక్క అక్షరమ్ముక్క కూడా సదువని అమ్మలు ఒడి బియ్యమప్పుడు ఎన్నెన్నో సదువులు సదువుతుంటే ఏ ఆడబిడ్డకైనా, తల్లిగారింటి మీద అధికారముందని గుర్తుచేసేది ఒడిబియ్యమే. కష్టనష్టాల్లో కట్టుబాట్లు కాపాడుతాయి. కలతబడిన గుండెల్ని కవిత్వం పాడుతుంది. కవిత్వం మనుషుల గుండెలోకి కొత్త రక్తం ఎక్కిస్తుంది.

కవిత్వం రసహీనమైన దృశ్యానికి రక్తాన్నెక్కించేలా ఉండాలి. నింగికొమ్మల్లో నిప్పుపూలు పూయించేలా ఉండాలి 'అతను తిరిగి వచ్చే నాటికి ఇక్కడ ఒక మొక్క పెరగటాన్నీ అతను గమనిస్తాడు. ఆ మొక్క మీద పాటని కట్టి బిగ్గరగా పాడుతో వెళ్ళిపోతాడు. పాడుతూ వెళ్ళిపోయేది కవే. జీవితం జీవితంలా పరిమళించాలని కోరుకునేదీ కవే.

యువకవుల శోభ కవులది కొత్త భాష. కొత్త ఆలంకారికత. కొత్త వర్ణన. ప్రకృతి, చెట్టూ, పిట్టా, పాట, కవుల వాక్య విన్యాసాల్లో శోభిస్తున్నాయి. తెలియని దిగులు గూడు కట్టుకున్న భావుకత. ఎదురైన శోకం గుండెలు వొడి పెడుతున్న దైన్యం అక్షరాల్లో అంతర్లీనంగా ప్రవహిస్తున్నాయి.

జీవితాన్ని సరికొత్తగా తీర్చిదిద్దుకోవాలన్న తపన. కొత్తగా వ్యక్తీకరించాలని చేస్తున్న అన్వేషణ హృదయాలను తాకుతాయి. కవిత్వ ప్రపంచాన్ని శోభాయమానం చేయటానికి సిద్ధమైతున్న కాంతిరేకలివి. మనశ్శోభలు వెదజల్లుతున్న మందారాలకు ఆహ్వానం.

# కబీర్ దాస్ - 13

**- లక్ష్మీ అయ్యర్**

ఇక 46వ అధ్యాయము కాల్ కౌ అంగ్. ఇందులో క్షణికమైన జీవితాన్ని గురించి కాలుని గురించి కబీర్ దాసు విస్తృతంగా చర్చించారు. ఇందులో మొత్తం 32 దోహాలు ఉన్నాయి. మొదటి దోహా లో కబీరు కాలుని గురించి కబీర్ కాలుని గురించి అంటే యముని పిలుపు గురించి ఈ క్షణ భంగురమైన జీవితం గురించి ఇలా చెప్తున్నారు. “ఇక్కడున్న మానువలంతా అజ్ఞానులై క్షణిక సుఖానికి గురై ఇదే సంతోషం అనుకొని ఆపదలో చిక్కుకొని ఉన్నారు. అబద్ధమైన (అశాశ్వత) సుఖాన్ని చూసి అది సత్యమైన సుఖమని అపోహ పడుతున్నారు. కానీ అన్నీ సుఖాలు యమధర్మరాజు యొక్క పిడికిలిలో ఉన్నాయి. ఈ జీవితమే క్షణభంగురము. ఈ అధ్యాయములో ఐదవ దోహా అత్యంత ప్రసిద్ధము.

***ఆజ్ క హై హరి కాల్ హై భజౌ హా కాల్ హీ***
***ఆజుహి కాల్ హీ కరత్ రే ఔసర్ జాసి చాల్ హీ***

ఈ రోజే భగవంతుడిని స్మరించండి హరిని ఈ రోజు స్మరించమంటే రేపు స్మరించమంటే ఎల్లుండి అంటావు. ఇలా రోజులు గడుస్తాయి. కానీ భగవంతుని నామాన్ని ఎవరు ఉచ్చరించరు. ఇలా భగవంతుని నామాన్ని స్మరించకుండానే కాలునికి బలై పోతుంటారు. ఇక ఎనిమిదో దోహాలో కబీర్ ఇలా అంటున్నారు “ జీవుడు ఒంటరివాడు అతనిపై ఆక్రమణకు ఇద్దరు శత్రువులు ఒకటికొకరు పోటీ పడుతుంటారు. ఒకటి వృద్ధాప్యము, ఇంకొకటి మరణము. వీళ్ళిద్దరిలో పెద్ద భేదం ఏదీ లేదు. వృద్ధాప్యము తర్వాత స్థితి మరణ స్థితి. ఇవి రెండూ జీవితం యొక్క క్షణభంగురాన్ని తెలియపరుస్తుంది. అదెలా 14వ దోహా కూడా అత్యంత ప్రసిద్ధము.

***పానీ కేరా బుద్ బుదా అ స్ మానస్ జాత్*** అనే ఈ దోహాలో “ఈ క్షణభంగురమైన జీవితము నీటిలో తేలే బుడగ లాంటిది. చూస్తూ చూస్తూ తెల్లవారి ఝామున అంటే ఉషోదయ సమయాన తారలు చూస్తూ చూస్తూ ఎలా కనుమరుగవుతాయో అదెలా చూస్తూ చూస్తూ ఈ జీవితం సమాప్తం అవుతుంది” అని అంటున్నారు కబీరు.

ఇక అంతిమ దోహాలైన 31,32లలో కబీరు యొక్క భావనలు ఆదిశంకరాచార్యుని భజగోవిందంను గుర్తుచేస్తాయి.

***యావత్-పవనోనివసతిదేహే తావత్-పృచ్ఛతికుశలంగేహే ।***
***గతవతివాయౌదేహాపాయే భార్యాబిభ్యతితస్మిన్కాయే ॥***

ఈ రెండు దోహాలలో కబీర్ ఇలా అంటున్నారు “ప్రతివాడూ మరణిస్తాడు కానీ వాడికోసం ఏడ్చేవాళ్ళు కూడా మరణించిన వారితో సమానమే. శవాన్ని దహనానికి తీసుకెళ్లి వ్యక్తులు కూడా ఆకాలుడికి బలికాబోతున్నవారే. ఈ రోజు లేకుంటే రేపు రేపు లేకుంటే ఎల్లుండి ఇలా కాలుడు ఎవరినీ వదలడు అని కబీర్ అంటున్నారు అంతిమ దోహాలో కూడా కబీర్ ఇలాగే చెప్తున్నారు.

ఇక 40 ఏడవ అధ్యాయము సజీవని కౌ అంగ్ ఇందులో కబీర్‌గారు శాశ్వతమైన జీవితాన్ని గురించి చెబుతున్నారు అంటే అది కబీర్ మార్గాన్ని అనుసరించి అమరపురి అనే పరమాత్ముని దివ్యధామం. ఆ అమరలోకంలో జరామరణాలు ఉండవు. భగవంతుడు మాత్రమే అక్కడ గల ఒకే ఒక వైద్యుడు. అక్కడ రోగాలు రొష్టులు ,దారిద్ర్యం ఇలాంటివి లేవు. సుఖము మాత్రమే ఉంటుంది. ఈ అధ్యాయంలో ఏడే దోహాలు ఉన్నాయి. ఇందులో కబీర్ పదేపదే చెప్తున్నారు “నీ చంచలమైన మనసు విషయ వాంఛలకు లొంగిపోయి భక్తికి దూరమైపోయింది. భగవంతుని స్మరించు. దానివల్ల నీ అహం బాగా సమాప్తమై ఆ ప్రభుస్మరణవల్ల నువ్వు ఆ కాలుడికి బలి అవ్వకుండా శాశ్వతమైన ఈశ్వరానందాన్ని పొంది ఆయన లోకాన్ని నువ్వు చేరుకుంటావు. ఇందులో ఏడు దోహాలు ఉన్నాయి. ఏడవ దోహాలో కబీరు భగవంతుని ఒక పెద్ద వృక్షంతో పోలుస్తున్నారు. వృక్షం ఎప్పుడూ అందరికీ అన్నింటినీ ఇస్తూనే ఉంటుంది. అందులోని ఫలములను అందరూ తినవచ్చు. అవి పరోపకారానికై మాత్రమే జీవిస్తాయి. అది ఎన్నో పశుపక్షులకు ఫలాన్ని ఇస్తాయి. నీడనిస్తాయి, నివాసాన్నిస్తాయి. ఒకవేళ పశుపక్షులు వాటిని వదిలిపెట్టి వెళ్లినా వృక్షం మాత్రం తనను తన గుణాన్ని మార్చు కోదు. తన దగ్గర వచ్చేవారికి ఆపకుండా ఫలాలను ఇస్తూనే ఉంటుంది. అదేలాగా భగవంతుడు పెద్ద పరోపకారి. సమదర్శి. తనను స్మరించుకున్నవాళ్ళనూ స్మరించని

వాళ్ళను తనతో విముఖత చూపిన జీవులకు కూడా ఎప్పుడూ ఉపకారం మాత్రమే చేస్తూ ఉంటాడు. ఎందుకంటే ఆయన ప్రపంచంలోనే పేరు ప్రఖ్యాతులు గడించిన అతుల్య అద్వితీయ గొప్పదాత.

ఇక 48వ అధ్యాయం అపారిష్ కౌ అంగ్ ఇక్కడ అపారిష్ అనే శబ్దము భగవంతుని మీద వుంచే భక్తి అనే అమూల్య రత్నాన్ని ముందు ఉంచుకుని కూడా దాని విలువను గుర్తించలేని వాడికై ఉపయోగింపబడ్డ శబ్దము. మొదటి దోహాలో కబీరు భగవద్భక్తి అని అమూల్యమైన రత్నాన్ని పారవేసి, అజ్ఞాని అయిన జీవుడు కంకర రాళ్ళను చేతిలో తీసుకున్నప్పుడే అతను ప్రాపంచిక విషయాల్లో కూరుకుపోయాడని అర్థము. ఈ శరీరం అనబడే వృక్షంలో ఉన్న ఆత్మ పరమాత్మ అనే పక్షుల జోడి ఒకటిలో ఒకటి కలుస్తేనే ముక్తి. ఈ ఈ జీవాత్మ అనబడే అజ్ఞాని అమూల్యరత్నమైన పరమాత్మతో కలుస్తే పాపం అనబడే కొంగనోటికి బలి అవ్వడు ఈ ఉపమానం ఉపనిషత్‌లలో చక్కగా అనేక చోట్ల వర్ణించబడింది. కవికబీరు ఉపనిషత్‌లో వున్న సారాన్ని లోకభాషలో చక్కగా సరళంగా చెప్పగల నేర్పరి. అంటే రెండు సుందరమైన రెక్కలు గల పక్షులు ఒకే వృక్షంలో ఉండి ఒకటి మధుర ఫలాలను తింటుంది, రెండోది దాని ద్వారా కింద పడుతున్న గింజలను చూస్తూ ఉండిపోతుంది. అన్యోక్తి అలంకారం ద్వారా ముండకోపనిషత్ యొక్క సత్యాలను ఇందులో వివరిస్తున్నారు కబీరు. ఇందులో మొత్తం ఐదు దోహాలు ఉన్నాయి. ఇక అంతిమ దోహాల్లో కబీర్ గారు ఇలా చెప్తున్నారు "బ్రహ్మానందంతో కూడిన రామరసంతో నిండిన ముత్యాలు తన ముందు వెదజల్లబడి ఉన్నా ఆ దారిన వచ్చే మూర్ఖుడైన జీవుడు దాన్ని దాటుకుంటూ వెళ్లిపోతాడు. ప్రభు యొక్క జ్ఞానజ్యోతి లేకుంటే ఆ పరమ పవిత్రమైన ప్రభువు నామ మనవడే ముత్యాలను గుర్తించకుండా పోయినవాడు పరమమూర్ఖుడు". ("గొర్రె చంకబెట్టి గొల్ల వెదకు రీతి – వేమన) కబీర్ అంటున్నారు "పాలవాడు దూడ చచ్చిపోయిన తర్వాత దాని యొక్క చర్మాన్ని చూపించి చూపించి గడ్డిలో ఆ చర్మాన్ని ఉంచి ఆవును ముందు దూడలా భ్రమింపజేసి ఆవు దగ్గర పాలు పితుకుతాడు. ఆ పిచ్చి ఆవు తన ముందు వున్నది తన దూడ అనుకొని దాన్ని నాకి నాకి తన సంతానమని నమ్ముతుంది. అదేలా మాయల భ్రమలోపడ్డ జీవుడు ఆ మోహ జాలంలో చిక్కుకొని ప్రభువును విస్మరిస్తాడు.

ఇక 49వ అధ్యాయము పారిఖ్ కౌ అంగ్. అంటే పరఖ్ నే వాలా గుర్తించే వాడు ఇందులో మూడే దోహాలు ఉన్నాయి. ఇందులో కూడా కబీరు భగవంతుని యొక్క మహిమను గుర్తించాలి అది చాలా అమూల్యమైన వజ్రంతో సమానం అని ఆయనను కొలుస్తున్నారు.

ఇక 50 అధ్యాయము ఉపజణి కౌ అంగ్. ఇక్కడ ఉభజణి అంటే ఉత్పత్తి భగవంతుని భక్తి యొక్క ఉత్పత్తి. ఇందులో మొత్తం 12 దోహాలు ఉన్నాయి ఇందులో కబీరు తనను ఉద్ధరించిన భగవంతుని గురించి అతని ద్వారా తాను పొందిన ఆధ్యాత్మిక అనుభవం గురించి చెబుతున్నారు. రెండవ దోహాలో కబీరు "ఈ లోకంనుండి విముక్తి లభించింది, నేను నా స్వామి దగ్గర వెళుతున్నాను. నా ప్రభువు నా మార్గదర్శకుడు నా జీవితం సార్థకమైంది" అంటున్నారు. ఇక ఇక్కడ మూడవ దోహాలో కబీర్ గారి వర్ణన అతి చమత్కారంతో కూడినది "నేను నా ప్రభువు కలిసే వేళ ఇంద్రలోకంలోని వాళ్ళందరూబ్రహ్మం దేవుడితో సహా చాలా సంభ్ర మాశ్చర్యాలతో నన్ను చూస్తున్నారు నన్ను గుర్తిస్తున్నారు. ప్రభువుపైగల ప్రేమసాధన భక్తితో నేను ఆయన దగ్గరికి వెళ్లగలిగాను. ఇందులో ఇతరుల సహాయం నాకు అక్కర్లేదు " ఇందులో మొత్తం 12 దోహాలు ఉన్నాయి అందులో కూడా కబీర్ తనను భాగ్య శాలిని చెబుతున్నారు. నేను నా రామ ప్రభువు యొక్క ఆశ్రయంలో ఉన్నానని గర్వంగా చెబుతున్నారు. అది గర్వం కాదు కబీర్ యొక్క ఆత్మవిశ్వాసానికి ప్రతీక. హిందీ కవి కబీరు పూర్ణంగా నిర్గుణవాది. ఆయన ద్వారా వాడబడ్డ గోవిందా, రామవిఠల్, హరిశబ్దాలు ఆయన ఉపాసించే రూపం నామం రంగు సర్వత్ర నిండివున్న అలౌకిక పరబ్రహ్మ శబ్దానికి ప్రతీకలు మాత్రమే. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా చెప్పారు. ఇందులో భక్తి యొక్క తీవ్రతను ఉపాసన పద్ధతిని భగవంతునిపై గల తన అపార ప్రేమను కబీర్ కొనియాడు తున్నారు. ఇందులో మొత్తం 12 దోహాలు ఉన్నాయి 9వ దోహాలో కబీర్ స్పష్టంగా చెబుతున్నారు" ఈ సంసారం అనబడే సాగరంలో విషయం విషయ వాంఛలు నిండి వున్నవి. దానికి కావాల్సింది ప్రభువు మీద ఉండే ప్రేమా భక్తి అనే నావ మాత్రమే.

దీన్నే పదేపదే కబీర్ చెబుతున్నారు. పదవ దోహాలో స్పష్టమైన ఆత్మవిశ్వాసము వెల్లడవుతుంది "నేను చాలా అదృష్ట వంతురాలిని. ఎందుకంటే ఈ సంసార సాగరాన్ని దాటేశీదుకై ఆ ప్రభువు యొక్క రామనామం అని నౌక నాకు పక్కన నిలిచింది. ఆ ప్రభుయొక్క ప్రేమాశ్రయం లభించింది. అది నన్ను విషయ వాంఛల నుండి మాయామోహాల నుండి దూరం చేసి ప్రభువు యొక్క ప్రేమపెన్నిధిని లభింపజేసిందని చెబుతున్నారు కబీర్. (ఇక్కడ తన ఆత్మను స్త్రీతో ప్రేయసి తో పొలుస్తూ ఆ అలౌకిక మోక్ష స్థితిని కబీరు వర్ణించారు).

ఇక 51వ అధ్యాయము దయ నిర్ బైరతా కౌ అంగ్ అంటే దయ వైరం లేని భావం అర్థము. భగవంతుని దయ అనేది జీవుడిపై కలిగినప్పుడు ఎటువంటి కష్టాన్నయినా ఎదుర్కొని విజయవంతుడవుతాడు. ఇందులో మూడే దోహాలు ఉన్నాయి. ఇందులో కబీర్ తన మనసును సంబోధన చేస్తూ ఈ మూడు దోహాలు రాశారు. "మాయ అనే గర్జించే మేఘాలు అలుము కున్నాయి, అనేక ప్రకారాలైన కోప తాపాలు ఈ ప్రాపంచిక దుఃఖాలు అనేపడే బడబాగ్నులు కురియసాగాయి ఈ ప్రపంచ మంతా మండుతున్నది. ఓ కబీర్ ! నువ్వులేచి ఈ సంసార కోప తాపాలకు ఆహుతి అవుతున్న వారికి హెచ్చరికలు చేసి వారిని ఉద్ధరించు. వారిని భగవంతుని దాసులు అవ్వమని చెప్పు".

ఈ 52వ అధ్యాయం సుందరి కౌ అంగ్. ఇందులో కబీర్ తన ఆత్మ ని ప్రియురాలు గా పరమాత్మని నాయకునిగా ఊహించి ఆయనను కలవడానికి పడ్డ తహతహలను గురించి వివరిస్తున్నారు. ఇందులో మొత్తం ఐదు దోహాలు ఉన్నాయి. మొదటి దోహాలో కబీర్ యొక్క తన ఆత్మ అనే సుందరి ఆ ప్రభువు అనే నాయకుడితో తన మొరను ఇలా విన్నవించు కుంటున్నది "నా స్వామీ! నా విన్నపాన్ని స్వీకరించండి తొందరగా వచ్చి నన్ను మీ దగ్గరకు పిలుచుకోండి, మీతో నేను కలవ కుండా వుంటే నేను నా ప్రాణాలను వదిలేస్తాను". అదే లాగా రెండో దోహాలో కూడా కబీరు ఇలా అంటున్నారు "తెలిసి తెలిసి ఒక సుందరి వ్యభిచారాన్ని స్వీకరిస్తే ఆమె భర్త దాన్ని సహించదు. అదేలాగా జీవాత్మ అనే సుందరి ప్రభువైన పరమాత్మను వదిలి మాయ అనే పరపురుషుణ్ణి స్వీకరిస్తే పురుషోత్తముడైన భగవంతుడు దగ్గరికి ఆ జీవాత్మ ఎప్పుడూ వెళ్లలేదు అని చెబుతున్నారు. ఇందులో కబీర్ యొక్క తాత్వికత, పరమ ప్రేమ అనుకూలమైన భక్తి కనబడుతుంది.

ఇక 53వ అధ్యాయము కస్తూరియా మృగ్ కౌ అంగ్ అంటే కస్తూరి జింకను ఉదహరిస్తూ కబీర్ అద్వైతవాదాన్ని బోధిస్తున్నారు. మొత్తం తొమ్మిది దోహాలున్నాయి. ఈ తొమ్మిది దోహాలసారం ఒక్కటే. "కస్తూరి జింక మనబడే ఆత్మ తనలో వస్తున్న సువాసనను గుర్తించకుండా అది ఎక్కడ నుండి వస్తుందని వనమంతా అంటే అరణ్యమంతా తిరుగుతూ వెతుకుతూ ఉంటుంది. ఆత్మస్వరూపు డైన రాముని గుర్తించకుండా జనులు వ్యర్థంగా మందిరాల వెంట మసీదుల వెంట తీర్థయాత్రలు చేస్తూ తిరుగుతూ వెతుకుతూ ఉంటారు. ఇక్కడ కబీర్ ద్వారా చెప్పిన తొమ్మిదవ దోహా అత్యద్భుతం "కంటికి రెప్పలాగా శరీరంలో ఉన్న ఆత్మ స్వరూపమైన భగవంతుని గుర్తించక ప్రజలు ఆయనను బయట వెతుకుతూ అలమటిస్తూ తిరుగుతారు. ఈ అధ్యాయమంతా తాత్వికత కూడిన భక్తి రసంతో కూడిన దోహాలు.

ఇక 54 అధ్యాయము నింద్యాకౌ అంగ్నిందియ అంటే నింద అని అర్థము ఇందులో కూడా తొమ్మిది దోహాలున్నాయి. ఇది చదువుతున్నప్పుడు మనకు వేమనగారి పద్యము "తప్పు లెన్నువారు తండోపతండంబు ఉర్వి జనుల కెల్ల వుండు తప్పు పదే పదే తప్పక గుర్తుకు వస్తుంది. ఈ రెండవ దోహాలో కబీరు "ఇతరుల దోషాలను గుర్తించి జనులు వాళ్లను చూసి పరిహాసం చేస్తూ ఉంటారు, వాళ్లు తమ వైపు చూసుకుంటే ఆది అంతం లేని అనేక దోషాలు వాళ్ళలో కనబడుతాయి. అంటే ఇతరుల లోపాలను ఎత్తిచూపే ప్రజలు తమను తాము పరిశీలించుకుంటే వాళ్ళ దోషాలు అనేకం కనబడతాయి. ఇక్కడ అధ్యాయపు తొమ్మిదవ దోహాలో కబీరు ఆత్మ సమర్పణ భావంతో అధ్యాయాన్ని ముగిస్తారు. ఈ ఎనిమిది తొమ్మిది దోహాలలో కబీరు! నా మోహం పై గల గర్వాన్ని అహంభావాన్నీ పూర్తిగా తొలగించు దాన్ని నాశనం చేయి. ఇతరులను మోసగించ కుండా ఉండే బుద్ధిని ప్రసాదించు నేను అహంభావాన్ని వీడితేనే సుఖ పడతాను. ఇతరులను మోసగిస్తే దుఃఖ పడుతాను. తండ్రీ ! ఒక్కసారి నువ్వు నాకు దర్శనం ఇచ్చి నన్ను నీలో కలువుకో నేను, నీకు

నా కరుణ కథను ఏడుస్తూ విన్నవించుకుంటాను. నీ శ్రీ చరణాలపై నా తలను ఉంచి నేను నీకు నా దుఃఖాన్ని వెల్లడించుకుంటాను. నీ అనుగ్రహం ఎల్లప్పుడూ నా పై కలగాలని భిక్షం అడుగుతాను "ఇలా ఈ అధ్యాయం అంతా కబీర్ యొక్క ఆత్మ సమర్పణ భావనలో అద్వైతవాదము ప్రస్ఫుటమవుతుంది. ఒక విధమైన అపురూప భక్తి సౌరభ్యాన్ని వెదజల్లుతుంది.

ఇక 55వ అధ్యాయము నిగుణా కౌ అంగ్ ఇందులో కబీర్ తన నిర్గుణ బ్రహ్మ గురించి చెప్తున్నారు. ఆ నిర్గుణం బ్రహ్మ అనుగ్రహంతో వర్షం పడుతుంది దాంట్లో ప్రేమ పూర్ణ భక్తి పూర్ణుడైన భక్తుడు మాత్రమే తడుస్తాడు. భక్తి శూన్యుడైన వ్యక్తిపై దాని ప్రభావం ఏమి పడదు. చెట్టుపై కురిసే వర్షానికీ, శిలపై కురిసే వర్షానికి తేడా ఉంటుంది. అదే లాగా భగవంతుని గుర్తించినవాడే నిజమైన భక్తుడు అవుతాడు". ఇక్కడ ఎనిమిదవ దోహా చాలా ప్రసిద్ధమైనది. శీతలత్వం పొందాలని సర్పాలు చందన వృక్షాన్ని చుట్టుకుంటూ పడుకుంటాయి కానీ వాటి రోమ రోమం విషపూరితమైనది చందనం యొక్క ప్రభావం దాని మీద ఎప్పుడూ. పడదు స్వభావంతో దుష్టులైన వ్యక్తులను సత్సంగం ఎప్పుడు మార్చలేదు. (దీన్నే మనం పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుడకతోనే పోతాయి అని చెబుతాం) ఇందులో 12 దోహాలు ఉన్నాయి.

ఇక 56 వ అధ్యాయము బీన్ తీ కౌ అంగ్. ఇందులోలో కబీరు తన ఆత్మను విరహ విదగ్ధ నాయకగా ఊహించుకొని ఆత్మ పరమాత్మల అనుబంధం గురించి కలయిక గురించి చెప్తున్నారు. ఇందులో కబీరుద్వారా వాడబడ్డ ఉపమానాలన్నీ సాధారణ జీవితములో చూస్తున్న వస్తువులు మాత్రమే. "హే ప్రభూ ! నా మనసు నీలో ఎంతగా అనురక్తమైంది అంటే మిమ్మల్ని నన్ను ఎవరూ విడదీయలేరు మనం ఇద్దరం ఒకటే. రెండు ఇనుప కమ్మీలను కాల్చి ఎలా ఒకటి చేస్తారో అలాగే నేను మీ విరహంలో కాల్చి కాల్చి మీతో కలిసి పోయాను". ఇందులో కబీర్ యొక్క భావనలు కఠోపనిషద్ 1 /2 /23 వ శ్లోకాన్ని గుర్తుచేస్తుంది.

ఇక 57వ అధ్యాయము సాషీ భూత్ కౌ అంగ్ ఇందులో మొత్తం మూడే దోహాలు ఉన్నాయి. సాషీ అనేదానికి సాక్షి అని అర్థము. ఈ అధ్యాయపు దోహాల లో కబీర్ ఇలా అంటున్నారు "మనసు యొక్క నాళము చాలా లోతైనది, అందులోని నీళ్లు త్వరగా ఎండిపోవు. వ్యక్తి తానుగా మాత్రమే కోరికలనే మాయా జాల జలకుండంలో పడితే బయటికి రాలేడు. దాని నుండి బయట పడాలంటే భగవంతుని మాత్రమే శరణు పొందాలని భావము.

ఇక 58వ అధ్యాయము బేలీ కౌ అంగ్. ఇక్కడ బేలి అంటే మాయ అనబడే తీగ ఈ మాయ అనబడే తీగ అనేది ఎంత ఘనిష్ఠ మైనదంటే దానిలో పండే విషయ వాంఛలనే అనే పండ్లు వాటితోబాటే అతుక్కుని ఉంటాయి. ఆ మాయ అనే లతను ఎండిపోయిన కట్టె అనుకుని కాల్చి వేసామా, మనము తప్పించుకుంటాము లేదంటే ఆ పండ్లను తినడానికి మనం ముందుకు వెళ్లామంటే తిరిగి రాలేం. ఆ సాంసారిక మాయా జాలంలో చిక్కుకొని దానికి బలి అయిపోతామని అంటున్నారు కబీరు ఇందులో మొత్తం ఆరు దోహాలు ఉన్నాయి.

ఇక అంతిమ అధ్యాయము 59వ అధ్యాయము అబిహాడ్ కౌ అంగ్ ఇందులో ముత్యాల లాంటి మూడు దోహాలున్నాయి. భగవంతుని కంటే ఎవరూ మనకు ఉపకారం చేసే వాళ్ళు పరమ బంధువులు ఎవ్వరూ లేరని స్పష్టంగా తన అనన్య భక్తిని నిరూపిస్తున్నారు భక్త కబీరు.

(ఇంతటితో కబీరు గ్రంథం బీజక్ లోని మొదటి భాగం సాఖీ సమాప్తం. నాకీ అవకాశాన్ని కల్పించి ఎక్కడో రాజస్థాన్‌లో ఉన్న నన్ను తెలుగు సాహిత్యానికై ఉసిగొల్పి నా చేత రాయించిన పూజ్య ఆచార్యులయిన వల్లభనేని అశ్విని గారికి, నన్ను పదే పదే "రాశారా? అయిపోయిందా, ఎప్పుడు పంపిస్తారు" అని ఎల్లప్పుడూ నవ్వుతూ మాట్లాడే ఆశారాణి గారికీ, నాకు ఫోన్లు చేసి అభినందించిన పాఠకులకు అందరికీ కృతజ్ఞతలు తెలుపుకొంటూ శత శత వందనములతో)

***యత్ర ధర్మస్య తత్ర కృష్ణస్య***
***యత్ర కృష్ణస్య తత్ర విజయస్య***

– శ్రీ కృష్ణం వందే జగద్గురుం

ఆచార్య ఎన్. లక్ష్మీ అయ్యర్
రాజస్థాన్ సెంట్రల్ యూనివర్సిటీ, ఫోన్: 968 027 6038.

# కామోత్సవ్:

## గుంటూరు శేషేంద్రశర్మ

గొప్ప పండితుడు, మహాకవి, బహుభాషావేత్త గుంటూరు శేషేంద్రశర్మ రాసిన ఏకైక నవల కామోత్సవ్. కామోత్సవ్ నవల పుస్తకం ప్రథమ ముద్రణ 2006లో వచ్చినా, 1989 ప్రాంతంలో *ఆంధ్రజ్యోతి* వార పత్రికలో సీరియల్‌గా ప్రచురింపబడింది. సీరియల్‌గా వస్తున్నప్పుడు అనేక ప్రశంసలతోపాటు, పలు విమర్శలూ వచ్చాయి. అలా చెలరేగిన వివాదాలు చివరికి కోర్టువరకూ వెళ్లాయి. కామోత్సవ్ మీద కేస్ నడిచింది. అనైతికంగా ఉందన్నది అభియోగం. *ఆంధ్రజ్యోతి* వారపత్రిక సంపాదకులు పురాణం సుబ్రహ్మణ్యశర్మ చాలా రోజులు హైద్రాబాద్ నుంచి ప్రయాణించి కోర్టుకు హాజరు కావాల్సి వచ్చింది. కేస్‌వల్ల రచయిత, *ఆంధ్రజ్యోతి* వారపత్రిక ఈ నవలని అకస్మాత్తుగా ముగించాల్సి వచ్చింది. కేస్ పూర్తయింది. కామోత్సవ్ ఏ నిషేధం లేకుండా బైటపడింది. కానీ విస్తృత ప్రణాళికతో శేషేంద్ర నిర్మించాలనుకున్న ఈ నవల అకస్మాత్తుగా ముగిసిపోయింది.

'కామోత్సవ్' పుస్తకం వెనకాల నేటి తరానికి తెలియని ఎన్నో కళా, సాంస్కృతిక విషయాలను చెబుతూ నవలా రచనలో క్రొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన అక్షరోత్సవం ఈ కామోత్సవ్ నవల అని ఉంది. అది అక్షరాలా నిజం. సినిమా రంగం, చిత్రలేఖనం, కవిత్వం, సంగీతం, తాంత్రిక విద్య, జైన, హిందూ, గ్రీకు, పారశీక తాత్వికత, శిల్పం, పాశ్చాత్య రచనాతీరులు, ఇలా ఈ నవలలో పలు విషయాలకి సంబంధించిన లోతైన విశ్లేషణలున్నాయి.

కామోత్సవ్ నవలలోని వస్తువు, ఇతర తెలుగు నవలల్లో కనిపించే వస్తువు కాదు. ఈ నవల నడిచిందంతా బొంబాయి మహానగరంలో. అదీ అత్యంత విలాస వంతమైన పరిసరాల్లో, భవంతుల్లో. తెలుగులో ధనికులు, జమీందారుల గురించి కొన్ని నవలలు రాకపోలేదు. కానీ ఆ నవలల్లో మిగిలిన చాలా విషయాలతో పాటు చాలా సామాన్యుల జీవితాల మధ్యే వీరి ప్రసక్తి. కానీ కామోత్సవ్ అలా కాదు. ఇది పూర్తిగా అత్యంత ధనికుల గురించి రాసిన నవల. వాళ్ల ఆలోచనలు, అలవాట్లు, అభిరుచులు, విలాసాలు, లైంగిక సంబంధాలు, పట్టుదలలు, పంతాలు, ఎగుడుదిగుడులు... ఇలా ఇదంతా ఓ సరికొత్త లోకం. ఈ లోకాన్ని చూసిన వ్యక్తిగా, అనుభవించిన మేధావిగా శేషేంద్ర గారి అపూర్వ సృష్టి ఇది. కొత్తదైన ఆ లోకాన్ని మన కళ్ల ముందు నిలిపింది ఈ నవల. ఈ నవలలో పలు సంఘ టనలు, ప్రదేశాలు, వ్యక్తులు, ఖరీదైన వస్తువులు, ఆభరణాలు, అలంకరణలు, సమావేశాలు, విందులు, వినోదాలే ఎక్కువ. కథ చాలా తక్కువ. అంత తక్కువ కథతో రెండొందల పేజీల నవల ఇలా రాయటానికి ఎంతో విజ్ఞానం కావాలి. ఓ విభిన్నమైన జీవనరీతికి నవలారూపం కల్పించి, కొన్ని ప్రత్యేకమైన నిగూఢమైన విషయాల్ని వివరించటమే, శేషేంద్ర ధ్యేయం అనిపిస్తుంది. దానికి ఆయన ఆధారంగా మలుచుకున్న కథాంశం చూద్దాం.

కీర్తి, జ్ఞాన్ భార్యాభర్తలు. కీర్తి కవయిత్రి, జ్ఞాన్ అద్భుత చిత్రకారుడు. కీర్తిది బాగా ధనిక కుటుంబం. వీళ్లిద్దరూ బొంబాయి వచ్చి ఒబెరాయ్ టవర్స్‌లో దిగారు. కీర్తి చెల్లెలు తృష్ణ. ఆమె భర్త కుబేర్‌దత్. వీళ్లు నలుగురూ ఆ సాయంత్రం ఓ ప్రసిద్ధ సినీతార ఇస్తున్న పార్టీకి వెళ్లటం కథారంభం. ధర్మేందర్, సంజీవ్‌దేవ్, రాజ్‌కపూర్, ఓ.పి. నయ్యర్, యష్ చోప్రా, జయదేవ్, జీనత్ అమన్, జానీ వాకర్, అశోక్ కుమార్, నీతూ సింగ్, స్మితా పాటిల్, మౌసమీ ఛటర్జీ, మహమ్మద్ రఫీ, మహేంద్ర కపూర్, షర్మిలా టాగోర్ ఇలా ఎందరో సినీ ప్రముఖులు ఆ పార్టీలో. జ్ఞాన్‌కి వాళ్లు పెద్దగా తెలియదు. అతని లోకం వేరు. ఈ పార్టీని పన్నెండు పేజీలు వర్ణించారు శేషేంద్ర. ఖరీదైన మద్యం, సిగరెట్లు, మత్తుపదార్థాలు, రుచికరమైన పదార్థాలు, అంతా లక్ష్మీ తాండవం. రకరకాల కాక్‌టెయిల్స్, డ్రింక్స్, అలంకరణలు, ఆభరణాలు. ఇలాంటి పార్టీలు ఈ నవలలో చాలా ఉన్నాయి. వాటన్నింటినీ శేషేంద్ర అంత విపులంగానూ వర్ణించారు. కానీ ఒక వర్ణనలా మరో వర్ణన ఉండకపోవడం విభిన్నత. ఆ పార్టీ నుంచి రాత్రి బాగా పొద్దుపోయాక కీర్తి, జ్ఞాన్ హోటల్‌కి వచ్చారు. మర్నాడు మధ్యాన్నం సురయా, హబీబ్ ఇంట్లో లంచ్, సాయంత్రం విలింగ్టన్ క్లబ్‌లో తృష్ణ ఇచ్చే పార్టీ.

ఇంతకు ముందు చెప్పిన పార్టీలో జ్ఞాన్ తన అభిమాన గాయనిని కలిశాడు. గొప్ప గాయనేకాక అద్భుత సౌందర్యరాశి. కానీ పెద్దవయసుకి చేరిన ఆవిడ, ఆవిడ సౌందర్యాన్ని పొగడగానే, 'ఇప్పుడు ఇంకా నాలో ఏ సౌందర్యముంది గనక,' అంది. 'అదేమిటండి, మీరు చరిత్ర సృష్టించారు. మీ సౌందర్యం చరిత్రలో లీనమైపోయింది. ఒక తరాన్ని కళాత్మక మాయాజాలంతో ప్రభావితం చేసింది,' అన్నాడు జ్ఞాన్. అంతేకాదు, ఆమె గురించి, 'దేశం చదివేసిన చరిత్ర పేజీల్లోంచి బయటికొచ్చి టేబుల్ ముందు కూర్చున్నట్టుంది. అగరొత్తులు, కర్పూరం వెలుగుతున్నప్పుడు భావాలు గత పరిమళాల్లో దొర్లుకుంటూ, దేవాలయాల్లోకి వెళ్లి స్తంభాల మీద చెక్కిన శిల్పాల్లో లీనమైపోయినట్లుంది. ఆమెని చూస్తుంటే మాధుర్యం అగ్నిలా శరీరమంతా వ్యాపిస్తుంది. మనస్సు కోమల పుష్పంగా మారిపోయింది,' అని రాశారు శేషేంద్ర. కవిత్వమే ఆత్మ అయిన శేషేంద్ర అద్భుత అభివ్యక్తి అది. ఇలాంటి వ్యక్తీకరణలు, వ్యక్తుల గురించి, కళల గురించి, సౌందర్యం గురించి ఈ నవల నిండా ఉన్నాయి.

దారిలో లూనార్ రాక్ చూసి హబీబ్ సురయాల ఇంటికి వెళ్లారు. చాలా రోజుల తర్వాత కలుసుకున్న స్నేహితులు. సరదాగా గడుపుతుండగా, నజ్లీ మేడమీద నుంచి నెమ్మదిగా దిగి వచ్చింది. హబీబ్ ఆంటీ ఆవిడ. మధ్యవయసు దాటినా గొప్ప అందం ఆవిడది. భర్తపోయి ఆరేళ్లైంది. ఆ సౌందర్యానికి ముగ్ధుడై పోయాడు జ్ఞాన్. ఆవిడ బాగా పాడుతుంది. అందమైనే పువ్వు తాలూకు అదనపు పరిమళంలా మధువు. పాటలు అయ్యాక మంచి భోజనం చేశారు. చిత్రకళమీద రసవత్తర చర్చ జరిగింది. అందరూ మంచి ఉద్వేగ స్థాయికి చేరారు. కీర్తి తను బ్రాడ్ మైండెడ్ అంది ఆ ఉద్వేగంలో. నేను టెస్ట్ చెయ్యనా అంది నజ్లీ. అంటూ గబుక్కుని జ్ఞాన్‌ని కౌగిలించుకుని గట్టిగా ముద్దు పెట్టుకుంది. కీర్తి అప్‌సెట్ అయింది. నజ్లీ లేచి వెళ్లిపోయింది. అందరి మూడ్ పాడైంది. ఇలాంటి కలయికల్లో, ఖరీదైన హైక్లాస్ పార్టీలలో ఆడవాళ్లు మగవాళ్లతో సమంగా తాగడం, సిగరెట్లు కాల్చటం, ముద్దులు పెట్టుకోవటం పెద్ద విషయం కాదన్నట్లు ప్రవర్తిస్తారు. కానీ, ఒక్కోసారి కీర్తిలాంటివాళ్లు తట్టుకోలేకపోవటమూ ఉంది. జ్ఞాన్ పూర్తిగా తనకే ఉండాలన్న మనస్తత్వం. జ్ఞాన్‌ని చిత్రకారుడి గ్లామర్‌తోనేకాక, అతని ఆకార సౌందర్యానికి విపరీతంగా ఆకర్షితులైన ఆడవాళ్లు ఎందరో. అది కీర్తి అనుభవంలోలేని విషయం కాదు. సాయంత్రం విలింగ్డన్ క్లబ్ పార్టీకి వెళ్లారు. అన్ని హంగులూ మామూలుగానే ఉన్నాయి. తృష్ణ గతంలో ఎవరితోనో సంబంధం పెట్టుకుని గొడవలు పడింది. మళ్లీ ఈ పార్టీకివాళ్లని పిలిచినందుకు చెల్లెలు తృష్ణని కీర్తి మందలించింది. దానికి కొంచెం కోపగించుకుంది తృష్ణ. ఎవరికి నచ్చింది వారు తాగుతూ, తింటూ నచ్చినవాళ్లతో గడుపుతున్నారు. పర్మేష్వర్జీ అన్న ఆవిడ, జ్ఞాన్ రసచర్చలో పడ్డారు. ఆమె కీర్తి స్నేహితురాలు. మళ్లీ అన్ని రకాలా ఉద్వేగం. కీర్తి ప్రోత్సాహించి పర్మేష్వర్జీని జ్ఞాన్‌ని కౌగిలించుకుని ముద్దుపెట్టుకోమంది. ఆమె అతన్ని వెంటనే కౌగలించుకుని పెదవులు కలిపింది. అది చూసి, 'మరీ గట్టిగా కొరక్కు,' అంది కీర్తి. మధ్యాన్నం నజ్లీ సంఘటనకి, ఇప్పటికీ కొన్ని గంటలే తేడా. కానీ తీరులో ఎంతో మార్పు. ఈ సంఘటన మీద జ్ఞాన్ నైతికతాపరంగా చర్చ కూడా సాగింది. 'అగ్ని దగ్గరకు రావాలని ఎదురు చూచే వెన్న ముద్ద,' అని తేల్చింది కీర్తి జ్ఞాన్‌ని.

విచ్చలవిడి ప్రవర్తన. తాగి, డాన్సులు, ఒకరి భార్యతో మరొకరు, ఎవరి భర్తతోనో మరో ఆవిడ శరీరాల రాపిడి, జ్వలించే కోరికలు. మళ్లీ కుహనా మర్యాదలు, నాగరికత అన్న ముసుగు అంతరాంతరాల్లో ఈర్ష్యా, అసూయలు, తృష్ణకి అక్క మొగుడు జ్ఞాన్ అంటే మోహం. అతను ఆడవాళ్లతో చనువుగా మెలుగుతుంటే మండిపోయింది. తృష్ణ తన అసూయని దాచుకోలేక ఏమేమో వాగింది. అది విని జ్ఞాన్‌ని అవమానించిందని కీర్తికి కోపం వచ్చింది. చివరికి చుట్టూ ఉన్నవారి పూనికతో అక్కాచెల్లెళ్లు చల్లబడి పార్టీ సుఖాంతం అయింది. బొంబాయిలో ఇలా, కీర్తి జ్ఞాన్ వెళ్లిన పార్టీలు, కలసిన స్నేహితులు, తిరిగిన ప్రదేశాలు, వివిధ అనుభవాల ద్వారా శేషేంద్ర నాగరికత పేరు మీద చలామణిలో ఉన్న ఓ ధనిక సంస్కృతిని చూపించారు. అంతేకాదు, నాగరికతా చిహ్నంగానో, నిజమైన అభిరుచిగానో వారి చుట్టూ ఉన్న కళాసంస్కృతిని చూపించారు. ఈ వర్గంలోని ద్వంద్వ ప్రవృత్తిని పట్టుకున్నారు. ధనబలంతో, ఎవరికి వారు సర్వస్వతంత్రులు మనుకునే వీరిలో కొందరు ఎన్నింటికి ఏ రకంగా బందీలో

నిర్వచించారు. ఈ వాతావరణం, ఈ నేపథ్యానికి పతాకగా కామాన్ని వస్తువుగా చేశారు శేషేంద్ర. మానవ ప్రవృత్తిని, ప్రవర్తనని కుదిపి కదిపే కామతీ వ్రతని విశ్లేషించారు. కామం తాలూకు అమిత బలాన్ని, అత్యంత బలహీనతని సాదృశం చేశారు. కామం, మోహం, ప్రేమల మధ్యనున్న సున్నిత వ్యత్యాసాన్ని అందరూ గమనించాలని చెప్పారు. మన సుఖదుఃఖాల మీద తీవ్ర ప్రభావం చూపించే కామాన్ని ఒక ఉత్సవ స్థాయిలో అనుభవించాలన్నది శేషేంద్ర నవ్య భావన అనిపిస్తుంది. కామాన్ని ఆయన ఇంద్రియాలవరకే పరిమితం చెయ్యలేదు. ఇంద్రియాల ద్వారా లభించే అత్యున్నత కామ సౌఖ్యపు మానసిక అలౌకిక స్థాయిని తాంత్రిక సాధన పూర్వకంగా చూపించారు. ఫరూక్ అన్న మిత్రుడి ఇంట్లో కలిసిన జైనబ్ జ్ఞాన్‌ని తాంత్రిక ఉపాసనలోకి తీసు కెళ్లింది. ఆ ఉపాసన శరీర సంబంధం ఉన్న కామోపాసనే అయినా, ధ్యేయం తాత్వికస్థాయి. అలాగే ఈ తాత్వికత కొనసాగింపులా, పూర్తి ఆధ్యాత్మిక స్థాయిని వీరేంద్ర కుమార్ జైన్ మహావీర్ నవల ఆధారంగా శేషేంద్ర ప్రతిపాదించారు. శ్వేత పద్మ అనే అతిలోక సుందరి, తన సౌందర్యంతో, జితేంద్రియుడైన మహావీర జిన ప్రభువుని లొంగదీసుకుంటానని పంతం పడుతుంది. కానీ ఓడిపోయి ఆ ప్రభువు పాదాలే సర్వస్వంగా తలచిన నిష్కామి అవుతుంది. ప్రభువు సందేశం ఇంద్రియాలని జయిస్తే, నీ మోక్షం నీ చేతిలోనే ఉంది. ఇది కూడా కామాన్ని ఆధ్యాత్మిక ఉత్సవ స్థాయికి తీసుకెళ్లటమే. ఇంక కథాపరంగా చెప్పుకోవాల్సివస్తే, ఓ ఉద్విగ్న సమయంలో తృష్ణ, జ్ఞాన్‌లకి లైంగిక సంబంధం ఏర్పడుతుంది. ఆ కలయిక తర్వాత తృష్ణకి పూర్తిగా జ్ఞాన్ పిచ్చి. బలవంతం చేసి అతన్ని ఇంటికి రప్పించింది. వీళ్లిద్దరూ అలా ఉండగా తృష్ణ భర్త కుబేర్ చూశాడు. జ్ఞాన్‌ని చంపుతానని రివాల్వర్ తెచ్చాడు. తృష్ణకి ఏ హాని జరుగుతుందో, కుబేర్ ఏం చేస్తాడోనని అక్కడ్నించి వెళ్లిపోవటానికి జ్ఞాన్ నిరాకరించాడు. చివరికి నానా రభసా అయింది. జ్ఞాన్‌ని పంపించేసి, తృష్ణ కుబేర్‌తో విడిపోతున్నానని, జ్ఞాన్‌తోటే తన జీవితం అని చెప్పి ఇల్లొదిలేసి స్నేహితురాలింటికి వచ్చేసింది.

ఆ రాత్రికి జ్ఞాన్ దొరకలేదు తృష్ణకి. మర్నాటి పొద్దున్న తృష్ణ ఆలోచన మరోలా సాగింది. 'ఇప్పుడు నేనేమిటి చెయ్యటం. జ్ఞాన్ చెప్పినట్టు నేను కామోత్సవ క్రీడలో ఆట ఆపలేని క్రీడాకారిణినైనానా? జ్ఞాన్‌పట్ల నా కాంక్ష, తల్లిలాంటి కీర్తి జీవితానికి శరాఘాతమౌతున్నదా? ఒకపక్క ఎన్ని తప్పులు చేసినా ప్రేమించే భర్త కుబేర్, రెండో పక్క జ్ఞాన్. ఎవరిని ఎంచుకోవాలి? జ్ఞాన్ తనతో ఉండిపోతే, అక్కయ్యకి జీవితమే ఉండదు'. తృష్ణ ఇలాంటి ఊహలకి శుభోదయం సరైన మార్గదర్శనం చేసిందని నవల ముగించారు శేషేంద్ర. ఇందులో తృష్ణ తిరిగి కుబేర్ దగ్గరకే వెళ్లిన ధ్వని ఉంది. కానీ వివరణ, స్పష్టత లేదు. ఈ నవలారచన సమయంలో జరిగిన గొడవవల్ల శేషేంద్ర చెప్పాలను కున్నదంతా చెప్పలేదేమో అనిపిస్తుంది. ఆయన వేసుకున్న ప్రణాళికంతా నవలలోకి రాలేదేమో అనిపిస్తుంది. ఆయన ఎన్నుకున్న వస్తువు సంపూర్ణంగా నవలారూపం దాల్చలేదేమో.

ఏమైనా 'కామోత్సవ్' విస్తృత ప్రాతిపదిక, ప్రణాళికా ఉన్న విభిన్నమైన నవల. అంతా అందకపోయినా, కొంతేనా రుచి తెలియటానికి చదవాల్సిన నవల. ఎవరు ఎటువంటి విమర్శలు చేసినా కామోత్సవ్ నవల నైతికతకి చేటు అన్నా, ఒక వర్గం తాలూకు జీవన వాస్తవికతకి ప్రతిరూపం. ఆ జీవితం కూడా నవలా లోకంలోకి రావాల్సిన అవసరం ఉంది. ఆ పని శేషేంద్ర ఎంతో నైపుణ్యంతో చేశారు.

శేషేంద్ర మంచి అభివ్యక్తికి పెట్టింది పేరు. ఆయన వాక్యాలు కవితా మయం. 'అడవిని, పక్షిపాటతో కొలుస్తావు' అంటారు ఒక చోట జ్ఞాన్ గురించి. కవిత్వం ఎటువంటి మానసిక స్థాయిలోంచి పుడుతుంది. ఎటువంటి మనఃస్థితి నుంచి నవలా రచన సాగుతుంది అన్న విపుల వివరణ, చిత్రకారుడి సంక్లిష్టతల విశ్లేషణా ఈ నవలలో ఉన్నాయి. మోహానికి నైతికతకీ మధ్య జరిగే ఘోర సంగ్రామ స్వరూపం కామోత్సవ్. కేవలం కథేకాదు, ఎంతో జీవితాన్ని భిన్నకోణాలలో చూపించి కొత్త భావాలని జాగృతం చేసే కొత్త రకం రచన కామోత్సవ్.

నవల శేషేంద్ర సంపూర్తిగా రాసి ఉంటే, కామానికి సరికొత్త నిర్వచనం మరింత విపులంగా లభించి ఉండేది. కామోత్సవ్ అన్న పదబంధం శేషేంద్ర ఏ ఉన్నత భావాలతో చేశారో తెలిసేది. దిశవరకూ చూపించి మార్గాన్ని మనమే నిర్మించుకోమంటుంది కామోత్సవ్.

వి. రాజారామమోహనరావు
హైదరాబాద్. ఫోన్: 939 473 8805.

# చదవండి...

– మిసిమి

**నిర్మాల్యం:** సింహప్రసాద్ నవల. ఇప్పటి హడావుడి జీవితంలో నవలలు రాసేవారు, చదివేవారు అరుదైపోయారు. సింహప్రసాద్ కోవిడ్ కాలానికి చెందిన ఇతివృత్తాన్ని తీసుకుని, అదే వలసవచ్చి – కోవిడ్ పుణ్యమా అని పనిలేక, ఇక్కడ ఉండలేక, తమ ఊళ్లకు వెళ్లే అవకాశం లేక తట్టాబుట్టా – పిల్లాపాపా – నెత్తిన – చంకనబెట్టుకుని కాలినడకన వేల మైళ్లు నడుచుకుంటూ దారిలో తాగేందుకు నీరు – తినేందుకు కూడూ దొరకక పడిన కఠోరమైన కష్టాలు – మనకు ఏ భాషలో చెప్పినా అనుభవంలోకి రావు – అలాంటి ఇతివృత్తాన్ని తీసుకుని – తనవంతు పరిశోధన (?) చేసి ఈ నవల రాశారు సింహప్రసాద్ – కేతు విశ్వనాథరెడ్డి, పెద్దింటి అశోక్‌కుమార్ మంచి పీఠికలు రాశారు. పరుల ఆనందాన్ని పంచుకోవడానికి ఇష్టపడతాం. కాని వలస కూలీల రక్తం ఓడుతున్న అరికాళ్లను చూడాలని ఎవరికుంటుంది? మట్టి, నెత్తురు, బురద, కాలే ఇసుక, కరుగుతున్న తారు, ఇవే ఈ నవలకు ముడిసరుకు, చదివి తెలుసుకోండి. నగ్న స్వరం!




*పేజీలు: 236, వెల: ₹ 150/- ప్రతులకు: పాలపిట్ట బుక్స్, హైదరాబాద్. ఫోన్: 984 878 7284.*

**చీకటి వెన్నెల:** ఝాన్సీ కొప్పిశెట్టి కథలు. అదేమిటో ఇతర దేశాల్లో స్థిరపడినవారికి మాతృభాష మీద మమకారం ఎక్కువైపోతుంది. అమెరికా, ఆస్ట్రేలియా, ఐరోపాలో స్థిరపడిన తెలుగువారిని ఎందరికో ఇదే మాతృభాషపై ప్రేమ – అది ఎన్నో విధాలుగా తెలియబరుస్తుంటారు. కొందరు కథలు రాసి, కొందరు కవితలు రాసి మరికొందరు జ్ఞాపకాలంటూ ఎక్కువగా ఇవన్నీ పుట్టిన గడ్డవైపే చూస్తుంటాయి. కానీ మనలాంటివారు వీరి నుంచి కోరుకునేది వారు స్థిరపడిన దేశం – వారు నివసిస్తున్న ప్రదేశం, వారు కలిసి పనిచేస్తున్న ప్రజల గురించి చెప్తారని ఆశిస్తాము. చాలా అరుదుగానే అలాంటి రచనలు వస్తున్నాయి. విహారి గారు చెప్పినట్లు ఇవి స్త్రీ అస్తిత్వ వేదన ధ్వని ఈ కథలు – ప్రతిధ్వనులు కూడా – ఇవి డయాస్పోరా కథలు కావు. మనిషి అంతర్మథనానికి అక్షరీకరణ అంటారు.




*పేజీలు: 140, వెల: ₹ 150/- ప్రతులకు: పాలపిట్ట బుక్స్, హైదరాబాద్. ఫోన్: 984 878 7284.*

**జీవధార:** సింహప్రసాద్ నవల. నవల శీర్షికనుబట్టే ఈ కథ 'నీటికి' సంబంధించిన ఇతివృత్తమని తెలుస్తుంది. రచయిత గోదావరి తీరంలో నివసించినా నీటిబొట్టుకు విలవిలలాడే రాళ్లసీమ కష్టాలు – నీటిమళ్లింపు అవసరమైన ప్రాజెక్టులు – ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నీటి సమస్య – ఇవన్నీ స్త్రీపాత్ర ద్వారా ఉద్యమాన్ని సృష్టించి పాఠకులకు కళ్లు తెరిపిస్తాయి – మీకు తెలియని ఎన్నో విషయాలు వారి పరిశోధన ద్వారా తెలుసుకోవచ్చు. నవలలను రాస్తున్న సింహప్రసాద్ ఓర్పుకు, నేర్పుకు అభినందించాలి.




*పేజీలు: 296, వెల: ₹ 175/- ప్రతులకు: పాలపిట్ట బుక్స్, హైదరాబాద్. ఫోన్: 984 878 7284.*

**కవిత్వంతో కరచాలనం:** (వ్యాస సంకలనం). మాడభూషి సంపత్‌కుమార్. సంపాదకుడు డా. కోదండ లక్ష్మణ. 60 వ్యాసాలున్న ఈ గ్రంథం చాలా విలువైనవి. ఒక మహామనిషి మాడభూషి రచనల గురించి వ్యాసాలు రాశారంటే మామూలు విషయం కాదు. వీరు మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖలో సుదీర్ఘంగా పనిచేశారు. సహజంగానే శిష్యకోటి – మిత్రశతం ఉంటారు. అందరూ తెలుగు సాహిత్యానికి సేవ చేసినవారే – వారి షష్ఠిపూర్తిని అరవై వ్యాసాలు సంకలించి ఈ 'కవిత్వంతో కరచాలనం'



ప్రచురించారు ఒక జీవిత యాత్ర – ఈ పుస్తకం దగ్గర ఉంటే సాహిత్య యానం తడిమి చూడవచ్చు.

*పేజీలు: 408, వెల: ₹ 450/-*

*ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16-11-20/6/11, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాద్ - 36. ఫోన్: 984 878 7284.*

**తెలుగు సాహిత్య చరిత్ర:** ముదిగంటి సుజాతారెడ్డి.




సాహిత్య సృష్టిపై రాజకీయ సామాజిక శక్తుల ప్రభావం – ఎటువంటి నేపథ్యంలో – ఎలాంటి సాహిత్యం వచ్చింది – ఈ విషయాలు పరిగణనలోనికి తీసుకోవటంలేదని – ఆ దిశగా పరిశోధన చేసి ఈ సాహిత్య చరిత్ర రాశారు సుజాతగారు. చరిత్రలో – చివరి మాట ఉండదు. అప్పటికి తవ్వి తీసిన పాత (క్రొత్తగా కనుగొన్నవి). విషయాల పట్టికే చరిత్ర! దానిపై నూతన వ్యాఖ్యానమే రచయిత కృషి, దాని విలువ ఏమిటో పాఠకుల తీర్పు!

*పేజీలు: 386, వెల: ₹ 360/- ప్రతులకు: పాలపిట్ట బుక్స్, హైదరాబాద్. ఫోన్: 984 878 7284.*

**చిగురించిన చెట్టు:** రచయిత్రి: జవేరియా. 62 కవితలున్న – కొమ్మలున్న ఈ చెట్టు ఎన్నో చిగురులు



వేసింది. అయితే అడవిలో అగ్నిపూల మాదిరి మండుతుంటాయి – చెట్టు చాటు నుంచి తూటాలు పేలుతుంటాయి. నెగెటివ్ నుంచి పాజిటివ్‌కి నీ ప్రయాణమని అన్ని కవితల్లో చెబుతున్నారు జవేరియా. ప్రజల పక్షాన నిలబడే నా కలం – నీతిని నిలబెట్టే నా కలం – న్యాయాన్ని చాటే నా కలం – ఇదీ ఆమె ధోరణి. చదవండి, తెలియండి.

*పేజీలు: 144, వెల: ₹ 140/- ప్రతులకు: పాలపిట్ట బుక్స్, హైదరాబాద్. ఫోన్: 984 878 7284.*

**ప్రతాపరుద్ర విజయము:** తెలుగువారికి సాహితీ రూపకాలంటే ఇష్టం. 'భువన విజయం' అతి ప్రసిద్ధం. ఆ బాటలోనే ప్రతాపరుద్ర విజయం సాహితీ రూపకాన్ని రచించారు డా. సంగనభట్ల నరసయ్య. 2017 తెలుగు మహాసభలలో ప్రదర్శించారు కూడా. అందరు కవులు 'భువన విజయం'లోవలె ప్రసిద్ధులు కారు. అయినా ప్రతాపరుద్రీయం కొలువులో మూడువందలమంది సంస్కృతాంధ్ర కవులుండేవారు. వారి వివరాలు లభించకపోవడం దురదృష్టమని రచయిత అభిప్రాయం. ఇందులోనే మరొక నాటకం 'సర్వజ్ఞ సింగభూపాలీయము' అనే ఆరు




రకాల నాటకాన్ని కూడా పొందుపరిచారు. సర్వజ్ఞ సింగభూపాల చక్రవర్తి కథానాయకుడు. అప్పటి చారిత్రక కవులందరూ దర్శనమిస్తారు తెలుగులో సంస్కృత వారసత్వాన్ని సర్వాంధ్రులకు అందించాలని రచయిత సంకల్పం.

*పేజీలు: 87, వెల: ₹ 200/- ప్రతులకు: సువేద్యోత్, ఫ్లాట్ నెం. 7, గాయత్రినగర్, పంజాల అనిల్ కుమార్ కాలని, హుడా కాంప్లెక్స్ వెనుక, సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035. ఫోన్: 944 007 3124, 998 583 3533.*

**విమర్శ వీక్షణం:** తెలుగు సాహిత్యంలో విమర్శకు




సమీక్షకు ఉన్న విభజన రేఖలు గుర్తించడం కష్టం. కొద్దిమంది మాత్రమే ఆ పనిని చేయగలుగుతున్నారు. వారిలో విమర్శ రాసే మహిళలు మరీ అరుదు. ఆ పనిని చేస్తున్నవారు ప్రొఫెసర్ సిహెచ్. సుశీలమ్మ. 'విమర్శ వీక్షణం'గా వారి సాహిత్య వ్యాసాలను గ్రంథంగా తెచ్చారు. కవిత్వం, నవల, కథానిక ప్రక్రియల మీద వ్యాసాలు ఈ గ్రంథంలో కనిపిస్తాయి. విమర్శను బాగా పదునెక్కించడం ఈ పుస్తకంలో గమనిస్తాం. విమర్శ ప్రక్రియ మీద తమవంతు బాధ్యతను నిర్వహిస్తున్నారు సిహెచ్. సుశీలమ్మ.

*పేజీలు: 164, వెల: ₹ 150/- ప్రతులకు: డా. సిహెచ్. సుశీలమ్మ, 4/3, అశోక్‌నగర్, గుంటూరు - 522007. ఫోన్: 833 386 8879.*

**యువశోభ:** సంపాదకులు: వి. ఉదయశంకర్, వి. గోపీచంద్. ఈ యువశోభ లోని కవితలు అన్నీ యువ కెరటాలు.




*పేజీలు: 72, వెల: ₹ 80/-*

*ప్రతులకు: వి. గోపీచంద్, హైదరాబాద్. ఫోన్: 944 127 6770.*

# మిసిమి
మాసపత్రిక

## మీరు చందాదారులుగా చేరండి   బహుమతిగా పంపండి

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు - మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ *(994 951 6567)* లేదా ఇ-మెయిల్ *(misimi90monthly@gmail.com)* ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.

**చందా వివరాలు:**

₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

**Scan QR to Pay**
Misimi Publication

## మిసిమి ప్రచురణలు



నోబెల్ వ్యాసాలు | మిసిమి పార్థసారథి వ్యాసాలు | చిత్రకళా నీరాజనం | నరిసెట్టి ఇన్నయ్య మిసిమి వ్యాసాలు



పురస్కార సాహిత్యం | వ్యాస మంజూష | సారస్వత వ్యాసాలు | చార్లీ చాప్లిన్



షెల్లీ జీవిత కథ | దోసిట చినుకులు | నృత్యభారతి | పారిజాతం



రజ్జు సర్పభ్రాంతి | బైరన్



సిద్ధార్థ | సప్తపర్ణి

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: 994 951 6567.

**మిసిమి** at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.